
మహాయానం
వేమూరి వేంకటేశ్వరరావు

# వేమూరి వేంకటేశ్వరరావు కథలు: మహాయానం

*వేమూరి వేంకటేశ్వరరావు*

## విషయసూచిక


తొలిపలుకు

ముందుమాట: వెయ్యాలి వేమూరికో వీరతాడు – కవన శర్మ

1. అభయారణ్యంలో ఏంబర్, ఈమాట అంతర్జాల పత్రిక, జూలై 2003; రచన, జూలై 2004

2. భయం, ఈమాట అంతర్జాల పత్రిక, మార్చి 2007; రచన, జనవరి 2008

3. మహాయానం, రచన, ఫిబ్రవరి 1998

4. రిరంసువు, రచన, ప్రచురణ తేదీ తెలియదు

5. చెలగాటం, సుజనరంజని అంతర్జాల పత్రిక, జూన్ 2004; రచన, మే 2012

6. లోలకం, రచన, మార్చి 2008.

7. కలిసిరాని కాలం, రచన, ప్రచురణ తేదీ తెలియదు,

8. గాలిదోషం, ఆంధ్ర పత్రిక, 17 జులై 1970

9. బ్రహ్మాండం బద్దలయింది, తెలుగు భాషా పత్రిక, 1973

10. కాకతాళీయం, రచన, ఫిబ్రవరి 1995; ఆంధ్రప్రభ, మే 1995

11. స్వరాజ్యం చచ్చిపోయింది, రచన, నవంబరు 1998.

12. మరోలోకం, కౌముది అంతర్జాల పత్రిక, ఏప్రిల్ 2012

# మహాయానం

## తొలిపలుకు

నేను గత నలభై ఏళ్లల్లోనూ రాసిన కథలు బహు తక్కువ; ముప్ఫయి కథలకి లోపే. వాటిల్లో పన్నెండు కథలు ఈ సంపుటంలో ప్రచురిస్తున్నాను. ఎంతటి కథాభిమానులకైనా అన్ని కథలనీ చదివి ఆనందించగలగడమనేది సాధ్యం కాని పని. లోకో భిన్న రుచి అన్నారు కదా. అందుకని, నేను రాసిన కథలలో, వైవిధ్యత కొరకు, కొన్నింటిని ఎన్నుకుని ఈ సంపుటంలో చేర్చేను. వీటిల్లో మూడు రకాల కథలు ఉన్నాయి.

నేను ఎన్నుకున్న కథలలో నాలుగు "సాహస యాత్రలు" కోవలోకి వస్తాయి. మొదటి కథ, ప్రస్తుత కాలంలో, అమెజాన్ అడవుల్లో జరుగుతుంది. ఇది నిజంగా జరిగిన సంఘటనలని ఆధారంగా చేసుకుని రాసిన కథనం. రెండవ కథ, ప్రస్తుత కాలంలో, అలాస్కా మంచు బీడుల్లో జరిగిన అనుభవం. మూడవది, భవిష్యత్ కాలంలో, రెండు శతాబ్దాల తరువాత, విశ్వాంతరాళంలో జరుగుతుంది. నాల్గవది, భూత కాలంలో, ఆంధ్ర దేశంలో జరిగిన కథ. ఐదవది కూడ ఒక రకమైన సాహస యాత్రే – ఇది ఊహాలోకంలో జరిగిన "జరగని" కథ.

రెండవ వర్గానికి చెందినవి నిజంగా జరిగిన సంఘటనలని ఆధారంగా చేసుకుని రాసిన కథలు. లోలకం అన్న కథ ఆంధ్ర దేశంలో, ఇటీవల, జరిగిన వృత్తాంతం. ఇది బెడిసికొట్టి, అడ్డం తిరిగిన ఒక అమాయక వ్యక్తి సాహస యాత్ర

అనుకోవచ్చు. కలిసిరాని కాలం నిజంగా జరిగిన సంఘటనల చుట్టూ అల్లిన కట్టుకథ.

మిగిలిన ఐదు కథలు వైజ్ఞానిక కల్పనలు. ఇవన్నీ విడి విడి కథలే కాని, నాలుగింటిలో మిడతంభొట్లు కథానాయకుడు. అందువల్ల చివర ఉన్న మరోలోకం కథలో ముందొచ్చిన నాలుగు కథల జ్ఞాపకాలు వస్తాయి. కాని ఈ ఐదు కథలనీ ఒక క్రమంలో చదవవలసిన అవసరం లేదు. ఇదొక కొత్త రకం ప్రయోగం.

ఈ సంకలనానికి పెట్టిన పేరు – మహాయానం, అంటే పెద్ద ప్రయాణం అని కాని అలాంటి ప్రయాణానికి అనుకూలమైన పెద్ద పడవ అని కాని అర్థం చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ కథలన్నీ ఒక రకమైన సాహస యాత్రలే!

తెలుగులో వైజ్ఞానిక కల్పనలు తక్కువ. వీటిల్లో శాస్త్రం గురించి తరచు ప్రస్తావనలు వచ్చినా వీటిని అర్థం చేసుకుని ఆనందించటానికి శాస్త్రం రానక్కర లేదు. కాని శాస్త్రీయ ప్రపంచంలో ఏమిటి జరుగుతోందో కొద్దో, గొప్పో తెలిస్తే కథ రక్తి కడుతుంది.

తినబోయేదాని రుచి వర్ణించి చెప్పటం ఎందుకు?

**వేమూరి వేంకటేశ్వరరావు**

**ప్లెజన్టన్, కేలిఫోర్నియా**

**నవంబరు, 2012**

# వెయ్యాలి వేమూరికో రెండు వీరతాళ్లు!

కవన శర్మ

ఆచార్య వేమూరి వేంకటేశ్వరరావు సైన్సు వ్యాసాల, పుస్తకాల రచయిత. సైన్సు ఫిక్షన్, ఇతర ఫిక్షన్, డ్రామా కథలు వ్రాసిన కథకుడు.

సైన్సు వ్యాసాలు వ్రాసేవారు రెండు రకాలుగా ఉంటారు. ఇప్పటికే చదువరులకు బాగా పరిచయం ఉన్న సైన్సు భావాల ద్వారా, 'ఆకాశం నీలంగా ఎందుకు ఉంది,' 'కేన్సరు అంటే ఏమిటి?' అంటూ సైన్సు విషయాలని విశదపరచే వారు మొదటి రకం రచయితలు. పాఠకులకి పరిచయం లేని సైన్సు విషయాలని పరిచయం చేయబూనుకున్న రచయితలు రెండవ రకం వారు. వీరిలో రెండు వర్గాలు. మొదటి వర్గం వారు మొదటి మెట్టు నుంచి మరికొంత ఎత్తుకి పాఠకులని తీసుకువెళ్లాలని ప్రయత్నించేవారు. రెండోవారు ఎత్తుకునే విషయం ఈ నాటి సైన్సుకి అంచున, తెలియనివాటి సరిహద్దున ఉండేవి. ఈ సరిహద్దులో సైన్సు తన పదునైన అంచుతో మన అజ్ఞానాన్ని కోసుకుంటూ, విజ్ఞానాన్ని ముందుకు తీసుకు వెళుతూ ఉంటుంది. ఈ రెండు వర్గాలకి చెందిన రచయిత ఆచార్య వేంకటేశ్వరరావు. అయితే, ఇటువంటి రచయితలు ఏ భాషలోనైనా కొద్దిగానే ఉంటారు. తెలుగులో అటువంటి రచనలు అతి కొద్ది. దీనికి మొదటి కారణం తెలుగు పాఠకులలో ఆ రచనలను అర్థం చేసుకోగలిగినవారు బహు స్వల్పం. రెండో కారణం ఆ విషయాలు తెలుగులో చెప్పడానికి రచయితకి శాస్త్ర జ్ఞానమే కాకుండా భాషా పరిజ్ఞానం కూడా కావాలి. అవసరమైతే మూలాలకి వెళ్లి పద

సృష్టి చేసే శక్తి ఉండాలి. అటువంటి తెలుగు సైన్సు రచయితలని వేళ్ల మీద లెక్కపెట్టడం మొదలు పెడితే వేళ్లు మిగిలిపోతాయి.

ప్రతీ శాస్త్ర నిర్మాణానికి దేని పునాదులు దానివే. దేని పునాదుల మీద దాని సూత్రాలననుసరించి ఆయా శాస్త్రాల నిర్మాణం జరుగుతుంది. ఈ ప్రక్రియలో దాని సోదర శాస్త్రాలలో సంభవించే ప్రగతి దీనికి ఎంతగానో తోడ్పడుతుంది. ఇలా శాస్త్రం నుంచి సంపాదించిన విజ్ఞానం సుజ్ఞానం అవ్వాలంటే దాని పునాదులు, సూత్రాలు మంచివై ఉండాలి. అజ్ఞానం విజ్ఞానం అవ్వాలంటే అది నియంత్రించిన పరిస్థితులలో చెయ్యగలిగిన ప్రయోగాల పరీక్షలకి నిలబడాల్సి ఉంటుంది. అంచుల వద్ద సైన్సు గురించి రాయాలంటే వివిధ శాఖల సైన్సు బాగా తెలిసి ఉండాలి.

చదువు చేత ఎలక్ట్రికల్ ఇంజనీరు, వృత్తి చేత మొదటి తరం కంప్యూటర్ ఆచార్యుడు అయిన ఆచార్య వేమూరి వేంకటేశ్వరరావుకి పెక్కు విజ్ఞాన శాఖల విజ్ఞానంతో పరిచయం ఉంది.

తనకు తెలిసిన విషయాలని తెలుగులో చెప్పడానికి ఆయనకి ఆంగ్ల సంస్కృతాంధ్ర భాషల్లో వలసినంత పరిజ్ఞానం ఉంది. అవసరమైతే బణువు, కణిక, వాకేతం లాంటి మాటలు సృష్టించగల నేర్పుంది. తెలుగు–ఇంగ్లీషు, ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు, సంబంధి పదకోశం తయారు చేసే ఓపిక, తెగింపు ఉన్నాయి.

అన్ని విధాలా ఈయన ఒక అసాధారణ రచయిత. ఆయనతో నాకు ఆట్టే పరిచయం లేకపోయినా, ఆయన రచనలతో నాకు 40 సంవత్సరాల పరిచయం

ఉంది. నా సైన్సు రచనా పద్ధతికి ఆయన ఒక స్ఫూర్తి. ఆయన కథలకి నేను పరిచయం రాయటం ఆయన నాకు ఇచ్చిన ఒక వరం.

ఆయన స్వేచ్ఛగా రాసినప్పుడు, స్వేచ్ఛగా అనుకరించినప్పుడు కూడ, ఆయన అసిమోవ్, డగ్లస్ ఏడంస్ స్థాయిని అందుకోగలడు. ఆయన 30 సంవత్సరాలుగా కథలు వ్రాస్తున్నా అవి 30 దాటలేదంటారు. అందులో 12 కథలని మీ ముందు ఉంచుతున్నారు. అవి ప్రచురించబడినప్పుడే నేను చదివి ఉన్నాను. అయితే అవన్నీ ఒక చోట ఇప్పుడు చదవడం జరిగింది.

ఆయన ప్రహసనాల శైలిలో పాత్రల పేర్లు పెట్టడం ఆయన ఎంచుకున్న రచనా శైలికి నప్పింది.

మొదటి కథ 'అభయారణ్యంలో ఏంబర్.' ఇందులో ఇద్దరు వృక్ష ప్రేమికులు అభయారణ్యం చూడడానికి వెళ్లి దృగ్విన్యాసం (directional sense) నాశనం అవడం వల్ల అక్కడ 5 రోజులపాటు చిక్కడతారు. అక్కడ వారు ఆకలి, దాహం, దోమల బాధలను తట్టుకుంటూ మరణంతో పోరాటం చేసి గెలవడమే ఇతివృత్తం. జురాసిక్ కాలం నాటి చెట్ల జిగురు గడ్డకట్టి ఏంబర్ అనే విలువైన తృణస్ఫటికంగా మార్తుంది. అదే కథానాయిక పేరు. రాజ్, ఏంబర్‌ల మధ్య కష్టాలలో పుట్టిన వారి ప్రేమ ఘనీభవించి విలువను సంతరించుకుంటుంది. దోమలబారి నుండి దాన్ని రక్షించుకోడానికి ఒక రకం బురదని వాడిన ప్రస్తావన ఈ కథలో ఉంది.

రెండోది, ఉత్తర ధ్రువానికి దగ్గర ఎప్పుడూ మంచుతో కప్పబడే ప్రాంతంలో ఒక్కడే ఒకడు ఒక కర్రల ఇంట్లో గడుపుతూ ఉంటే తన మెదడుకి సరఫరా అయ్యే

రక్తపు శబ్దం మోటారు హోరులా వినిపించడం గురించిన కథ. ఆ భయంకర ఒంటరితనాన్ని తట్టుకుని బతికిన మనిషి కథ. మంచులో గమ్యాన్ని చేరటానికి ఓ మనిషి చేసిన ప్రయత్నం గురించిన ఓ గొప్ప కథ ప్రపంచ సాహిత్యంలో ఉంది. అయితే అందులో మనిషి చనిపోతాడు. కాని ఈ రెండు కథలలో అననుకూల పరిస్థితులను మనిషి మనోధైర్యంతో ఎదుర్కొని జయించే ఆశావాదం ఉంది.

మూడో కథ మహాయానం. బృహత్‌నవ్యతార పేలేటప్పుడు వెయ్యి సూర్య ప్రభలతో వెలుగుతుందనిన్నీ, 30 జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న నవ్యతార పేలినప్పుడు బెత్లెహెం వాసులు దాన్ని క్రీస్తు జన్మిచడానికి సూచనగా అనుకున్నారని చెప్పిన 'ద స్టార్' అనే కథకు ఈ కథ స్వేచ్ఛానుకరణ. ఇందులో అంతరిక్ష యాత్రలకి వాడిన యానకాలకి రచయిత పెట్టిన పేర్లు 'మహాయానం', 'హీనయానం.' ఆ గ్రహవాసులు పాతిన కాల గుళిక వలన యాత్రికులు గ్రహవాసుల నాగరికత గురించి తెలుసుకుంటారు.

నాల్గవది రిరంసువు. ఇది పేరూరు నుంచి సింహాచలం వచ్చిన ఒక ద్రావిడ ప్పిండం – కామ పిశాచి బారి నుండి తప్పించుకోడం గురించిన కథ. కథ చెప్పే క్రమంలో ద్రావిడుల శాఖలు, గుర్రాన్ని గుడిగోపురం ఎక్కించగల వారి తెలివితేటలు, రాజమండ్రి–సింహాచలపు మధ్య ప్రాంతపు ఆ నాటి చరిత్ర రచయిత ప్రస్తావిస్తాడు.

చట్టాలు బలహీనులని కాపాడడానికి చేస్తే దాన్ని ఆసరా చేసుకుని బలహీన వర్గంలో వారు అవతలవారిని బాధించడం అయిదో కథలోను, ఓటు బేంకు రాజకీయాలు ఆరో కథలోను రచయిత చెబుతారు. ఏడవ కథ 'వరల్డ్ ట్రేడ్

సెంటర్' మీద విమానాల దాడి జరిగినప్పుడు అమెరికా ప్రజలు ప్రవర్తించిన తీరుకీ, బొంబాయి తాజ్‌మహల్ హొటల్ మీద తీవ్రవాదులు దాడి చేసినప్పుడు భారతదేశ ప్రజల ప్రవర్తన తీరుకీ తేడా చెప్పే కథ. మనవారు ఆ నాటి క్రికెట్ మాచ్‌కి ఇచ్చిన ప్రాధాన్యత, ఈ కథలో సుబ్బుడు పాత్రని బాధిస్తుంది.

ఎనిమిది, తొమ్మిది, పది, పన్నెండు కథలు, మిడతంభొట్లు అనే వేడుక పేరు కల భౌతిక శాస్త్రజ్ఞుడు ముఖ్య పాత్రగా కలవి. ఇవి సైన్సు ఫిక్షన్ కథలు. చతుర్విధ శక్తులలోని గురుత్వాకర్షక శక్తిని విద్యుదయస్కాంత శక్తితో ఏష్యం చేసినప్పుడు కలిగే భార రహిత స్థితిని చెప్పేవి. వస్తువులు కాంతి వేగం కంటె ఎక్కువ/తక్కువ ప్రయాణించగలవని, కాంతి వేగానికి సమానమయే స్థితి ఒక 'సింగ్యులర్ పోయింట్' అన్నట్టు రచయిత ఒక కథలో సూచిస్తాడు. ఈ కథ అసిమావ్ కథకి స్వేచ్ఛానుకరణ.

పదకొండో కథ 'కాదేదీ అమ్మకానికి అనర్హం' అని నమ్మే ఒక రెడ్డి కథ. మనిషి దేహంలోని రసాయనాలని విడగొట్టి, శుద్ధి చేసి అమ్మే అవకాశాలని పరిశీలించడం ఈ కథలోని వస్తువు. ఇదీ సైన్సు ఫిక్షన్ కథే.

ఈ రచయితకి భాషలో పాండిత్యం, విజ్ఞానంలో జ్ఞానం రెండూ మెండుగా ఉన్నాయి. నాకే అధికారం ఉంటే ఈయనకి రెండు వీరతాళ్లు వేయిస్తాను. అంత వరకు తెలుగు పాఠకులకి సైన్సు అందజేయాలనే ఈయన తపనకు నా తపన జోడిస్తాను.

# అభయారణ్యంలో ఏంబర్

కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడవి. కీకారణ్యం. గహనాంతర సీమ! ఎంత ఆస్వాదించినా తనివి తీరని కాంతారం. ఇదీ వర్షారణ్యం అంటే!!

ఆస్ట్రేలియాలో వర్షారణ్యం అన్న పేరుతో పర్యాటకులకి చూపించే అడవి దీని ముందు బలాదూర్! మెక్సికో దేశంలో యూకటాన్ లోని అయనరేఖా మండలంలో ఉన్న అడవులలో చెట్ల కంటె కూడ ఇక్కడ ఇంకా దట్టంగా పెరిగిన వృక్ష సంపద లోని అందం వర్ణనాతీతం! అంబర చుంబితాలలా ఎదిగిన చెట్ల కొమ్మలు ఆకాశమంత పందిరి వేసినట్లు నాలుగు దిక్కులా పరివ్యాప్తి చెంది సూర్యరశ్మి భూమిని తాకకుండా చేస్తున్నాయి. ప్రాణ ప్రదాత అయిన వెచ్చని సూర్యకిరణాల తాకిడి కోసం గుయ్యారంలా ఉన్న అడవి నేల నుండి లతావల్లికలు చెట్లని ఆసరా చేసుకుని ఆకాశం వైపు ఎగబాకుతున్నాయి. ఎటు చూసినా ఆకుపచ్చ రంగే. లేతాకు పచ్చ ముదరాకు పచ్చల మధ్యలో ఉన్న రకరకాల చాయలలో రకరకాల పచ్చలు! ఇదొక పచ్చ సముద్రం.

నొప్పి పెట్టే వరకూ మెడని సారించి చూసే ఓపిక ఉండాలే తప్ప చూసిన వారికి నేత్రానందం కలుగజేసే విధంగా చెట్టు కొమ్మలని వేలాడుతూ గబ్బిలాలు! పచ్చటి చెట్ల కొమ్మల మీద రంగు రంగుల రామ చిలుకలు, పెద్ద చిలుకలు, ఇంకా పెద్ద టూకాన్ చిలుకలు. మెడ దించి కిందకి చూస్తే చిత్తడిగా ఉన్న నేల మీద ఒత్తు ఒత్తుగా అంగుళం దట్టంగా ఉండి, ఎండి కుళ్ళుతూన్న ఆకులు, అలములు. చెట్ల

ఆకుల నుండి టపటప చుక్కలు చుక్కలుగా రాలుతూన్న నీటి బిందువులు పల్లపు ప్రదేశాలకు చేరి, నీటి గుంటలుగా మారి, అవి నిండినప్పుడు పొంగి, పొర్లి చిన్న చిన్న పిల్ల కాలువలలా ప్రవహిస్తున్నాయి. ఈ నీటి గుంటలలో ముదరాకు పచ్చ చర్మపు రంగు మీద లేతాకుపచ్చ మచ్చలుతో అలరారే పెద్ద పెద్ద బోదురు కప్పలు. వాటి బెకబెకలు సింహ గర్జనలా ఉన్నాయి కాని టర్టరాయణంలా లేనే లేవు. ఈ కప్పలు అరచేయంత పొడుగున్న మిడతలని పట్టి తింటూ ఉంటే చూడడానికి ఒక పక్క కుతూహలం, మరొక పక్క ఏహ్యాభావం, మరొక పక్క పక్కా భయం. అక్కడ నేల మీద ఉన్న తుప్పలలో పిడికిలి ప్రమాణంలో ఉన్న సాలీళ్ళని చూస్తూ ఉంటే గుండె నిబ్బరం లేని వాళ్ళకి భయమే వేస్తుంది.

ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించి, ప్రకృతి సౌరభాలని ఆఘ్రాణించి, ప్రకృతి మాత ఒడిలో నిదురించి, ప్రకృతిశక్తి గర్జించినప్పుడు సాహసంగా ఎదుర్కొని ఆనందించాలనే తృష్ణ ఉన్న సాహసికులకి ఈ అరణ్యం గంతవ్యం.

ఎవరెస్టు శిఖరం ఎక్కేసరికి అక్కడ కాఫీ, ఇడ్లీలతో అరవ అయ్యరు హాజరైతే ఎంత బాగుంటుందో అని మనలో కొంతమంది కలలు కన్న రోజులు లేకపోలేదు. ఎవరెస్టు శిఖరం మీద అయ్యరు హొటేలు లేదని మనందరికీ తెలుసు. కాని ఈ అమెజాన్ అరణ్యం మధ్యలో, నాగరికత మప్పిన కనీస అవసరాలు కూడ అందుబాటులో లేని దూరంలో అరవ అయ్యరు హొటేలుని పోలిన సదుపాయం ఒకటి ఉంది. దాని పేరే 'అమెజాన్ యూత్ హాస్టల్'. ఆకుపచ్చటి అమెజాన్ అఖాతంలో కాలు మోపుకునే సావకాశాన్ని ప్రసాదించిన దీవి ఈ అమెజాన్ యూత్ హాస్టల్. బ్రెజీల్ దేశంలో, కొన్ని వేల హెక్టర్లు వైశాల్యం ఉండే

సతతహరితారణ్యపు నడిబొడ్డులో, యువతీ యువకుల వసతి సౌకర్యం కోసం, ఈ యూత్ హాస్టల్ దరిదాపు 700 హెక్టర్ల వైశాల్యపు మేరలో ఉన్న చెట్లని కొట్టి కట్టేరు. ఇలా తెరిపి చేయబడ్డ మేరలో చిన్న చిన్న కర్ర, కంపలతో కట్టిన కట్టడాలు నాలుగే నాలుగు ఉన్నాయి. చుట్టూ అడవి అవడం వల్ల, బాడవ నేల చిత్తడిగా ఉండడం వల్లా నేల మట్టంగా కాకుండా పొడుగాటి రాటలు పాతి, వాటి మీద ఈ కుటీరాలని లేవనెత్తి ఎత్తుగా కట్టేరు. ఈ నాలుగు కుటీరాలలో నలుగురేసి మనుష్యులు చొప్పున మొత్తం పదహారు మంది తల దాచుకోవచ్చు. ఈ కుటీరాలు కాకుండా పెద్ద బంగళా వంటి కట్టడం మరొకటి ఉంది. చుట్టూ పంచపాళీలలా ఉన్న వరండాలలో ఉన్న కుర్చీలలో కూర్చుని అడవిని చూసి ఆనందించవచ్చు.

ఈ బంగళా లోపల ఒక విశాలమైన వంట గది, చిన్న పుస్తకాల బీరువా! రెండు అంతస్తుల మంచాల వరస. మంచాలు లేని వారికి నులక తాడుతో నేసిన ఊయల వంటి హేమక్‌లు రాటలకి ఇటూ అటూ కట్టినవి ఉన్నాయి. వాటిలో పడుక్కోవచ్చు. హాస్టల్ సిబ్బందితో కలుపుకుని ఇక్కడ జనాభా పాతిక ముప్పై మందిని దాటి ఉండదు – ఏ సమయంలోనైనా సరే. ఇవీ ఇక్కడ ఉన్న కనీస సదుపాయాలు. హాస్టల్‌లో విద్యుత్తు కాని, టెలిఫోను సౌకర్యాలు కాని లేవు. టెలివిజన్ లేదన్న సంగతి వేరే చెప్పనక్కరనే లేదు. బయట ప్రపంచం నుండి హాస్టలుకి వెళ్ళాలన్నా, హాస్టలు నుండి నాగరిక లోకంలోకి వచ్చి పడాలన్నా రోడ్లు లేవు, విమానాశ్రయాలు లేవు; కమేరావ్ గ్రాండే నది మీద పడవలో ప్రయాణమే శరణ్యం.

ఎంతో కష్టపడి ఎవ్వరైనా ఇక్కడకి వచ్చేరంటే వారు ఒకటి రెండు రోజులు చుట్టపు చూపుగా రావడం దండగ. కనీసం రెండు మూడు వారాలైనా ఉండకపోతే పడ్డ కష్టానికి ఫలితం కిట్టదు; ఆయాసం తప్ప ఆనందించడానికి అవకాశం మిగలదు. అందుకని ఇక్కడకి వచ్చే వారు సాహస యాత్రీకులు, ప్రకృతి సౌందర్య ఉపాసకులు, లేదా ఏ విశ్వవిద్యాలయాల్లోనో పరిశోధన చేసే ఆచార్యులు, వారి విద్యార్థులు. సుకుమారులకి, పిరికి వారికి చేరవలసిన గమ్యం కాదిది. ఇటువంటి మైత్రీభావం నిండుకున్న వాతావరణం లోనికి ఏరి కోరి వచ్చారు రాజ్, అతని స్నేహితురాలు, సహాధ్యాయిని అయిన ఏంబర్.

అది జూన్ నెల. మొదటి వారం. ఏంబరు, రాజు ఈ కీకారణ్యపు నడిబొడ్డులోకి వచ్చి రెండు రోజులు అయింది. "పీత కష్టాలు పీతవి" అన్నట్లు, ఎంత అడవి అయినా అక్కడ బతికే వారి నిబంధనలు వారికి ఉంటాయి కదా. హాస్టల్ సిబ్బంది నిబంధ నియమావళి ప్రకారం కొత్తగా వచ్చిన వాళ్ళు – ఎవ్వరైనా సరే – మొదటి రెండు రోజులు హాస్టల్ పరిధి దాటి పోరాదు. ఈ రెండు రోజులూ చెయ్య వలసిన పనులు: కొత్త చోటుకీ వాతావరణానికీ అలవాటు పడడం, అక్కడ బతకడానికి కావలసిన సాధన సంపత్తి ఉందో లేదో చూసుకోవడం, ప్రయాణపు బడలిక తీర్చుకోవడం, సిబ్బందితో పరిచయం చేసుకోవడం, వరండాలో కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి ఆనందించడం. ఎవరి పరుపు చుట్టలు, ఎవరి తిండి సామానులు, ఎవరికి ఏమిటి కావాలో అవన్నీ ఎవరికి వారే సమకూర్చుకోవాలి. హాస్టలు వాళ్ళు సమకూర్చేదల్లా రాత్రి తలదాచుకుందికి చోటు, కాలకృత్యాలు తీర్చుకుందికి మరుగు, సేద తీర్చుకుందికి సదుపాయం,

మాట సహాయం. ఏమి కావలసినా పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క ఊరు పడవలో వెళ్ళాలి. దానికి రాను, పోను ప్రయాణంలో ఒక రోజు ఖర్చు అయిపోతుంది.

రాజ్, ఏంబర్‌లు వచ్చి వారం రోజులు అయింది. పరిసరాలకి నెమ్మదిగా అలవాటు పడుతున్నారు. అక్కడ నది లోనూ, చుట్టు పక్కల ఉన్న పిల్ల పాయలలోనూ తెడ్డు పడవలు వేసుకుని ఇటూ అటూ తిరుగాడడం, సాయంత్రం హోస్టల్‌కి తిరిగి రావడం –ఇలా ఒక గాడిలో పడి రోజులు దొర్లి పోతున్నాయి!

ఆ రోజు మంగళవారం. సమయం ఉదయం. యూత్ హోస్టల్ ప్రాంగణం నుండి అడవిలోనికి నడవడానికి ఉన్న కాలి బాటలని అన్వేషించడానికి ఇద్దరూ ఆయత్త పడుతున్నారు. బాట పొడుగునా గుర్తులు వేసి ఉంటాయి కనుక కాలిబాటలని అన్వేషించడం అనేది పిరికివారు కూడ చెయ్యగలిగిన సాహస యాత్ర! కేలిఫోర్నియా లో ఉన్న కొండలలో ఇటువంటి హైకింగు చెయ్యడంలో రాజు, ఏంబరు, ఇద్దరూ సిద్ధహస్తులే! పొద్దు కూకే లోగా తిరిగి వచ్చేసే చిన్న నడకే కనుక, కేంపింగు సామగ్రి వగైరాల అవసరం లేదు. దారిలో ఆకలేస్తే ఉంటాయని చిన్న చిన్న బిస్కట్ పేకెట్లు, కేండీ బార్లు, ప్రోటీన్ బార్లు, గ్రనోలా బార్లు వగైరాలు తన 'బేక్‌పేక్' లో సర్దింది ఏంబరు. అవి కాకుండా రెండు లీటర్ల నీటి సంచి, ఇద్దరికీ చెరొక మంచినీళ్ళ సీసా, ఒక గొట్టం దోమల మందు, ఒక స్విస్ ఆర్మీ చాకుల గుత్తి, ఒక కెమేరా ... ఇవన్నీ రాజు తన వీపు సంచిలో సర్దుకున్నాడు. చేతికి వాచీతో పాటు ఒక దిక్సూచిని కూడ తగిలించుకున్నాడు.

ఏంబరు, రాజు ఒకరికొకరు సమమైన ఉజ్జీయే! వయస్సు లోనూ, ఒడ్డూ, పొడుగులలోనూ ఏంబర్ రాజ్ కంటె ఒక్క వాసి చిన్నదే. క్రీడాకారులు కాకపోయినా, వ్యాయామం ఎడల శ్రద్ధ చూపే వ్యక్తులే కనుక ఇద్దరూ ఆరొగ్యవంతమైన, దృఢమైన శరీరం కలవారే. ఇద్దరూ పాదాల వరకూ దిగజారిన పంట్లాలు వేసుకున్నారు. మోకాలిని అంటే వరకూ ఉండే పొడుగాటి గొట్టాలున్న రబ్బరు బూట్లు పాదాలకి తొడిగేరు. జొన్న పొత్తు జుత్తులా మెరుస్తూన్న బంగారు రంగు జటాజూటాన్ని పైకెత్తి, ముడి వేసి, ఆ ముడి ఒదులైపోకుండా ఒక 'ఎలేస్టిక్ బేండ్` ని పెన్సిల్తో బిగించింది ఏంబర్. జూన్ నెల కావడం వల్ల వాతావరణం ఉదయానికే వేడిగా ఉంది. అందుకని ఇద్దరూ పల్చటి పొట్టి చేతి చొక్కాలు తొడుక్కున్నారు. బయలుదేరే ముందు కాసింత తిండి తిని మరీ వెళ్ళమని హాస్టల్ సిబ్బంది సలహా చెబితే వేడివేడిగా కోడిగుడ్డు పొరటు, కాల్చిన రొట్టె తిని, కాఫీ తాగి ఉరకలు వేస్తూన్న ఉత్సాహంతో ఇద్దరూ బయలుదేరేరు.

దారి పొడుగునా ఉన్న తెల్లటి బాణం గుర్తులు చూసుకుంటూ వెళితే రెండు గంటలలో ఒక నది కనిపిస్తుందనీ, దారిలో ఎన్ని పక్క పెత్తనాలు చేసినా, నది వరకు వెళ్ళి తిరిగి రావడం అనేది నాలుగైదు గంటలలో తెమిలిపోయే పని అనీ, ఎంత ఆలస్యం అయినా లంచి వేళకి తిరిగి హాస్టల్కి వచ్చెయ్య వచ్చనీ హాస్టల్ సిబ్బంది చెప్పి పంపేరు. రాజుకీ, ఏంబరుకీ వచ్చిన పోర్చుగీసు భాష అంతంత మాత్రమే. ఆ మాట కొస్తే హాస్టల్ సిబ్బందికి వచ్చిన ఇంగ్లీషే నయం. వారి ఉద్దేశం ఏమిటో గాని వీరికి మాత్రం వారన్న మాట నది అనే అర్థంలోనే అర్థం అయింది. కబుర్లు చెప్పుకుంటూ, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఇరువురూ దరిదాపు

రెండు, మూడు గంటల సేపు ఆ అడవిలో నడిచేరు. పోను, పోను అడవి చిక్కబడి అందాలు చిందుతోంది. కాని ఎంత దూరం నడచినా ఎక్కడా నది కనిపించలేదు.

దూరాలు సంస్కృతిని బట్టి ఉంటాయి. అమెరికాలో రెండు గంటల దూరం అంటే ఏ వంద మైళ్ళో అయి ఉంటుంది. ఒక సారి ఢిల్లీలో కన్నాట్ ప్లేస్ నుండి ఏదో బట్టల దుకాణానికి తీసుకెళ్ళమంది నా శ్రీమతి. అక్కడ ఎవ్వరిని అడిగినా అది 'వాకింగ్ డిస్టెన్స్' అన్నారు కదా అని ఇద్దరం నడవడం మొదలు పెట్టేం. అ షాపు ఎప్పటికీ రాదు! ఆఖరికి కాళ్ళు నొప్పులు పెడుతూ ఉంటే ఆటో చేయించుకుని వెళ్ళేం. అది 'వాకింగ్ డిస్టెన్స్' ఎలా అవుతుందని దరిమిలా వాకబు చేస్తే అది ఢిల్లీలో నడవగలిగే దూరమే అని ఆ షాపులో అంతా ఏకగ్రీవంగా తీర్మానించేరు. అలాగే బ్రెజీల్ లో 'రెండు గంటల దూరం' అంటే అమెరికాలో దూరం కంటె దూరం కాదు కదా అని ఇద్దరికీ అనుమానం వచ్చింది. కాని ఆ అనుమానం తీర్చడానికి ఆ అడవిలో వీరిద్దరూ తప్ప మరొక నరమానవుడు లేడు. మరికొంత దూరం నడిచేరు, నది కనిపిస్తుందేమో అన్న ఆశతో. వీళ్ళ కబుర్లలో బాణం గుర్తులని చూడడం ఎప్పుడో మరచి పోయేరు. ఇప్పుడు బాణం గుర్తులు లేవు. అనుకున్న రెండు గంటలూ రెండు గంటల క్రిందటే తెమిలి పోయాయి.

"వాళ్ళు నది అన్నది నది కాదేమో" అన్నాది ఏంబరు.

"నది కాకపోతే కనీసం కాలువో, ఏరో, ఏ నీటి ప్రవాహమో కనిపించాలి కదా? మనకి ఏదీ కనిపించ లేదు."

"కనిపించకపోవడం ఏమిటి? మనం మోకాలు బంటి నీటి లోంచి నడుచుకుంటూ వచ్చేము కదా!"

"అది పల్లంలో నిలకడగా ఉన్న నీరే కదా! అందులో నా అంత పొడుగు గడ్డి దుబ్బులు కూడా కనిపించేయి. అది నది ఎలా అవుతుంది?"

"ఈ అడవిలో నిలకడ నీరు చాల చోట్ల కనిపించింది. ఎక్కడ చూసినా నీటి గుంటలే. మనం గంట కిందట దాటిన మోకాటి లోతులో ఉన్న నిలకడ నీరే నదేమో? ఆ తర్వాత దారి అంతా పొడిగానే ఉంది కదా?"

ఇక ముందుకి వెళ్ళి లాభం లేదని ఇద్దరూ వెనక్కి తిరిగేరు. నడి సముద్రం లోనికి ఈదుకు వెళ్ళి ఒడ్డెక్కడుందో అని వెనక్కి తిరిగితే ఏమిటి కనబడుతుంది? ఉత్తుంగ తరంగ భీకరమైన మహా సముద్రం కనుచూపు మేర కనిపిస్తుంది! అలాగే ఆకుపచ్చటి అఖాతంలా ఎదురుగా అమెజాన్ వర్షారణ్యం వికటాట్టహాసం చేస్తూ కనబడింది! వారు ఏ దారి వెంబడి అక్కడవరకు వచ్చేరో అది కూడా మూసుకుపోయి ఎటు చూసినా పెట్టని గోడలా ఆకాశాన్ని అంటే చెట్లే! వారు వచ్చిన పాద ముద్రల కోసం వెతికేరు. ఫలితం శూన్యం. తెల్లటి బాణం గుర్తుల కోసం వెతికేరు. అవీ కనబడ లేదు. ఏ దిక్కు నుండి వచ్చేరో తెలియని దిక్కు లేని వారైపోయారు, ఇద్దరూ!

రాజ్ దిక్సూచి వైపు చూసేడు. ఇంతవరకూ ఉరమరగా వాళ్ళు వాయువ్య దిశలో వచ్చేరని అతనికి గట్టి నమ్మకం. కనుక ఇప్పుడు ఆగ్నేయ దిశలో వెళితే తిరుగుదారి అవుతుందని తీర్మానించేడు. కాని తిన్నటి రోడ్డు మీద ప్రయాణం చేసినట్లు ఈ అడవిలో ఎలా కుదురుతుంది? ఒకోసారి కుడి పక్కకి, ఒకోసారి ఎడం పక్కకి, ఒకోసారి వెనక్కి నడుచుకుంటూ పోయేసరికి దృగ్విన్యాసం పూర్తిగా

నశించి పోవడంతో చీకటిలో తందనాలాడినట్లు యాతన పడ్డారు. “ఎవరక్కడ? మేం దారి తప్పిపోయేం, సహాయం చెయ్యండి!” అని ఎలుగెత్తి అరచేడు, రాజ్. అది అరణ్య రోదనే అయింది. ఏంబర్ వెలుగు ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే విజ్ఞత ఉన్న వ్యక్తి కాబట్టి, "రాజ్! మనం ఈ రాత్రికి ఈ అడవిలోనే ఎక్కడో తల దాచుకుని రేపు వేకువ జామున లేచి మళ్ళా ప్రయత్నం చేద్దాం" అని సలహా ఇచ్చింది.

ఇద్దరూ తాటి, కొబ్బరి వంటి తాళవృక్షాల మట్టలు కొన్ని సంపాదించేరు. ఆరేసి అడుగులు పొడుగున్న ఆ మట్టలని ఒక చెట్టు కింద నేల మీద పరుపులా పరచేరు. మరి కొన్ని మట్టలని ఒంటిదూలం ఇంటి కప్పులా అమర్చేరు. రాతి యుగపు మానవుడు నిర్మించిన పర్ణశాల కూడ ఇంతకంటె మెరుగ్గా ఉండేదేమో. ఇద్దరికీ అనుభవం లేదు. వీరి వద్ద ఉపకరణాలు ఏమీ లేవు. ప్రయోగాలు చెయ్యడానికి వ్యవధి లేదు. చీకటి పడే లోగా చిన్న గుడిసె లాంటి కుటీరం అమర్చి అందులో తల దాచుకోవాలని వారి తాపత్రయం.

చీకటి పడింది. ఎక్కడి నుండి వచ్చేయో నీలాల మేఘమాలలా తండోపతండాలుగా దిగి వచ్చేయి – దోమలు! కర్తవ్యం ఆలోచించే లోగా ఆ దోమలు వీళ్ళ శరీరాలని కుళ్ళబొడిచేసేయి. పల్చటి పై దుస్తులు ఆ దోమల ధాటి నుండి లేశమాత్రం రక్షణ కల్పించలేకపోయాయి. తాటి మట్టలతో వాటిని ఎంత పారద్రోలినా సముద్రపు కెరటాలని ఇసక గోడతో ఆపడానికి ప్రయత్నించినట్లే అయింది. రేపటి వరకు బతికుంటే బలుసాకు ఏరుకు తినొచ్చన్న తర్కంతో తెచ్చుకున్న దోమలమందంతా ఇద్దరూ చెరి సగం పంచుకుని ఒళ్ళకి

పట్టించుకున్నారు. అయినా దోమల ఉధృతం తగ్గ లేదు. ఇంక సభ్యతకీ, ఆలోచనకీ అవకాశం లేదు. ఇద్దరూ వారు నిర్మించుకున్న తాటికమ్మ గుడిసెలోకి దూరి ఆకులు మీద కప్పుకున్నారు. గుడిసె లోపల జాగా గట్టిగా దోసెడంత లేదు. చీకటి పడడంతో బయట తిరుగాడే వన్య మృగాల ధ్వనులు దూరంలో వినిపిస్తున్నాయి. ఇద్దరూ అలసి సొలసి ఉన్నారు. చీకటి, దోమలు, ధ్వనులు, చలి. ఇక ప్రత్యామ్నాయం లేకపోగా, అసంకల్పితంగా, ఒకరి పరిష్వంగంలో మరొకరు ఇరుక్కుని బితుకు బితుకు మంటూ పడుక్కున్నారు.

"ఈ వేళప్పుడు ఇంటి దగ్గర ఉండి ఉంటే బీరు తాగి, భోజనాలు చేసి కబుర్లు చెప్పుకునే సమయం" అన్నాడు రాజ్.

"ఇప్పుడేమి వచ్చింది? బీరు లేదు. భోజనం లేదు. కాని మన 'బేక్‌పేక్' లో చిరుతిండి పొట్లాలు ఇంకా ఉన్నాయి. వాటిల్లో ఒకటి చెరిసగం పంచుకు తిందాం" అంటూ ఏంబరు ఒక 'కేండీ బార్' ని తీసింది. ఆ ఒక్క దాన్నీ ఇద్దరూ పంచుకు తిన్నారు. తెచ్చుకున్న నీళ్ళు అప్పటికే చాలమట్టుకు తాగేసేరేమో, ఉన్న నీళ్ళనే కొద్దిగా తాగి మర్నాటికి కొంత దాచుకున్నారు.

రాజుకీ ఏంబరుకీ మధ్య తొలి పరిచయం దరిదాపు ఏడాది కిందటే జరిగింది. అది కూడా కేవలం కాకతాళీయంగా జరిగింది. రాజ్ పని చేసే విశ్వవిద్యాలయపు ప్రాంగణంలో ఒక వృక్షవాటిక ఉంది. నిజానికి ఒక వృక్షవాటికలో విద్యాలయపు భవనాలున్నాయనడం సమంజసమేమో. ఎందుకంటే ఈ వృక్షవాటిక ఏదో వారసరిగా ఒక మూలకి విసిరేసినట్లు కాకుండా, పాఠశాల ప్రాంగణాన్ని ఆనుకుని పారుతూన్న చిన్న పిల్ల నది గట్టు

వెంబడే మెలికలు తిరుగుతూ వ్యాపించి ఉంది. ఆ పిల్ల నదిలో నీళ్ళు పెళ్ళివారిలా పిల్లినడకలు నడుచుకుంటూ చిన్న తటాకంలో చేరిన బాతులతో జలకాలాడి, నెమ్మదిగా డెల్టా లోని మరొక పాయలో కలసి పోయేవి. అవకాశం దొరికినప్పుడల్లా ఈ వృక్షవాటికలో తిరగడానికి వెళ్ళేవాడు రాజ్.

చెట్ల మధ్య తిరగడం అంటే రాజ్‌కి చిన్నప్పటి నుండీ సరదా. చెట్ల నీడలలోని గాలిలో ఆమ్లజని పాలు ఎక్కువ ఉంటుందనిన్నీ, అందుకని చెట్టు కిందకి వెళ్ళగానే మనస్సులో ఒక రకం ఉత్తేజం పుడుతుంది అనిన్నీ, అందుకే బుద్ధుడి వంటి మహర్షికి చెట్టు కింద కూర్చున్నప్పుడే జ్ఞానోదయం అయిందనిన్నీ అనేవాడు. చెప్పొచ్చేదేమిటంటే రాజ్‌కి చెట్లంటే చచ్చేంత ఇష్టం. ఏ వూరు వెళ్ళినా బొటానికల్ గార్డెన్ అనీ, ఆర్బొరీటం అనీ, ట్రాపికల్ జంగిల్ అనీ ఏ పేరుతో కనిపించినా చెట్లని చూసి, పరామర్శ చేసి వచ్చేవాడు. అలాంటిది సొంత యూనివర్శిటీ కేంపస్‌లో ఉన్న ఆర్బొరీటంని అనుభవించకుండా ఎలా ఉండగలడు? ఆర్బొరీటం అనగానే ప్రతి చెట్టు దగ్గరా దాని పేరు, దాని జాతి, ఉప జాతి, స్వస్థలం, మొదలైన వివరాలు చిన్న రేకు మీద రాసి పెట్టి, దానిని చెట్టు కొమ్మకి వేలాడదీసి ఉంటాయి. వెళ్ళినప్పుడల్లా ఈ వివరాలు చిన్న పుస్తకంలో రాసుకుంటూ ఉండే వాడు.

కళాశాలలో ఒక కొస నుండి మరొక కొసకి వెళ్ళడానికి అడ్డు దారి ఈ వృక్షవాటిక గుండా ఉంది కనుక అక్కడ జన సంచారం ఉండేది; కాకపోతే, కొంచెం పలచగా ఉండేది. పరిచయం ఉన్నా లేకపోయినా ఎదుట తారసపడ్డ వ్యక్తిని పలు విధాల పలకరింపులలో ఏదో ఒక విధంగా పలకరించడం ఇక్కడ

ఆచారాలలో ఒకటి. కనుక ఎదుట పడ్డ వ్యక్తితో యాత్రికంగా 'హాయ్' అన్నంత మాత్రాన్న అదేమీ స్నేహం అనిపించుకోదు. కాని ఆ రోజు రాజు చెట్టు కొమ్మని ఆసరాగా చేసుకుని, వాలులో నిలబడి, చెట్లతో ఏవో సరసోక్తులాడుకుంటూ మరో లోకంలో ఉన్న తరుణంలో ఒక పరిచయం లేని గొంతుక వెనక నుండి "హాయ్!" అని పలకరించింది, "ఐ సీ యు హియర్ ఎవ్విరి నౌ ఎండ్ దెన్. ఆర్ యు డూయింగ్ సం రిసెర్చ్?"

అప్పటికే చెట్ల లోకంలో తప్ప ఈ లోకంలో లేడేమో, అనుకోకుండా వెనక నుండి ఈ ప్రశ్న వచ్చేసరికి రాజు తుళ్ళిపడి కాలు పట్టు తప్పగా కొమ్మని ఆసరాగా గట్టిగా పట్టుకున్నాడు.

"డిడ్ ఐ స్టార్టిల్ యు? ఐ యాం సారీ!"

రాజ్ తేరుకుని ఎదురుగా ఉన్న వ్యక్తిని పరకాయించి చూసేడు. ఇంతకు పూర్వం ఎప్పుడూ చూసిన జ్ఞాపకం లేదు.

"ఐ యాం ద క్యూరేటర్ అఫ్ దిస్ ఆర్బొరీటం. మై నేం ఈజ్ ఏంబర్" అంటూ గట్టు మీద నుంచి దిగువనున్న రాజ్ వైపు చెయ్యి చాచింది, ఆమె.

వాలులో దిగువ నిలబడి ఉన్న రాజ్ పైనుండి ఏంబర్ అందించిన చెయ్యి పట్టుకుని, "హ్వాట్ ఎన్ ఎప్రోప్రియేట్ నేం ఫర్ ఎ క్యూరేటర్ అఫ్ ఎన్ ఆర్బొరీటం" అంటూ గట్టెక్కి, "ఐ యాం రాజ్" అని పరిచయం చేసుకున్నాడు.

'హ్వాట్ ఎన్ ఎప్రోప్రియేట్ నేం' అని ఎందుకు అన్నాడో తన పేరుకీ తను చేసే ఉద్యోగానికీ ఉన్న బాదరాయణ సంబంధమేమిటో తనకి అర్థం కాలేదంది ఏంబర్.

"ఏంబర్ అనేది వజ్రాలనీ, రత్నాలనీ మించిన విలువ గల తృణస్పటికం. ఏ జురాసిక్ యుగంలోనో చెట్ల నుండి స్రవించిన జిగురు పాలు గడ్డ కట్టి శిలాజములుగా మారి ఇప్పుడు మనకి అపురూపంగా, పారభాసకమైన స్పటికాల రూపంలో అక్కడక్కడ దొరుకుతున్నాయి. కనుక ఏంబర్ అనేది చెట్లు మనకి ప్రసాదించిన రత్నం. కనుక 'యు ఆర్ ఎ జ్యూయల్. ఎ గిఫ్ట్ అఫ్ ద ట్రీస్" అని ఏంబర్‌తో చెప్పేడు రాజ్. అప్పటి నుండి రాజు కుశాగ్ర బుద్ధి యెడల ఏంబరు మనోఫలకంపై మంచి భావముద్రే పడ్డట్టు ఉంది.

తన వంతుగా ఏంబర్ ఆ ఆర్బొరీటం చరిత్ర కొంత చెప్పుకొచ్చింది. ఈ కబుర్ల లోకం నుండి బయట పడే సరికి ఇద్దరూ ఏంబర్ పనిచేసే ఆఫీసు దగ్గరకి నడచి వచ్చేసేరు.

రాజ్ సెలవు తీసుకుని వెళ్ళబోతూ ఉంటే ఆఫీసు లోపలికి తీసుకెళ్ళి రాజుని నలుగురికీ పరిచయం చేసి, ప్రతి వారం వారి ఆఫీసులో జరిగే సదస్సులకి రమ్మని ఆహ్వానించింది.

ఇదంతా జరిగి రెండు వారాలు అయింది. ఎవరి పనులలో వారు పడిపోయేరు. వీలున్నప్పుడల్లా రాజ్ లంచి పట్టుకుని వెళ్ళి అర్బరీటంలో కూర్చుని తినే వాడు. అక్కడకి వెళ్ళినప్పుడల్లా ఏంబర్ గుర్తుకు వచ్చేది. వారి ఆఫీసులో జరిగే సదస్సులకి రమ్మనమని ఆమె అన్నా ఏదో మాటవరసకి అన్న మాటే అయ్యుంటుంది అని సర్ది చెప్పుకున్నాడు. తను కంప్యూటరు వాడు. చెట్లంటే అభిమానం ఉండొచ్చు గాక. కాని చెట్ల పెంపకం, వాటిని గురించి విజ్ఞానం తనకి

ఏముంటుందని? ఇలా సంజాయిషీ చెప్పుకుని అలసత్వంతో అటువైపు వెళ్ళనే లేదు.

రాజ్ బెంచీ మీద కూర్చుని లంచి తినే సమయంలో ఏంబర్ మళ్ళా ఆ ఆర్బరీటంలో తారస పడింది. బెంచీ మీద రాజ్ పక్కన పరిచయస్తురాలిలా కూర్చుని పిచ్చాపాటి మొదలు పెట్టింది. మాటల సందర్భంలో వారి సదస్సులకి రమ్మని మరొకసారి పిలచింది.

ఇదీ రాజు, ఏంబరు కలుసుకున్న వైనం. పరిచయం క్రమేపీ శేముష్య స్నేహంగా పరిణమించింది. ఇలా పెన వేసుకుంటూన్న శేముష్య స్నేహాన్ని పురస్కరించుకుని ప్రపంచంలో సతతహరితాలైన అడవులు ఎలా నాశనం అయిపోతున్నాయో, వాటిని పరిరక్షించడానికి చెయ్యవలసిన కృషి ఏమిటో చర్చించుకునే వారు. ఆర్బరీటం సదస్సులకి వీలయినప్పుడల్లా వెళ్ళేవాడు, రాజ్. ప్రపంచం నలు మూలలనుండీ వచ్చి ప్రసంగాలు చేసే అతిథులని సదస్సు అయిన తర్వాత తన ఇంటికి రమ్మని పిలచేది, ఏంబర్. అక్కడ అందరూ ఒకటో, రెండో కాక్‌టెయిల్స్ తాగి ఎవరి ఇళ్ళకి వారు వెళ్ళిపోవడం ఒక రివాజుగా జరిగే పని.

ఒక సారి దక్షిణ అమెరికా నుండి ఒక ఆచార్యుడు వచ్చిన సందర్భం. ఆయన అమెజాన్ నదీ లోయలో ఉన్న అరణ్యాల అంద చందాలని సినిమా తీసి చూపించేడు. ఆ రోజు అతిథులు పాన పాత్రలు ఖాళీ చేసి వెళ్ళిపోయిన తర్వాత, రాజుకి మరొక కాక్‌టెయిల్ ఇచ్చి మరి కొంత సేపు కూర్చో మంది ఏంబర్. అడవిలో కాసిన ఉసిరికాయ ఎక్కడ? సముద్రంలో పండిన ఉప్పు ఎక్కడ? అలా

వీరిరువురి మధ్య శృంగార చింత చెంతన లేకుండానే, శుద్ధ శేముష్య భావంతోనే, స్నేహం దినదినాభివృద్ధి చెందింది. ఒకరి సహచర్యం మరొకరు ఆనందించేవారు.

"దక్షిణ అమెరికాలో అమెజాన్ పరివాహంలో ఉన్న అడవులు నిజానికి ఒక పేద్ద ఆర్బొరీటం లాంటివి. ఇక్కడ చెట్లు నాటి, పెంచి పెద్ద చేస్తాం. అక్కడ సహజసిద్ధంగా పెరుగుతాయి. అంతే తేడా."

"ఇక్కడ మన ఆర్బొరీటంలో బాతులు, ఉడతలుతో సరి. అక్కడ కోతులు, కొండ చిలువలు, పులులు,.."

"ఏంబర్ నువ్వు ఎప్పుడైనా అమెజాన్ అరణ్యాలు చూసేవా?"

"లేదు. ఆ సినిమా చూసిన తర్వాత చూడాలనే ఉంది. అవకాశం రావాలిగా."

"అవకాశాలు స్వయంచోదితాలు కావు. వాటికి కాళ్ళూ చేతులూ లేవు. వాటిని మనమే కల్పించుకుని కథని నడిపించాలి."

"రాజ్! నీకు వచ్చే ధైర్యం ఉందా?"

"నీతో వచ్చే ధైర్యమా? అమెజాన్ అడవులలో తిరిగే ధైర్యమా?"

"నాతో వస్తే నేనేమైనా కరుస్తానా ఏమిటి? అక్కడ అడవులలో ఏకాంతంగా తిరగ గలిగే ధైర్యం ఉండాలి మరి!"

"నువ్వు పక్కన ఉంటే అది ఏకాంతం ఎలా అవుతుంది?"

ఇలా మొదలైంది ఈ అమెజాన్ యాత్ర! ఇప్పుడు, ఇక్కడ, ఈ నిర్మానుష్యమైన అడవి మధ్యలో, భూమంత పరుపు మీద, ఆకాశమంత పందిరి కింద, రేపు ఏమవుతుందనే ప్రశ్నకి సమాధానం తెలియని అయోమయ

పరిస్థితిలో, ఒకరి గుండె చప్పుడుని మరొకరు వింటూ ఆ రాత్రి గడిపే పరిస్థితిలోకి తీసుకు వచ్చింది!!

అర్ధరాత్రి అయ్యుంటుంది. తూర్పు దిశ నుండి మోటారు లాంచీ చప్పుడు వినిపించింది. దానిని బట్టి తూర్పు దిశలో ఎదో నది ఉండి ఉంటుందని తీర్మానించుకున్నారు. కాని వాళ్ళకి తెలియని విషయం ఏమిటంటే అడవులలో శబ్దం ఎటునుండి వచ్చిందో చెప్పడం కష్టం. శబ్ద తరంగాలు చెట్ల మానులని తాకి, ప్రతిధ్వనించి, అవి మరొక దిశ నుండి వచ్చినట్లు మనని మభ్య పెడతాయి.

బుధవారం ఉదయం అరణ్యపు అంతరాళాలలోకి ఇంకా పూర్తిగా వెలుగు చొరబడక ముందే రాజు, ఏంబరు లేచేరు. తెచ్చుకున్న సరంజామాలో ఉడికించిన పండ్ల పూర్ణంతో ముడిచిన రొట్టె ముక్కని ఇద్దరూ చెరొకటీ తిన్నారు. సీసాలతో తెచ్చుకున్న నీళ్ళు ఖర్చు అయిపోయాయి కనుక సంచిలో ఉన్న నీళ్ళని కొద్ది కొద్దిగా తాగేరు. తాగి, తూర్పు దిశగా ఉన్న నది వైపు బయలుదేరేరు. ఇహ ఎంత సేపు! నది కనబడితే అక్కడనుండి హాస్టలు కూత వేటు దూరం. 'బ్రెక్‌ఫెస్ట్' వేళకల్లా హాస్టల్ లో ఉండొచ్చని ఇద్దరూ కొండంత ధైర్యంతో ఉన్నారు. మధ్యాన్నం అయింది. ఎండ జోరు పుంజుకుంది. సంచీలో నీళ్ళు ఇద్దరూ తాగేసేరు. కాని నది జాడ లేదు. గొంతుక పిడచ కట్టుకు పోతోంది. నీళ్ళు తాగకపోతే శరీరం ఎండి పోతుంది. అది ప్రాణాపాయం. పక్కన ఉన్న పిల్ల కాలవలో నీళ్ళు ఉన్నాయి. కాని చూడడానికి మంచి నీళ్ళల్లా లేవు. ఏదో నాచు వంటి పదార్థం పైన తేలియాడుతోంది. వడబోసి తాగొచ్చేమో! వడబొయ్యడం ఎలా? ఏంబరు ఖాళీ నీళ్ళ సీసా అడుగు భాగాన్ని కత్తితో కోసింది. తన జాకెట్టు విప్పి లోపల ఉన్న 'బ్రా'

ని బయటకి తీసింది. ఆ బ్రా కప్పుని గరాటులా వాడి, నది నీళ్ళని ఆ గరాటులో పోసి, వడబోసి రెండో సీసాని, నీటి సంచిని నింపింది. ఆ నీళ్ళల్లో ఏ సూక్ష్మజీవులు ఉన్నాయో తెలియదు కాని, రుచికి మాత్రం సుద్ద నీళ్ళల్లా వెగటుగా ఉన్నాయి. వాటినే ఇద్దరూ తాగేరు, ప్రాణం నిలబెట్టుకొనేందుకు. ఏ వాంతులో, విరేచనాలో పట్టుకుంటే ఆ అడవిలో హరీ మనిపోవడమేనని కలవరపడ్డారు. ఇద్దరూ పరి పరి విధాల భయ పడుతున్నారు. వేడి, ఉక్క, ఆకలి, నిద్ర లేమి, ఆందోళన – ఇవన్నీ భయానికి కారణాలే. ఇవే కాకుండా రాజ్ కి తెలియని విషయం మరొకటి ఉంది. ఏంబర్ అప్పుడప్పుడు 'డిప్రెషన్' లోకి దిగజారుకుంటుంది. ఒత్తిడి ఎక్కువైతే అది ప్రకోపించే ప్రమాదం ఉంది. దానిని అదుపులో పెట్టడానికి వాడే మందు హాస్టల్‌లో వదిలేసి వచ్చింది. కరువులో అధిక మాసంలా ఆ డిప్రెషన్ ఇప్పుడు ప్రకోపించిందంటే చెయ్యగలిగింది ఏమీ లేదు.

అగమ్యగోచరంగా ఆ అడవిలో తిరిగి తిరిగి ఒక బాడవ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడ అంతా చిత్తడి నేల. వెతకగా వెతకగా కొంచెం పొడిగా ఉన్న మెరక ప్రదేశం ఒకటి కనిపించింది. అక్కడ కూడ తాటి మట్టల లాంటి మట్టలు దొరికేయి. తన దగ్గర ఉన్న చాకుతో వాటిని కోసి, గత రాత్రి అనుభవాన్ని పురస్కరించుకుని మరొక కుటీరం నిర్మించేడు, రాజ్. దోమల బాధ తప్పేది కాదని అనుభవం వల్ల తెలుసుకున్నారేమో, అక్కడ పుష్కలంగా దొరుకుతూన్న బెందడిలో నీళ్ళు కలిపి, బురదని చేసి ఆ బురదని ఒళ్ళంతా – ముఖం, కాళ్ళూ, చేతులు – దట్టంగా పులుముకున్నారు. ఆకులు కప్పుకుని గుడిసెలో కూర్చున్నారు. హోరుమని లంకించుకున్న వర్షపు జోరునైనా ఆపగలిగింది కాని ఆ గుడిసె దోమల

దండయాత్రని ఆపలేకపోయింది. ఎండి బీటలు వేస్తూన్న బురద తెరని తోసుకుని లోపలికి వెళ్ళి మరీ కుట్టడం మొదలు పెట్టేయి. ఇంతింత పెద్దవి, లోపల కండని కరచి పీక్కు తినేవి దోమలు ఎలా అవుతాయి? ఏ చిన్న సైజు రాబందులో అయ్యుంటాయి! భీతమనస్కులైన ఇరువురూ ఒకరినొకరు రక్షణగా ఆదుకుని ఒకరి ఒడిలో మరొకరు తలవాల్చి దఫ దఫాలుగా నిద్రపోయారు.

మూడవ రోజు. గురువారం. ఒక గ్రనోలా బార్‌ని మధ్యకి విరచి చెరి సగం తిన్నారు. ఉన్న నీటిని తాగేసి, మళ్ళా కాలువలో నీటిని పట్టి, బ్రాతో వడబోసి సీసాని, సంచీని నింపేరు. ఆగ్నేయ దిశలో వెళితే గమ్యం చేరుకోవచ్చనే నమ్మకం రాజులో చాల బలంగా ఉంది. అందుకని దిక్సూచిని సంప్రదించి ఆగ్నేయ దిశలో ప్రయాణం మొదలు పెట్టేరు. అంత దట్టంగా ఉన్న అడవిలో ఒకరి పక్క ఒకరు నడవడానికి కూడ జాగా లేదు. ఒకరి వెనుక ఒకరు. దండకారణ్యంలో రాముడి వెనక సీతలా – రాజు ముందు, ఏంబరు వెనక. ముండ్ల చెట్ల కొమ్మలని వంచి రాజు పట్టుకుంటే ఆ సందులలో ఇరుక్కుని ఏంబరు నడుస్తోంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఇద్దరి శరీరాలూ ముండ్లతో గీరుకు పోయి, రక్తం చిమ్ముతున్నాయి. పైపెచ్చు ఆ చెట్లలో ఉండే పులి చీమలు మీద నుండి వీరి మీద రాలి, బట్టలలో దూరి కరిచెస్తున్నాయ్!

ఈ నరకంలోంచి బయట పడే సరికి ఏంబర్ పూర్తిగా దిగజారి పోయింది. ఆకలి. నీరసం. చీమకాట్ల తోటీ, దోమ కాట్ల తోటీ ఆమె వక్షోజాలు ఎర్రటి దద్దుర్లతో నిండి వాచి పోయాయి. వాటి మీద బట్ట నిలప లేక పోతోంది ఆమె. ఇంకా సిగ్గేమిటని కొంతవరకూ ఉపశమనం దొరుకుతుందనే ఆశతో ఆమె పై

బట్టలన్నీ తీసేసింది. రాజ్ కి ఏమీ పాలు పోలేదు. తన బనీను విప్పి, నీటిలో తడిపి ఆమె శరీరం అంతా ఉన్న దోమ కాట్లనీ, చీమ కాట్లనీ ఆ గుడ్డతో నెమ్మదిగా తుడిచేడు. సాయం సంధ్య చుట్టూ పులుముకుంటోంది. మళ్ళా దోమల బాధ తప్పదు. కనుక ఆ చుట్టుపట్ల ఉన్న మట్టిని ఏంబరు శరీరం అంతా పులిమి, తన శరీరం మీద పులుముకున్నాడు. ఈ జంబాల లేపనం దోమలని ఏమాత్రం అడ్డడం లేదని రాజ్‌కి తెలుసు. కాని తనకి తెలిసిన మంత్రం అదొక్కటే.

రాత్రయింది. దోమలు మళ్ళా బీభత్సం చేసేయి. పులి మీద పుట్రలా పెద్దగా వర్షం పడడం మొదలయింది. ఆ వర్షంలో దోమల మందు కొట్టుకు పోయింది. ఏదో గుడ్డిలో మెల్లలా దోమలు కూడా పోయాయి. అర్ధ నగ్నంగా ఉన్న ఏంబరు గజ గజ వణకిపోతోంది. చలి కొంత కారణం. భయం కొంత కారణం. నిరాశం, నిస్పృహ అన్నిటి కంటె పెద్ద కారణాలు. రాజ్ ఆమెని హృదయానికి హత్తుకుని, తన శరీరపు వేడితో ఆమె శరీరానికి వెచ్చదనం చేకూర్చాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాడు.

నైలీ క్విరోజ్ మొల్దనాడో ముగ్గురు పిల్లల తల్లి. అడవిలో ఉన్న హాస్టల్ ఈమె ఆధ్వర్యంలో నడుస్తుంది. మంగళవారం లంచికి తిరిగి రావలసిన వ్యక్తులు సాయంకాలమైనా రాక పోయేసరికి ఆమె కంగారు పడి వీళ్ళని వెతికి తీసుకురమ్మని సిబ్బందిలో ఇద్దరిని పంపించింది. బుధవారం నాటికి ఇద్దరు పదిమంది అయేరు. గురువారం పది పాతిక అయేరు. శుక్రవారం నాటికి పొరుగున రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న మనావుస్ నుండి వచ్చిన వాళ్ళతో వెరసి ఏభై మంది అయేరు. అడవిని గాలించడం మొదలు పెట్టేరు.

మనావుస్ నుండి ఎవరో బ్రెజీలియాలో ఉన్న అమెరికా రాయబారి కార్యాలయానికి ఫోను చేసి చెప్పేరు. శుక్రవారం నాడు అమెరికన్ ఎంబసీ నుండి రాజ్ పని చేస్తూన్న డిపార్టుమెంటుకి ఫోను వచ్చింది. అప్పుడు వారు అడవిలో తప్పడిపోయిన రాజుని, ఏంబర్‌ని వెతికే నిమిత్తం విమానానికి అయే ఖర్చు భరిస్తామని క్రెడిట్ కార్డుతో సహా హామీ ఇచ్చేరు.

రాత్రల్లా తెరలు తెరలుగా వాన పడుతూనే ఉంది. వాన వెలిసే సరికి దూరంగా చెట్ల సందులలోంచి సూర్యరస్మి నేలని తాకుతోంది. ఇద్దరూ ఆ ఎండ పొడలోకి చేరుకున్నారు. రాజుకి ఒంటిమీద చొక్కా లేదు. తన కోసం రాజ్ చేసిన త్యాగం ప్రత్యక్ష సాక్ష్యంగా ఏంబర్‌కి కనిపించింది అప్పుడు – రాజ్ వీపు మీద! ఆ వీపంతా ఎర్రటి మాంసపు ముద్దే! రాజ్ తన శరీరాన్ని ఏంబర్ శరీరానికి అడ్డు పెట్టి దోమల బారి నుండి కొంత వరకు రక్షించి ఉండక పోతే ఏంబరు శరీరం కూడ ఒక మాంసపు ముద్ద అయి ఉండేది. ఇప్పుడంటే ఎర్రటి దద్దుర్లుతో సరిపోయింది. ఏంబర్ మనస్సంతా నిరాశావృతం అయిపోయింది.

"మరొక రోజు. మరొక ప్రయత్నం" అన్నాడు రాజ్, "కంఠంలో ప్రాణం ఉండగా ప్రాణం మీద ఆశని ఎలా వదులుకుంటాం? ప్రాణం కంటె తీపి మరొకటి లేదుగా!"

ప్రత్యామ్నాయం లేక ప్రాణాలు నిలబెట్టుకునే ప్రయత్నంలో ఇద్దరూ నడక మొదలు పెట్టేరు. ఇంతలో చెట్ల ఆకుల మధ్య గలగలారావం వినిపించింది. ఇద్దరూ మెడ పైకి రిక్కించి చూసేరు. చెట్ల మీద, సుమారు డెబ్బై అడుగుల ఎత్తున, నల్లమూతి కోతులు కొమ్మచ్చిలు ఆడుకుంటూ దిగువనున్న వింత జంతువులని

చూసి కిలకిలారావం చేస్తున్నాయ్! ఏంబర్‌కి అనుభవం మీద తెలుసు. ఈ రకం కోతులు అరణ్యపు అంతరాళాలో తప్ప జనావాసాల సమీపాలలో ఉండవని! అంటే రాజూ, ఏంబరూ దారీ తెన్నూ తెలియకుండా అడవి మధ్యలోకి వెళ్ళిపోతున్నారన్నమాట!

శనివారం తెల్లవారింది. ఇది ఐదవ రోజు. వాళ్ళ దగ్గర ఉన్న ఆఖరి గ్రనోలా బార్ పంచుకు తింటూ ఉండగా దూరాన్న మోటరు బోటు శబ్దం వినిపించింది. వినిపించిందే తడవుగా ఇద్దరూ ఆ శబ్దం వచ్చిన దిశలో "బతికిపోయాం భగవంతుడా!" అనుకుంటూ పరుగు లంకించుకున్నారు. పొదలు దాటి ఇసక పర్ర మీదకి వచ్చి పడ్డారు. మళ్ళా ఆ పైన అంతులేని అరణ్యమే. పడవా లేదు. నదీ లేదు. మోటరు బోటు శబ్దం అంతకంటే లేదు. పక్షుల కిలకిలారావం తప్ప.

ఈ పరుగులో ఏంబర్ పాదాల మీద ఏర్పడ్డ నీటి పొక్కుల లాంటి దద్దుర్లు పగిలి పోయాయి. అవి 'ఇన్‌ఫెక్ట్' అయే ప్రమాదం ఉంది. ఆమె అడుగు తీసి అడుగు వెయ్యలేని పరిస్థితి ఏర్పడింది. కనిపించిన ఆకులని పాదాలకి, కాలి పిక్కలకి చుట్టబెట్టి తీగలతో కట్టు కట్టింది – నొప్పి తగ్గుతుందనే భ్రమతో. మెక్కుతూ అడుగులు వేస్తోంది.

ఏంబర్‌లో ధైర్యం క్రమేపీ దిగజారిపోవడం రాజ్ గమనించేడు. ఆమె శరీరం వాడిపోయిన తోటకూర కాడలా వేలాడిపోతోంది. మనస్సుని ఏకాగ్రతతో నిలపలేక పోతోంది. తనూ అంత కంటె ఏమీ మెరుగైన పరిస్థితిలో లేదు. ఎంత

దుర్దశ వచ్చినా నిరాశ పడిపోకుండా విధిని ఎదుర్కోవడమే మానవ కర్తవ్యం అని అతని నమ్మకం.

"ఏంబర్! దిగాలు పడిపోకు. ఈ ఒక్క రోజూ, నా కోసం బతుకు" అని ఆమెని బతిమాలుకున్నాడు. నొప్పులతో పాదాలు బరువెక్కి పోయాయి. అడుగు తీస్తే అడుగు పడడం లేదు. ఆ ఇసక పర్ర మీద దేకడం మొదలు పెట్టేరు. సాయంకాలం అయేసరికి ఛత్రం పట్టినట్లు ఉన్న 'ఆకుల చాందినీ' దూరంగా జరిగిపోతోంది! ఆరు రోజులలో మొదటిసారి చెట్ల మధ్య నుండి బయట పడి నీలాకాశం కిందికి వచ్చేరు. దానికే పెద్ద పండగ జరుపుకున్నట్టు సంతోషించేరు. సూర్యుడు పశ్చిమాకాశంలో ఇలా కుంకేడో లేదో అలా నల్లటి ఆకాశం లోకి నక్షత్రాలు దూసుకు వచ్చేయి. ఆ నక్షత్రాల కాంతిలో రాజు, అతని పొట్ట మీద తల వాల్చి ఏంబర్ ఆద మరచి నిద్ర పోయారు.

ఆదివారం తెల్లవారింది. ఇద్దరూ కొంచెం తేరుకున్నారు. చుట్టు పక్కల చూడగా వాళ్ళు ఉన్న ఇసక పర్ర ఒక నది యొక్క వెల్లువ తలం గట్టున ఉన్నట్లు తెలిసింది. నది గట్లు తెగి వెల్లువై ప్రవహించినప్పుడు ఇక్కడ మేట వేసి ఉంటుంది. ఇసక దిబ్బలు దిగి కొంచెం కిందికి వెళితే అక్కడ నిలకడగా నీరున్న చిన్న తటాకం లాంటిది ఒకటి కనిపించింది. ఆ నీటిలో ఉన్న చెట్ల మోదులని ఆసరాగా పట్టుకుని ఇద్దరూ ఆ తటాకం లోనికి దిగేరు. దద్దుర్లుతో వాచి చిటపటలాడుతూన్న ఒంటికి చల్లటి నీరు తగిలే సరికి కొంత ఉపశమనం కలిగింది. కాని ఆ నీళ్ళల్లోనూ ముళ్ళ తుప్పలే! నది పొంగి గట్టున ఉన్న తుప్పలని, దుబ్బులని ముంచెత్తి ఉంటుంది. దూరానికి చూస్తే ఇటూ అటూ ఆకుల చాందినీతో జుత్తు విరగబోసుకున్న

దయ్యాలలా కనిపిస్తున్నాయి – అడవి లోని చెట్లు. కాని ఆ జుత్తు మధ్యలో, తలలో పాపిడిలా, ఏ చెట్లూ లేకుండా ఆకాశం కనిపిస్తోంది. ఇక్కడ తప్పకుండా అడవి మధ్యలో ప్రవహిస్తూన్న నది ఏదో ఉండి ఉండాలి. ఈ ఆలోచనతో రాజు, ఏంబరు ఆ గట్టున ఉన్న తుప్పలని పట్టుకుని నీళ్ళల్లో తేలుతూ సేద తీర్చుకుంటున్నారు.

ఇంతలో దూరంలో ఏదో చప్పుడు వినిపించింది. ఇలా మతిని భ్రమింపచేసే చప్పుళ్ళు ఇంతకు ముందు రెండు సార్లు విన్నారు, రెండు సార్లూ మోస పోయారు. కాని ఈ చప్పుడు క్రమేపీ బిగ్గరగా వినిపిస్తోంది. ఇది మోటరు బోటు కాదు. విమానపు మోత! రాజు, ఏంబరు చేతికి దొరికిన కొమ్మలని జెండాలలా ఊపడం మొదలుపెట్టేరు. ఆ విమానం ముందుకు వెళ్ళి, వెనక్కి తిరిగి వీరున్న చోట చాల దిగువకి దిగి, వీరి మీదుగా ఎగురుతూ దూరంగా వెళ్ళి పోయింది.

ఈ ప్రాంతాలలో విమానాలు నదీలోయని అంటిపెట్టుకుని ఎగిరితేనే కిందని ఏముందో కనిపించే సావకాశం. ఆకుల చాందినీ మీద ఎగిరితే ఆకులు కనిపిస్తాయి తప్ప నేల మీద ఉండేవారు కనిపించరు. కనుక ఈ విమానం ఎగిరి వెళ్ళిన దారి వెంబడే ఏదో నది ఉండి ఉండాలి. వీళ్ళని వెతికి రక్షించడం కోసమే ఎవ్వరో ఆ విమానాన్ని పంపి ఉంటారు. ఇలా తర్కించుకొని, ఆ విమానం వెళ్ళిన వైపు గట్టు వెంబడే తుప్పలని పట్టుకుని, నీళ్ళల్లో తేలుకుంటూ, రాజూ, ఏంబరూ ఈదుతున్నారు. ఏంబర్ ఒంట్లో వీసమెత్తు ఓపిక లేదు. మనస్సులో బతకాలనే కోరిక సన్నగిల్లి పోతోంది. ఆమెని వెల్లకిల్లా నీళ్ళ మీద పడుకోబెట్టి, మెడ కింద తన చెయ్యి పెట్టి రాజే ఆమెని ముందుకి లాగడం మొదలు పెట్టేడు. మీద నుంచి ఎండ

ఒకటే బాదుడు. నీళ్ళల్లో ఉన్నారు కనుక బతికిపోయారు కానీ, లేకపోతే ఆ వేడికి చచ్చిపోయి ఉండేవారు.

పొద్దు కుంకే సమయానికి అడవి ముసుగు తెరచింది. ఎదురుగా విశాలమైన నది కనిపించింది. కనీసం బల్లకట్టు తయారు చేసుకుని ఆ నదిలో చొరబడితే ఎప్పటికైనా బయట ప్రపంచం, మనుష్యులు కనిపించకపోరు.

"అరుగో మనుష్యులు!!" ఏంబర్ సన్నగిల్లితూన్న గొంతుతో ఒక చిరుకేక పెట్టింది.

చిన్న దొన్నెలో ఇద్దరు నల్లటి మనుష్యులు కనిపించేరు. తనకి వచ్చీరాని పోర్చుగీసు భాషలో ఏంబర్ వారిని పిలచింది. వాళ్ళు వీళ్ళిద్దరినీ ఆ దొన్నెలోకి ఎక్కించుకున్నారు.

చీకటి పడే వేళకి అక్కడకి గంటన్నర దూరంలో ఉన్న ఒక పల్లెటూరులో పూరిగుడిసెల దగ్గరకి చేరుకున్నారు. అక్కడి ఆడంగులు వీరిద్దరికీ చేతనైన శుశ్రూష చేసి, పొడి బట్టలు ఇచ్చి కాసిన్ని పళ్ళు, రొట్టెముక్కలు పెట్టేరు. మరొకరు ఒంటినిండా గుచ్చుకున్న ముళ్ళని నెమ్మదిగా తీసి కొంత ఉపశమనం కలిగించేరు. అక్కడ రెండు రాటల మధ్య కట్టిన హేమక్‌ల మీద పడుక్కుని ఇద్దరూ మైమరచి నిద్ర పోయేరు.

సోమవారం ఉదయం వీరిద్దరినీ మహూయెన్‌లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్ళేరు. అక్కడ వైద్యుల పరిచర్యలో వీరిద్దరూ తేరుకుందికి రెండు రోజులు పట్టింది. రోజుకి ఏభై కేలరీల తిండి కూడ లేకుండా, వారం రోజుల పాటు బతకడం వల్ల ఇద్దరూ ఎముకల పోగులలా తయారయారు. నవనవలాడుతూ

ఉండే ఏంబర్ గళ్ళెంలా తయారయింది. ఆ దృశ్యం చూసి రాజ్ దుఃఖం ఆపుకోలేకపోయాడు.

మొగ్గతొడుగుతూన్న వీరి స్నేహానికి అమెజాన్ అడవి ఒక అగ్నిపరీక్ష పెట్టింది. వివాహ బంధం కూడ ఒనగూర్చలేని సాన్నిహిత్యాన్ని శేముష్య స్నేహంలోనే ఇద్దరూ చవి చూసేరు. ఒకరి మనుగడకి మరొకరు కారణభూతులయ్యారు.

వ్రతం చెడ్డా ఫలం దక్కాలి కదా. అందుకని అమెజాన్ యూత్ హాస్టల్‌కి తిరిగి వచ్చి, మరొక వారం రోజులు అక్కడే ఉండి, ప్రకృతి సౌందర్యాన్ని తనివి తీరా ఆస్వాదించిన తర్వాతే ఇద్దరూ తిరుగు ముఖం పట్టేరు.

జూలై నెల. నాలుగో తారీకు. ఆ రోజు స్వతంత్ర దినోత్సవం. భోజనానికీ, తర్వాత బాణసంచా చూడడానికీ తన ఇంటికి రమ్మని రాజ్‌ని ఏంబర్ ఆహ్వానించింది. ఏంబర్ పెరట్లో కూచుని పురపాలక సంఘం వారు జరిపే బాణసంచా ఉత్సవాలని చూడొచ్చు. రాజ్ వెళ్ళేడు. ఇద్దరూ చెరొక పానీయం తాగుతూ గతాన్ని సింహావలోకనం చేసుకున్నారు. రాజ్‌కి ఇష్టమైన వంటకాలు వండింది ఏంబర్. కొవ్వొత్తుల వెలుగులో భోజనాలు అయిన తర్వాత చీకటి పడే వరకు ఇద్దరూ సంగీతం వింటూ కబుర్లు చెప్పుకున్నారు.

"రాజ్! నేను రోజూ మందు వాడకపోతే నా మనస్సు కకలావికలం అయేది. కాని నీ సన్నిధిలో ఉన్న వారం రోజులూ నా మందు వాడక పోయినా నేను బాగానే ఉన్నాను కదా!"

"కనీసం ఈ అమెజాన్ ప్రయాణం నీ యెడల షాక్ ట్రీట్మెంట్ లా పని చేసిందేమో!"

తొమ్మిది దాటాక ఏంబర్ రాజ్‌ని పెరట్లోకి తీసుకెళ్ళింది – బాణసంచా చూడడానికి. తారాజువ్వలు ఆకాశంలోకి ఎగిరి కొన్ని గుండెలదిరేలా చప్పుడు చేస్తూ ఉంటే మరికొన్ని పంచరంగుల వెలుగులు విరజిమ్ముతూ నేత్రోత్సవం కలుగజేస్తున్నాయి. ఆ రంగుల వెలుగులో ఎప్పుడూ లేని ఒక వింత శోయగం ఏంబర్ ముఖంలో చూసేడు రాజ్.

రాత్రి పది కాబోతూంది. బాణసంచా హడావుడి, హోరు అయిపోయాయి. చిన్న చిరు చలి వేయడం మొదలైంది. తన స్వెట్టర్‌ని తీసి ఏంబర్ భుజాల మీద కప్పి,

'లోపలికి పోదాం' అంటూ దారి తీసేడు రాజ్.

"అటు కాదు, ఇటు" అంటూ పెరట్లో మరో పక్కకి దారి తీసింది ఏంబర్. అక్కడ చెట్ల మధ్య ఉన్న గజీబోలో ఆకులు, గడ్డి వగైరాలతో కప్పబడ్డ చిన్న కుటీరం లాంటిది ఒకటి కట్టబడి ఉంది. రాజు ఆశ్చర్యంతో ఆమెని యాంత్రికంగా అనుసరించి నడుస్తున్నాడు.

"రాజ్! ఈ రోజు అమెరికాకే కాదు, నాకూ స్వతంత్ర దినోత్సవమే! ఈ కుటీరంలో అన్ని సదుపాయాలూ అమర్చేను. ఇక్కడ దోమలు లేవు. ఒంటికి పులుముకుందికి బురద లేదు; బురదకి బదులు పన్నీరు ఉంది. ఆ అమెజాన్ అడవిలో నీ సాన్నిధ్యాన్ని అనుభవించేను కాని, నీ సాంగత్యాన్ని అనుభవించే

అవకాశం రాలేదు," అంటూ ఆ కుటీరంలోనికి రాజ్‌ని తీసుకెళ్ళి కుటీరం ద్వారానికి ఉన్న తెరని జిప్పర్తో మూసేసింది.

(అమెజాన్ అడవిలో నిజంగా జరిగిన సంఘటనని ఆధారంగా చేసుకుని అల్లిన కథ. ఈమాట అంతర్జాల పత్రిక, జూలై 2003; రచన, జూలై 2004.)

# భయం!

నిశీధి! నిర్మానుష్యం! నిశ్శబ్దం?

అకస్మాత్తుగా ఆ నిశ్శబ్దాన్ని చీల్చుతూ ఆ దుంగ ఇంటి బయట గోడని ఏదో గీకుతూన్నట్లు చప్పుడయింది. ఆ చప్పుడుకి ఒళ్ళంతా ఒక్కసారి జలదరించింది. హృదయ స్పందన లయ తప్పినట్లయింది. చలితో బయట నుండి, భయంతో లోపల నుండి ఒణుకు పుట్టుకొచ్చింది.

అప్పుడు నేను అలాస్కాలో, ఫెయిర్‌బేంక్స్‌కి ఉత్తరంగా – ఉత్తర ధృవ చక్రానికి ఒక్క రవ దక్షిణంగా – చుట్టుతా కనుచూపు మేర మంచుతో కప్పబడ్డ ప్రదేశంలో, ఒక దుంగ ఇంట్లో, ఒంటరిగా ఉంటున్నాను. ఆ కాలంలో రాత్రి శీతోగ్రత నీటి ఘనీభవ స్థానానికి 35 డిగ్రీలు దిగువ వరకు దిగేది. ఆ చలికి భూమ్యాకర్షణ కూడ గడ్డకట్టుకు పోయిందా అన్నట్లు మంచు కూడ కురవటం మానేసింది. అంత చలిలో కంఠంలో ప్రాణం ఉన్న ఏ జీవి కూడ సాహసించి బయటకి రాలేదు. కాని, బయట ఏదో ఉంది. లోపలకి రాడానికి ప్రయత్నిస్తూన్నట్లు ఉంది. కుటీరపు గోడలని గోకుతోంది!

చలిని మించి నిశ్శబ్దమో, నిశ్శబ్దాన్ని మించి చలో అర్థం కాని ఆ వాతావరణంలో నిశ్శబ్దాన్ని చీల్చుతూ అప్పుడప్పుడు పొయ్యిలో కాలుతూన్న కట్టెలు చిటపటలు, ఫెళఫెళలు చేస్తూ చలిని చెండాడుతున్నాయ్. ఆ చీకటిలో, పైకి ఎగసే ఆ మంట వెలుగులో గోడ మీద పడ్డ నా నీడ నాట్యం చేస్తోంది. పోతే, నేను ధరించిన శీతాకాలపు దుస్తులు చేసే బరబర శబ్దం తప్ప బయట నుండి మరొక

శబ్దం లేదు. ఇహ మిగిలింది ఆ నిశ్శబ్దాన్ని భరించలేక నా మనస్సులో ఉన్న ఊహలకి మాటలు జోడించి నాలో నేను మాట్లాడుకునే మాటలు తప్పితే మరే శబ్దానికి ఆస్కారం లేదు ఆ ఇంట్లో. అట్టి పరిస్థితిలో కుటీరపు గోడని గోకుతోన్నట్లు శబ్దం వినిపించింది.

ఎక్కడా అనుమానానికి అవకాశం లేదు. బయట గోడని ఏదో గోకుతోంది. ఎవ్వరో కాదు. ఎవ్వరో అయితే తలుపు తడతారు. పాదాల చప్పుడు ఉంటుంది. ఈ చప్పుడు తీరే వేరు. ఇది కొమ్మ రాపిడి కూడ కాదు; అలాస్కాలో అంత ఉత్తరాన్న చెట్లేవీ? ఈ శబ్దం ఏదో గోళ్ళతో గోకుతూన్నట్లు ఉంది. లోపలికి రాటానికి ఏదో ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నాదా అన్నట్లు ఉంది తప్ప అది సాధారణమైన శబ్దం కాదు అని నా మనస్సులో నిర్ధారణ అవటమూ, శరీరమంతా భయావేశమవటమూ ఒక్క సారి జరిగిపోయేయి. అంత చలిలోనూ చిరు చెమటలు పోసేయి.

నేను అలాస్కాలో ఈ సాహస యాత్ర చెయ్యటానికి కారణం లేకపోలేదు. రెండేళ్ళ క్రితం ఏంబర్‌తో కలసి అమెజాన్ అడవుల్లో తిరగటానికి వెళ్ళి, దారి తప్పి, మహాసముద్రం లాంటి ఆ అడవిలో చుక్కానిలేని నావలా ఇద్దరం అయిదు రోజులు తిరిగి, చావు తప్పించుకుని, కన్ను లొట్టపోయినంత వరకూ వచ్చి, ఎలాగో బతికి బయట పడ్డాం. అనుకోకుండా అలాంటి అనుభవం జరిగిన తరువాత, ఏకాంతమైన ప్రదేశానికి ఎక్కడికైనా ఒంటరిగా వెళ్ళాలన్న కోరిక బలవత్తరంగానే పుట్టింది. జనసంచారం లేని చోట, నా ఊపిరి తప్ప మరొక శబ్దం కూడా లేని ప్రదేశంలో ఉంటే ఎలా ఉంటుందో అనుభవించి చూడాలని కోరిక

పుట్టింది. తిండి తినటానికి తప్ప నోరు విప్పవలసిన అవసరం రాకుండా ఉన్న ప్రదేశం కోసం వెతకటం మొదలు పెట్టేను.

దక్షిణ అమెరికా ఖండంలో పతగోనియా, హిమాలయాలలో మంచుతో కప్పబడ్డ గుహలు, ఉత్తర ధృవానికి సమీపంలో సతతం మంచుతో కప్పబడ్డ బంజరు భూములు నన్ను ఎన్నుకో అంటే నన్ను అంటూ అభ్యర్థులుగా నా మనోఫలకం మీద నిలిచేయి. ఇంతలో అలాస్కా విశ్వవిద్యాలయం, ఫెయిర్‌బేంక్స్‌లో ఉన్న ఆర్కిటిక్ పరిశోధనా కేంద్రంలో పనిచేస్తూన్న ఆచార్యుడొకాయనతో పరిచయం అయింది. విశ్వవిద్యాలయానికి చెంది, శిధిలావస్థలో ఉన్న లాగ్ కేబిన్ ఒకటి ఉత్తర ధృవ చక్రానికి రెండు, మూడు మైళ్ళ దిగువున ఉందనిన్నీ, కావలిస్తే దానిని వాడుకోటానికి అనుమతి ఇస్తాననిన్నీ వాగ్దానం చేసేరు. పోతే, అక్కడి నా అనుభవాలన్నిటిని ఒక దినచర్యలా రాసి, ఆ దినచర్యని ఆయనతో పంచుకోవాలని చిన్న మెలిక పెట్టేరు. ఆ షరతుకి నేను ఒప్పుకుంటే యూనివర్శిటీ వారి దన్ను నాకు ఉంటుందనిన్నీ, ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఎవ్వరో ఒకరు నన్ను రక్షించటానికి వస్తారనిన్నీ ఆయన ధైర్యం చెప్పేరు. నేనేదో సరదాగా వేసుకున్న పర్యాటక పథకం ఇలా ఒక విశ్వవిద్యాలయపు పరిశోధనా కార్యక్రమంలో ఒక భాగం అయ్యేసరికి నా ఉత్సాహం ఇనుమడించింది. విహారయాత్రగా తలపెట్టిన కార్యక్రమం పరిశోధనా పర్యటనగా మారేసరికి, యూనివర్సిటీ వారి సహాయంతో ఆ దుంగ ఇంట్లో నాకు కావలసిన హంగులన్నీ ఏర్పాటు చేసుకుందుకి ముందు వేసంగిలో ప్రయాణం కట్టేను.

నేను ఉండబోయే దుంగ ఇల్లు శిధిలావస్థలో లేదు కాని, వాసయోగ్యంగా కూడ లేదు. చిన్న చిన్న మరమ్మత్తులు చేసుకోవలసి వచ్చింది. ఇల్లంటే పెద్ద ఇల్లేమీ కాదు. ఒకే ఒక గది; దరిదాపు పన్నెండడుగుల చతురస్రం. ఒక్క తలుపు, ద్వారం తప్ప ఎక్కడా కిటికీలు లేవు. చుట్టూ దుంగ గోడలు, పైన దుంగ టొపారం. చలిమంట వేసుకోటానికి ఒక మట్టి పొయ్యి. విద్యుత్తు, నీటి సరఫరా లేవని చెప్పక్కర లేదు. కింద మట్టినేల గడ్డకట్టుకుపోయిన భూమట్టాన్ని తాకకుండా రాటల మీద లేపి కట్టేరు. సర్వకాల సర్వావస్థలలోనూ గడ్డకట్టుకుపోయి ఉండే ఈ రకం భూమిని ఇంగ్లీషులో "పెర్మాఫ్రాస్ట్" అంటారు. ఈ మంచుబంజరులలో ఏవీ పెరగవు. ఈ భూమిలో ఒక బొరియని తవ్వి, అందులో చలికాలంలో నాకు కావలసిన ఆహారపదార్ధాలని ఒక జాబితా ప్రకారం భద్రపరచేను: దుంపలు, ఎండబెట్టి ఒరుగులుగా మార్చిన కాయగూరలు, డబ్బాలలోనూ, సంచులలోనూ భద్రపరచిన పోషక పదార్థాలు, శరీరంలో వేడిని పుట్టించటానికి, రెండు–మూడు నెలలకి సరిపడా సారాలు, మాదక ద్రవ్యాలూ, మొదలయినవి.

నా అనుభవాలని రాయటానికి ఒక కాగితాల కట్ట, సిరాతో రాయటం అసంభవం కనుక, ఒక కట్ట పెనసళ్ళు, అక్కడ విద్యుత్తు ఉండదు కనుక ఒక పాత కాలపు టైపు యంత్రం. వేళ తెలుసుకోటానికి ఒక కేలండరు, ఒక అలారం గడియారం. ఉన్ని దుస్తులు. కొవ్వొత్తులు, కిరసనాయిలు దీపం, అగ్గిపెట్టెలు, కట్టెలు, ఇలా కావలసిన సరంజామా అంతా అక్కడ, ఆ కుటీరంలో ముందుగానే భద్రపరచేను.

ఆ దరిదాపుల్లోనే ఒక చిన్న సెలయేరు ఒకటి ఉంది. అది శీతాకాలంలో గడ్డకట్టుకు పోతుందిట. గడ్డకట్టిన మంచు మీద చిన్న గొయ్యి తవ్వితే అడుగున ఇంకా నీళ్ళు ప్రవహిస్తూనే ఉంటాయిట. వంటకీ, వార్పుకీ నీళ్ళు కావలిస్తే ఆ నీరే జీవనాధారంట.

ఇహ ఉదయం కాలకృత్యాలకని బయలుకి వెళ్ళవలసినప్పుడు ఏమిటి చెయ్యాలన్న అనుమానం రానే వచ్చింది. నేను ఉండబోయే దుంగ ఇంటికి దిగువగా గడ్డ కట్టిన మంచులో లోతుగా ఒక గొయ్యి తవ్వి దాని మీద ఆసనంలో రంధ్రం ఉన్న ఒక కొయ్య కుర్చీ వేసుకుని కాలకృత్యం కానివ్వటం సాధకం చేసేను. పని అయిన తర్వాత, ఏ రోజుకారోజు, ఆ కొయ్య కుర్చీని వెచ్చగా ఉన్న దుంగ ఇంట్లోకి తీసుకు రాకపోతే, మళ్ళా వసంత కాలం వచ్చే వరకూ పిరుదులకి ఆ కుర్చీ అంటుకుని ఉండిపోయే ప్రమాదం ఉందని మా వాళ్ళు హెచ్చరించేరు.

వేసంగిలోనే ఈ ప్రయత్నాలన్నీ పూర్తి చేసేను. నిజానికి నేను అనుభవించబోయేది ఏకాంతవాసమే కాని నేను పూర్తిగా ఏకాకిని కాదు, నేల విడచి సాము చేసే అవివేకినీ కాదు. అత్యవసరం అయితే దక్షిణంగా, నీరు ప్రవహించే దిశలో, పుంతల వెంబడి మూడు రోజులు కాలినడకని ప్రయాణం చేస్తే ఫెయిర్‌బేంక్స్ వెళ్ళే రహదారి తగులుతుంది. అక్కడ నుండి ఏదో ఒక వాహనం పట్టుకుని నాగరికతని చేరుకోవచ్చు. ఇటువంటి ప్రయాణానికి అవసరం ఉంటుందని ఒక దిక్సూచిని కూడా నా జాబితాలో వేసుకున్నాను.

ఇటువంటి ఏకాంతంలో వారాల తరబడి ఉంటే అది మన శరీరం మీదా, మనస్సు మీద తీవ్రమైన ప్రభావం చూపించక మానదు. అసలే కోతి, కల్లు

తాగింది, నిప్పు తొక్కింది అన్నట్లు కోతి లాంటి ఈ మనస్సుకి ఏకాంతంతో పాటు, బయటి ప్రపంచంతో బంధం లేకపోవటం, దాని మీద లయతప్పిన దినచక్రం, వెలుగు లేమి, నిశ్శబ్దం!

ఆ నిశ్శబ్ద సముద్రంలో ఒకే ఒక రకం చప్పుళ్ళు నాకు సతతం వినిపించేవి. అవి బయటనుండి వచ్చే శబ్దాలు కావు. ఆ శబ్దాలు నా బుర్రలోంచి వినబడే శబ్దాలు: నా చిన్నతనంలో నేను మాట్లాడిన మాటలు, విన్న పాటలు, సినిమాలలో విన్న సంభాషణలు. ఎవ్వరో చెవులో ఇల్లుకట్టుని పోరుతూన్నట్లు ఒకటే శబ్దాలు!

పూర్వం మన ఋషులు తపస్సు చేసుకుంటూ యోగనిష్టలో మౌనంగా ఉన్నప్పుడు చత్వారీ వాక్పధాలు వారి అధీనంలోకి వచ్చిన తరువాత, వారికీ ఇలాగే కొన్ని శబ్దాలు వినిపించి ఉంటాయి. అల్లకల్లోలమైన మనస్సు శాంతించిన తరువాత వినిపించిన అర్ధవంతమైన శబ్దాలనే కాబోలు శృతులు అని ఉంటారు.

ఈ శబ్దాల సద్దు మణిగిన తర్వాత, మగ గొంతుకలు – రష్యన్ భాషలో. నా భిలాయి రోజులు జ్ఞాపకం వచ్చేయి. తర్వాత అమెరికన్ యాస. స్పేనిష్ యాసతో ఇంగ్లీషు. తమిళ యాసలో తెలుగు. నేను గతంలో ఉద్యోగాలు చేసిన సందర్భాలలో సంభాషణలు ఇవన్నీ! ఈ గోలతో ఒక వారం కాపురం చేసిన తరువాత మళ్ళా నిశ్శబ్దం ఆవరించింది.

మరొక రోజు. పైన విమానం ఎగురుతూన్నట్లు దూరం నుండి చప్పుడు వినిపించింది. కాని ఆ చప్పుడు క్రమేపీ పెరగటం కానీ, తరగటం కానీ జరగలేదు; ఒకే స్థాయిలో ఉంది. పక్కింటి వారి గడ్డిని కోసే యంత్రమేమో! ఈ మంచులో గడ్డేమిటి, నా మొహం కాకపోతే. పైపెచ్చు పక్కన ఇళ్ళేమీ లేవే! దూరంలో

ఎవ్వరిదైనా ఇంట్లో ఎలక్ట్రికల్ జెనరేటర్ చేసే చప్పుడనుకున్నాను. కను చూపు మేర ఇళ్ళే లేవు. ఆ మెట్ట వాలుకి అటువైపు ఎవ్వరైనా ఉన్నారేమో! చలిలో శబ్దం చాలా దూరం ప్రయాణం చేస్తుందంటారు.

ఈ శబ్దం ఎక్కడనుండి వస్తోందో తేల్చుకోటానికి బందోబస్తుగా బట్టలు ధరించి, బూట్లు వేసుకుని బయటకి నడిచేను. ఆ శబ్దం వస్తూన్న దిశలో నడక మొదలు పెట్టేను. ఎంతదూరం నడిచినా జనావాసాలేవీ కనబడ లేదు. నా ఏకాంత వాసానికి భంగం కలగలేదని ఒక పక్క సంతోషం, ఆ శబ్దం ఎక్కడ నుండి వస్తోందో తెలియక ఒక రకమైన అనిర్వచనీయమైన భయం.

అలాస్కా అనుభవం అయిన ఒక ఏడాది పోయిన తర్వాత ఈ మోటారు శబ్దం ఎక్కడినుండి వచ్చుంటుందో స్టేన్‌ఫర్డ్ యూనివర్శిటీలో పనిచేసే ఒక మానసిక శాస్త్రవేత్త ఉహాగానం చేసి చెప్పేరు. మనుష్యులని, మరో మానవ సంపర్కం లేకుండా, ఏకాంతంగా ఉంచినప్పుడు వారి మనస్సులో కలిగే మార్పుల మీద ఆమె పరిశోధన చేసిందిట. మన మనస్సులో పుట్టే ఊహలు సరైనవో కావో అన్న అనుమానం మానవ సహజంట. మనం కన్నదీ, విన్నదీ, అనుభవించినదీ ఇతరులు కూడా అనుభవిస్తున్నారా లేదా అని సతతం బేరీజు వేసి చూసుకుంటాముట. ఈ "బేరీజు" లేక పోతే మనం కనేదీ, వినేదీ, అనుభవించేదీ నిజమో కాదో ఎలా తెలుస్తుంది? సముద్రంలో ఉన్న నావకి ఒడ్డున ఉన్న దీపస్థంబం ఎలాంటిదో ఈ బేరీజు మనకి అలాంటిది అన్నమాట. "ఎ బ్యూటిఫుల్ మైండ్" అన్న సినిమాలో ప్రొఫెసర్ నేష్ పక్కనున్న విద్యార్థిని అడుగుతాడు, "నా పక్క నిలబడి నాతో మాట్లాడుతూన్న వ్యక్తి అక్కడ నిజంగా ఉన్నాడా? లేదా?"

అని. ఏకాంతంగా ఉన్నప్పుడు మనకి ఇలా సంప్రదించటానికి ఒక స్థిర బిందువు — ఇలాంటి దీపస్తంబం – అంటూ ఏదీ ఉండదు. అప్పుడు మన మానసిక తుల్యత గాడి తప్పుతుంది. అప్పుడే ఆత్రుత, బుద్ధిమాంద్యత, నిర్లిప్తత, చిత్తభ్రమణం మొదలైన మానసిక లక్షణాలు క్రమంగా పొడచూపుతాయిట.

రోజుల తరబడి బయట నుండి ఏ రకమైన ధ్వనులు కాని, మాటలు కాని చెవులని తాకనప్పుడు నా బుర్రలో ప్రవహించే రక్త ప్రవాహపు ధ్వనే నాకు మోటరు శబ్దంలా వినిపించి ఉంటుంది అని ఆమె సిద్ధాంతీకరించేరు. నేనూ, ఏంబరూ అమెజాన్ అడవుల్లో చిక్కడినప్పుడు నాకు ఇదే రకం మోటారు హోరు వినిపించింది. ఆమె అనేదేమిటంటే కంఠంలో ప్రాణం ఉన్నంత కాలం పరిపూర్ణ నిశ్శబ్దం అంటూ ఎదీ లేదని. నిశ్శబ్దంగా ఉన్న గదిలో మనం పీల్చి వదిలే గాలే ఎంతో శబ్దం చేస్తూ వినిపిస్తుంది కదా!

బయట ఎంత సేపు చూసినా మరొక కొంపంటూ ఎదీ కనిపించలేదు. జెనరేటరు చప్పుడు మళ్ళా వినిపించనూ లేదు. ఇంటికి తిరిగొస్తూ ఉంటే ఆకాశం మెరిసినట్లు అనిపించింది. తలెత్తి చూసేను. ఆకాశం శోభాయమానంగా వెలిగిపోతోంది. దూరంగా, ఆకాశంలో రకరకాల ఆకారాలలో వెలుగులు నాట్యం చెయ్యటం మొదలు పెట్టేయి. వీటినే ఉత్తర

జ్యోతులు ("నార్దర్న్ లైట్స్") అంటారు. హిమాలయా గుహలకి వెళ్ళకుండా ఇక్కడికి రాటానికి కారణం ఈ జ్యోతులని చూడాలనే కోరిక ఉండబట్టే. వర్ణనకి లొంగని ఈ జ్యోతులు రంగురంగులతో మెరిసే రిబ్బన్లులా ఒకసారి, నాటకరంగం మీదకి దింపిన రంగుల తెరలా మరొకసారి, జెండాలా

గాలిలో రెపరెపలాడుతూన్నట్లు ఇంకొకసారి. గాలిలో రంగు కెరటాలు దొర్లుతూ దిక్చక్రం వరకూ పరిగెడుతూన్నట్లు ఇలా ఆ వెలుగులు నాట్యం చేస్తూ ఉంటే --- ఇలా రోజుకో రంగు వెలుగుతో మైమరపించే దృశ్యాలు ఇవి.

ఇరవై ఒకటవ శతాబ్దంలో అడుగు పెడుతూన్న మనకి ఈ ఉత్తర జ్యోతులనే అరోరా బొరియాలిస్ అని కూడ అంటారనీ, సూర్య జ్వాలలో పుట్టిన కణజాలం భూమి యొక్క అయనోవరణంలోకి ప్రవేశించినప్పుడు జరిగే భౌతిక ప్రక్రియల వల్ల ఆకాశం రంగు రంగులలో ప్రకాశిస్తుందనీ తెలుసు. కాని పురాతన మానవుడు, తన మేధకి అంతుపట్టని ప్రకృతి శక్తులకి దైవత్వం ఆపాదించి వాటిని వేదాలలో కీర్తించేడు. అందుకనే వేదాలలో పదే పదే ఇంద్రుడు, సూర్యుడు, అగ్ని, వరుణుడు, మిత్రుడు, ఉషస్సు, సవితృడు మనకి ప్రత్యక్షమవుతారు. వీరిలో మిత్రుడు, ఉషస్సు, సవితృడు తప్ప మిగిలినవారు మనకి పరిచితులే. అరోరా బొరియాలిస్‌నే మన ఋషులు సవితృడు అన్నారని ఒక సిద్ధాంతం ఉంది. ఋగ్వేదంలోని కొన్ని ఋక్కులని ఈ దృష్టితో వ్యాఖ్యానిస్తే వాటి అర్థం తేటతెల్లమౌతుందని వీరు 'నిరూపించేరు.'

ఇదే నిజం అయితే వేదకాలం నాటి ఆర్యావర్తం హిమాలయాలకి దిగువన ఉన్న భూభాగం కాజాలదు. ఎందుకంటే అదే ఋగ్వేదంలో మరొక చోట సప్తర్షి మండలం (లేదా బృహదృక్షం, లేదా పెద్ద ఎలుగుబంటి, లేదా "ఉర్సా మేజర్") ఆకాశంలో నడినెత్తి మీద కనిపిస్తోంది అని ఉంది. ఈ నక్షత్ర సమూహం ఒక్క ఉత్తర ధృవ ప్రాంతంలోనే నడినెత్తి మీద కనిపిస్తుంది. అంటే ఆర్యులు ఋగ్వేద కాలంలో ఉత్తర ధృవ ప్రాంతాలలో ఉండేవారా? ఈ సిద్ధాంతమే నిజం అయితే

సూర్యుడు పగటి దేవుడు, సవిత్రుడు రాత్రి దేవుడూనా? ఆ వేదకాలం నాటి సవిత్రుడినే ఇప్పుడు ఉత్తర జ్యోతులని అంటున్నామా?

వేదకాలం నాటి ఆర్యులు ఈ ఉత్తర ధృవ ప్రాంతాలలో నివసించి ఉంటే, ఇక్కడ ఆరు నెలలు పగలు, ఆరు నెలలు రాత్రి సంగతి ఎక్కడైనా ప్రస్తావించేరా? ఆరు నెలల కాలం మేరు పర్వతం మీద ఉన్న దేవతలకి ఒక పగలుతో సమానమని, మరొక ఆరు నెలలు రాత్రితో సమానమనీ చెబుతారు కదా. అలాంటప్పుడు ఉత్తర ధృవ ప్రాంతాలలోని కొండలలో ఎక్కడో మేరు పర్వతం ఉందా?

ఇలా ఋగ్వేదపు కాలాన్ని తలుచుకుంటూ, ఆ ఉత్తర జ్యోతులని చూస్తూ ఎంతసేపు బయట ఉండిపోయానో నాకే తెలియదు. ఆలోచించినకొద్దీ మతి పోతోంది తప్ప ....ఆకలి వేస్తూంటే లోపలికి వచ్చేను. అగ్నిహోత్రుడి పక్కనే వెచ్చ వెచ్చగా ఉన్న పదార్థాలని పళ్ళెంలో పెట్టుకుని తినటం మొదలు పెట్టేను.

అలాస్కాలో, నేనున్న అక్షాంశ రేఖ – 66 డిగ్రీలు ఉత్తరం - దగ్గర వెలుగున్న పగటి కాలాన్ని కొలవటానికి గంటలు అక్కర లేదు; నిమిషాలు చాలు. సూర్యరశ్మి తగలకుండా ఆకాశం మబ్బుగా ఉన్న రోజులలోనే మనకి సగం ఉత్సాహం చచ్చిపోతుంది. ఇంట్లో నిత్యం తిరుగాడే మనిషి ఊరికి వెళితేనే ఇల్లు చిన్నబోయినట్లు ఉంటుంది. అలాంటిది దరిదాపు ఇరవై నాలుగు గంటలూ చీకటిగా ఉండే ఈ శీతాకాలంలో ఏకాంతంగా ఉండటం అంటే మజాకా కాదు. ఎంత ధీమంతుడికైనా మతి భ్రమించే సావకాశం ఉంది. ఇందులో వెలుగులేమి ప్రభావం ఎంతో, ఏకాంతవాసపు ప్రభావం ఎంతో, లయతప్పిన దినచక్రం

ప్రభావం ఎంతో అని నేను తిరిగొచ్చిన తరువాత విశ్వవిద్యాలయంలో ఆచార్య బృందం తీవ్రంగా తర్జనభర్జనలు చేసింది.

తిండి తిని, గ్లాసులో వైను పోసుకుని, దానిని చప్పరిస్తూ తూగు కుర్చీలో కూర్చుని, చిన్నప్పుడెప్పుడో విన్న రేడియో నాటకాన్ని ఊహా ప్రపంచంలో మననం చేసుకుంటూ, తాదాత్మ్యంతో మైమరచి, సుషుప్తావస్తలోకి జారుకుంటూ, వింటున్నాను. ఇంతలో ఏదో చప్పుడైంది. మొదట్లో ఆ నాటకంలో పాత్రలు చేసే చప్పుడనే అనుకున్నాను. ఆ చప్పుడు నా కుటీరపు గోడలమీదనే అని స్ఫురించేసరికి కుర్చీ లోతుల్లోకి కూరుకుపోయిన నా నడ్డి ఠక్కున నిటారుగా నిలబడింది.

ఏదో మెత్తటి సుత్తితో బాదుతూన్నట్లు ఉందా చప్పుడు. కుటీరం అంతా ఒక్కసారి కంపించినట్లనిపించింది. లోపల వెచ్చదనం కోసం గోడల మీద, మిద్దె మీద మెత్తిన మెత్తటి మట్టి పెళ్ళలు, గడ్డి, గాదర ఊడి కింద పడ్డాయి. ఊపిరి బిగపట్టి, చెవులు రిక్కించి కుర్చీలో కదలకుండా కూర్చున్నాను – భయంతో. బయట చప్పుడు ఆగింది. 'ఆగంతకుడు' తరువాత ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడా అని ఆ నిశ్శబ్దానికి భాష్యం చెప్పుకుని ఎదురు చూస్తూ మెదలకుండా కూర్చున్నాను. నేను కదిలితే బయటున్నదేదో నా మనో భావాన్ని గ్రహించి నా ఎత్తుకి పై ఎత్తు వేస్తే! అదీ ప్రమాదమే.

మళ్ళా మొదలైంది. మొదట్లో జంకుతోనూ, క్రమేపీ నిర్భయంగానూ చేసిన చప్పుడది. ముందు గోడల పైన గోళ్ళతో బక్కురుతూన్నట్లు చప్పుడు. క్రమేపీ ఆ బక్కురు గోడ దిగువకి వచ్చింది. పదే పదే అదే చోటు నుండి ఆ చప్పుడు వినిపించే

సరికి అదేదో గోడలోంచి గదిలోకి వచ్చేసిందేమోనన్న భావన నా మనస్సులో నాటుకు పోయింది. రెపరెపలాడుతూన్న కిరసనాయిలు దీపపు గుడ్డి వెలుగులోంచి కళ్ళు పొడుచుకుని తీక్షణంగా చూడటం మొదలు పెట్టేను. పిచ్చి భయం ఒడలంతా ఆవహించింది. పరిగెత్తటానికి చోటు లేదు. దాక్కోడానికి చోటు లేదు. సత్వరం బయటనున్నది – అదేదైతేనేమి – లోపలికి వచ్చెస్తుంది.

అదేమై ఉంటుందో గభీ మని స్పురించింది. ధృవప్రాంతాలలో ఉండే ఎలుగ్గొడ్డు? బృహదృక్షం! 'ఉర్సా మేజర్!'

ఎలుగ్గొడ్లు చలికాలం అంతా నిద్ర పోతాయి కదా! అని వెంటనే మరొక ఆలోచన.

నిద్ర మధ్యలో ఆకలేసిందేమో! నేను వండుకు తింటూన్న తిండి వాసనకి నిద్ర లేచి వచ్చి ఉంటుంది. ఉత్తర జ్యోతులు విరజిమ్మే వెలుగుకి తెల్లారిందనుకుని శీతనిద్ర ("హైబర్నేషన్") వదిలేసి లేచి వచ్చిందేమో! లేక, ఈ పెద్ద భల్లూకాలు శీతనిద్ర పోవేమో!

కుటీరపు గోడల పైభాగాన్ని గోళ్ళతో బక్కిరింది కనుక ఈ ఎలుగ్గొడ్డు కనీసం నిలువెత్తు పైనే ఉంటుంది. అంత పెద్ద ఎలుగ్గొడ్డుకి బరువుతోపాటు రవంత తెలివి కూడా ఉండుంటే ఈ కుటీరాన్ని ఇసక మేడని తొక్కినట్లు తొక్కేసి ఉండేది.

ఈ ఆలోచన వచ్చేసరికి నా వెన్నులో చలి విద్యుత్తులా ప్రవహించింది. ఆ ఎలుగ్గొడ్డు గోడని గోకుతున్నాది కనుక సరిపోయింది కాని, ఆ పక్కనే ఉన్న తలుపుని గోకితే అది రపీమని తెరుచుకుంటుంది – చిన్న కర్రగెడ ఎలుగ్గొడ్డుని

ఆపగలదా? అప్పుడు అరవై కెజిల బరువు ఉన్న నేను ఒక పక్షం, ఆరువందల కెజిల బరువు ఉన్న భల్లూకం మరొక పక్షం! గెలుపు ఏ పక్షానిదో ఉహించటం కష్టం కాదు!

గోకుడు ఆగింది. మళ్ళా నిశ్శబ్దం – లబ్ డబ్ అని కొట్టుకుంటూన్న నా గుండె చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దమే!

గెడ వేసిన కుటీరపు తలుపు మీద దృష్టి కేంద్రీకరించి, కుర్చీ లోంచి లేవకుండా, నెమ్మదిగా గోడని ఆనించిన తుపాకీని చేతిలోకి తీసుకున్నాను. ట్రిగ్గర్ని కాక్ చేసి, తుపాకిని పైకెత్తి తలుపు వైపు గురిపెట్టి ఊపిరి బిగపట్టేను. భయంతో వణుకుతున్న చేతికి చల్లటి తుపాకీ తగిలేసరికి చేతి వేళ్ళు కొంకర్లు పోయాయి.

నిరీక్షణ మొదలు పెట్టేను. ఎలుగ్గొడ్డు గుర్రు పెట్టిన శబ్దం వినిపించినట్లయింది. నా మెడ మీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి. మళ్ళా నిశ్శబ్దం. ఎలుగ్గొడ్డు బుస కొడుతున్నట్లు నాకు వినిపిస్తోందా? ఈ లోగా నా ముక్కు పుటాలలో ఎలుగ్గొడ్డు వాసన! పులి వాసన, ఒంటె వాసన లాగే ఎలుగ్గొడ్డు ఒక నిర్దిష్టమైన వాసన వేస్తుంది. ఆదొక రకం రొచ్చు వాసన! అయితే ఎలుగ్గొడ్డు తలుపు తెరుచుకుని లోపలికి వచ్చేసిందా?

పోతపోసిన విగ్రహంలా కదలకుండా అక్కడే అలా నిరీక్షిస్తూ కూర్చున్నాను. తుపాకీ ట్రిగ్గర్ మీద నా చూపుడు వేలు అతుక్కు పోయింది. ఆ తలుపు వైపే గురి పెట్టి చూస్తూన్న నా తీక్షణమైన చూపులకి ఆ తలుపుకి చిల్లులు పడిపోయి ఉండాలి.

ఒంటి మీదకి తెలివొచ్చేసరికి నా ఒళ్ళంతా చెమటలు పోసేసి ఉంది. ఛాతీ మీదకి వాలిపోయిన తలని పైకెత్తి చూసేను. చేతిలో తుపాకీ ఇంకా అలాగే ఉంది. తలుపు మూసే ఉంది. గెడ వేసే ఉంది. లోపలా, బయటా నిశ్శబ్దం ఒక్కటే వినిపిస్తోంది.

ధైర్యం చేసి తలుపు తెరుచుకుని బయటకి వెళ్ళటానికి రెండు రోజులు పట్టింది.

(ఈమాట అంతర్జాల పత్రిక, మార్చి, 2007; రచన, జనవరి, 2008)

# మహాయానం

ఇది కలా? నిజమా? వైష్ణవ మాయా?

ఒకటి కాదు! రెండు కాదు!! ఇంటి నుండి మూడు వేల జ్యోతిర్వర్షాల దూరం.

మూడు వేల జ్యోతిర్వర్షాల దూరం అంటే మాటలా? ముప్పయ్ పద్మ కిలోమీటర్ల దూరం. లేదా ముప్పయ్ క్వాడ్రిలియను కిలోమీటర్లు దూరం. లేదా 30,000,000,000,000,000 కిలోమీటర్లు దూరం. ఇంత దూరం ఈ రాకెట్‌లో రావటమనేది అచింత్యం, అప్రమేయం, దుర్గ్రాహ్యం. ఈ దూరాన్నంతటినీ ఒక్క సాంకేతిక యంత్ర తంత్రాంగాలతో మాత్రమే అధిగమిచటం సాధ్యపడేది కాదన్న అవగాహన రాగానే సాంకేతిక తంత్రంతో యోగ తంత్రం మేళవించి ఈ దూరాన్ని మూడు భూ సంవత్సరాల కాలంలో అధిగమించగలిగేం. అసలు ఈ యోగ తంత్రపు మెలిక లేకపోతే ఈ రాకెట్‌లో ప్రయాణీకుడిగా నాకు అవకాశమే దొరికేది కాదేమో.

గమ్యం చేరుకున్నాం. చెయ్యవలసిన కార్యక్రమాలు చేసేసేం. చూడవలసిన విశేషాలు చూసేసేం. బరువైన హృదయాలతో తిరుగు ముఖం పట్టేం. నభోనౌకలో ఉన్న పరివారం అంతా దీన వదనాలతో, దిగాలుగా, నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా ఉన్నారు. వచ్చిన పని పూర్తయిందన్న విజయోత్సాహం ఎవరి ముఖాన్నా వీసమెత్తు లేదు.

జరిగిన విషయం నేను ఎవ్వరితోటీ చెప్ప దలుచుకోలేదు. నేను చెప్పకపోయినంత మాత్రాన గదిలో ఉన్న ఏనుగుని దాచగలమా? జరిగినదంతా వందలకొద్దీ విడియో టేపులలోనూ, వేలకొద్దీ ఛాయా చిత్రాలలోనూ పూసగుచ్చినట్లు నమోదు అయిపోయింది. ఇవన్నీ మాతో ఇంటికి మోసుకుపోతున్నాము కదా.

సాధారణ శకం ఇరవైయవ శతాబ్దపు ఉత్తర భాగంలో రోదసి మీద మొట్టమొదటగా ముమ్మరంగా పరిశోధనలు జరిగేయి. ఆ రోజులలో సైనిక, నావిక, వైమానిక దళాలలోని దళపతులని నభోనౌకలకి చోదరులుగా ఎన్నుకోవటం పరిపాటిగా ఉండేది. రాను రాను ప్రజాస్వామ్యపు ప్రభావం వల్ల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల దగ్గర నుండి ప్రజలలో అన్ని వర్గాల వారిని రాకెట్లో పైకి పంపటం జరిగింది. ఇప్పుడో? రోదసిలో ప్రయాణం అంటే బస్సు ప్రయాణంలా తయారయింది.

దూరాన్న మెరుస్తూ కనిపిస్తూన్న నక్షత్రాలని చూస్తూ రాకెట్ యొక్క కిటికీ దగ్గర కూర్చుని, నా మస్తిష్కంలో చెలరేగుతూన్న ఆలోచనా తరంగాలతో కుస్తీ పడుతూ, నాలో నేనే స్వగతంగా గొణుక్కుంటున్నాను.

"సృష్టికర్త హస్త కౌశలం ఈ విశ్వంలో ఏ మూల చూసినా ద్యోతకం అవుతూనే ఉంటుందని చెప్పటానికి ఇంత కంటె నిదర్శనం ఏమిటి కావాలి?"

బోరు కొడుతూన్న బస్సు ప్రయాణంలో సందు దొరికితే చాలు పక్కవాడితో హస్కు కొట్టటానికి ఎదురు చూస్తూన్న వాడిలా నెవిల్ లూమన్ అందుకున్నాడు.

“ఈ విధ్వంస కాండ చూసిన తరువాత ఆ స్రష్ట దీనంతటినీ ఏ ప్రయోజనం ఆశించి సృష్టించేడో అర్థం కావటం లేదు.”

డాక్టర్ లూమన్ నా పరిశోధనా వర్గంలో ఉన్న తోటి ప్రయాణీకుడు. మిగిలిన శాస్త్రవేత్తలలాగే ఇతను కూడ ఒక మోస్తరు నాస్తికుడు. రేషనలిస్టు. “స్రష్ట,” “సృష్టి” మొదలైన మాటలు వాక్యంలో వాడినా అవి కేవలం ఊతపదాలు.

సా. శ. పదమూడవ శతాబ్దారంభంలో ఆధునిక పాశ్చాత్య నాగరికత “పునర్వికాశ యుగం” లో అడుగు పెట్టింది. నాటి నుండి యంత్రిక–భౌతిక (“మెకానిస్టిక్”) దృక్పథం చెలరేగి ప్రపంచం అంతటినీ పెను తుఫానులా చుట్టుముట్టింది. ఆ సందర్భంలోనే రెనే డెకా, స్పినోజా, ఇమ్మేన్యువల్ కాంట్ మొదలైన తత్త్వశాస్త్రపు హేమాహేమీలు పునాదులు వేసి లేవనెత్తిన హేతువాద సౌధపు నిర్మాణం డార్విన్ సిద్ధాంతో బలం పుంజుకుని ఇరవైయవ శతాబ్దం నాటికి పరాకాష్ట నందుకుంది. ఈ సౌధపు ప్రాంగణంలోనే ఈ నభోనౌక నిర్మాణం జరిగింది. ఈ నౌక విన్యాసానికి, రూపకల్పనకి తోడుపడ్డ వ్యక్తి డాక్టర్ లూమన్. ఇది అతని కపాల కల్పితం. దేవుళ్ల గురించి, దయ్యాల గురించి చేసే చర్చలు అతని చెవికి ఎక్కవు. అంతా మన చేతులలోనే ఉందనే రకం.

“మనమంతా దేవుని బిడ్డలం. వాడి నామధేయమే ‘కరుణామయుడు’ అనే నమ్మకంతో పెరిగిన నాకు వాడి ఈ ప్రవర్తన ఎంతగా ప్రయత్నించినా అవగాహన కావటం లేదు. ఏ ప్రయోజనం చూసి వాడు ఈ పని చేసేడో నాకు ఆకళింపుకి రావటం లేదు.” నభోనౌక నాయకుడు ఫాదర్ స్మిత్ వంత కలుపుతూ కబుర్లలోకి దిగేడు.

క్రైస్తవ మతం లోని రోమన్ కేథలిక్ శాఖకి గురుతుల్యుడైన ఫాదర్ స్మిత్ నభోనౌకకి నాయకుడేమిటా అని ఆశ్చర్యపోనక్కర లేదు. ఫాదర్ స్మిత్ గ్రహ భౌతికశాస్త్రం ("ప్లేనటరీ ఫిజిక్సు") లో పి. ఎచ్. డి. పట్టా పుచ్చుకుని బాగా పేరు తెచ్చుకున్న ఘటికుడు. వివేకానందుని నిర్వచనం ప్రకారం ఇతడొక కర్మ యోగి. ఈ బృహత్కార్య నిర్వహణకి సాయుధ బలాల్లోని సైనికాధికారులకంటె మతాధిపతులు, యోగులు ఎక్కువ ఉపయోగం అని మొదట్లోనే ఒక నిర్ణయం జరిగింది. అందుకనే ఈ జోగులంతా ఈ నభోనౌకలో భుజాలు రాసుకుంటున్నారు.

దేవుని ఉనికి మీద నమ్మకం సన్నగిల్లుతూన్న వారిలో ఆధునిక శాస్త్రవేత్తలు చాల మంది ఉన్నారు. స్థూలంగా చెప్పాలంటే ఆస్తిక మతాల మీద నమ్మకం ఉన్నవాళ్లంతా – అంటే హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, మొదలగువారు – దేవుడి యెడల అయిదు విషయాలలో ఐక్యతా భావం వెలిబుచ్చుతారు. మొదటిది దేవుడి అద్వితీయం. రెండు, దేవుని సృష్టికర్తృత్వం. తరువాత, ఆయన సర్వశక్తిత్వం, సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం.

సూక్ష్మంగా పరిశీలిస్తే మతాలలో తేడాలు లేకపోలేదు. వాడు "కరుణామయుడు, ఆశ్రిత పక్షపాతుడు, ఉత్తములని రక్షించి దుష్టులని శిక్షిస్తాడు" అనే నమ్మకాలు అందరిలోనూ ఉన్నా, "దేవుడు ఎటువంటివాడు?" అన్న ప్రశ్న వచ్చినప్పుడు మాత్రం ఈ నమ్మకాలలో కొద్ది కొద్ది తేడాలు కనిపిస్తాయి. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, నిందాస్తోత్రాలు, మంచిచెడ్డలు, రాగద్వేషాలు, పాపపుణ్యాలు, మొదలైన ద్వయీ భావాలకి దేవుడు అతీతుడని హిందువులు

నమ్ముతారు; క్రైస్తవులు అలా అనుకోరు. హిందువులలోని అద్వైత మతస్తుల నమ్మకాలని క్రైస్తవుల నమ్మకాలతో పోల్చి చూస్తే మరొక తేడా కనిపిస్తుంది. ఈ సృష్టి అంతా భగవంతుని స్వరూపమే అని హిందువులు నమ్ముతారు; వారికి విశ్వమే విష్ణువు. కుండలకీ కుమ్మరికీ తేడా ఉన్నట్లు ఈ జగత్తుకీ, జగద్రచనా వ్యాపారానికి అధ్యక్షుడైన భగవానుడికీ తేడా ఉందంటారు క్రైస్తవులు. హిందువులలో విశిష్టాద్వైతాన్ని పాటించే వైష్ణవులకీ, క్రైస్తవులకీ ఈ విషయంలో కొంత పోలిక ఉన్నట్లు అనిపిస్తుంది.

సుదూరంలో నెమ్మదిగా వెనక్కి జరుగుతూన్న నక్షత్రమండలాల గమనాన్ని బట్టీ, ఇంజను నిశ్శబ్దంగా చేస్తూన్న బుస వంటి ధ్వనిని బట్టీ అనుమానపడాలే తప్ప ఆ శూన్యంలో రాకెట్ కదులుతూన్న భ్రమే లేదు.

"ఇదంతా వాడి లీల. ఈ జగన్నాటక సూత్రధారుడి ఆటలో మనం అంతా పావులం మాత్రమే. 'ఈ సృష్టి ఎందుకు జరిగింది? ఈ సృష్టి ప్రయోజనం ఏమిటి?' వంటి ప్రశ్నలు అడగగలిగే కుతూహలం మనకి ఉన్నప్పటికీ, వీటిని అర్థం చేసుకోగలిగే స్థోమత మానవ మేధకి లేదు." నా వేదాంత ధోరణిలో నాకు తోచిన అభిప్రాయం నేనూ వెలిబుచ్చేను.

ఈ నభోనౌకని నిర్మించి, పరిశోధన నిమిత్తం మూడు వేల జ్యోతిర్వర్షాల దూరం పంపగలిగిన జాతికి మేధా శక్తి లేదన్న నా మాట విరుద్ధోక్తిలా స్ఫురించిందో లేక నా వేదాంతపు ధోరణి నెవిల్‌కి అర్థం కాలేదో, ప్రశ్నార్థకంగా నా వైపు చూసి, " 'ఈ సృష్టి ఎందుకు జరిగింది? ఈ సృష్టి ప్రయోజనం ఏమిటి?' వంటి ప్రశ్నలకి సమాధానం సైన్సులోనూ దొరకదు. ఈ సృష్టి ఎలా జరిగిందో

చెప్పటానికి సైన్సు ప్రయత్నించగలదు. ప్రయోగ శాలలో ఎలక్ట్రాను గరిమ, ప్రోటాను గరిమ ఎంతెంతో తూకం వేసి చెప్పగలను కాని, 'వాటికి ఆయా గరిమలు అంతంతే ఎందుకు ఉండాలి?' అని అడిగితే నేనూ చెప్పలేను. ఈ సృష్టి ప్రయోజనం మాటంటావా? ఏమో___." అంటూ అర్ధగర్భితంగా ఆగిపోయేడు.

ఈ ప్రశ్నకి సమాధానంగా నేనే చొరవ చేసుకుని సంభాషణ పొడిగించేను.

"సముద్రపుటొడ్డున పిల్లలు ఇసకలో గుడి కట్టటం చూసే ఉంటారు?"

"చూసేను."

"పిల్లలు ఎంతో కష్టపడి గుడులు, గోపురాలు కడతారు. కట్టి కాసేపు ఆడుకుని, ఆ ఇసక మేడలని కాలితో తన్నేసి, ఆ ఇసక పోగు ఉవ్వెత్తున పడి లేచే కడలి తరంగాలలో కొట్టుకుపోతే, మరి కొంచెం ఎగువకి జరిగి మరొక మేడ కడతారు. అదొక హేల. అంతే.

"పేక మేడలు కట్టే పిల్లాడిని ఒక సారి చూసేను. గంటలకొద్దీ శ్రమించి నిలువెత్తు మేడ కట్టేడు. పది నిమిషాల పాటు తన సృజనాత్మక శక్తిని చూసుకుని ఆనందించేడు. అటు తరువాత ఉఫ్ అని ఊదేసి మేడని పడగొట్టేడు.

"పాశ్చాత్య దేశాలలో కూడ "డామినో" అనే ఆట ఒకటి ఉంది కదా. చిన్న చిన్న బొమ్మిటికలని రకరకాల విన్యాసాలతో పేర్చి, తరువాత పడగొట్టి ఆనందిస్తారు; కట్టటం, పడగొట్టటం, అదే ఈ ఆటలో ఆనందం.

"సైకత స్థలిలో సౌధాలు నిర్మించిన వాడినీ, పేక మేడలు కట్టిన వాడినీ 'ఏ ప్రయోజనం ఆశించి కట్టేవు?' అని అడిగితే 'సరదాకి' అని సమాధానం

చెబుతాడు. అలాగే సృష్టి కర్త కూడ ఈ గ్రహాలని, నక్షత్రాలనీ, క్షీరసాగరాలనీ, సృష్టించి, నడిపించి, లయింప జేస్తున్నాడు. ఇదంతా ఒక హేల!

"మా గీతలో కృష్ణ పరమాత్మ "కాలోస్మి లోకక్షయ కృత్ప్రవృద్ధో, లోకా స్సమాహర్తు మిహ ప్రవృత్తః" అన్నాడు. దీని అర్థం ఏమిటో తెలుసా? కాలస్వరూపుడను నేనే. లోకములను పెంపొందించి లయింప జేయువాడను నేనే. లోక సంహారము ప్రవృత్తిగా కలవాడను నేనే.

"మన భూలోకంలో మానవుడు పుట్టి పట్టుమని మూడు ఆదివారాలు కాలేదు. భూలోక చరిత్రలోనే మన ఉనికి కేవలం బుద్బుదప్రాయం. సృష్టిలో మనం ఏపాటి వాళ్లం? అటువంటి మనం ఎంత ఎదిగి పోయేం? ఎదిగిపోయి సృష్టి కర్త మనోప్రవృత్తి మీద వ్యాఖ్యానాలు చేస్తున్నాం! ఆహా!

"అన్ని జన్మలలోకి మానవ జన్మ ఒక్కటే ఉత్కృష్టమైనదనిన్నీ, ఈ సృష్టి అంతా వాడు మన కోసమే – అంటే మానవుల కోసమే – చేసేడనిన్నీ, ఈ మానవుడి చుట్టూ విశ్వం అంతా పరిభ్రమిస్తోందనిన్నీ భ్రమ పడటం యంత్రిక–భౌతిక పాశ్చాత్య నాగరికత ప్రభావమే. ఇది శుద్ధ కుక్షింభరత్వం, భౌతిక వాదం."

నా మనస్సులో చెలరేగుతూన్న ఆలోచనా పరంపరకి వాగ్రూపం కల్పించి నా సహాధ్యాయుల ముందు ఉంచేను.

అసలు ఈ నభోసాగరం దాటటానికి మేము 'మహాయానం' అన్న పేరుతో నిర్మించిన ఈ నభోనౌకలో జరుగుతూన్న ఈ ప్రయాణం మా అందరికీ ఇంతగా కలిగించిన మనస్తాపానికి, ఆ మనస్తాపం ప్రేరేపించిన చర్చకీ కారణం చెబుతాను.

ఇరవైయవ శతాబ్దపు ఉత్తర భాగంలో మానవుడు నభోనౌకలు నిర్మించటం నేర్చుకున్న తరువాత నక్షత్రాలు పేలిపోగా మిగిలిన అవశేషాల మీద పరిశోధన పుంజుకుంది. ఈ పరిశోధనలకి గాను విశ్వాంతరాళంలోకి దూసుకుపోయి, అత్యంత వేగంతో ప్రయాణం చెయ్యగల పెద్ద పెద్ద నభోనౌకలని నిర్మించటం నేర్చుకున్నాం. భౌద్ధ మతం మీద అభిమానం ఉన్న ఒక ఆసామీ సలహా మీద ఈ జాతి పెద్ద నౌకలకి 'మహాయానం' అని పేరు పెట్టేం. మహాయానం అంటే పెద్ద పడవ అని అర్థం. పెద్ద పడవలని సముద్రంలోనే అట్టేపెట్టి రేవులోకి చిన్న పడవలు తోలుకు వచ్చినట్లు, మహాయానంకి అనుబంధంగా 'హీనయానం' అన్న పేరుతో చిన్న నభోనౌకలు కూడ నిర్మించేం.

ఆకాశంలో మన కంటికి కనిపించే నక్షత్రాలన్నీ మినుకు మినుకు మంటూ ఒకేలా కనిపించినా నిజానికి మనిషికీ మనిషికీ ఎంత తేడా ఉందో నక్షత్రానికీ నక్షత్రానికీ అంత తేడా ఉంటుంది. మనిషికి పుట్టుకా, యవ్వనం, తదుపరి మరణం ఉన్నట్లే నక్షత్రాలకి కూడ బాల్య, కౌమార, యవ్వన, వార్ధక్య, మరణాలు ఉంటాయి. మన సూర్యుడు లాంటి నక్షత్రాల జీవితాలు ఒడిదుడుకులు లేకుండా, పెద్ద చెప్పుకోదగ్గ విశేషాలేవీ లేకుండా, సజావుగా గడచిపోతాయి. కాని కొన్ని నక్షత్రాలు నడి వయస్సులో ఉన్నప్పుడు దేదీప్యమానమైన కాంతి వెదజల్లుతూ ఫెళ్లున పేలిపోతాయి. వీటిని నవ్యతారలు లేదా నోవాలు అంటారు. ఈ నోవాలలో రెండు రకాలు ఉన్నాయి: సాధారణంగా పేలే నవ్యతారలు, బ్రహ్మాండంగా పేలే సూపర్ నోవాలు లేదా బృహన్నవ్య తారలు. ఈ విశాల విశ్వంలో ఇలా రివాజుగా

పేలే బృహన్నవ్య తారలు సహస్రాబ్దానికి మూడో, నాలుగో మన కళ్ల పడుతూ ఉంటాయని శాస్త్రవేత్తల అంచనా.

ఒక నవ్యతార కాని బృహన్నవ్య తార కాని పేలినప్పుడు అంతవరకు మినుకు మినుకు మంటూ కనిపించే నక్షత్రం అకస్మాత్తుగా దేదీప్యమానంగా వెలిగిపోతుంది. అలా వెలిగినప్పుడు ఆ తార వెయ్యి సూర్యుల ప్రభతో రెండు, మూడు వారాలపాటు ప్రకాశించినప్పుడు భూలోకంలో ఉన్న ప్రజల దృష్టిని ఆకట్టుకోటానికి సావకాశం ఉంటుంది. తరువాత శక్తిని కోల్పోయి కంటికి కనిపించనంతగా కాంతివిహీనమైపోతుంది. సా. శ. 1054 లో ఇటువంటి బృహన్నవ్య తారని చైనాలోని ఖగోళ శాస్త్రవేత్తలు గమనించి నమోదు చేసేరు. అయిదు శతాబ్దాల తరువాత, సా. శ. 1572 లో శర్మిష్ఠ నక్షత్ర రాసిలో మరొక బృహన్నవ్య తార పేలింది. దుర్భిణి యంత్రాల వాడుక విరివిగా పెరిగిన ఈ కాలంలో నక్షత్రాలు పేలిపోగా మిగిలిన అవశేషాలు దూది పింజలులాంటి తేజోమేఘాల రూపంలో ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి.

ఈ నవ్యతారలకి మల్లే మన సూర్యుడి గ్రహపాటు కూడ వక్రిస్తే మన గతి ఏమిటవుతుందని కొంతమందికి అనుమానం రానేవచ్చింది. అటువంటి గతి మన సూర్యుడికి పట్టదనిన్నీ, మన సూర్యుడు నవ్యతారగా కాని బృహన్నవ్య తారగా కాని మారటానికి సిద్ధాంతం ఒప్పుకోదనిన్నీ ఎంతమంది ఎంతలా వాదించినా నీహారికల మీద పరిశోధన ఆగలేదు. ఈ కార్యక్రమంలోనే నేను, డాక్టర్ లూమన్, ఫాదర్ స్మిత్, ప్రభృతులం ఇక్కడికి వచ్చేం.

అంతా ఎప్పుడో అయిపోయింది అని తెలిసి కూడ పరామర్శ చెయ్యటానికి వచ్చిన దూరపు బంధువులులా వచ్చేం. ఇళ్లు తగలబడి పోయిన తరువాత, విమానాలు కూలిపోయిన తరువాత ప్రమాదం ఎందుకు జరిగిందో విచారించే పత్తేదారులలా వచ్చేం. "ఈ ప్రమాదం ఎందుకు జరిగింది? ఇటువంటివి ఇటుపైన జరగకుండా తీసుకోవలసిన జాగ్రతలు ఏమిటి?" అంటూ పరిశోధన చేసినట్లే మేమూ అటువంటి ప్రశ్నల పుస్తకం ఒకటి మాతో పట్టుకొచ్చేం – చెయ్య గలిగినది ఏదీ ఉండదని తెలిసి కూడా.

ఎప్పుడో వేల సంవత్సరాల కిందట జరిగిన పేలుడు జోరు ఇప్పటికీ తగ్గినట్లు లేదు. పలచటి విశ్వధూళి రేణువులు, గాలి తెరలులా వచ్చి మా నభోనౌకని తాకటం మొదలవగానే నిద్రాణంగా ఉన్న మా ఉపకరణాలని మీటలు వేసి లేవగొట్టేం. ఎంతో వేడిగా ఉన్న ఈ పరమాణు రేణువులు, ఇప్పటికీ, ఇన్నాళ్లు పోయినప్పటికీ, అత్యూదమైన కాంతులీనుతూ ప్రకాశిస్తున్నాయి. ఎక్కడో పేలిపోయిన నక్షత్రం యొక్క అవశేషం సుదూరంలో ఎక్కడో ఉండే ఉంటుంది. ఎందుకంటే, చంద్రశేఖర్ నియమించిన అవధి ప్రకారం మన సూర్యుడిని పోలిన నక్షత్రాలు అవసాన దశకి వచ్చే సరికి శ్వేతకుబ్జ తారలుగా మారతాయి. మన సూర్యుడికి వెయ్యింతలు పరిమాణంలో ఉన్న మహానవ్య తార అంత్య దశలో పేలిపోయిన తరువాత మిగిలేది కాలరంధ్రం, లేదా బ్లేక్ హోల్. ఈ కాలరంధ్రం కంటికి కనిపించని రోదసీ విశేషం. దీని సంఘటన దిక్చక్రం దరిదాపులకి వెళితే మహాయనం పని హుళక్కి. అందుకని బహు అప్రమత్తతో చోదకులు నభోనౌకని నడుపుతున్నారు.

అగ్ని దేవుడికి ఆహుతి అయిపోయిన మంటలని ఆర్పిన ఆరు నెలల తరువాత ఎవ్వరైనా బతికున్నారేమోనని ఆశతో వెతకటం పేరాసే అయినట్లు, ఎప్పుడో ఆరు వేల సంవత్సరాల కిందట పేలిపోయిన తారా మండలంలో గ్రహాలు, వాటిని అంటిపెట్టుకుని జీవాలు ఉన్నాయేమోనని వెతకటం కూడ పేరాసే అనిపించుకుంటుంది. అలాగని పురుష ప్రయత్నం చెయ్యకుండా ఇంత దూరం వచ్చి రిక్త హస్తాలతో తిరిగి ఎలా వెళ్లటం? అందుకని "వైడ్ ఏంగిల్ ప్లేనెటరీ కేమెరా" ని నిద్ర లేపి ఏదైనా గ్రహం కనిపిస్తుందేమో వెతకమని కంప్యూటరుకి పని అప్పగించేం. కొద్ది సేపట్లోనే మన కాల రంధ్రానికి అత్యంత దూరంలో పరిభ్రమిస్తూ, ఉరవళ్లు తొక్కుతూన్న వరదలో కొట్టుకుపోతూన్న కట్టమానులా, ఒకే ఒక చిన్న గ్రహం ఆ శూన్యాకాశంలో కనిపించింది. మేము ఊహించుకుంటూన్న కాల రంధ్రానికీ ఇక్కడ కనిపించిన గ్రహానికి మధ్య దూరం మన సూర్యుడికీ ప్లూటోకి ఉన్న దూరం కంటె చాల రెట్లు ఎక్కువ ఉంటుందని మా సిబ్బంది లెక్క కట్టి చెప్పేరు. నక్షత్రం పేలుడు యొక్క తీవ్రతకి, తన మాతృ కక్ష్య నుండి తొలగించబడి, తుళ్లి పడి, ఈ గ్రహం, అనాథగా, ఇంత దూరం వచ్చి ఉంటుందని నా అనుయాయులు తీర్మానించేరు.

ఇంత దూరం కొట్టుకొచ్చిన గ్రహానికి వెలుతురు, వేడి అందే సావకాశాలు పూజ్యం. కాని అటువంటి గ్రహం మీద ప్రాణి జీవించలేదని తీర్మానించటం మానవకేంద్ర దృక్పథపు అహంభావమే అవుతుంది. సూర్య రస్మి సోకని సముద్రపు లోతుల్లో, భూగర్భపు లోతుల్లోంచి ఉబికి వచ్చే వేడి ఊటలలో ప్రాణులు కనిపించేయి. కనుక ఈ గ్రహం మీద కూడ ఏదో ఒక రకపు ప్రాణి బతకటానికి

సావకాశాలు లేకపోలేదు; అది మనలాంటి మేధా శక్తి ఉన్న ప్రాణి కాకపోవచ్చు. ఇంత దూరం వచ్చి తినబోతూ రుచి అడగటం ఎందుకని మాలో ముగ్గురు హీనయానం ఎక్కి ఆ గ్రహం మీదకి దిగేం. దిగి చూసిన దృశ్యం మాలో రేకెత్తించిన అనుభూతులని 'ఇవీ' అని వర్ణించటానికి మాటలు చాలవు. ఒక పక్క ఆనందం. మరొక పక్క ఆశ్చర్యం. మరొక పక్క ఆరాటం. ఈ అనుభూతులు నసాళానికి అంటే లోగా ఆవేదన, విచారం, ఆగ్రహం ముంచెత్తుకు వచ్చేయి.

గ్రహం మీద దిగే ముందే, చాల దూరం నుండే, రకరకాల కోణాలలో ఛాయా చిత్రాలు తీసి ఎక్కడ దిగటమో నిశ్చయం చేసేం. దూరం నుండే దీర్ఘ చతురస్రాకారంలో ఒక పెద్ద కట్టడం లాంటి భవన విశేషం కనిపించింది. దాని ఆకారాన్ని బట్టి, దాని నుండి పరావర్తనం చెంది తిరిగి వచ్చిన రాడార్ వాకేతాలని బట్టి అది సహజ సిద్ధమైనది కాదనిన్నీ, ఎవరో మేధాశక్తి సంపన్నులచే నిర్మించబడి ఉంటుందనిన్నీ ఒక ప్రతిపాదన చేసుకున్నాం. కనుక ఆ గ్రహం మీద దిగగానే ఆ భవన విశేషాన్ని వెతుక్కుని సమీపించేం.

అది చూడటానికి పెద్ద ఉక్కు భోషాణంలా ఉంది. చుట్టూ ఉన్న రాళ్లల్లో పాతుకుపోయి ఉంది. మేమంతా ఖగోళ శాస్త్రంలో తరిఫీదు పొందినవాళ్లం. మాకు పురావస్తు పరిశోధనలో ప్రవేశం పూజ్యం. అయినా సరే పెల్లుబికి వస్తూన్న కుతూహలాన్ని అణిచిపెట్టుకోలేక ఆ భోషాణం చుట్టూ ఉన్న శిలావిశేషాలని చేతిలో ఉన్న పనిముట్లతోనే తవ్వి, రాళ్లని పక్కకి నెట్టి, చిన్న గదిలా ఉన్న ఆ భోషాణం లోనికి ప్రవేశించటానికి ఒక బిలం రూపొందించి, ఆ బిలం గుండా లోపలికి ప్రవేశించేం.

సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన నాగరికుల హస్త కౌశలం కనిపించిందా గదిలో. మన జుట్టు, కట్టు, బొట్టు మొదలైన బాహ్యాలంకారలనీ, ఆహార, విహార, శయన, పానీయాదులలోని ఆచార వ్యవహారాలనీ, ఆట, పాటలనీ, జీవిత సరళినీ భావి తరాల వారికి అందజేయటానికి కాల గుళికలు చేసి పాతిపెట్టే ఆచారం మనకి ఎలా ఉందో అటువంటి ఆచారం ఉన్న జాతి ఒక నిధిని చేసి అక్కడా గదిలో దాచి పెట్టినట్లనిపించింది. ఈ కాల గుళిక ద్వారా వారి పాటలు వినగలిగేం. వారి పిల్లలు ఆడుకునే ఆటబొమ్మలు చూడ గలిగేం. వారి ఆశలు, ఆశయాలు, ఆసక్తులు అవగాహన చేసుకున్నాం. మేము చూసిన దానిని బట్టి వారి పాఠశాలలు, పరిశోధనా పథకాలు, అన్నీ అగ్గిలో కాలి, నిర్ధూమధామములై, బుగ్గయి పోయాయి.

అగ్నికి అలా ఆహుతి అయిన ఆ జాతి ప్రగతి పథంలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగింది. తమ పరిశోధనా నైపుణ్యంతో తమ మనుగడకి రాబోయే మహా విపత్తు గురించి తెలుసుకోగలిగిన మహా మేధావులు వాళ్లు. ఒక రోజు, రెండు రోజుల ముందు కాదు, శతాబ్దాల ముందే తమ సూర్యుడికి పట్టబోయే గతి, దుర్గతి వారు అవగాహన చేసుకున్నారు. వారు తమ స్వంత గ్రహాన్ని వదిలేసి, తమ సూర్యుడికి – తద్రూపేణా ఆసన్నమయే ప్రమాదానికి – దూరంగా, మరొక గ్రహం మీదకి వలస వెళ్లి, తమ జాతిని, నాగరికతని రక్షించుకుందామని ఈ గ్రహం మీదకి వచ్చినట్లు ఆ భోషాణంలో ఉన్న అవశేషాల ద్వారా అర్థం అయింది.

ఆ భోషాణంలో చిత్రపటాలు, ఛాయాచిత్రాలు, చలన చిత్రాలు, దృశ్యకావ్యాలు, మొదలైనవి ఎన్నెన్నో ఉండబట్టి, భాషతో నిమిత్తం లేకుండా వారి

చరిత్రని అవగాహన చేసుకోగలిగేం. వారి పట్టణాలని చూడగలిగేం. ఇలా కిలకిలారావాలతో కలకలలాడుతూన్న వారి జీవనశైలికి పేలుడు లక్షణం ఉన్న బృహన్నవ్య తార ప్రతిబంధకాలు తెచ్చిపెట్టింది. రాబోయే పెను ముప్పు తెలుసుకునే దక్షత సంపాదించేరు కాని ఆ ముప్పు నుండి తప్పించుకునే తరుణోపాయానికి కావలసిన సాంకేతిక సంపద వారి దగ్గర లేకపోయింది. వారి పుట్టి ములగకుండా ఉండాలంటే వారి గ్రహం వీడి మరొక గ్రహానికి వలస వెళితే సరిపోదు; వారి తారా మండలం దాటి సుదూరంగా ఉన్న మరొక తారా మండలానికి పారిపోయి అక్కడ వారి సంస్కృతిని తిరిగి స్థాపించుకోవాలి. కాని వారి తారా మండలం వదలి మరో తారా మండలానికి వెళ్లగలిగే రాకెట్‌లు కాని, సాంకేతిక విజ్ఞానం కాని వారి రాతల్లో ఎక్కడా కనబడ లేదు. ఆసన్నమవుతూన్న ఆపద అవగాహనలోకి వచ్చినా అసహాయసూరుల్లా ఉండిపోయారే తప్ప ఆపదని ఎదుర్కోలేక దీపపు జ్వాలలో పడ్డ చిమ్మెటలలా ఆ ప్రళయాగ్నికి ఆహుతి అయిపోయేరు. వారు భద్రంగా దాచుకున్న కాలగుళిక వారి కథని మనకి చెప్పి ఉండకపోతే హృదయవిదారకమైన ఈ విచార గాథ కాలగర్భంలో కలసిపోయి ఉండేది.

మన సూర్యమండలం వదలి వెళ్లటానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం మనకి మాత్రం ఆ రోజుల్లో అర్థం అయిందా? మరొక రెండు శతాబ్దాల తరువాతనే గదా మానవుడు చంద్రమండలం చేరుకున్నది. మరొక నాలుగు శతాబ్దాల తరువాతనే కదా – అంటే ఈ కథా కాలం నాటికి – మానవుడు

సూర్యమండలం వదలి నక్షత్రమండలాల్లో ప్రయాణం చెయ్యగల రాకెట్లు నిర్మించగలిగింది!

జరిగిన ఈ అసలు కథ తెలియక ఈ నక్షత్రం అకస్మాత్తుగా ఆకాశంలో మెరిసిపోవటం చూసి, అది ప్రపంచ పరిరక్షకుడు, శాంతిదూత, కరుణామయుడు అయిన ఏసు ప్రభువు పుట్టేడనే వార్త ప్రపంచానికి చాటి చెప్పటానికి భగవానుడు ఆకాశంలో చూపిన సంకేతం అని మురిసిపోయేరు – బెత్లెహెంలో ఉన్న యూదులు. అమాయకులు!

(ఈ కథ ఆర్థర్ సి. క్లార్క్ రాసిన "ద స్టార్" కి స్వేచ్ఛానుకరణ. రచన, ఫిబ్రవరి, 1998)

# రిరంసువు

## 1

సంస్కృతంలోను, తెలుగులోను 'రిరంసువు' అనే మాట ఉంది. ఆడది అంటే అబల, లతాంగి, పూబోడి మొదలైన మాటలే స్ఫురిస్తాయి తప్ప 'రిరంసువు' వంటి బరువైన మాటలు స్ఫురణకి రావు. ఈ రిరంసువుకి సమానార్థకమైన ఇంగ్లీషు మాట చెబితే తెలుగు వారికి అర్థం అయే సావకాశం ఉంది. ఇంగ్లీషులో 'నింఫోమేనియాక్' అన్నా, తెలుగులో రిరంసువు అన్నా "తీరని కామవాంఛతో కుతకుతలాడుతూన్న స్త్రీ" అని అర్థం. "ఇటువంటి ఆడవాళ్లు ఉంటారా?" అని అనుమానం పడక్కర లేదు. కోరిక అనేది లింగభేదం లేకుండా అందరికీ ఉంటుంది; కొందరు బాహాటంగా ప్రదర్శిస్తారు, అంతే!

## 2

అవి పదిహేనవ శతాబ్దం అంతం అవుతూన్న రోజులు. అదొక సంధి యుగం. కాకతీయ సామ్రాజ్యం అవతరించటం, అంతం అయిపోవటం కూడ జరిగి శతాబ్దం దాటిపోయింది. అప్పటికి హంపీ విజయనగర సామ్రాజ్యానికి అంకురార్పణ జరిగింది కాని కృష్ణదేవరాయలు ఇంకా గద్దెకి ఎక్కలేదు.

పదిహేనవ శతాబ్దం రెండవ పాదం మొదలయే వేళకి, అంటే కుమారగిరిరెడ్డి గద్దెకెక్కే వేళకి, ప్రోలయ వేమారెడ్డితో మొదలైన కొండవీటి రాజ్యానికి నూరేళ్లూ నిండిపోయాయనవచ్చు. ఈ రాచ కుటుంబంలో కలహాల వల్ల కొండవీడు హంపీ విజయనగర రాజుల వశం అయింది. ఈ రాజ్యంలో

భాగమైన రాజమహేంద్రవరం కళింగ గజపతి రాజుల వశం అయింది. ఇదీ దేశంలో రాజకీయ వాతావరణం.

ఏనుగులు పోట్లాడుకుంటూ ఉంటే వాటి కాళ్ల కింద పడి నలిగే ఎలకల సంగతి ఎవరికి కావాలి? చరిత్ర అనగానే రాజుల కథలు చెపుతారు కాని సామాన్యుల గోడు ఎవరు పట్టించుకుంటారు? ఒక పక్క వీరశైవులకి, వైష్ణవులకి వైరాలు. మరొక పక్క హిందువులకి, మహమ్మదీయులకీ కలహాలు. మహమ్మదీయుల మతావేశానికి పోటీగా వీరశైవం తలెత్తిన ఆ రోజుల్లో భైరవుడు, వీరభద్రుడు, మొదలైన ప్రచండ దేవతల ఆరాధన బాగా హెచ్చింది. బౌద్ధ కాలం నాటి భైరవ కాపాలిక తంత్రాలు, వజ్రయానం తిరిగి తలెత్తేయి. భూత వైద్యులు, తాంత్రికులు దేశవ్యాప్తంగా కనిపించేవారు. వారితోపాటు దయ్యాలు, కొరివి దయ్యాలు, కామినీలు ప్రజలకి కనిపిస్తూ ఉండేవి. ఇదీ దేశంలో సాంఘిక వాతావరణం.

నేటి కోనసీమ ప్రాంతం అంతా అప్పట్లో దట్టంగా అడవిలా ఉండేది. నేటి రామచంద్రపురం తాలూకాలో ప్రవహించే గోదావరి పాయ తుల్యభాగకి ఇరువైపులా చిక్కటి మారేడు అడవులు ఉండేవి. ఆ రోజులలో వ్యవసాయమే ప్రజల ముఖ్య జీవనాధారం కనుక అడవులు నరికి భూమిని సాగులోకి తీసుకురావటం, చెరువులు, కాలువలు తవ్వించి నీటి వనరులు కల్పించటం ప్రభుత్వపు ప్రథమ కర్తవ్యంగా ఉండేది. కొండవీటి రాజులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చి గోదావరీ తీరాన్ని వాసయోగ్యంగా చేసేరు.

అప్పటికే పాల్ఘాట్ ప్రాంతాలలోని ద్రావిడ బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశంలో జీవనోపాధికి మంచి అవకాశాలు ఉన్నాయని విని, దఫాలు దఫాలుగా తరలి వచ్చి కృష్ణా, గోదావరీ తీరాల్లో స్థిరపడుతున్నారు. ఇస్లాం మతపు పెను తుఫానులో సనాతన ధర్మం రెపరెప లాడుతూన్న ఆ రోజుల్లో అగ్నిహోత్రాన్ని నెత్తిమీద పెట్టుకుని ఊరు నుండి ఊరుకి ప్రయాణం చేసిన నిష్టా గరిష్ఠులు వీరు. అటువంటి వారిలో కొందరు తమిళ దేశం నుండి ఆంధ్ర దేశం చేరుకునే సరికి ఓపిక సన్నగిల్లి మధ్యస్థంగా 'బండి దిగిపోయేరు.' వీళ్లే దిగుడు ద్రావిళ్లు లేదా చిన్న ద్రావిళ్లు. ఇలా ప్రయాణం మధ్యలో ఆగిపోయిన వారిని 'దివిలి' ద్రావిళ్లు, 'పుదు' ద్రావిళ్లు అని కూడ అంటారు. ఇంకా పట్టుదల, ఓపిక ఉన్న కొంతమంది గోదావరీ తీరం చేరుకుని అక్కడ వాసయోగ్యంగా ఉన్న దక్షారామం (ఇప్పటి ద్రాక్షారం), కుమారారామం (ఇప్పటి సామర్లకోట భీమవరం), సోమారామం (ఇప్పటి గునుపూడి భీమవరం), క్షీరారామం (ఇప్పటి పాలకొల్లు), మొదలైన ఆరామ క్షేత్రాల వరకు వచ్చి అలసట వచ్చో, ఆశ చల్లారో అక్కడే చతికిలపడిపోయేరు. వీరినే ఆరామ ద్రావిడులు అంటారు. వీరందరి కంటె తెగువ, సాహసం ఉన్న బహుకొద్ది మంది గోదావరి దాటి, ప్రస్తుతం అమలాపురం తాలూకాగా చలామణీ అవుతున్న ప్రాంతంలో ఉన్న పేరూరు అనే గ్రామం చేరుకున్నారు. వీరినే పేరూరు ద్రావిళ్లు లేదా పెద్ద ద్రావిళ్లు అంటారు.

ఈ పేరూరు ద్రావిళ్లు ఘటికులు. సాహసానికి పెట్టింది పేరు. వీళ్లు ఎంతటి అసాధ్యప్పిండాలంటే, వీళ్లల్లోని కుర్ర కుంకలు కొందరు రాత్రికి రాత్రి ఒక గుడి పక్కన ఏటవాలుగా గడ్డి మేట్లు మెట్ల మాదిరి పేర్చి వాటి మీదుగా ఒక గుర్రాన్ని

నడించుకు వెళ్ళి, గుర్రం గుడి గోపురం చేరుకున్న తరువాత గడ్డి మేట్లు పీకి పారేశారు. తెల్లారి లేచేసరికి ఊళ్లో ప్రజలందరికి గుడి గోపురం మీద గుర్రం కనిపించింది. అది పైకి ఎలా వెళ్లిందో, దాన్ని దింపటం ఎలాగో ఎవ్వరికీ బోధపడ లేదు. అందుకనే పేరూరు ద్రావిళ్లు అనగానే గుర్రాన్ని గుడెక్కించిన వాళ్లు అనే జనవాక్యం ఉంది.

ఈ పేరూరు ప్రాంతాలలో ఉన్న గంగలకుర్రు అగ్రహారపు వీధుల్లో రాత్రి పూట కొరివి దయ్యాలు కంచు కాగడాలు పట్టుకుని తిరుగుతూ ఉండేవని వదంతి పుట్టిందంటే పుట్టదూ మరి? గుర్రాన్ని గుడెక్కించిన ద్రావిడ కుర్రాళ్లే అగ్రహారపు వైదీకులని హడలగొట్టటానికి ఇలాంటి వేషాలు వేస్తున్నారని కొందరు అభియోగాలు కూడ వేసేరు.

ఇదీ నూనూగు మీసాల నూత్న యవ్వనంలో అడుగు పెడుతూన్న వీరభద్రశాస్త్రి ఆభిజాత్యం. వేదవేదాంగాలు, ధర్మ శాస్త్రాలు అధ్యయనం చేసేడు. "శరీరమాద్యం ఖలు ధర్మ సాధనః" అన్నారు కదా అని హఠ యోగం అభ్యాసం చేసినవాడవటం చేత పటిష్ఠమైన శరీరంతో పిటపిట లాడుతున్నాడు, కుర్రాడు. స్ఫురద్రూపి. చొరవ ఉన్నవాడు. అందుకని అగ్రహారపు అమ్మాయిలు వీరభద్రశాస్త్రి విగ్రహాన్ని చూసి లోలోపల ఉవ్విళ్లూరేవారు.

ఆ రోజుల్లోనే ప్రసాద పంచాక్షరీ మంత్రోపాసకుడైన శ్రీనాధ మహాకవి దక్షిణ కాశి అని పేరు పొందిన ద్రాక్షారామాన్ని సందర్శించి, భీమేశ్వర పురాణం రచించి, గోదావరీ తీరంలో ఉన్న ఆరామ క్షేత్రాలలో పర్యాటన చేసి, అక్కడ పండిత ప్రకాండుల నుండి పురస్కారాలు అందుకున్నాడు. ప్రయాణ సౌకర్యాలు

అంతంత మాత్రంగానే ఉన్న ఆ రోజుల్లో ఆంధ్ర దేశపు భోజనాది ఆచార వ్యవహారాలని, ఆడంగుల చీరకట్లని, చనుకట్లని, నుదుట బొట్లని కట్టుదిట్టంగా వర్ణించిన శ్రీనాధుని సీస పద్యాలు ఆనోటా ఈ నోటా విన్న గురుకుల విద్యార్థులు తాము కూడ తీర్థయాత్రలు చేసి, దేశంలో ఉన్న అందమైన స్థలాలని, అమ్మాయిల వక్షస్థలాలని చూడాలని కలలు కనటంలో వింతేమీ లేదు.

తంజావూరు నుండి తెలుగు దేశం వరకూ జరిగిన బృహత్ ప్రయాణపు కథలు తల్లి ఒడిలో వింటూ పెరిగిన వీరభద్రశాస్త్రి పేరూరులో కుదురుగా కూర్చోమంటే కూర్చోగలడా? చూడవలసిన తూర్పు దేశం ఇంకా చాలా ఉంది. ఆడది తిరిగి చెడింది, మగాడు తిరక్క చెడ్డాడు అన్నారు కదా. తిరిగి తిరిగి నాలుగు విషయాలూ తెలుసుకుంటే నాలుగు రాళ్లు వెనకేసుకునే పద్ధతులు కూడ అర్థం అవుతాయనీ, అదే రెండో పురుషార్థానికీ, అక్కడనుండి మూడో పురుషార్థానికీ మార్గం అనిన్నీ నమ్మేడు. పర్యాటనలో బుద్ధి వికసిస్తుందని తల్లిదండ్రులు వీరభద్రశాస్త్రి ప్రయాణపు సన్నాహాలకి అభ్యంతరం చెప్పలేదు.

పేరూరు నుండి బయలుదేరి వీరభద్రశాస్త్రి దక్షారామం చేరుకున్నాడు. అక్కడ భీమేశ్వరుని, భ్రమరాంబికాదేవిని స్తుతించి, ఆ ప్రాంతాలలో ఉన్న ఆరామ క్షేత్రాలని దర్శించి, సర్పవరంలో భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నారదకుండంలో గృంకులిడి, పిఠాపురంలో కుంతిమాధవస్వామికి ప్రణామాలర్పించి, కుక్కుటేశ్వరుడి ఆలయంలో ఉన్న పాదగయలో స్నానం చేసి, శ్రీనాధుడి అడుగుజాడలలో సింహాచలానికి బయలుదేరేడు.

పిఠాపురం నుండి సింహాచలం వరకు ఉన్న ప్రాంతం గయుడనే రాక్షసుడి శరీరంతో అపవిత్రం అయిందంటారు. ఈ గయుడు హతమార్చబడ్డప్పుడు అతగాడి తల సింహాచలం వద్దా, పాదాలు పిఠాపురంలోని పాదగయ వద్దా పడ్డాయని ఒక ఐతిహ్యం ఉంది. అందుకనే గోదావరీ తీరంలో ఉన్నన్ని పుణ్యక్షేత్రాలు ఈ భూభాగంలో లేవంటారు. పిఠాపురం దాటిన తరువాత – మధ్యలో అన్నవరం తప్పిస్తే – సింహాచలం చేరునే వరకు ప్రసిద్ధి పొందిన దేవాలయాలు లేవు. అందుకనే కాబోలు, పాదగయలో స్నానం చేసిన తరువాత సింహాద్రి అప్పన్న దర్శనం చేసుకుంటే మంచిదనే భావన ఆ రోజుల్లో ఉండేది.

పిఠాపురం నుండి సింహాచలం వెళ్లే మార్గంలో ఇప్పుడంటే గ్రేండు ట్రంకు రోడ్డు, మద్రాసు–కలకత్తా అయోమార్గం ఉన్నాయి కాని ఆ రోజుల్లో ఎడ్ల బండ్లు నడవటానికి వీలైన మార్గాలు మాత్రం ఉండేవి. ఎప్పుడో అశోకుడి కాలంలో వేయించిన రహదారులే అవన్నీ. దారికి ఇరుపక్కలా చెట్లు, అక్కడక్కడ సత్రవలు, చలివేంద్రాలు ఉండేవి. ప్రాచ్యోదధి (ఈ నాటి బంగాళాఖాతం) పక్కగా ఉన్న తీరపు ఊళ్లని మినహాయిస్తే లోపలి కొండ ప్రాంతాలు చాలమట్టుకు మన్యపు భూములే. ఊరు దాటి ఊరు వచ్చేవరకూ చాలవరకు చిట్టడవులే. పురుగు, పుట్ర బారి నుండి తప్పించుకుందుకని కాళ్లకి కిర్రు చెప్పులు, చేతులలో మువ్వగంటల కర్రలతో కోలాహలం చేస్తూ, ప్రజలు ప్రయాణాలు చేసేవారు. బందిపోటు దొంగల బారి నుండి తప్పించుకోటానికి బేహారుల బండ్లు బారులు తీర్చి వెళ్లేవి. బారుకి పదేసి చొప్పున రెండెడ్ల బండ్లు ఉండేవి. ఈ రోజులలో రైలుబండికి డ్రైవరు, గార్డు ఉన్నట్లే అప్పట్లో బండ్ల చయనికకి ఎదట ఒక చోదరి, చివర మరొక చోదరి

తప్పకుండా ఉండేవారు. ఈ చోదరులని కాని, ఎద్దులని కాని కాజేసే నిమిత్తం ఏ చెట్టు కొమ్మ మీదనో కాసుకు కూర్చున్న చిరుతపులి బారి నుండి రక్షణ నిమిత్తం బండ్ల చయనికకి ఇటు ఇద్దరు, అటు ఇద్దరు – చేతులో ఉన్న మువ్వల గంటలతో చప్పుడు చేస్తూ – ఈటె గాళ్లు పహరా కాసేవారు.

వీరభద్రశాస్త్రి అటువంటి బేహారుల బండ్ల చయనికతో ప్రయాణం చేసేడు. దార్లో అన్నవరంలో రత్నగిరి మీద ఉన్న సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుని, విశాఖపట్నం మీదుగా, వైశాఖ మాసం వచ్చే సరికి సింహాచలం కొండ దిగువ అడవిలో ఉన్న చిన్న పల్లెటూరు చేరుకున్నాడు. పర్యాటకులకుండే కుతూహలంతోపాటు, జిజ్ఞాసువు కావటం వల్ల సింహాచలపు స్థల పురాణాలు సేకరించి, కాలక్షేపపు క్రీడగా అధ్యయనం చెయ్యటం మొదలు పెట్టేడు వీరభద్రశాస్త్రి.

సింహాచలం ఊరు దిగువ ఉన్న ప్రాంతాన్ని ఇప్పుడంటే అడివివరం అంటున్నారు కాని, వాస్తవానికి ఆ ఊరి పేరు అడివారం. తమిళంలో అడివారం అంటే కొండ దిగువ ప్రాంతం అని అర్థం. సింహాచలం లోని తిరు కైంకర్యాలన్నీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం జరుగుతాయి. వైష్ణవ సంప్రదాయ సాహిత్యం చాల వరకు తమిళ భాషలో ఉండబట్టి, సింహాచలపు అప్పన్న ఎంత తెలుగువాడైనప్పటికీ ఆయనకి కైంకర్యం చేసే స్వాములలో కొందరు తరతరాల కిందట తమిళ దేశం నుండి వచ్చినవారు ఉన్నారు. వారు ఆ కొండ దిగువ ప్రాంతాన్ని అడివారం అని పిలచే వారు. అదే క్రమేపీ అడివివరం అన్న ఊరు పేరుగా మారిపోయింది.

అడివివరానికి పడమట దిక్కున కొండ మీద ఉంది నృసింహస్వామి ఆలయం. ఊరు నుండి దేవాలయానికి వెళ్లే మార్గాన, కుడి పక్కన, కొండ మీదకి వెళ్లే మెట్ల దారి, ఎడమ పక్కన కోనేటికి వెళ్లే కాలి బాట. కలువ పువ్వులతో నిండిన ఆ కోనేటి మధ్యలో ఒక సుందరమైన మండపం. కోనేటికి అవతల రుద్రభూములు. శత్రువులని జయించాలనే కోరికతో చేతబడులు, చెడుపు, చిల్లంగి, మొదలైన క్షుద్ర విద్యలతో ప్రయోగాలు చేసే బైరాగులు ఆ శ్మశాన వాటికలో తిరుగుతూ కనిపించేవారు, వీరభద్రశాస్త్రికి.

దేవస్థానపు కచేరీలు, సత్రవలు, అర్చకుల గృహాలు ఈ అడివివరంలోనే ఉండేవి. ఆలయాన్ని ఆలంబనగా చేసుకుని బతికే పరిచారక బృందాలు కూడ ఇక్కడే ఉండేవారు. పేరూరు నుండి కొద్ది తరాల క్రితమే వచ్చి అడవివరంలో స్థిరపడ్డ వారిలో కొందరు స్వామివారి అర్చక బృందంలో ఉన్నారు. వారిలో ఒకరు శ్రీమాన్ నల్లానచక్రవర్తుల వరదాచార్యులవారు. ఈయన వీరభద్రశాస్త్రి తండ్రికి సహాధ్యాయి. స్వామి వారి అర్చక బృందానికి అధిపతి. వీరభద్రశాస్త్రి ధర్మ సత్రవలో బస చేసి, వరదాచార్యులవారికి శుశ్రూష చేస్తూ కాలక్షేపం చేస్తున్నాడు.

ఇప్పుడంటే ఈ పరిసర ప్రాంతం అంతా ప్రజలు, ప్రభుత్వమూ నిర్లక్ష్యం చెయ్యటం వల్ల హృదయవిదారకంగా తయారయింది కాని, కథా కాలంలో అతి సుందరంగా, కనులకింపుగా, ఉద్యానవనంలా ఉండేదిట. కొండ దిగువ ప్రాంతంలో ఉన్న అడివవరం చేరుకోవటానికి దారి దుర్గమంగా ఉన్నా, కొండ మీదకి వెళ్లే మెట్ల దారిలో, ఎడమవైపున అందమైన జలధారలు – ఆకాశధార, హనుమద్ధార, మాధవ ధార, పాతాళగంగ – ఉన్నాయి. నీటి వనరులు

ఉండటంతో ఆ కొండ చాలువులలో సంపంగి, పనస, చందనం వంటి చెట్లూ, మల్లి, మొగలి వంటి పొదలు దట్టంగా పెరిగి సూర్య రస్మి లోపలికి చొరబడనంత చీకటిగా ఉండేదిట. అందుకని దిగువ నుండి ఎగువకి వెళ్లటానికి , యాత్రికుల సౌకర్యార్థం, ఈ ఆలయానికి వంశ పారంపర్యంగా ధర్మకర్తలైన శ్రీ పూసపాటి గజపతి వంశం వారు పావంచాలు వేయించేరుట. సుమారు వెయ్యి నల్లరాతి మెట్లు ఎక్కటం అంటే మాటలా? అందుకని యాత్రికులు సేద తీర్చుకునే నిమిత్తం, అక్కడక్కడ, మెట్లకి ఇరువైపులా, చిన్నచిన్న మండపాల లాంటి విశ్రాంతి మందిరాలు కట్టించేరు.

కొండ మీదికి వెళ్లే దారిలో సంపంగి, మొగలి, గంధపు చెట్ల సుగంధానికి పాములు వచ్చి తిరుగాడేవి. దిగువ చాలులో పూర్వం సింహాలు, పులులు కూడ కనబడేవి. అందుకని ఒంటరిగా కొండ ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రజలు భయపడేవారు.

సింహాచలం క్షేత్రం పదకొండవ శతాబ్దం నుండీ ఉన్నట్లు దాఖలాలు ఉన్నాయి. అప్పటికే ఇది ఎంతో ప్రఖ్యాతి చెందిన పుణ్య క్షేత్రం. కొండ మీద వెలిసిన శ్రీ వరాహ నృసింహస్వామికి ధూప, దీప, నైవేద్యాలతో నిత్యం అర్చన జరుతుంది. ఆంధ్రదేశంలో నరసింహస్వామి ఆలయాలు చాల ఉన్నాయి కాని, దశావతారాలలోని వరాహావతారం, నరసింహావతారం ఇలా కలసి ఉండటం అపురూపం. మరొకచోట ఎక్కడా ఇటువంటి దేవాలయం ఉన్న దాఖలాలు లేకపోవటం వల్ల ఈ దేవాలయానికి ఒక ఉత్కృష్ట స్థానం ఉంది. ఇది అతి ప్రాచీనమైన ఆలయం అవటమే కాకుండా మనోజ్ఞమైన శిల్ప సౌందర్యానికి

ఆటపట్టు. ఖజురాహోని పోలిన కామకేళీవిలాసములతో కూడిన కుడ్య శిల్పాలు ఉండటం వల్ల కాబోలు, ఇది కేవలం పుణ్యక్షేత్రమే కాకుండా విద్యార్ధినీ విద్యార్ధులకి వ్యాహ్యాళి వినోద కేంద్రంగా కూడ ప్రసిద్ధి పొందింది.

నృసింహస్వామి ఆగ్రహావేశాలని చల్లార్చటానికి స్వామికి నిత్యం కర్పూర చందనంతో లేపనం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని చందనచర్చ అంటారు. ఒక సంవత్సరం పాటు విగ్రహానికి ఇలా చందనం పూత పూసేసరికి నృసింహస్వామి విగ్రహం లింగాకారం పొందుతుంది. అందుకని శివకేశవులని కొలిచే ఇరువర్గాల భక్తులకీ సింహాచలం పుణ్యక్షేత్రంగా భాసిల్లి, వీరశైవ వైష్ణవ మతాల మధ్య చెలరేగుతూన్న వైషమ్యాలని అణగదొక్కటానికి తోడ్పడింది. సంవత్సరానికి ఒకే ఒక రోజున, వైశాఖ శుద్ధ తదియ నాడు, ఈ చందన లేపనం తొలగించినప్పుడు స్వామి నిజ రూపంతో దర్శనమిస్తాడు. అందుకని సింహాచలంలో వైశాఖ శుద్ధ తదియ పెద్ద పర్వదినం.

సమయానికి సింహాచలం చేరుకున్న వీరభద్రశాస్త్రి స్వామివారికి జరిగిన చందనచర్చ చూసి చలించేడు. అవకాశం దొరికితే తానే స్వయంగా స్వామికి కైంకర్యం చెయ్యాలని ఉవ్విళ్లూరేడు. మూడు వారాలు తిరిగే లోగా ఎదురు చూసిన అవకాశం రానే వచ్చింది.

అవి భాద్రపద మాసం అంతం అవుతూన్న రోజులు. అమావాశ్య రోజులు దగ్గర పడుతున్నాయి. శ్రావణ మేఘాల ధాటి ఇంకా పూర్తిగా ఆకాశం నుండి సమసిపోలేదు. రెండు రోజులుగా తరణి కిరణ వారాల చుంబనకు నోచుకోని ప్రజానీకం మత్తుగా మూలుగుతోంది. స్వామి వారికి నిత్యం అర్చన చేసే

వరదాచార్యులవారు ఆ రోజు పక్క మీంచి మూలుగుతూ లేచేరు. అస్వస్థతగా ఉన్న ఆ కాయాన్ని వెయ్యి మెట్లు ఎలా ఎక్కించగలడు? స్వామివారి కైంకర్యానికి అంతరాయం కలగటానికి వీలు లేదు. ఇటువంటి సమయాలలో తనకి చేదోడు వాదోడుగా ఉండే తన కుమారుడు కార్యార్థియై గ్రామాంతరం వెళ్లేడు. మార్గాంతరం లేక మథన పడుతూన్న సమయంలో అతిథిగా వచ్చిన వీరభద్రశాస్త్రి ఎదురుగా కనిపించేడు. ఆ కుర్రవానికి అర్చన భారం అప్పగించి, కొండమీద మిగిలిన అర్చకులు సహాయం చేస్తారని ధైర్యం చెప్పి పంపేరు.

ఆడబోయిన తీర్థం ఎదురవటంతో అర్చన భారాన్ని ఆనందంతో అంగీకరించేడు వీరభద్రశాస్త్రి. కిందనున్న కోనేటి నీటిలో స్నానమాడి, సంధ్యావందనాది జపాదులు పూర్తి చేసుకుని, కొండపైనున్న కోవెలకేగి, సాయంకాలం వరకూ నిత్య పూజాది కార్యక్రమాలన్నీ శ్రద్ధగా నిర్వర్తించి, బలిహరణాది తంతులన్నీ శాస్త్రోక్తంగా జరిపి, స్వామివారికి చేయవలసిన ఆర్జిత సేవలన్నీ ముగించి, చీకటి పడ్డ తరువాత ఆలయ బహిర్ద్వారానికి తాళం వేసి, గృహోన్ముఖుడయేడు. అప్పటికే ఆలశ్యం అయిందేమో యాత్రికులంతా కొండ దిగి ఎవరి బసలకు వారు వెళ్లిపోయినట్లున్నారు. దారి అంతా నిర్మానుష్యంగా ఉంది.

అసలే అమావాశ్య. ఆకాశం అంతా మేఘాలతో కప్పబడి ఉందేమో నక్షత్రాల కాంతి కూడ బొత్తిగా లేదు. బయట గుబురుగా పెరిగిన చెట్లు చీకటిని ఇనుమడింపజేస్తున్నాయి. ఆ చీకటిలో కప్పలు చేసే టర్టరాయణాలు, కీచురాళ్ల రొద తప్ప కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడటం లేదు. అడపా తడపా

పడుతూన్న చిన్న చిన్న జల్లుల నుండి శిరోభాగాన్ని గొడుగుతో కప్పి, వడివడిగా అడుగులు వేస్తూ మెట్లు దిగుతున్నాడు వీరభద్రశాస్త్రి.

ఇంతలో వర్షం ఉధ్రుతం పెరిగింది. ఆకాశంలో విద్యుల్లతలు మెరిసినప్పుడల్లా మిరిమిట్లు చెందిన కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి తప్ప దారి కనబడటానికి దోహదం చెయ్యటం లేదు. పోనీ మెట్ల పక్కనున్న విశ్రాంత మందిరాలలో కొద్ది సేపు తలదాచుకుందామా అంటే వర్షం తగ్గే సూచనలు కనబడటం లేదు; రాత్రల్లా వర్షం పడేటట్లు ఉంది. అందుకని అడుగులు జోరుగా వేస్తున్నాడు వీరభద్రశాస్త్రి.

అప్పటికి కొండ దిగటం సగం అయింది. ఇంతలో కోయిల కంఠాన్ని మరపించే తీయని స్వరంతో, "స్వామీ! స్వామీ!" అన్న కంఠం వినిపించేసరికి వీరభద్రశాస్త్రి కాళ్లకి బంధం పడింది. ఆర్తనాదంలా వినబడిన అది ఒక కలకంఠి కంఠమా? లేక ఆ చీకటిలో తన శ్రవణేంద్రియాలు తనతో దోబూచులాడుతున్నాయా? ఇదమిత్థంగా చెప్పలేకపోయాడు. శబ్దం వచ్చిన దిశ వైపు దృష్టి సారించి చూసేడు. ఆ పావంచాల పక్కన ఉన్న విశ్రాంతి మండపంలో ఒక స్త్రీ కనిపించింది. ఇంతలో ఆకాశంలో మెరుపు మెరిసింది. ఆ వెలుగులో ఒక మెరుపు తీగలా కనిపించిన ఆకారం చూడగానే అది తన భ్రమ కాదని నిశ్చయం చేసుకున్నాడు, వీరభద్రశాస్త్రి.

మండపంలో తల దాచుకున్న మగువ తెల్లటి చీరలో దేవకాంతలా కనబడింది. బయట వర్షం పడుతున్నా ఆమె తడిసినట్లు లేదు; ఆమె పై చెంగు గాలిలో రెపరెపలాడుతోంది. ముంగురులు నుదిటి మీద నాట్యం చేస్తున్నాయి. నవ

యవ్వన తేజోరాసిలా ఉన్న ఆ మెరుపుతీగ వీరభద్రశాస్త్రి కంటికి అపర వరూధునిలా కనిపించింది. ఇలా ఆ నిశీధిలో పగటి కలలు కంటూన్న వీరభద్రశాస్త్రి ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ...

"స్వామీ! జడి వానలో తడిసిపోతున్నాను. ఒంటరి దానిని. కొండ దిగే వరకూ అండగా ఉండి మీ గొడుగులో చోటిస్తే మీ మేలు మరిచిపోను."

వీరభద్రశాస్త్రికి ఈ వైపరీత్యమైన సంఘటన పెద్ద చిక్కునే తెచ్చిపెట్టింది. "పాత్రత నెరిగి దానం, పూర్వాపరాలు చూసి స్నేహం" అన్నారు. కనుక ఒక్క నిమిషం తటపటాయించేడు.

"స్వామీ! ప్రమదనని సంకోచించకండి. దైవదర్శనానికి వచ్చి ఈ వానలో చిక్కుకున్నాను. తమరు సర్వజ్ఞులు. ఆపత్కాలంలో తరతమ భేదాలు పాటించనక్కరలేదని నేను జ్ఞాపకం చెయ్యాలా?"

ఆకాశంలో మెరిసిన మరో మెరుపు కాంతిలో దేవకాంతని ధిక్కరించే సోయగంతో తొణికిసలాడుతూన్న ఆ అంగనని మరొక సారి చూసేడు. ఆక్రందనంతో సహాయం చెయ్యమని ఒక పడతి వేడుకుంటూన్నప్పుడు మీనమేషాలు లెక్కించి చేసేదేముంది? పైగా తను దేవాలయానికి తాళం వేసి దిగిపోతున్నాడు. తన వెనక వచ్చేవారు ఎవ్వరూ ఇహ లేరు. చూస్తూ చూస్తూ ఈ అబలని ఇలా అరణ్యంలో వదలి వెళ్లటానికి ఇచ్చగించక "సరే" అన్నాడు.

"స్వామీ! గచ్చు తడిగా, జారుగా ఉంది. కాలు జారుతుందేమోనని భయంగా ఉంది. మండపం దిగి మెట్ల మీదకి రావటానికి కాస్త చెయ్యి ఊతగా ఇస్తారా?" అని అడిగింది ఆ సుందరాంగి.

పర పురుషుడుని గొడుగులో చోటు ఇమ్మని అడగటమే ఒక వైపరీత్యం. ప్రాణాంతకమైన పరిస్థితులలో అడిగెనుపో! పాణిగ్రహణం చెయ్యమని అర్థించటమా?

వీరభద్రశాస్త్రి నూనూగుమీసాల నూత్న యవ్వనంలో ఉన్నాడు. ధృఢ గాత్రుడు. సాహసోపపేతమైన కార్యాలు చెయ్యటంలో ముందువెనకలు చూసుకునే మనిషయితే ఊరు వదలి, అయిన వాళ్లని వదలి ఇంత దూరం వచ్చి ఉండేవాడా? అయినా ఇందులో సాహసానికి ఏముంది? ఒక అబల సహాయం చెయ్యమని అడుగుతున్నాది. అంతే కదా!

ఇలా పరి పరి విధాల పరిగెడుతూన్న మనస్సుకి కళ్లెం వేసి, ఆ నారి చేతిని అందుకునే నిమిత్తం తన చేతిని అందించేడు. ఇంతలో మిన్ను విరిగి మీద పడ్డట్లు, నల్లటి ఆకాశాన్ని చీలుస్తూ జిగేలుమని మెరుపు మెరిసింది. జాచిన చేతిని ఆమె అందుకుంది. పక్కనే పిడుగు పడ్డాదో లేక విద్యుల్లతలా మెరిసిపోతూన్న ఆ భూలోక సుందరి హస్త స్పర్శకి వీరభద్రశాస్త్రి శరీరం అంతా విద్యుత్ తరంగపూరితమైనదో తెలియదు కాని, విద్యుత్ఘాతం తిన్న వాడిలా, స్థాణువులా అయిపోయేడు. ఆ మెరుపు వెనక చీకటిలో ఇద్దరూ అంతర్ధానం అయిపోయేరు.

## 3

కొద్ది రోజులు గడిచేయి. శ్రీమాన్ నల్లానచక్రవర్తుల వరదాచార్యులవారు ఇంకా అస్వస్థత నుండి పూర్తిగా కోలుకోలేదు. వీరభద్రశాస్త్రే స్వామివారి సేవలు చేస్తున్నాడు. ఆ రోజు బలిహరణకై శాస్త్రి కోవెల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాడు. అదే సమయంలో కోవెల ప్రాకారాన్ని ఆనుకుని ఉన్న ఒక స్తంభం దగ్గర ఒక సాధువు

జపం పూర్తి చేసుకుని అప్పుడే కళ్లు తెరచేడు. ప్రదక్షిణ పూర్తి చేసుకుని ఆలయంలోకి ప్రవేశించటానికి ఆయత్త పడుతూన్న వీరభద్రశాస్త్రి మీద పడ్డాయి ఆ కళ్లు. ఆ సాధువు తన తర్జనిని శాస్త్రి వైపు సారించి, తన వైపు రమ్మని శాసిస్తూన్నట్లు కదలించేడు.

వీరభద్రశాస్త్రి ఆ సాధువు కళ్ళల్లోకి చూసేడు. వెన్నులో విద్యుత్తు ప్రవహించిన అనుభూతి కలిగింది. ఆ పరివ్రాజకుని దృష్టి అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. యాంత్రికంగా ఆ సాధువుని చూస్తూ, "ఎవరబ్బా ఈ బైరాగి? ఈ ఆలయ ప్రాంగణంలో గతంలో చూసిన జ్ఞాపకం లేదు. కాని ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది" అనుకుంటూ శాస్త్రి సాధువు చెంతకి చేరేడు.

సాధువు శాస్త్రిని ఆశీర్వదిస్తూన్నట్లు తల మీద చెయ్యి వేసి, జుత్తుని నిమురుతూ, ఎన్నాళ్లబట్టో పరిచయం ఉన్న ఆప్తునిలా పలకరిస్తూ, "అబ్బాయీ! ఈ కథ ఎన్నాళ్ల బట్టి జరుగుతొందేమిటి?" అని అర్థగర్భితంగా, మంద్ర స్థాయిలో, అడిగేడు.

"స్వామీ! తమరు అడుగుతూన్నది ఏమిటో నాకు అవగాహన కావటం లేదు."

"అవగాహన కావటం లేదూ? ఇంకా ఎన్నాళ్లీ దాగుడు మూతలు?" తీవ్ర స్థాయిలో గద్దించేడు సాధువు.

ఆ గొంతులో గద్దింపు కంటె చింత నిప్పుల్లా ఉన్న ఆ సాధువు కనుగవ చూడగానే గుర్రాన్ని గుడెక్కించిన వంశంలో పుట్టిన విశ్వనాధశాస్త్రికి కొద్దిగా

భయం వేసింది. అయినా ఈ సాధువుకి తను చేసిన అపచారమేమిటో అర్థం కాలేదు.

"స్వామీ! తమ అభిమతం ఏమిటో నాకు అవగతం కావటం లేదు. కాస్త వివరంగా చెప్పండి."

"అదే! నువ్వు రోజూ రాత్రులు ఆడుతూన్న నాటకం నాకు తెలియదనుకున్నావా...?"

వీరభద్రశాస్త్రి గతుక్కుమని, స్థాణువులా కళ్లప్పగించి చూస్తున్నాడు.

"...ఆ కామినీ పిశాచితో ఇంకా ఎన్నాళ్లీ ఆటలు? ఇహ ఆ సరస సాంగత్యాలు కట్టిపెట్టు."

"కామినీ పిశాచియా? అదెవరు స్వామీ?"

"ఎవరని అడుగుతావేమిటి? గత నాలుగు రోజులుగా, ప్రతి దినమూ, నీవొక అద్భుత సౌందర్యవతితో భోగలాలసుడవై, విషయవాంఛలు తీర్చుకుంటూ, ఆ కోనేటి మధ్య మందిరంలో కాలక్షేపం చేస్తున్నావే. ఆమె ఎవరనుకున్నావ్?"

"క్షమార్హుణ్ణి స్వామీ! తడిసిన చపటా మీద కాలు జారుతుందని భయపడుతూన్న అసహాయురాలైన స్త్రీకి చెయ్యి అందిస్తూ ఉంటే అదే సమయంలో ఆకాశం నుండి పడ్డ అశనిపాతపు ధాటికి నా కాలే జారింది. అప్పుడు ఆమె పరిచర్యలు చేసింది. అప్పటినుండి కన్ను తెరచినా, కన్ను మూసినా ఆమె రూపే కనిపిస్తోంది. ఆ లతాంగినా కామినీ పిశాచి అనటం? ఇటువంటి అభియోగం అన్యాయం."

“నాయనా! ఆ విభావరీ వనిత మానవ స్త్రీ అని అనుకోవటం కేవలం నీ భ్రాంతి సుమా. నిజం నాకు తెలుసు. అది కామినీ పిశాచి. అంటే ఏమిటో తెలుసా? కొందరు మానవ స్త్రీలు తీరని కామ వాంఛతో చనిపోయినప్పుడు, వారు పాంచభౌతికమైన శరీరం వీడినప్పటికీ, సూక్ష్మ శరీరమును వీడ లేక, వారి సంచిత, ప్రారబ్ధ కర్మల ఫలానుసారం ఇలా కామినీ పిశాచులవుతారు. ఈ కామినీలు కామరూపులు. కోరిన వేషం ధరించగలవు. తమకి ఇచ్చ వచ్చిన పురుషుని సాంగత్యం కోరి, తమ మాయలచే ఆ పురుషుని లొంగదీసుకుని, తీరని కామదాహాన్ని విరతి లేకుండా తీర్చుకుంటూ, ఆ పురుషుని రక్తమాంసములు పీల్చి, అలా నిర్వీర్యమైన శరీరాన్ని ఒదిలేసి మరొకరిని పట్టుకుంటాయి. నిన్ను, శల్యావశిష్టం అవుతూన్న నీ శరీరాన్ని, తేజోరహితంగా ఉన్న నీ ముఖాన్ని చూడగానే జరిగిన విషయం నాకు అవగాహన అయింది. నీ శ్రేయస్సు కోరి చెబుతున్నాను. ఇక ఆమె దరి చేరకు.”

ఈ పరివ్రాజకుడి మాటలు నమ్మటమా? వచోధోరణి చూస్తే లాతి వాడులా కనబటం లేదు. అన్నీ చూసినట్లే చెబుతున్నాడు. ఆ లతాంగి చెంత మహిమలు ఉంటే ఉండవచ్చు గాక. ఆమె కామిని కావచ్చు గాక. కాని మాయావి అంటే ఎలా నమ్మటం? పిశాచి అంటే ఎలా నమ్మటం?

“స్వామీ! మీరన్న మాట శంకించే వ్యక్తిని కాను. నా మనస్సునే నమ్మేదా? మీరు చెప్పేదే నమ్మేదా? ఆమె యెడల నాకు వీసమెత్తు అనుమానం లేదు. ఆమె ఈ దేవాలయాన్ని ఆశ్రయించుకున్న దేవదాసి కావచ్చు. కాని, కామినీ పిశాచియా? ఈ విషయాన్ని రూఢి పరచుకోవటానికి నాకు నిదర్శనమేమిటి?”

"నిదర్శనం కావాలా? వత్సా! తప్పకుండా! కామినీ పిశాచులు భోగభాగ్యాలని సృష్టించగలరు, నాశనం చెయ్యగలరు. నిదర్శనం కావలిస్తే ఆమెని ధనరాసులు కావాలని అడిగి చూడు. నీకు కావలసిన ధన, కనక, వాహనాలని సృష్టించి ఇస్తుంది...."

వీరభద్రశాస్త్రి మనస్సులో రెండు పెడలుగా సంకోచానికి అంకురార్పణ జరిగింది. ఒక పెడ, ఈ మస్కరి ఆమె సముపార్జించిన ధనాన్ని తస్కరించటానికి పన్నిన పన్నాగమా? లేక ఈ కర్మంది తన కర్మ ఫలంగా తారసపడ్డ..."

"ఆమె నడకని పరీక్షించి చూడు. ఆమె పాదాలు నేలని తాకవు. గాలిలో తేలినట్లే ఉంటుంది ఆ నడక,"

"నేనామె వద్దకు వెళ్లకుండా ఎలా ఉండగలను?"

"వత్సా! నీవామె చెంతకు పోకపోయినా నిన్నామె వదలదు. మనిషి మాంసం మరిగిన పులిలా ఆమె నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. తన కామ వాంఛని తీర్చుకుంటూ నీ శరీరంలోని జీవరసాన్ని పిండి, పిప్పి చేసేదాకా వదలదు. ఇప్పటికే కాలహరణం అయిపోయింది. ఈ పద్ధతిలో నువ్వు కొనసాగితే ఇహ పది రోజుల కంటె ఎక్కువ కాలం బతకవు."

వీరభద్రశాస్త్రి మనస్సు పరిపరి విధాల పరిగెట్టింది. ఇంతకీ ఆమె ఎవరు? తనని చూసి అర్చక స్వామి వరదాచార్యులవారి కుమారుడని భ్రమపడ్డ దేవదాసి కాకూడదా? దేవదాసీలు, బసవిలు తమ శరీరాన్ని అర్చక స్వాములకి అర్పించే ఆచారం ఆ రోజులలో ఉన్నదని వీరభద్రశాస్త్రికి చూచాయగా తెలుసు.

"స్వామీ. కానున్నది కాక మానదు. మా ఊరు పక్క ఉన్న గంగలకుర్రులో వైదిక బ్రాహ్మణులని కొరివి దయ్యాలని చెప్పి హడలగొట్టిన నేను ఇంతమాత్రానికే బెదిరిపోతే..."

"సరి. సరి. దీప నిర్వాణ గంధాన్ని మూర్కొనని మూర్ఖునిలా ఉన్న నీవు ఆమె బారిని పడనే పడ్డావు. హితోపదేశం నీ పాలిటి బధిర శంఖారావమే అవుతూంది. నీకు ప్రియోపదేశమే చేస్తాను. వెళ్లు. ఈ దినము కూడ ఆమె వద్దకు వెళ్లు. ఆమెతో సంభోగభోగాలన్నీ అనుభవించు. కాని, కనీసం, మిత్రభావంతో చెబుతూన్న నా కోసం, నీ అర్థాపేక్ష గురించి ఆమెతో ప్రస్తావించి చూడు. నీవు కోరిన ధనం అంతా క్షణాల మీద సమకూర్చి ఇస్తుంది. అదే నీకు కావలసిన తార్కాణం."

గొర్రెపోతు గాంభీర్యంతో ఉన్న వీరభద్రశాస్త్రి వ్యగ్రతతో తత్తరపడి కొద్దిగా చలించేడు. ఏమీ తెలియనప్పుడు కామినీతో జరిపిన సరస సాంగత్య క్రీడలు ఒక ఎత్తు. మెదడులో అనుమానం మొలకెత్తిన తరువాత..."

"...ఇప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి. నీకు మార్గాంతరం లేదు. కొండ దిగేటప్పుడు నిన్ను ఆ విభావరీ వనిత దారిలో అటకాయిస్తుంది. అప్పుడు పారిపోవాలని అనుకున్నా పారిపోలేవు. నువ్వామెను శంకిస్తున్నావని పసి కట్టిందంటే అది నిన్ను బతక నియ్యదు. అందు చేత నువ్వు ఈ దినము ఏమీ తెలియనట్లు నటించు. ఎప్పటిలాగే ప్రవర్తించు. అనుమానానికి తావీయకు. ఆమె కోరినది ఇయ్యి. నేను చెప్పినవి కావాలని కోరి పుచ్చుకో."

వీరభద్రశాస్త్రి గుండె దిటవు చేసుకొని, ఆ చిరు చీకట్లో మెట్లు దిగటం మొదలు పెట్టేడు. సగం దూరం వెళ్లే సరికల్లా సంకేత స్థలంలో అభిసారిక వేచి ఉంది. శాస్త్రి చెయ్యి అందుకుని, సత్వరం కొలను మధ్యలో ఉన్న మండపంలోకి తీసుకుని వెళ్లిపోయింది.

దేవాలయపు గోడల మీద ఉన్న కామకేళీ వినోద శిల్పాలలో ఉన్న ఒంపుసొంపులన్నీ అవుపోసన పట్టిన ప్రౌఢ వలె ఆ కామిని వీరభద్రశాస్త్రిని వాటేసుకుంది.

శాస్త్రి శరీరం అంటే అక్కడ ఉంది కాని మనస్సు మరెక్కడో ఉంది. అది పసికట్టిన కామిని కారణం ఏమిటని గుచ్చి గుచ్చి అడిగింది.

"ధర్మార్ధ కామ మోక్షాలు చతుర్విధ పురుషార్ధాలు. ధర్మ శాస్త్రం అధ్యయనం చేసేను. కాని ధనము కలవాడినే పండితుడని లోకం గౌరవిస్తుంది. యోగాభ్యాసం చేసేను. అయినా ధనం కలవాడే బలవంతుడంటుందీ లోకం. ఆ ధనం కోసం ఊరు విడచి దేశాల వెంబడి తిరుగుతున్నాను. అర్ధ సాధన కాకుండానే మూడో పురుషార్ధాన్ని అఘ్రాణించి అనుభవిస్తున్నాను. ఇది సరి కాదు. ధనం మూలం మిదం జగత్ అన్నారు. ఆ డబ్బే ఉంటే మనం వివాహం చేసుకుని సంసారం చేసేవాళ్లం కదా అని ఆలోచిస్తున్నాను."

"అంతేనా! చూడు," అంటూ గదిలో ఉన్న పేటికని తెరచి నవరత్న ఖచితమైన బంగారు నగలు, ఆభరణాలు, చీనిచీనాంబరాలు చూపించి, "ఇవన్నీ

నీవే. నీకేమి కావాలిస్తే అది తెచ్చి ఇస్తాను. ముందు మనస్సు నా మీద లగ్నం చేసి నా కోరిక తీర్చు."

అలా వీరభద్రశాస్త్రి ఆ రాత్రి ఆ కామినితో గడిపేడు. సాధువు చెప్పిన సంకేతాలన్నీ ఈ నారిలో కనబడ్డాయి. సందేహం లేదు.

## 5

తెల్లవారింది. వీరభద్రశాస్త్రి కామిని ఇచ్చిన పేటికతో కొండ ఎక్కి ఆలయ ప్రాంగణంలో ఎదురు చూస్తూన్న సాధువుని కలుసుకున్నాడు. బైరాగి ఆ పేటికని అందుకుని, మంత్రించిన విభూతి, రక్షరేకులు, తావీజులు ఇచ్చేడు.

"ఈ దినం సంధ్య వేళ కాకుండానే కొండ దిగి, తిన్నగా ఇంటికి వెళ్లిపో. ఇంటి చూరులకు నాలుగు మూలలా ఈ రక్షరేకులు బిగించు. ఇంటి చుట్టు ప్రహరి వలె ఈ విభూతిని జల్లు. ఇంటి కప్పు మీద కూడ ఒక రక్షరేకు ఉంచు. ఇంటి అంతర్భాగంలో ఒక మంచం చుట్టూ ఈ విభూతి జల్లి ఆ మంచం మీద శయనించు.

"నిర్ణీత సమయానికి కొండ దిగే దారిలో నువ్వు కనిపించకపోయేసరికి ఆ పిశాచి నిన్ను వెతుక్కుంటూ మీ ఇంటికి వస్తుంది. ఈ విభూతి రేఖలని దాటి అది లోపలకి రాలేదు. అందుకని నయాన్నా భయాన్న నిన్ను ఆ విభూతి పరిధి నుండి బయటకు రప్పించటానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. కామినీలకి లఘిమ, ప్రపత్తి అనే శక్తులు ఉన్నాయని జ్ఞాపకం ఉంచుకో. వీటితో అవి గాలిలో తేలి ఎగర గలవు. కోరిన కోరికలు ఎలా తీర్చగలవో నువ్వే చూసేవు. కనుక అది ధన, కనక, వస్తు, వాహనాలు ఎరగా చూపించి నిన్ను బయటకు రప్పించటానికి ప్రయత్నం

చేస్తుంది. నీ పరిధి దాటి వచ్చితివో దానికి చిక్కినట్లే. దానికి చిక్కితివో నీవు చచ్చినట్లే. మిన్ను విరిగి మీద పడ్డా తెల్లవారేవరకు నువ్వు ఆ గది దాటి బయటకు రాటానికి వీలు లేదు."

వీరభద్రశాస్త్రి సాధువు చెప్పినట్లు తు. చ. తప్పకుండా చేసేడు.

అలవాటు ప్రకారం, చీకటి పడ్డ తరువాత, కామిని వీరభద్రశాస్త్రి కొరకు సంకేత స్థలంలో వేచి ఉంది. శాస్త్రి జాడ లేదు. కొండ దిగి చిన్న అర్చక స్వామిని వెతుక్కుంటూ ఊళ్లో ప్రవేశించింది. అతి త్వరలో అతని జాడ పసిగట్టింది. కాని మంత్రించిన విభూతి మహిమ వల్ల పరిధి దాటి శాస్త్రి చేరువకు చేర లేకపోయింది. బయట నుండి శాస్త్రిని పిలచింది. శాస్త్రి పలకలేదు. ఆకాశం లోకి ఎగిరి ఇంటి కప్పు గుండా శాస్త్రిని చేరుకోటానికి ప్రయత్నించింది. రక్ష రేకు వల్ల అదీ కుదర లేదు. అలా ఆకాశయానం చేస్తూనే శాస్త్రిని పరిపరి విధాల బతిమాలింది. కావలసినంత డబ్బు ఇస్తానని ఆశ పెట్టింది.

సామ దానాలు పని చెయ్యలేదు. ఆ బైరాగి కపటి, వంచకుడు అని చెప్పి చూసింది. చివరి ప్రయత్నంగా ఇంటి కప్పు మీద రాళ్ల వర్షం కురిపించింది. రక్షరేకు మహిమ వల్ల రాళ్లు ఇంటి మీద పడటం లేదు. ఇంతలో ఇంటి కొప్పు మీద పిడుగు పడి కొప్పుకి నిప్పు అంటుకుంది. భయభ్రాంతుడైన వీరభద్రశాస్త్రి మంచం దిగి బయటకు పరిగెత్తబోయాడు. కాని సిద్ధుడు స్మరణకి వచ్చి ధైర్యం తెచ్చుకున్నాడు. ఈ విధంగా ఆ కామిని మూడు రాత్రులు ప్రయత్నం చేసింది. ఫలితం లేక వెళ్లిపోయింది.

కామిని వెళ్లిపోయిందని రూఢి పరచుకుని, ధైర్యం తెచ్చుకుని సాధువుని చూడటానికి శాస్త్రి కొండ మీదకి వెళ్లేడు. సాధువు జాడ ఎక్కడా లేదు. ఎవ్వరిని అడిగినా అటువంటి సాధువుని ఆ గుడి దగ్గర చూసిన జ్ఞాపకమే లేదన్నారు.

జరిగినదంతా తంత్ర విద్య నేర్చిన ఆ సాధువు కల్పించిన కనికట్టు అని కొంతమంది అన్నారు. తాంత్రికులు తాము నేర్చిన విద్య యొక్క స్థోమతని పరీక్షించటానికి క్వాచిత్కంగా ఇలాంటి ప్రయోగాలు చేస్తూ ఉంటారనిన్నీ, అందువల్ల అవన్నీ యదార్థం అనుకోకూడదనిన్నీ కొంతమంది తీర్మానించేరు.

ఈ సిద్ధాంతాలు వింటూ ఉంటే వీరభద్రశాస్త్రికి కొండ దిగువ, కొలను పక్కనున్న శ్మశానవాటికలో తిరుగాడుతూ తనకి తారసపడ్డ బైరాగి రూపం ఒకటి లీలగా మనస్సులో మెదిలింది. ఇదంతా కలో, నిజమో, మాయో, మంత్రమో, తంత్రమో తేల్చుకోలేకపోయేడు.

కాని దయ్యం పక్కలో పడుక్కుని ద్రావిడ ప్రాణాయామం చేసిన వీరభద్రశాస్త్రి “గుర్రాన్ని గుడేక్కించేరు” అని పేరూరు ద్రావిడులు తెచ్చుకున్న పేరుకి సార్థకత్వం తీసుకొచ్చేడని ఇప్పటికీ అడివారంలో అనుకుంటూ ఉంటారు.

(మా చిన్నన్నయ్య శ్రీ వేమూరి విశ్వేశ్వర సోమయాజి చెప్పిన కథ దీనికి ఆధారం. సింహాచలపు ప్రాంతపు భౌగోళిక విషయాలని చెప్పినది పారనంది లక్ష్మీనరసింహం. ద్రావిడుల చరిత్ర చెప్పినది శ్రీమతి మంథా లక్ష్మి. శ్రీ విశ్వనాథ అచ్యుత రాయలు గారు రాసిన "వ్యాకరణం వారు" అన్న కథ చదివిన తరువాత ఈ కథ రాయాలనిపించింది. ఈ కథ 'నింఫోమేనియాక్' అనే పేరుతో రచన లో ప్రచురించబడింది. తేదీ అలభ్యం.)

# చెలగాటం

"డేడీ, స్టో..._రీ,_..._ఈఁ_..._ఈఁ"

అనగా అనగా ఒక రాజ్యాన్ని ఒక రాజు పాలించేవాడు. ఆ రాజు పేరు నాకు తెలియదు. అయినా అతని పేరుతో మనకి అంతగా పని లేదు. ఈ కథ భారతదేశంలో మహాభారత కాలంలోనో, మొగల్ సామ్రాజ్యపు రోజుల్లోనో జరిగుండొచ్చు. లేదా, ప్రపంచంలో మరెక్కడయినా, మరెప్పుడయినా జరిగుండొచ్చు. నన్నడిగితే ఆ విషయం కూడ మనకి అనవసరమే. మా తాతమ్మ మా అమ్మకి ఈ కథ చెప్పినప్పుడు ఈ పేరు లేని రాజు మరెవ్వరో కాదు, వాళ్ల ఊరు మునసబు కర్కోటకుడు గారే అని మా అమ్మ ఊహించిందిట. ఈ కథ నేను తిరగ చెప్పినప్పుడు మా పెద్దమ్మాయి ఈ కథ కచ్చితంగా రోమన్ సామ్రాజ్యపు కథ అయిఉంటుందని ఊహించింది. మా ఇంట్లో ఆడ జనం – ఆబాలగోపాలం – నా కంటె తెలివయిన వారని నేనెప్పుడో ఒప్పేసుకున్నాను కనుక ఇది కర్కోటకుడి కథ అయినా అయుండవచ్చు, రోమన్ సామ్రాజ్యపు కథ అయినా కావచ్చు, లేక ఈ కాలపు కథ అయినా నేను ఆశ్చర్యపోను.

మన రాజు కర్కోటకుడే కాకుండా చాదస్తపువాడు కూడాను. తను పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్లు అనే రకం. కుక్క తోకని తిన్నగా అయేవరకు సాపు చేస్తానంటాడు. పోనీ ఎవడి వెర్రి వాడికి ఆనందం అని సర్దుకుపోదామా అంటే వీలయ్యే పనా? అంతా తను అనుకున్న పద్ధతిలోనే జరగాలని మంకు పట్టు

పట్టేవాడు. ఈ పప్పులు పెళ్లాం దగ్గర, కూతురు దగ్గర ఉడికేవి కావు కానీ, నోరు, వాయి లేని ప్రజల దగ్గర ఉడికేవి.

ఒక రోజు అకస్మాత్తుగా ఈ రాజు బుర్రలో ఒక ఊహ మెరిసింది. లేడికి లేచిందే పయనం అన్నట్లు స్థపతులనీ, మేస్త్రీలనీ, వడ్రంగులనీ పిలిపించేడు. తన మనస్సులో ఉన్న ఊహని వాళ్లకి చెప్పేడు. వాళ్లు అదెంత సేపు, చిటికెల మీద పని అన్నారు.

మన రాజు మనసు పడుతూన్నది క్రీడారంగాన్ని పోలిన బహిరంగ న్యాయస్థానం. ఈ న్యాయస్థానంలోకి విచారణకి వచ్చే “కేసు”లు “కేపిటల్” కేసులు మాత్రమే! అంటే మరణ శిక్షకి అర్హమయిన కేసులనే ఇక్కడ విచారించి, తీర్పు చెప్పి, శిక్షని విధించి, ప్రజల సమక్షంలో ఈ న్యాయస్థానంలోనే శిక్ష అమలు పరుస్తారు. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు కదా. అందుకని రాజుగారే స్వయంగా తీర్పు చెప్పి, శిక్ష విధించి, ఆ శిక్షని ఆయన సమక్షంలోనే అమలు జరిపిస్తారు.

“ఓస్ ఇంతేనా కథ! ఇందులో విశేషం ఏమిటి?” అని కొట్టి పారేయగల సమర్థులు మీరని నాకు తెలుసు. కాదనను. మీవరకూ ఎందుకు? ఇంతవరకూ కథ విన్న మా చిన్నమ్మాయి, “ఇంక చాల్లే, నాన్నా. ఈ కథ ఏమీ బాగా లేదు. చీమ–నల్లి కథ చెప్పెయ్” అంది.

అందరిలాగా వ్యాజ్యం విని, ఉరిశిక్ష విధించటమో, వదలిపెట్టెయ్యటమో చేసేసి, చేతులు దులిపేసుకునే వ్యక్తి అయితే ఈ కర్కోటక రాజు గారి కథ మనం ఇప్పుడు చెప్పుకోము కదా. ప్రజల సమక్షంలో శిక్షని అమలు చేసే పద్ధతి

ప్రవేశపెట్టటానికి ఒకటి కంటె ఎక్కువే కారణాలు ఉన్నాయి. ఒకటి, ఏ శిక్షనైనా రద్దు చెయ్యవచ్చు కాని అమలు జరిగిపోయిన మరణశిక్షని వెనక్కి తీసుకోలేము కదా. అస్త్రాలలో బ్రహ్మాస్త్రం ఎలాంటిదో శిక్షలలో మరణ శిక్ష అలాంటిది. కనుక న్యాయస్థానంలో తీర్పు అయిపోయి, శిక్ష పడిపోయిన తరువాత తన ప్రాణం రక్షించుకోటానికి దోషికి రాజుగారు ఒక్క ఆఖరు అవకాశం ఇస్తారు. అదీ ప్రజల ఎదుట! రెండవ కారణం – తప్పులు చేస్తే వాటి పర్యవసానం ప్రజలకి గుర్తు చెయ్యటం. మూడవది, ప్రజలని వినోద పరచటం కోసం!

పిల్లికి చెలగాటం, ఎలుకకి ప్రాణ సంకటం లా తయారయిన ఇటువంటి పరిస్థితిని కల్పించి, దానిని చూసి ఆనందించే మనస్తత్వాన్ని మనస్తత్వశాస్త్రజ్ఞులు 'సెడిస్టిక్ పెరసనాలిటీ డిసార్డర్' అంటారు. లేకపోతే ఏమిటి చెప్పండి? దేశంలో సమస్యలే లేవా రాజుగారి కాలక్షేపానికి?

శిక్ష ఏ రోజున జరగబోయేదీ ముందుగానే దండోరా వేసి ప్రజలకి తెలియబరుచుతారు. ప్రవేశ రుసుము ఉన్నాదని జంకకుండా ప్రజలు తండోపతండాలుగా వచ్చి క్రీడారంగాన్ని నింపేస్తారు. ఇటువంటి సంఘటనలు చూసి ఆనందించే ప్రజలు కూడ మానసికరోగులే అయి ఉండాలి. యథా రాజా తథా ప్రజా అని ఒట్టినే అనలేదు.

ఇహ క్రీడారంగం సంగతి. అది చిన్నదీ, చితకదీ కాదు; అదొక బృహత్తరమైన మూడంతస్తుల భవనం. ఈ భవనంలోకి జనాలు తొంబతొంబలుగా వెళ్లటానికీ, బయటకి రాటానికి సువిశాలమైన ద్వారాలు. లోపలికి వెళ్లగానే ముందస్తుగా కనిపించేది – కళ్లు చెదిరిపోయే అంత అందంగా

– అప్పుడే కత్తిరించబడ్డ సువిశాలమయిన పచ్చటి పచ్చిక మైదానం. అదే మన రాజు గారి క్రీడారంగం. దీర్ఘవలయం ఆకారంలో ఉన్న ఈ మైదానం చుట్టూ పావంచాల మాదిరి అమర్చిన వరసలలో కుర్చీలు. చెల్లించిన ప్రవేశ రుసుం ని బట్టి ప్రేక్షకులు మధ్యలో ఉన్న వేదికకి దగ్గరగానో, దూరంగానో కూర్చుంటారు. ప్రజలంతా కూర్చున్న తరువాత రాజు గారు పెద్ద పటాటోపంతో వచ్చి ఆయన కోసం ప్రత్యేకంగా అమర్చిన గాజద్దాల గదిలో కూర్చుంటారు.

"మన ఓక్‌లండ్ లో ఉన్న 'బేస్‌బాల్ స్టేడియం'లా ఉంటుందా?" పక్కలో పడుక్కుని కథ వింటూన్న పిల్ల కూజితం.

అవునమ్మా! కొంతవరకు ఓక్‌లండ్‌లో ఉన్న 'కలోసియం'లా ఉంటుందని ఊహించుకోవచ్చు.

రాజు గారు సుఖాసీనులు అయిన తరువాత సర్వాంగ సుందరంగా నిందితుడిని అలంకరించి – అంటే, స్పెయిన్‌లో జరిగే 'బుల్ ఫైటింగ్' లో 'మేటడోర్' లా – మైదానంలోకి తీసుకు వస్తారు. నిందితుడిని రాజు గారి ఎదుట నిలబెడతారు. రాజు గారు చెప్పబోయే తీర్పు ఏమిటో ప్రజలందరికీ ముందుగానే తెలుసు.

నిందితుడి ఎదురుగా, మైదానంలో ఒక పక్కగా, రెండు తెరలు ఉంటాయి. ఒకదాని మీద 1 అనే అంకె, రెండవ దాని మీద 2 అనే అంకె వేసి ఉంటాయి. ఒక తెర వెనక బోనులో ఆకలితో నకనకలాడుతూన్న పులి ఉంటుంది. రెండవ తెర వెనక నేరస్తుడికి సమాజంలో ఉండే అంతస్తుకి, హోదాకి, వయస్సుకి సరితూగే

ఒక అమ్మాయి – పువ్వుల దండతో సహా – వేచి ఉంటుంది. ఈ అమ్మాయి ఎంపిక కూడ రాజుగారి పర్యవేక్షణలోనే జరుగుతుంది.

"డేడీ! ఇది 'లేడీ అండ్ ద టైగర్' కథ కాదూ?"

"నోరు ముయ్యవే చుప్పనాతీ!"

ముఖ్యమైన మరో విషయం. ఏ తెర వెనక ఏది ఉందో ఎవ్వరికీ తెలియదు. ఊహించటానికి కూడ వీలు లేనంతగా కట్టుదిట్టాలు చెయ్యబడతాయి. లోపల నుండి పులి వాసన గానీ, పువ్వుల వాసన గానీ బయటకి రావు. పులి 'గాండ్రు' మంటే ఆ చప్పుడు కూడ బయటకి రాదు. అంతలా కట్టుదిట్టం చేసేరు.

రాజు గారి అనుమతిని సూచిస్తూ సేవకులు చేతి గంటతో గణగణరావం చెయ్యగానే నిందితుడు రెండు తెరలలో ఏదో ఒక తెరని ఎన్నుకోవాలి.

"లెట్స్ మేక్ ఎ డీల్ ప్రోగ్రాములోలా అన్నమాట!" పక్కలో ఉన్న పిల్ల గువ్వ పిట్టలా కూజితాలు చేస్తూ ఉంటే పిల్ల ఇంకా పడుక్కోలేదనే కదా అర్థం!

అవునమ్మా! మాంటీ హాల్, బాబ్ బార్కర్ మొదలైన వాళ్ల టి. వి. షోలో లాగే. అచ్చం అలాగే.

నిందితుడు పులి ఉన్న తెరని ఎన్నుకుంటే దాని వెనక ఉన్న పులి అమాంతం మీద పడి మనవాడిని ఎముకలపోగులా మార్చటానికి రెండు నిమిషాలు కూడ పట్టదు.

"మరయితే రోములో ఉన్న 'కలోసియం'లో 'గ్లేడియేటర్' లా ఆ అబ్బాయి ఈ పులితో కుస్తీ పట్టి పులిని చంపెస్తే...?"

నామానాన నేను కథ చెప్పుకు పోతూ ఉంటే కుదురుగా పడుక్కుని కథ వినకుండా మధ్యలో యక్ష ప్రశ్నలు వేస్తే నాకు చిరాకు పుట్టుకొస్తుంది. కాని కిందటి వేసంగిలోనే మా సంసారం అంతా కట్టగట్టుకుని రోము వెళ్లి ఆ కలోసియంని చూసి వచ్చేం కదా. అందుకని పక్కలో ఉన్న మా అమ్మాయి వేసిన ఈ ప్రశ్నని నేను 'ఏంటిసిపేటు' చేసి ఉండవలసింది. చెయ్యలేదు. ఇప్పుడు పచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డట్టు అయింది.

అవునమ్మా! గ్లేడియేటర్ లా మనవాడు కూడ పులి పీకని రెండు చేతులతోనూ నులిమి చంపెస్తే వాడికి మరే శిక్షా పడదు. వాడిని మెచ్చుకుని, మేకతోలుకి బదులు, ఆ చచ్చిపోయిన పులి తోలే కప్పి వాడిని ఇంటికి పంపించెస్తారు. మన కథ మధ్యలోనే కంచికి వెళ్లిపోతుంది. అప్పుడు నువ్వు నోరు మూసుకుని చొప్పదంటు ప్రశ్నలు అడగకుండా నిద్రపోతావు. సరేనా?

నిందితుడు పిల్ల ఉన్న తెరని ఎన్నుకుంటే వెంటనే ఆ పిల్లనిచ్చి మనవాడికి పెళ్లి చేసెస్తారు, అక్కడికక్కడే! అందరి ఎదుటా! అందుగ్గాను మరొక తెర వెనుక (ఈ తెర మీద 1, 2 అనే అంకెలేవీ ఉండవు) ఒక పురోహితుడు, భజంత్రీలవాళ్లు సిద్ధంగా ఉంటారు. ప్రేక్షకులలో ఉన్న 'సైకలాజికల్ కేసులు' "వీడికి పెళ్లయింది! ఇదే వీడికి ఉరి శిక్ష కంటె పెద్ద శిక్ష!" అని సమర్ధించుకుంటూ చప్పట్లు కొడతారు.

"మరి, ఆ అబ్బాయికి అప్పటికే పెళ్లయిపోతే?"

మన రాజు గారి నిబంధన ప్రకారం నిందితుడు తెర వెనక పిల్లని పెళ్లి చేసుకుని తీరాలి. అంతకు ముందే వాడికి పెళ్లయి పోతే ఇప్పుడు ఇద్దరినీ ఏలుకోవాలి. కనుక రాజు గారి దృష్టిలో ఇదీ ఒక రకం శిక్షే!

ఈ పద్ధతిలో జరిగే తీర్పు మన రాజు గారికీ, రాజ్యంలో ప్రజలకీ ఒక వినోద కాలక్షేపం. ఇలా రోజులు దొర్లిపోతూ ఉంటే నేను ఈ కథ చెప్పవలసిన పనే ఉండేది కాదు. రోము కాలిపోతూ ఉంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయిస్తూ కూర్చున్నాడని మనం చరిత్ర పుస్తకాల్లో చదువుకున్నట్లే, ఫలానా కర్కోటకుడు ఫలానా విధంగా ప్రవర్తించేడని చదువుకుని ఉండేవాళ్లం. కాని నిజంగా జరిగిన తంతు అది కాదు కనుక ఈ కథ కడితేరా చెప్పాలి.

ఒక రోజు మన రాజు గారి ముద్దుల కూతురు — మొన్నమొన్నటివరకు, నీలాగే, పక్కలో పడుక్కుని కథలు చెప్పించుకున్న చిట్టి తల్లే – రాజ్యంలో ఒక బాలా కుమారుడిని చూసింది. చూసి మనసు పడింది. పడటమేమిటి, ప్రేమించేసింది! మొదట్లో చాటుగానో, మాటుగానో ఇద్దరూ కలుసుకునేవారు. ఏ చెట్టు కిందో, తుప్ప వెనుకో ఒకరి ఒడిలో ఒకరు ఒదిగిపోయేవారు. ఇలా గుట్టుగా ప్రేమించేసుకుని, పెదాలు కొరికేసుకుంటే ఏ గొడవా ఉండకపోయేది. తొండ ముదిరి ఊసరవిల్లి అయినట్లు వీరిద్దరూ బరి తెగించి, కోట వెనక ఉన్న బాడవ తోటలో 'స్టెప్పులు' వెయ్యటం మొదలు పెట్టేరు. ఇలా గుట్టు రట్టవటం చూసిన రాజభటులో, లేక కిట్టని వారు మరెవరో ఈ వార్తని మన రాజు గారి చెవిలో ఊదేశారు.

ఆయన ఉగ్రుడై పోయాడు. అగ్గిరాముడై పోయాడు. నిగనిగలాడుతూన్న నిప్పు బొగ్గుల మీద సాంబ్రాణి వేసినట్లు భగ్గుమన్నాడు. వయసులో ఉన్నవాళ్లు ప్రేమించుకోవటంలో మనకి తప్పు కనిపించకపోవచ్చు. కాని మన మంకు పట్టు రాజా వారికి ఈ ప్రేమ కలాపం నచ్చలేదు. చేసిన 'తప్పు' కి ఇద్దరూ సమంగా

బాధ్యులే అయినప్పటికీ, కూతురిని ఏమైనా అంటే రాణీ గారు రాజుని బతకనిస్తుందా? ఆయన ఊరంతటికీ రాజు కాని పెళ్లాం దగ్గర కాదు కదా! అందుకని తప్పంతా కుర్రాడిదేననీ, తన కూతురుని ప్రేమించటంతోపాటు వాడు ఇంకా చాల తప్పులు చేశాడనిన్నీ, ఆ మాటకొస్తే వాడి దగ్గర 'వెపన్స్ అఫ్ మాస్ డిస్ట్రక్షన్' వంటివి ఉన్నా ఉండొచ్చనిన్నీ, ఇలా ఎన్నో నేరాలని ఆ కుర్రాడి మీద ఆరోపించి, వాడి తరఫున వకాల్తా పుచ్చుకోటానికి మనిషిని దొరక్కుండా చేసేసి, విచారణ అంతా రహశ్యంగా జరిపించేసేసి, కుర్రాడిని శిక్ష అనుభవించటానికి క్రీడారంగానికి రమ్మనమని ఆజ్ఞ జారీ చేసేసేరు.

ఈ 'కేసు' ప్రజల దృష్టిని బాగా ఆకర్షించింది. దేశంలో ఉన్న ప్రజ, పొరుగు దేశాలలో ఉన్న ప్రజలు, తండోపతండాలుగా వచ్చేసి క్రీడారంగంలో ఇసక వేస్తే రాలకుండా కిటకిటలాడిపోయేరు. కథాకాలం నాటికి వార్తా పత్రికలు, టి. వి. ఉండుంటే ఆయా విలేకరులు కూడా వచ్చి క్రీడారంగాన్ని మరింత కిటకిటలాడించేసే ఉంటారు.

బటానీలు, శనక్కాయలు, బీరు, పీచుమిఠాయి, వగైరా అమ్మకాలమీద వచ్చిన లాభాలతో రాజు గారి ఖజానా గలగల లాడుతూ నిండిపోతోంది. క్రీడారంగం తిరణాల వాతావరణంతో మోగిపోతోంది.

ఇంతలో రాజు గారు వచ్చి సుఖాసీనులు అయేరు.

ఒక్క సారి క్రీడారంగం అంతా నిశ్శబ్దంతో నిండిపోయింది.

రాజు గారు కూర్చున్న గాజద్దాల గది కిందనే ఉన్న ఒక సొరంగం ద్వారా దోషిని తీసుకు వచ్చి రాజు గారి ఎదట నిలబెట్టేరు.

ఆ వ్యక్తిని చూసి అందరూ 'ఔరా!' అని ముక్కు మీద వేలేసుకున్నారు.

అతను ఆజానుబాహువు. కండలు తిరిగిన శరీరం. మహాబలశాలిలా కనిపించేడు. నవయవ్వనం తొణికిసలాడుతూన్న మన్మధుడిలా ఉన్నాడు. వర్చస్సు చూస్తే రాకుమారుడిలా ఉన్నాడు కాని, సామాన్యుడిలా లేడు. అందానికీ, ఆకర్షణకీ రాకుమార్తెకి ఏమాత్రం తీసిపోడు. ప్రేక్షకులలో ఉన్న ఆడువారు ఈ వ్యక్తిని చూసి ఉవ్విళ్లూరేరంటే ఊరరూ. ఈడూ, జోడూ కుదిరింది. ఇటువంటి వ్యక్తిని తనంత తానే ఎన్నుకుని ప్రేమించిన రాకుమారిని అభినందించాలి కాని ఏమిటీ వీధి భాగోతం అని కొందరు గు.. స.. గు.. స...లా....డు......కు...... న్నా...రు.

"వేకప్ డేడీ! యు ఆర్ ఫాలింగ్ ఎస్లీప్"

లేచేనమ్మా. కథ చెప్పేస్తున్నాను.

మహా సముద్రంలా ఉన్న ఆ జనసందోహం మధ్యలో నిలబడ్డ ఆ దోషి కళ్లు ఎవ్వరి కోసమో వెతుకుతున్నాయి. గాజద్దాల తలుపు వెనక రాజు గారి కుడి పక్క రాణి గారు, ఆమె పక్కన నిలబడి రాకుమార్తె ఆ కళ్లకి కనిపించేరు. ఆమె వైపే చూస్తున్నాడు దోషి. ఆశగా చూస్తున్నాడు. రాకుమారి తలుచుకుంటే ఏ తెర వెనక ఏముందో తెలుసుకోలేదా! ఆ విషయం తెలిసిన తరువాత ఏదో ఒక విధంగా తనకి సంకేతం పంపకపోతుందా! చిన్న ఆశ అతని బుర్రలో మొలకెత్తింది.

అంతలోనే నిరాశ. తనకి ప్రాణదానం చేస్తే ఆమెకి ఒరిగేదేముంది? పులి ఉన్న తెరని తప్పించి పిల్ల ఉన్న తెరని తను ఎన్నుకుంటే ఆ పిల్లని బలవంతంగా కట్టబెడతాడు కర్కోటక రాజా.

చేజారిపోయిన తన ప్రియుణ్ణి మరొకరికి కట్టబెడితే రాకుమార్తె సహించ కలదా? సహించటం మాట దేవుడెరుగు, కనీసం తన ప్రాణం నిలపటానికి సహకరించేటంత పెద్ద మనస్సు ఆ పిల్లకి ఉంటుందా?

ఏమో! ప్రాణం మీద ఆశ మహా దొడ్డది. అందుకని ఆమె వైపే చూస్తున్నాడు, ఏదైనా సంకేతం కొరకు.

గడియారపు స్థంబం మీద ఉన్న గడియారం చేసే టిక్కు, టిక్కు శబ్దం తప్ప క్రీడారంగం అంతటా నిశ్శబ్దం ఆవరించింది. ప్రజలు ఉత్కంఠ భరించలేక పోతున్నారు.

రాకుమారి మనస్సు పరిపరి విధాల పోతూంది. నిందితుడికి తను సహాయం చేసినట్లు వెల్లడి అయితే అది రాజద్రోహం. ఎంత తండ్రి అయినా మొండి ఘటం కదా. పైపెచ్చు కర్కోటకుడు! ఏ వేళప్పుడు ఏ కళలో ఉంటాడో?

ఇలా మీనమేషాలు లెక్కెంటుకుంటూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది. ముఖం మీద పడుతూన్న ముంగురులని రెండు సార్లు పైకి ఎగదోసింది, రాకుమారి.

అదే తనకి కావలసిన సంకేతం అని రాకుమారుడు భావించేడు.

ఇంతలో గడువు కాస్తా అయిపోయింది. రాజు గారు సంజ్ఞ చేసేరు. తెర తెరవటానికి సమయం ఆసన్నమయిందని రాజభటుడు గుర్తించి గణగణ గంట మోగించటం మొదలు పెట్టేడు.

అందరూ ఊపిరి బిగపట్టి దోషి ఏ తెర ఎన్నుకుంటాడా అని ఉత్కంఠతో ఉన్నారు.

దోషి రెండవ తెర వైపు నిస్సంకోచంగా వడిగా అడుగులు వెయ్యసాగేడు.

అందరూ ప్రాణాలు ఉగ్గపట్టి ఉన్నారు.

గంట ఇంకా మోగుతోంది.

చీకటిలో చేతితో తడుముకుంటూ బల్ల మీద ఉన్న అలారం గడియారాన్ని కిందకి తోసేస్తూ అతను దిగ్గున లేచేడు.

గంట ఇంకా మోగుతోంది.

ఈ మాటు టెలిఫోను అందుకుని 'హల్లో' అన్నాడు.

"అన్నయ్యా! నేనురా పిలుస్తున్నాను. నిద్రపోతున్నావేమిటి?"

"లేపేసేవు కదా! ఇంక నిద్రపోవటం లేదు."

"మరేమీ లేదు. నీకు పీడ కలలు వస్తూ ఉంటాయి కదా. అవి ఎందుకు వస్తాయో 'సైకాలజీ టుడే' లో మంచి వ్యాసం చూసేను. నీకు చెబుదామని పిలచేను. ఇంత తొందరగా నిద్రపోతావని అనుకోలేదు."

"ఉద్ధరించలేకపోయేవురా! రెండో తెర వెనుక ఏముందో తెలుసుకోటానికి అవకాశం లేకుండా చేసేవు కదరా. అతన్ని పులి తినేసిందో, మొదటి తెర వెనక ఉన్న పిల్లతో పెళ్లే అయిందో? రాకుమారి ప్రేమాయణం సంగతి ఏమయిందో తెలీకుండా చేసేవు కదరా!"

("ద లేడీ అండ్ ద టైగర్" అనే ఇంగ్లీషు కథకి స్వేచ్ఛానుకరణ. సుజనరంజని అంతర్జాల పత్రిక, జూన్, 2004; రచన, మే 2012)

# లోలకం

## 1

ఆ మధ్య ఒక తెలుగు సాహితీ సదస్సుకి వెళ్ళేను. ఇది తానా, ఆటాల మాదిరి ఎంతో ఆర్భాటంగా పెద్దలు జరిపే తిరనాళ్ళు కాదు. తెలుగు అంటే నిజంగా అభిమానం ఉన్న పిన్నలు నలుగురు కలుసుకుని స్వీయకవిత్వాలు చదువుకునే చిరు సభ. నేను లోపలికి వెళుతూ ఉంటే ఒక అమ్మాయి కరపత్రం ఒకటి చేతికి అందించింది.

"రండి! మనల్ని అణచి ఉన్న సంకెళ్ళని తెంచుకుందాం!" ఎవర్ని ఎవరు ఎప్పుడు ఎలా అణచిపెట్టేరో తెలుసుకుందామని చదవటం మొదలు పెట్టేను.

"స్త్రీల మీద హింస ఒక భయానకమైన స్థితికి చేరుకుంది. కుటుంబ హింస! శారీరక హింస! మానసిక హింస!!.....ఆర్థిక, సామాజిక, రాజకీయ, మానవ హక్కులని మనం తిరిగి స్వంతం చేసుకోవాలి!!...వివక్షను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ, హక్కుల ఉల్లంఘన జరిగిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం...... "

తలెత్తి చూసేను.

సావిత్రి తనంత తాను పరిచయం చేసుకుంది.

"అరె! ఈ పిల్లని మనింట్లో ఎవ్వరికైనా చేసుకుంటే బాగుంటుందే" అనిపించి, "చూడరా! ఈ పిల్లెవరో బాగుంది. మనవాళ్ళల్లో ఎవరికైనా నప్పితే ఎదురు కట్నం ఇచ్చి చేసుకుందాం!" అని పక్కనున్న తమ్ముడితో అన్నాను.

ఎక్కడైనా పెళ్ళీడు పిల్లడు కాని, పిల్ల కాని కనిపిస్తే వెంటనే వాళ్ళకి సంబంధాలు చూసే పద్ధతి కాదు నాది. మనం చూపెట్టిన సంబంధం బెడిసికొడితే నన్ను తిట్టుకుంటారనే భయం ఒకటి వెనక ఉన్నప్పటికీ అసలు కారణం అది కాదు. మనిషిని చూడగానే వాళ్ళ పూర్వాపరాలన్నీ అంచనా వేసేసి ఎవరికి ఎవరు నప్పుతారో బేరీజు వేసేసే చాకచక్యం మా నాని పిన్నికి ఉందేమో కాని నాకు లేదు. అయినా సావిత్రిని చూడగానే తటాలున ఆ మాట నోటి వెంబడి వచ్చేసింది.

"మావయ్యగారూ! నేను 'బుక్' అయిపోయానండీ!" అంది సావిత్రి అప్పటికప్పుడే వరస కలుపుతూ. మీకంత సరదాగా ఉంటే మా అన్నయ్య మూర్తికి ఏదైనా మంచి సంబంధం చూసిపెట్టండి!"

సావిత్రిని కలుసుకోవటం అదే మొదటి సారి. మూర్తిని ముఖాముఖీ కలుసుకోవటం కూడ అదే మొదటి సారి. మా ఇద్దరికీ అభిరుచులలో కొన్ని పోలికలు ఉండటంతో అతనితో టెలిఫోనులోను, ఇ-టపాలోను తరచుగా మాట్లాడుతూనే ఉన్నాను కనుక ఒక విధంగా మూర్తి పరిచయస్తుడి కిందే లెక్క.

"ఏమయ్యా! పోనీ నీకో పిల్లని చూసిపెట్టమంటావా?" కరపత్రాన్ని మడచి జేబులో పెట్టుకుంటూ మూర్తిని అడిగేను – పెద్ద అరిందా భంగిమలో! అతను "అలాగే చూసిపెట్టండి" అని అనుంటే నా ఎరికని తుపాకేస్తే పిల్ల లేదు.

"లేదండీ. నాకు ఈ అమెరికాలో పెరిగిన పిల్ల వద్దు. మన దేశం వెళ్ళి మన సంప్రదాయంలో పెరిగిన పిల్లని, బాగా తెలుగు మాట్లాట్టం, పాట పాడటం వచ్చిన పిల్లని చేసుకుంటాను."

"శుభం!" అనుకుంటూ అక్కడనుండి తప్పుకున్నాను. అమెరికాలో పెరిగిన పిల్లల మీద అతను తెలిసో, తెలియకో విసిరిన విసురుకి కించిత్తు బాధ పడ్డాను, ఇద్దరు ఆడపిల్లల తండ్రిని కనుక!

మూర్తి 'పోస్ట్ డాక్' పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. సావిత్రి ఇంకా పి.హెచ్.డి. కోసం కృషి చేస్తోంది. అన్నా, చెల్లెలూ బాధ్యత, మర్యాద తెలిసిన వాళ్ళలా ప్రవర్తించేరు. ఇద్దరికీ సంగీత సాహిత్యాల్లోనూ, చిత్రలేఖనంలోనూ అభిరుచి ఉన్నట్లు కనిపించేరు. పైపెచ్చు స్త్రీల హక్కుల కోసం ఏదో ఉడతా భక్తిగా కరపత్రాలు అందిస్తున్నారు. సాంఘిక బాధ్యతలు ఉన్న కుర్రాళ్ళు కనుక నేను కూడ వారిద్దరితోనూ స్నేహ బంధం కలిపేను.

ఆ స్నేహాన్ని పురస్కరించుకుని, సావిత్రి తన పెళ్ళికి పిలచింది కాని వెళ్ళలేకపోయాను. రోజులు దొర్లిపోతున్నాయి. ఒక రోజున మూర్తి దగ్గరనుండి ఇ-టపా వచ్చింది. తెరచి చూసేను. "మూడు వారాలు సెలవు పెట్టి ఇండియా వెళుతున్నాను. సావిత్రి 'లైన్ క్లియర్' చేసింది కనుక పెళ్ళి చేసుకుని వస్తాను. నా పెళ్ళికైనా మీరు తప్పకుండా రావాలి."

అభినందనలు చెబుదామని ఫోను తీసి మూర్తిని పిలచేను. "మూర్తీ, పిల్లని వెతుక్కోటానికి మూడు వారాలు సరిపోవు," అంటూ హెచ్చరించేను.

"వెతుక్కోనక్కర లేదండి. అంతా నిశ్చయం అయిపోయింది."

"మేనరికం ఏమిటి?"

"కాదండి. పై సంబంధమే. మా వాళ్ళు చూసిపెట్టేరు. వాళ్ళు బందరుట."

"మీ వాళ్ళు చూసిపెట్టేరంటున్నావు. ట అంటున్నావు. నువ్వు పిల్లని చూడక్కరలేదా?"

"మా వాళ్ళకి నచ్చితే నాకు నచ్చినట్టేనండి!"

ఇరవయ్యొకటో శతాబ్దపు మొదటి దశాబ్దంలో అమెరికాలో ఉంటూన్న కుర్రాడి నోటి వెంబడి ఈ మాట వినేసరికి గతక్కు మన్నాను. ఎప్పుడో శతాబ్దం క్రితం మా పెద్ద మావయ్య గారికి పెళ్ళి సంబంధాలు చూస్తూన్నప్పుడు మెడ్రాసులో చదువుకుంటూన్న మా మావయ్య గారు "మీరు కోతిని తీసుకొచ్చి మెళ్ళో పుస్తె కట్టమంటే కట్టేస్తాను. నేను పిల్లని చూడవలసిన పని లేదు" అన్నారుట. "మా అన్నయ్య అంటే అన్నాడు కాని, మా వాళ్ళకి బుద్ధి ఉండక్కర లేదూ, వాళ్ళు వాడన్నంత పనీ చేసేసేరు," అని మా అమ్మ మా అత్తయ్యని ఎప్పుడూ వెటకారం చేసేది. కాని ఈ ఇరవయ్యొకటవ శతాబ్దంలో పిల్ల వాడు ఒప్పుకున్నాడే అనుకుందాం. ఆ పిల్ల ఎలా ఒప్పుకుందో నాకు అర్థం అయి చావ లేదు. అదే మాట అన్నాను.

"ఫోనులో మాట్లాడుకున్నామండి."

వెనకటికి, చంద్రుడి మీద అమెరికా వాళ్ళు కాలు మోపిన కొత్త రోజుల్లో, నేను ఇండియా వెళ్ళటం తటస్థ పడింది. మా ఇంటి పక్కన ఉన్న పోస్ట్ మాస్టారు మంగపతిరావు గారితో పిచ్చాపాటీ మాట్లాడుతూ, "మా అమెరికా వాళ్ళు ఎంత గొప్ప వాళ్ళో చూసేరా! చంద్రుడి మీద కాలు మోపేరు!" అన్నాను, సగర్వంగా!

"నీకెలా తెలుసు?"

"వాళ్ళు కళ్ళకి కట్టినట్లు అన్నీ టి. వి. లో చూపించేరు కదండీ! మీరు చూడ లేదా?"

"వాళ్ళు టి. వి. మీద చూపించినవన్నీ నిజమేనని నమ్మేసే వెర్రి కక్కగట్టలా ఉన్నావు. ఆ అమెరికాలో ఏం చదువు వెలగబెడుతున్నావో ఏమో!" అని నన్ను, నా అమాయకత్వాన్ని చూసి చాలా జాలి పడ్డారు ఆయన.

నేనూ అలాగే మూర్తి మాటలు విని జాలి పడ్డాను. తెలుగు రాని హిందీ తారలని ముందు పెట్టి, తెర వెనక నుండి తెలుగులో సంభాషణలు చెప్పించినట్లు అట్నించి ఎవరి చేతనైనా పాట పాడించి, మాటలు మాట్లాడించి ఉండొచ్చుకదా! పక్కింటి అమ్మాయి సినిమాలోలా!! కీడెంచి మేలెంచమన్నారు. వెనకటికి ఒక మొండి చెయ్యి పెళ్ళికొడుకు పొడుగు చేతుల చొక్కా వేసుకుని పెళ్ళి చూపులకి వెళ్ళేడుట. మూడు ముళ్ళూ పడ్డ తరువాత "నెగ్గేమురా బాబూ!" అంటూ బోర విరుచుకుని, కాలరెగరేసి, చొక్కా చేతిని వెనక్కి లాగి మొండి చెయ్యి చూపించేడుట. "నెగ్గని వారెవరూ!" అని కూని రాగాలు తీస్తూ పెళ్ళికూతురు చెవులమీదకి దిగజారిన జుత్తుని తొలగించి సొట్ట చెవులని చూపించిదిట. కనుక పిల్లని పిల్లడూ, పిల్లడిని పిల్లా చూసుకోకుండా వీళ్ళు పెళ్ళికి ఒప్పుకున్నారనే సరికి నా మనస్సు కకలావికలమై రకరకాల దిశలలో పరుగులు మొదలెట్టింది.

"పిల్ల బందరంటున్నావు, పోనీ పెళ్ళికూతురు ఫొటో అయినా చూసేవా?" అని కొంచెం శ్లేష ధ్వనించేలా అడగాలనే అడిగేను.

"చూసేనండి. మీకు పంపిస్తాను, చూడండి," అంటూ మా సంభాషణ జరుగుతూండగానే పార్వతి ఫొటో ఇ–టపాలో పంపించేడు.

బొమ్మ చూసేను.

మూర్తికి ఉన్న ఒక్క అప్పచెల్లెలూ ఈ అమెరికాలో ఉందాయె. మరి ఈ పిల్లని ఎవరు ఎంపిక చేసి పెట్టేరో నాకు అర్థం కాలేదు.

"కట్నం ఏ మాత్రం ఇస్తున్నారేమిటీ?" కట్నం కోసం పిల్లని చూడకుండా చేసేసుకుంటున్నాడేమో అని అనుమానం పీకుతోంది.

"మా సావిత్రిని బావ గారు కట్నం లేకుండా చేసుకున్నారు. మా ఇంట్లో ఇక ఆడ పిల్లలు లేరు. కనుక నేను కట్నం కోసం ఆశ పడవలసిన అవసరం లేదు. వాళ్ళు పిల్లకి విమానం టికెట్టు కొనిస్తే చాలు."

"అది మాత్రం వాళ్ళు ఎందుకు కొనివ్వాలి?"

"గురువు గారూ! గురువు గారూ!! నా దగ్గర అంత డబ్బు ఎక్కడిదండీ? నాకొచ్చే పోస్ట్ డాక్ జీతం – మీకు తెలియనిది ఏముంది – నాకే బొటాబొటీ. ఈ మధ్యే పాత కారొకటి కొన్నాను. మిగిలిన డబ్బులు కొత్త సంసారానికి కావాలి కదా. పైగా విమానం టిక్కెట్టు కొన గలిగే స్థోమత వాళ్ళకి ఉంది. మీ అమ్మాయి 'నాన్నా! ఇల్లు కొనుక్కుంటున్నాను, కొంచెం డబ్బు సహాయం చెయ్యండి' అని అడిగితే మీరు సాయం చెయ్యరా ఏమిటి?"

మా ఆవిడవి పాము చెవులు. నేను మేడమీద గదిలో తలుపులేసుకుని మాట్లాడుతున్నా, పెళ్ళి, పెళ్ళి కూతురు అన్న మాటలు విని వంట మధ్యలో ఆపి మేడ మీదకి పరిగెత్తుకొచ్చి పెళ్ళి కూతురు ఫొటో చూసి మూతి విరిచింది.

మూర్తికి అభినందనలు చెప్పి, క్షేమంగా వెళ్ళి, లాభంగా రమ్మని ఆశీర్వదించి టెలిఫోను పెట్టేసేను.

## 2

నేను హైదరాబాదులో ‘డాట్ కాం’ కంపెనీ నడిపిన రోజులవి. కనుక నాకు హైదరాబాదు వెళ్ళవలసిన పని తగిలింది. పిల్ల బందరే అయినా పెళ్ళి హైదరాబాదులో చెయ్యటానికి ఒప్పుకున్నారు. ఊళ్ళోనే ఉన్నాను కనుక పెళ్ళికి వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను.

పెళ్ళికి వెళుతున్నానని నా స్నేహితుడు, కంపెనీలో వాటాదారూ తన మెర్సిడీస్ కారునీ, డ్రైవరునీ ఇచ్చి పంపేడు – మా కంపెనీ స్టేటస్ ప్రదర్శించమని ప్రోత్సహిస్తూ!

రథం లాంటి కారు, యూనిఫారంలో డ్రైవరు, పటాటోపం చూసి పెళ్ళివారు ఎదురొచ్చి, పలకరించి, పెద్దలకి పరిచయం చేసేరు. పెళ్ళికూతురు తల్లి బొద్దుగా, సూర్యాకాంతంలా ఉంది. తండ్రి రమణారెడ్డిలా సన్నంగా, రివటలా ఉన్నాడు. పెళ్ళికొడుకు నాకు కావలసిన వాడు అని చెబుతూ పరిచయం చేసుకున్నాను. “మావయ్యగారూ, మావయ్య గారూ!” అంటూ సావిత్రి నాకు కాఫీ, టిఫినూ ఇప్పించింది.

‘మంథా వారిదీ మాదీ కలిపి నూటొక్క వీసం’ అన్న సామెతాలా నాకూ, మూర్తికీ ఏమీ ఆస్తి లేకపోయినా, నా కారు చూసి, మా స్నేహం చూసి మూర్తి అమెరికాలో ఎంతో ఆస్తిపరుడే అయుంటాడని ఆడ పెళ్ళివారు అనుకుంటూ ఉంటే విని నవ్వుకున్నాను.

ముహూర్తం వేళకి నాలుగు అక్షతలు జల్లి ఇంటికి తిరిగొచ్చేసేను.

నాలుగు రోజులు దొర్లిపోయాయి. శనివారం తెల్లారుతోంది. ఇంటి నుండి నా శ్రీమతి ఫోను చేసే వేళ అది. అందుకని అప్పటికే లేచి ఉన్నాను – ఫోను మీద వచ్చే పిలుపుకి ఎదురు చూస్తూ సుప్రభాతం వింటున్నాను. ఇంతలో ఫోను మోగింది.

"మా మూర్తినీ, సావిత్రినీ, వాళ్ళ తల్లి దండ్రులనీ రాత్రికి రాత్రి జైల్లో పెట్టేరు. మీరు ఉన్నపట్టున బయలుదేరి పోలీసు స్టేషన్‌కి రావాలి" అంటూ, పోలీస్ ఠాణా చిరునామా ఇచ్చేరు అట్నించి పిలచిన గొంతు.

నాకు మతి పోయింది. మూర్తి, సావిత్రి... వీళ్ళిద్దరూ కుర్ర కుంకలు. పైగా బుద్ధిమంతులూను. జైలుకి వెళ్ళవలసినంత అపచారం వీళ్ళేమి చేసి ఉంటారో నాకు అర్ధం కాలేదు. తల్లి దండ్రులని కూడానా?

మనస్సు పరి పరి విధాల పరుగెత్తుతూంది. కారెక్కి పరుగు పరుగున పోలీసు స్టేషన్‌కి వెళదామని డ్రైవరుని లేపి పోలీసు స్టేషన్ కి తీసికెళ్ళమన్నాను.

ఊరు తెల్లారకుండా పోలీసు ఠాణా అనే సరికి డ్రైవరు శాంసన్‌కి కుతూహలం పెరిగి ఎందుకని అడిగేడు. రెండ్రోజుల క్రితం పెళ్ళి చేసుకున్న పెళ్ళి కొడుకునీ, పెళ్ళి కొడుకు అప్పచెల్లెలునీ, వారి తల్లి దండ్రులనీ జైల్లో పెట్టేరని చెప్పేను.

"సార్! ఇది డౌరీ కేసులా ఉందే. ఒక్కరుదా వెళ్ళి ఏమీ చెయ్యలేరు. ఒక లాయరుని వెంట తీసికెళ్ళండి." శాంసన్ తమిళ క్రైస్తవుడైపోయేడు కాని, తెలుగువాడయి ఉంటే 'సిరికింజెప్పడు...' పద్యం చదివేసి ఉండేవాడు, నా హడావుడి చూసి.

నేను ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి స్థాణువులా నిలబడిపోయాను.

“సార్! కల్యాణం నాలుగు దినాలుదా అయింది. ఎల్లారు జైలులో పడ్డారంటిరి. పెళ్ళికొడుకు ఎన్.ఆర్.ఐ. దా? ఇది కట్నం కేసు! ఇండియాలో ఇప్పిడి ఒక బిజినెస్ మాదిరి అయిందిదా. ఆంధ్రాలో మరీ రొంబగా ఉందిదా. ఈ పెళ్ళి కేసులు పోలీసోళ్ళకి పండగేనండి. పెళ్ళి చేసుకున్నోళ్ళు బూడిదై పోతారు దా! పోలీసోళ్ళూ, లాయరోళ్ళూ బాగుపడుతున్నారండి. ఈ మధ్య గల్ఫ్ నుండి వచ్చి, ఇక్కడ అమ్మాయిని పెళ్ళిచేసుకుని, ఒక ముస్లిం కుర్రాడు దా జైల్లో పడ్డాడండి. అతని లాయరు దగ్గరకి తీసికెళతాను, వస్తురా?”

నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఆ మధ్య మన తెలుగబ్బాయే, 18 ఏళ్ళ వయస్సుకే డాక్టర్ అయేడని పత్రికల్లో ఒకటే రాసేరు. ఇండియా ఇండియా వెళ్ళి, పెళ్ళి చేసుకుని, కట్నం కేసులో చిక్కడి, సకుటుంబంగా జైల్లో పడి, నానా అవస్థలూ పడి, లాయర్లకీ, పోలీసులకీ ముడుపులు చెల్లించుకుని, అయిన పెళ్ళిని రద్దు చేయించుకుని, చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో బయట పడి, తిరిగి అమెరికా వచ్చేడు. తప్పెవరిదో తెలియదు కాని కుర్రాడికి మూడేళ్ళ ఆర్జన పోయింది. తట్టెడు ఖర్చు అయింది. వార్తాపత్రికలలో వారాల తరబడి రాసేరు. “మంచి పని అయింది. ఈ మగాళ్ళకి ఇప్పటికైనా బుద్ధి చెప్పాలి!” అని మా ఆవిడ సంతోషం ప్రకటించింది కూడా!

“వివాహం విడాకులతో అంతం అయిందిట. ఎవ్వరు ఏమి బావుఁకున్నారని ఆ సంతోషం? కేసు వివరాలు తెలియకుండా నువ్వలా తీర్మానించటం బాగు లేదు!” అన్నాను, కొంచెం ఉక్రోషంగా.

"వివరాలు తెలియక్కర లేదు. మీ మగాళ్ళు తరతరాలుగా చేస్తూన్న పనేగా. ఆ డాక్టరు కట్నం అడిగే ఉంటాడు. లేక పోతే ఆ అత్త కోడలిని కోడింటికం పెట్టేసి ఉంటుంది."

"చూడు. అమెరికాలో డాక్టర్ సంపాదన ముందు ఇండియాలో – అందులోనూ, మన బెమ్మిగాళ్ళు – ఇచ్చే కట్నం ఏపాటి? సముద్రంలో కాకిరెట్ట! కట్నం కోసం అల్లరి పెట్టేడంటే నేను నమ్మను."

"పోనీ, అత్తగారూ, మరదళ్ళూ సూటీ, పోటీ మాటలు అనేసి ఉంటారు! మన పిల్లలకైతే నేను అమెరికా సంబంధాలే చేస్తాను. తెల్లవాళ్ళయినా పరవాలేదు కాని, ఛస్తే నేను ఇండియా సంబంధానికి ఒప్పుకోను."

"పెళ్ళయి మూడ్రోజులు కాలేదు. సూటీ, పోటీ మాటలు అనటానికి అవకాశం రావాలి కదా! పెళ్ళన్న తరువాత రెండు భిన్నమైన మనస్తత్వాలు గల మనుష్యులు, రెండు భిన్నమైన వాతావరణంలో ఉన్న సంసారాలు కలసి, మెలసి మెలగటం నేర్చుకోవాలి. మన పెళ్ళయి ముప్ఫయ్ ఏళ్ళవుతోంది. అయినా మనం ప్రతిరోజూ వాదించుకోవటం లేదూ? కోర్టులకెక్కుతున్నామా? చీటికీ, మాటికీ అమెరికా సంబంధాలో అంటావు. నీకు ఈ తెల్లవాళ్ళంటే మోజు పోలేదు. వాళ్ళు మాత్రం విడాకులిచ్చుకు చావటం లేదూ?"

ఈ సంభాషణ చినికి, చినికి గాలివానవటం, మేమిద్దరమూ కొన్నాళ్ళ పాటు రివాజుగా మాట్లాడుకోవటం మానేసుకోవటమూ జరిగిపోయాయి. మా ఇళ్ళల్లో పట్టుదలలూ, పౌరుషాలూ ముందూ, ఆ తర్వాతే పిల్లల పుట్టుకానూ మరి! అవకాశం ఇస్తే చాలు ఆవిడ ఈ మగాళ్ళు ఆడవాళ్ళకి తరతరాలుగా చేసిన

అన్యాయాలు ఏకరవు పెడుతుంది. మా గిల్లీకజ్జాలు విడాకులవరకూ పోలేదనటానికి సాక్ష్యం నేను రోజూ తెల్లవారు ఝామున లేచి నా శ్రీమతి పిలుపుకి ఎదురు చూడటమే!

నేనిలా పాత జ్ఞాపకాల దొంతరలలో మునిగి తేలుతూ ఉంటే శేంసన్ బంజారా హిల్స్ లో ఒక మేడ ముందు ఆపి, నన్ను కారులో ఉండమని, లోపలికి వెళ్ళి, కొంత సేపయిన తరువాత తిరిగొచ్చేడు. నన్ను వెంటబెట్టుకుని లోపలికి వెళ్ళి రెడ్డి గారికి పరిచయం చేసేడు.

నాకూ, మూర్తికీ ఉన్న పరిచయం చెప్పి, ఆర్థిక స్థోమత లేని కుర్రాడు. ఇంకా జీవితంలో స్థిరపడలేదు. సహాయం చెయ్యకలరా అని అడిగేను – నా కారుని, డ్రైవరుని చూసి నాకు వడ్డించెస్తాడేమో అన్న భయంతో. రెడ్డి ఫోను తీసి పోలీస్ స్టేషన్‌ని పిలచి వాళ్లతో పది నిమిషాలు మాట్లాడేరు.

“గిది IPC 498A కేసు. కట్నం, గిట్నం, లాంచనాలు అంటూ అత్తింటొల్లని పరేషాన్ చేస్తున్నా, ఇంట్లగింట్ల ఏమైనా కిందమీదైనా, పిల్లగాన్ని, వాని అమ్మ అయ్యను ఈ సెక్షన్ కింద జైల్ల పెట్టోచ్చు. దీన్ని మన మహిళా సంఘాలన్ని పూర సపోర్టు చేస్తున్నయి.”

నాకు తెలంగాణ తెలుగుతో పరిచయం సున్న. రెడ్డి గారి భాష గభీమని అర్థం కాలా! ఆయన ఇంగ్లీషులో మాట్లాడినా బాగుండిపోను.

“మా మూర్తి కట్నం అక్కరలేదన్నాడే! అమ్మాయికి విమానం టికెట్టు కొని అమెరికా పంపిస్తే చాలన్నాడు. పెళ్ళయి రెండు రోజులు కూడా కాలేదు, ‘డొమెస్టిక్ వయలెన్స్’ కి అవకాశం ఏదీ? అసలా అబ్బాయి దగ్గర వయలిన్ తప్ప ఎప్పుడూ

వయలెన్స్ కనిపించలేదే!" మూడు నిద్రలయినా ముగియకుండా మూర్తి – అందులోనూ అత్తవారింట – కొత్త పెళ్ళాం మీద చెయ్యి చేసుకుంటాడంటే నేను నమ్మ లేదు.

"పెండ్లాన్ని కొట్టకర్లే! పెండ్లాన్ని గాని అత్తింటొల్లని గాని, తక్కువచేసి మాట్లాడినా సరే, దటీజ్ గ్రౌండ్స్ ఫర్ ఎ కంప్లైంట్. బిసైడ్స్, ఇన్ ఇండియా, దిస్ ఈజ్ ఎ నాన్ బైలబుల్ అఫెన్స్" (that is grounds for a complaint. Besides, in India, this is a non-bailable, non-compoundable, cognizable criminal offense) అన్నారు రెడ్డి.

నేను బిక్క మొహం వేసేను, ఆయన మాట అర్థం అయింది కాని భావం బొత్తిగా అర్థం కాలా!

"నాన్-బెయిలబుల్ కనుక గీ కేసులా బెయిలుండది. కోర్టులా జడ్జి ముందె జామీను కట్టి ఇడిపియ్యాల. శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసిన్రంటే యిగ సోమవారం పొద్దుగలవారకు యేమి జెయ్యడానికి గాదు. గీ మధ్య మన పోలీసోండ్లు గిట్లాంటి పనులల్లా బాగా వుషారైన్రు."

పెరీ మేసన్ పుస్తకాలు తప్ప కోర్టు వ్యవహారాలతో నాకు బొత్తిగా పరిచయం లేదు. "రుజువయేవరకూ నిందుతుడు నిర్దోషి కదా? కనీసం కోర్టులో ప్రాథమిక సాక్ష్యం ప్రవేశపెట్టి, నిందుతుడు కనీసం తప్పు చేసుండొచ్చు అనే విషయం అనుమానాస్పదంగా ఉందని నిరూపించాలి కదా?" అని భయపడుతూనే అన్నాను.

"గిది "కాగ్నిజబుల్ అఫెన్సు" (cognizable offense) బే! 'గీడు నన్ను లోల్లి పెట్టిందు' అని ఆడది గిన అంటే, ఎనకా ముందూ సూడకుండ బొక్కలేస్తరు మన పోలీసోళ్ళు. రుజువు, గిజువు, సాక్ష్యం, బీక్ష్యం ఏం అక్కర్లే!"

"మరి గయ్యాళి పెళ్ళాంతో బాధలు పడే మగాడికి కూడా ఈ రకం హక్కులు ఉన్నాయా?"

"లేవు. గిది డోళ్ళాకోసం స్పెషల్‌గా ఇచ్చిన చట్టం. జమానకెల్లి వాళ్ళాకు జరుగుతున్న అన్యాయానికి గిది ప్రతీకారం."

"ఇది న్యాయం కాదే! ఇది పక్కా బ్లేక్‌మెయిల్!" కొంచెం ఉక్రోషంగానే అన్నాను.

"గీ IPC 498A, గంత మంచిగ లేదు. దీనిలో గొంచెం మార్పులు తేవాలె అని సుప్రీం కోర్టు గూడ అంటున్నది. గీ చట్టాన్ని మార్చాలి! ఓట్ల కోసం, సీట్ల కోసం గింజుకులాడె మన రాజకీయనాయకులకు గంత ధైర్యమేది?" అన్నారు రెడ్డి గారు.

"ఇండియాలో నాయం ఎప్పుడో సచ్చిపోనాదండి. ప్రతోడికీ ఎదటోడు అన్నేయం చేసేసేడని ఒకటే దురద. కోస్తా వోళ్ళకో రూలు, ముల్కీ వోళ్ళకో రూలు. పెళ్ళిళ్ళు చేసుకున్నప్పుడు, ఆస్తులు పంచుకున్నప్పుడు ముస్లిమోళ్ళకో రూలు. మాకో రూలు, మీ హిందువులకో రూలు. ముస్లిమోళ్ళు మక్కా ఎల్లాలంటే మన గవర్నమెంటు టికెట్టు కొనిస్తారు. నాకు ఇవ్వరు." శాంసన్ తన గోడు తను చెప్పుకున్నాడు. శాంసన్ గల్ఫ్‌లో పని చేసి బాగా డబ్బు గణించి హైదరాబాదులో

ఇల్లు కట్టుకుని కాలక్షేపానికి డ్రైవరు పని చేసుకుంటున్నాడు. లోకం పోకడ బాగా తెలిసిన మనిషి.

"శాంసన్ చెప్పినది నిజం. ఏవరి మీదనొ గోపంతోని పెట్టిన చట్టాలు మిగిల్నయి. ప్రతోడు మరొకని మీదొడి ఏడ్సేటోడె. వాడి కులం వీడికి పడదాయె. వీడి మతం వాడికి నచ్చదు. వాని కోక చట్టం. వీని కోక చట్టం. వీనికి న్యాయమైతె వానికి నష్టం, వానికి న్యాయమైతె వీనికి నష్టం. మీకు తెలవందేమున్నది? గీ రిజర్వేషన్ల పేరిట సదువులల్ల, ఉద్యోగాల్లోపట గిది జరగతనే ఉన్నది గద. గిట్ల జెయ్యకపోతే ఓట్లు పడయి మరి. మన తాతల్నాటి కాలంల కన్యాశుల్కం! మరి గిప్పుడు వరకట్నం!...."

లాయరు గారు ఇలా చెప్పుకు పోతూ ఉంటే అసలు విషయం మరచిపోయే ప్రమాదం ఉందని ఆయనని తక్షణ కర్తవ్యం ఏమిటని అడిగేను.

"మీరు జేశెడిదేం లేదు. ఓ 50 లచ్చలు ఖర్చు పెడితే ఏమైనా పని గావచ్చు."

"ఏభై లక్షల రూపాయలంటే హండ్రెడ్ థౌజండ్ డాలర్లు! లాయరు ఖర్చులూ, కోర్టు ఖర్చులూనా? మూర్తిని బజారులో పెట్టి అమ్మేసినా అంత డబ్బు రాదు."

"గిది కోర్టు ఖర్చులు గాదు. పోలీసోల్లని మేపనీకి."

నేను బిక్క మొహం వేసేను – ఈ మారు తడారిపోయిన గొంతుకతో!

రెడ్డిగారు ఏవేవో తంటాలు పడి సాయంత్రానికి మూర్తి తల్లిదండ్రులని జైలు నుండి విడిపించేరు. "మావయ్య గారూ! నా పేస్‌పోర్టు వీళ్ళ కస్టడీలో పెడితే

నన్ను కూడా విడిపిస్తామంటున్నారు. ఇప్పుడు నా చదువేం కాను?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది, సావిత్రి.

సోమవారం కోర్టు తెరిచే వరకూ సావిత్రిని విడిపించటం కుదరలేదు. పోలీసుల చేతిలో సావిత్రి పేస్‌పోర్టు పడకుండా చూసేసరికి మా తాతలు దిగొచ్చేరు.

పాలిపోయిన ముఖంతో ఉన్న మూర్తిని జైల్లోనే వదిలేసి, కొంత కాకపోతే కొంతయినా సంఘటనలు అదుపులోకి వచ్చేయని సంతోషిస్తూ ఉంటే, "ఎందుకైన మంచిది, వాళ్ళ చెల్లెను ఇండియా కెల్లి జల్దిగ బయటకి పంపెయండ్రి, లేకుంటె గామెన్ని కష్టాలు పడల్సొస్తదో ఏమో" అని రెడ్డి గారి సలహా మీద మలేసియా వరకు టికెట్టు దొరికితే సావిత్రిని నిలబడ్డపాటుగా కోలాలంపూర్ పంపేసి, ఇంటికి వచ్చి నిద్రపోయేను – ఆ రాత్రికి.

తెల్లవారుఝామున నేను ఎదురు చూసే వేళకి టెలిఫోను మోగింది. నా శ్రీమతే పిలుస్తోందని టెలిఫోను తీసేను. "మూర్తి నాన్నగారు పోయారు! మీరు అర్జంటుగా రావాలి" మళ్ళా నిన్నటి గొంతు.

స్థాణువునై పోయాను. నోరు పెగలదీసుకుని "ఏమైందేమిటి?" అని అడిగేను.

"గుండె ఆగిపోయిందండి!"

శవం మీద పడి ఏడవటానికి కూతురైనా లేకుండా చేసేనే అన్న బాధతో రెడ్డి గారి ఇంటికి పరిగెత్తుకెళ్ళేను. తండ్రి తలకి కొరివి పెట్టటానికైనా మూర్తిని విడచిపెట్టమని పోలీసులని అడిగేము. వీలు లేదన్నారు. "కొడుకు అమెరికాలో

ఉంటే ఏమిచేసుండేవారు? ఇప్పుడూ అదే చెయ్యమనండి" అని పోలీసులు సలహా ఇచ్చేరు. ఈ లంపటంలోంచి మూర్తిని జామీను మీద విడిపించేసరికి పద్నాలుగు రోజులు పట్టింది. ముప్ఫయి వేలు ఖర్చు అయింది. మూర్తి పేస్‌పోర్టు పోలీసులు తమ అధీనంలో ఉంచేసుకున్నారు.

బెయిలు మీద ఇంటికొచ్చిన మూర్తిని ఎలా పరామర్శించాలో అర్థం కాలేదు. ఏ మాటంటే ఏ అర్థం స్ఫురిస్తుందో అని ఒక భయం.

"నువ్వు బయట పడ్డందుకు చాలా సంతోషం, పద ఇంటికి పోదాం" అన్నాను.

"జైల్లో పడ్డందుకు చాలా సంతోషంగా ఉంది. పదండి ముందుకి!"

చకితుణ్ణయాను!

"జైల్లో నేను కలిసిన మనుషులు, వారి అనుభవాలు నాకు ఒక కొత్త వెలుగుని చూపాయి."

"ఏమయిందయ్యా?"

"మొదట్లో నా జీవితం నాశనం అయిందనుకున్నాను. అమెరికాలో నా ఉద్యోగం పోయింది. ఈ దేశం విడచి వెళ్ళటానికి వీలు లేకుండా నా పేస్‌పోర్టు పోయింది. నాలా జీవితం నాశనమైన వాళ్ళు ఇంకా చాలా మంది జైళ్ళల్లో మగ్గుతున్నారని తెలిసిన తరువాత వాళ్ళు చేసిన మహాపాపం ఏమిటా అని శోధించటం మొదలుపెట్టేను."

"అది అలా ఉండనియ్యవోయ్! అసలు నీ మీద కేసు పెట్టటానికి నువ్వు చేసిన తప్పు ఏమిటిట?"

"ఈ కేసు విషయాలు ఎవ్వరితోటీ సంప్రదించటానికి వీలు లేదని నా లాయరు ఆంక్ష పెట్టేడు. కనుక కోర్టులో లావాదేవీలు పూర్తయేవరకు నేను సమాధానం చెప్పగలిగే పరిస్థితిలో లేను."

"పోనీ! ఆడపెళ్ళివారితో మాట్లాడి వస్తాను. ముల్లు వెళ్ళి అరిటాకు మీద పడ్డా, అరిటాకు వెళ్ళి ముల్లు మీద పడ్డా అరిటాకుకే కదా నష్టం అని నచ్చ చెప్పి చూస్తాను. కేసు విరమించుకోమని చెబుతాను. జరిగిందేదో మరిచిపోయి ఇద్దరూ అమెరికా వచ్చేసి సుఖంగా ఉండండి."

"లేదండి. ఇది non-cognizable offense అండి. ఈ కేసు కోర్టులో నమోదైన తరువాత అభియోగం చేసినవాళ్ళు మనస్సు మార్చుకుని వెనక్కి తీసుకోటానికి వీలు లేదుటండి. ఒక వేళ వీలున్నా నాకు జరిగిన అన్యాయం తరువాత నేను ఆ పిల్లతో కాపురం చెయ్యటమనేది కలలోని మాట!"

పోనీలే! ఇప్పుడు కర్తవ్యం ఏమిటి?"

"ఏమోనండి. అంతా అయోమయంగా ఉంది. ఈ కేసు ఇప్పట్లో తెమిలేటట్టు లేదు. ఇది నా ఒక్కడికీ వచ్చిన కష్టం కాదు. మన సమాజానికి పట్టిన చీడ. చట్టాలను దుర్వినియోగపరచి, స్వలోభాలకి పోయి, పరుల జీవితాలను చెడగొట్టి, వారి జీవితాలను ప్రశ్నార్థకాలుగా మార్చి ఆడుకునే ఆడవారు, వారి పుట్టింటివారు ....... స్త్రీవాదాన్ని సమర్థించిన నేను స్త్రీవాదమనే జ్వాలలో పడి చిమ్మెటలా ఆహుతి అయిపోయానండి."

"పోనీ, అప్పో, సొప్పో చేసి డబ్బు పట్టుకొచ్చి ఇస్తాను. ఆ లంచాలు మేపేసి బయటపడతావా? అమెరికా పోదాం!"

“లేదండి. ఇదేదో న్యాయస్థానంలో తేలాలి. ప్రేమ వేడిలో పడి పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళ సంగతేమో నాకు తెలియదు కానీ, పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు రాతకోతలు లేని వ్యాపార ఒప్పందాలలాంటివి. కనుక అపార్థాలు, మాట పట్టింపులు వస్తూ ఉంటాయి. లాంచనాలు సరిపోలేదని వాళ్ళో మాటంటే వీళ్ళో మాట అంటారు. తరువాత ‘బావ గారూ’ అంటే ‘వదిన గారూ’ అని వరసలు పెట్టుకుని పిలుచుకోనూ పిలుచుకుంటారు. అంతే కాని కక్షలు, కావేషాలు, కార్పణ్యాలు పెట్టుకుని జీవితాలనే కాల్చుకుంటారా? నేను చేసిన తప్పేమిటో న్యాయస్థానంలో తేలకుండానే నాకు శిక్ష పడిపోయింది! ఇహ కోర్టుకెళ్ళి సాధించేదేమిటంటారా? కనీసం నా ఆత్మగౌరవం నిలుపుకోవాలి. ఈ రకం అన్యాయం నాతో అంతరించాలి, మరెవ్వరికీ ఇలా జరగకూడదు.”

“- - - .” ఏమనాలో తెలియలేదు!

ఈ మధ్య వాషింగ్‌టన్‌లో జరిగిన తానా సభకి వెళ్ళేను. సభా ప్రాంగణంలోకి ప్రవేశిస్తూ ఉంటే ఎవ్వరో చేతికి ఒక కరపత్రం అందించేరు.

“రండి! సమాన హక్కుల కోసం పోరాడండి! భారతీయ సంసారాలలో అసమానతని తొలగించండి! 498A అనే తెర వెనుక దాగి భారతీయ సంసారాల్లో చిచ్చు పెడుతున్న తీవ్రవాదులని నిరసించండి!!”

తలెత్తి చూసేను.

సావిత్రి!!

పరిచయం చేసుకోవలసిన అవసరం లేని సావిత్రి! మహంకాళి సావిత్రి!

(ఈ కథలో నిజంగా జరిగిన సంఘటనలు ఎక్కువ, కల్పన తక్కువ. రచన, మార్చి, 2008, కథా పీఠం పురస్కారం అందుకున్న కథ. ఈ కథలో లాయర్ రెడ్డి మాట్లాడిన యాసలో రాయడానికి సహాయం చేసిన కుమార్ కలగరకి ధన్యవాదాలు.)

# కలిసిరాని కాలం

నవంబరు 26, 2008 న మా సుబ్బిగాడు ముంబై లోనే ఉన్నాడు! "అది కేవలం కాకతాళీయం" అంటాడు వాడు. నేను నమ్మను. ఈ సుబ్బారావు నాన్న నాకు చిన్నప్పటినుండీ తెలుసు. వాడు అమెరికా వచ్చి స్థిరపడి నలభై ఏళ్ళు దాటింది. ఈ నలభై ఏళ్ళల్లో వాడు మాత్ర దేశానికి రెండే రెండు సార్లు వెళ్ళేడు. మొదటిసారి వాడు వెళ్ళినప్పుడు ఇండియాకీ, పాకిస్తాన్‌కీ మధ్య బంగ్లాదేష్ యుద్ధం మొదలైంది. రెండవసారి వెళ్ళినప్పుడు ఇండియాకీ, పాకిస్తాన్‌కీ మధ్య కార్గిల్ యుద్ధం మొదలైంది – రెండూ వాడు ఇండియాలో ఉన్నప్పుడే మొదలయాయి. అందుకని వాడు అమెరికాలో ఉండటమే ప్రపంచ శాంతికి మంచిదని వాడిని అమెరికాలోనే నొక్కిపెట్టి వాడి ఇండియా వ్యవహారాలు నేనే చక్కబెడుతూ వస్తున్నాను. ఈ హడావిడిలో నేను చూసుకోకుండానే సుబ్బి గాడు పుట్టటం, ఎదగటం, కాలేజీకి వెళ్ళటం, వగైరాలన్నీ చకచకా జరిగిపోయేయి. ఇప్పుడు సుబ్బిగాడు టాటా ఇన్‌స్టిటూట్ లో ఏదో ప్రసంగం ఇవ్వటానికి ముంబై వెళ్ళాడుట. ఇప్పుడేమో ఈ ఉపద్రవం వచ్చి పడింది. వాడి నాన్న నన్ను ఫోనులో పిలచి వాడి పోలికలు వాడి కొడుకుకి కూడా వచ్చేసేయని లబో, దిబో మని మొత్తుకున్నాడు.

నూ యార్కు మహా నగరంలో ఉన్న కొలంబియా యూనివర్సిటీలో సోసియాలజీ, ఏంత్రొపోలజీ రంగాల్లో డాక్టరేట్ పట్టా కోసం సుబ్బడు ప్రయత్నం చేస్తూన్న రోజులవి. ఒత్తిడిగా ఉన్న పరిస్థితులలో మనుష్యులు నిర్ణయాలు ఎలా

తీసుకుంటారో అధ్యయనం చెయ్యాలని వాడి అభిలాష. ఈ రకం పరిస్థితులు మనం రోజూ ఎదుర్కుంటూనే ఉంటాం కదా. రెండు కాలేజీల్లో సీటు వస్తుంది, లేదా మూడు కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయి. ఏదో ఒకటి ఎన్నుకోవాలి. ఇటువంటి నిర్ణయాలకి సాధారణంగా వ్యవధి ఉంటుంది. కాని కొన్ని సందర్భాలలో మీనమేషాలు లెక్కపెట్టటానికీ, తర్జనభర్జనలకీ, సంప్రదింపులకీ వ్యవధి ఉండదు. పైపెచ్చు మనం చేసే నిర్ణయం మీద ఇతరుల జీవితాలు ఆధారపడి ఉండొచ్చు. అటువంటి సందర్భాలలో బాధ్యత గల అధికారులు నిర్ణయాలు ఎలా తీసుకుంటారో నేపథ్యంలో ఉండి, వారి చర్యలని, చేష్టలని గమనించి, వాటిని విశ్లేషించి పరిశోధనాత్మకమైన సిద్ధాంతవ్యాసం రూపొందించాలని వాడి అభిలాష.

ఉదాహరణకి వైద్యుడు శస్త్రచికిత్స చేస్తూ ఉండగా అనుకోని పరిస్థితి ఎదురవవచ్చు. వైద్యుడు నిమిషాలలో పరిస్థితిని అవగాహన చేసుకుని సరి అయిన నిర్ణయం చెయ్యాలి. లేకపోతే బల్ల మీద ఉన్న వ్యక్తికి ప్రాణ నష్టం కలగొచ్చు.

మరొక ఉదాహరణ. పెద్ద అగ్ని ప్రమాదం జరిగిందనుకుందాం. ఆ వార్త రాగానే అగ్నిమాపక దళాలు ఆదరబాదరాగా అక్కడకి పరిగెత్తుకుని వెళతారు. మంటలు ఉవ్వెత్తున లేచి భీకరంగా ఉంటాయి. ఆ మంటలకి కారణం తెలియకుండా వాటిని ఆర్పటానికి ప్రయత్నిస్తే మొదటికే మోసం రావచ్చు. మండే పదార్థాన్ని బట్టి దానిని ఆర్పటానికి వాడే అస్త్రం మారుతుంది. ఏ రకం మంటని ఎలా అదుపులోకి తీసుకురావాలో నిర్ణయించే బాధ్యత ఆ దళాధికారిది. ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకున్న వెంటనే, దళాధికారి నిమిషాల మీద ఈ నిర్ణయం

చెయ్యాలి. లేకపోతే ధన నష్టం, ప్రాణ నష్టం; రోజులు బాగు లేకపోతే, పరువు నష్టం!

సాధారణంగా ఇటువంటి నిర్ణయాలు చేసే శక్తి అనుభవం మీద వస్తుంది. ఆ వ్యక్తిని "మీరు నిర్ణయం ఎలా చేసేరు?" అని అడిగితే వారు చెప్పలేరు. అందుకని ఆ సందర్భంలో వారి ప్రవర్తనని మనవాడు నేపథ్యం నుండి గమనించి, అవసరం వెంబడి వారు కార్యకలాపాలలో ఉన్నప్పుడు వారికి ఫొటోలు, సినిమాలు తీసి, హడవిడి తగ్గిన తరువాత సావధానంగా వారితో ముఖాముఖీ మాట్లాడి ఆ నిర్ణయాల వెనక ఉన్న కిటుకు ఏమిటో కనిబెట్టాలని వాడి ఆశ, గమ్యమూను. ఈ రకం పరిశోధన "తర్కబద్ధ తీర్మాన వివేచన" అనే శీర్షిక కింద బలం పుంజుకుంటోంది కనుక నేను కూడా వాడు చేసే పనిని పరకాయిస్తూనే ఉన్నాను.

పోలీసులు, అగ్ని ప్రమాదాలని ఎదుర్కొనే దళాలు, వైద్య సిబ్బంది తరచుగా ఈ రకం ఉపద్రవాలని ఎదుర్కుంటూ ఉంటారు కనుక వారిలో ఒకరిని పరిశోధనకి ఎన్నుకోవాలని నిశ్చయించేడు, సుబ్బడు.

కొలంబియా విశ్వవిద్యాలయానికి చాల పెద్ద పేరే ఉంది. కనుక ఆ విద్యాలయం తరఫున నూ యార్కు నగరపు ముఖ్య వైద్యాధికారి ఉద్యోగ జీవితం ఒక నెల రోజులపాటు ఎలా ఉంటుందో చవి చూడటానికి అనుమతి ఇమ్మని ఆయనకి ఒక ఉత్తరం రాసేరు, సుబ్బడి గురువర్యులు. డాక్టర్ కెవిన్ కార్పెంటర్ ఒప్పుకున్నారు. మనవాడు చేసేదల్లా నీడలా ఆయనని వెన్నంటి తిరగటం. పుస్తకంలో విషయ సంగ్రహం రాసుకోవటం. వారిని ఎవ్వరినీ ప్రశ్నలడిగి వేధించకుండా, వారి పనులకి అడ్డు రాకుండా, వారి కాళ్ళల్లో పడకుండా

మనవాడు మెలగాలిట. అలా ఒప్పుకుంటే వారు సుబ్బుడుని ఆంతరంగికమైన సమావేశాలలోకి కూడ రానిస్తారుట. అదీ ఒప్పందం.

మనవాడు పనిలో బద్ధకిష్టి కాదు. కలుపుగోలు మనిషేమో, త్వరలోనే పనిలో ఒడుపులు తెలుసుకుని తలలో నాలుకలా మెలగటం నేర్చుకున్నాడు.

ఆ రోజు సెప్టెంబరు 11, 2001. ఉదయం ఎనిమిదయేసరికల్లా ఠంచనుగా ఫస్ట్ ఎవెన్యు మీద ఉన్న 520 నంబరు భవనం ముందుకి చేరుకున్నాడు. బయట కాలాతీతమైన వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. అది ఆకురాలు కాలం. వేసవి ఎండలు, ఉక్క పోతలు పాత జ్ఞాపకాలు అయిపోతూన్న రోజులు అవి. చలి, మంచు మొదలవటానికి ఇంకా రెండు నెలల వ్యవధి ఉంది. ఆకాశాన్ని అంటే అంబరచుంబితాల మధ్య నుండి మబ్బులు లేని నీలాకాశం నిర్మలంగా కనిపిస్తోంది. అక్కడ నుండి ఉదయభానుడి వెచ్చటి కిరణాలు కోలాహలంగా వీధులలో తిరుగుతూన్న పురజనులతో దోబూచులాడుతున్నాయి. ఆహ్లాదకరంగా ఉన్న ఇటువంటి భలే మంచి రోజుని బయట వదిలేసి కూపాల్లా ఉన్న ఆఫీసు గదులలోకి వెళ్ళటానికి మనస్కరించటం లేదా అన్నట్లు ప్రజలు ఇంకా బయటే తచ్చాదుతున్నారు.

భవనం లోపల ఆ రోజు డాక్టర్ కార్పెంటర్ చాల హడావిడిగా ఉన్నారు. నూ యార్కు నగరానికి మొట్టమొదటి వైద్యాధికారి అయిన డాక్టర్ చారెల్స్ నోరిస్ అరవయ్యవ వర్ధంతి ఆ రోజు. దానికి తోడు "బయోహేజర్డ్స్" మీద శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు ఆ రోజు. "బయోహేజర్డ్స్" అంటే మానవుడి ఆరోగ్యానికీ, శ్రేయస్సుకి ప్రమాదం కలిగించే సూక్ష్మజీవుల వల్ల కలిగే ప్రమాదాలు. ఇలాంటి

ప్రమాదాలకి కారణాలు చాలా ఉండొచ్చు. “గాలి ద్వారా వ్యాపించే రోగకారకులని అదుపులో పెట్టటం ఎలా?" అన్న విషయం మీద ఆ శిక్షణ శిబిరం దృష్టిని కేంద్రీకరించింది. అమెరికా శత్రువులు అమెరికా మీద దెబ్బ తియ్యటానికి గాలిలోనో, నీటిలోనో సూక్ష్మజీవులని ప్రవేశపెడతారేమోనన్న భయం ఆ రోజులలో మెండుగా ఉండటమే ఈ ప్రయత్నానికి ప్రేరణ కారణం.

పై రెండు పనులతో డా. కార్పెంటర్ రెండు చేతులూ నిండుగా ఉన్నాయి. ఈ రెండూ చాలనట్లు, ఆ మధ్యనే, నూ యార్కు నగరానికి చెందిన పోలీసు ఒకడు, డూటీలో లేని సమయంలో తప్ప తాగేసి, తను నడుపుతూన్న కారుని రోడ్డు పక్క నడుస్తూన్న ఒక కుటుంబం మీదకి తోలేసేడేమో ముగ్గురు చచ్చిపోయేరు. ఈ వార్త పతాక శీర్షిక అయి డిపార్టుమెంటు వారికి తలవంపు సమస్య అయి కూర్చుంది. ఇంతటితో సరిపోయిందా? క్షతగాత్రులలో ఒకామె గర్భవతి కావటం, ఆమెకి వైద్య సౌకర్యాలు వెనువెంటనే సమకూర్చినా గర్భస్థ శిశువు చచ్చిపోవటంతో పరిస్థితి విషమించింది. పొట్టని కోసి పిల్లని బయటకి తీసేసరికి పిల్ల చచ్చిపోయి ఉంది కనుక, "పిల్ల గర్భంలోనే చచ్చిపోయింది" అని మరణానికి కారణం రాసేసేరు డాక్టర్ కార్పెంటర్. కారు ప్రమాదం కారణంగా పిల్ల చచ్చిపోయి ఉంటే ఆ పోలీసు మీద ఖూనీ కేసు పెట్టొచ్చు. పిల్ల చావూ, కారు ప్రమాదమూ కేవలం కాకతాళీయం అయితే ఖూనీ కేసుకి అవకాశం లేదు. ఈ సూక్ష్మం గ్రహించిన నూ యార్కు నగరపు "డిస్ట్రిక్ట్ ఎటర్నీ" (ప్రభుత్వం తరపున వాదించే వకీలు) డాక్టర్ కార్పెంటర్ యొక్క నిజాయతీని అభిశంసించేడు. ఈ నేపధ్యంలో ఆ రోజు తన్యతాభరితంగా, బరువుగా, మొదలయింది. జీవితం అన్న

తరువాత ఎగుడు దిగుళ్ళు సహజమే కదా అనుకుంటూ డాక్టర్ కార్పెంటర్ ఆ రోజు కార్యక్రమాలు మొదలు పెట్టేరు.

ఇంతలో, ఆదిలోనే హంసపాదులా, టెలిఫోను మోగింది. విమాన ప్రమాదం జరిగిందిట. ఏదో విమానం, మూడు మైళ్ళు దూరంలో ఉన్న, వరల్డ్ ట్రేడ్ సెంటర్ లో ఉన్న జంట బురుజులో ఒక దానిని గుద్దేసిందిట.

నూ యార్కు మహా నగరానికి ఇటువంటి ప్రమాదాలు కొత్తేమీ కాదు. 1945 లో మిలటరీ విమానం ఒకటి, పొగమంచులో దారి కనిపించక, ఎంపైర్ స్టేట్ బిల్డింగుని గుద్దేసింది. పదముగ్గురు చచ్చిపోయేరు, మరొక ఇరవైఆరుగురికి దెబ్బలు తగిలేయి. అంబరచుంబితాలతో కిటకిటలాడే నూ యార్కు నగరంలో ఇటువంటి ప్రమాదాలు జరగటానికి సావకాశాలు ఉన్నాయి కనుక ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక దళాలు, పోలీసు దళాలతో పాటు వైద్య బృందాలు కూడ అత్యవసరం. వైద్య బృందంలో ప్రథమ చికిత్స, శస్త్ర చికిత్స చేసే వారు ఎంత ముఖ్యమో మరణ విచారణాధికారులు కూడ అంతే ముఖ్యం. క్షతగాత్రులని బ్రతికించటం ఒక ఎత్తయితే చచ్చిపోయిన వారు ఏ కారణం వల్ల చచ్చిపోయేరో నిర్ణయించటం మరొక ఎత్తు. అందుకని ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరం సహాయం ఎలా అందించాలో అని నూ యార్కు మహానగరం అలా పూర్వప్రయోగాలు (రిహర్సల్) చేసుకుంటూనే ఉంటుంది. కనుక విమాన ప్రమాదం అనగానే డాక్టర్ కార్పెంటరూ, ఆయన అనుయాయులు కొందరూ హుటాహుటి ప్రమాదం జరిగిన స్థలానికి బయలుదేరటానికి సన్నద్ధులు అవుతున్నారు. ఇటువంటి సందర్భాలలో మొట్టమొదట చెయ్య వలసిన పని

మృతదేహాలని భద్రపరచటానికి కావలసిన సంచులు, వగైరా హంగులు సమకూర్చుకోవటం. ఈ ప్రయత్నాలు ఇలా జరుగుతూనే ఉన్నాయి. ఇంతలో పిడుగులా మరొక వార్త వచ్చి పడింది. వరల్డ్ ట్రేడ్ సెంటర్ దక్షిణపు బురుజుని మరొక విమానం ఢీకొందిట.

మొదటి వార్త రాగానే అదేదో యాదృచ్చికంగా జరిగిన ప్రమాదం అనుకున్నారు. రెండవ వార్త వచ్చిన తరువాత ఇదేదో తీవ్రవాదుల చర్య అని స్పష్టం అయిపోయింది. ఇలా వాయు పథం మీద విమానాలతో దాడి అంటే ప్రాణ నష్టం విపరీతంగా ఉండొచ్చు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట బురుజులలో ఏ రోజయినా కనీసం ఏభై వేల మంది ఉద్యోగస్తులు పని చేస్తూ ఉంటారు. వారితో పనిమీద వచ్చేవారినీ, సందర్శకులనీ కూడా కలుపుకుంటే లక్ష మంది సునాయాసంగా ఉంటారు. ఊహకి అందనంత పని ఎదట కనిపించింది డాక్టర్ కెవిన్ కార్పెంటర్ కి.

వైద్య బృందం ప్రమాదం జరిగిన చోటుకి కార్లలో బయలుదేరింది. దారి పొడుక్కీ ఎక్కడ చూసినా పోలీసు కార్లు, అగ్నిమాపక దళాల సైరన్లు, జనసందోహంతో తొడతొక్కిడిగా ఉంది. తొడతొక్కిడి కాస్తా కొద్దిసేపట్లో దిగ్బంధంగా రూపాంతరం చెందింది. వాహనాల ప్రవాహం స్తంభించిపోయింది. వాహనాలు ముందుకి కదిలే ప్రసక్తి లేదని వాటిని అక్కడే ఆపి, కాలి నడకని మిగిలిన దూరం వెళ్ళేరు. ప్రమాదస్థలం సమీపిస్తూన్న కొద్దీ అది ప్రమాదమా, నరకమా అన్నట్లు ఉంది. రెండు బురుజుల నుండీ అగ్ని శిఖలు ఉవ్వెత్తున ఎగురుతూ ఉంటే వాటి నుండి చిమ్ముకొచ్చే నల్లటి, చిక్కటి పొగతో ఉదయం

చూసిన నీలాకాశం కాస్తా నల్లటి దుప్పటితో కప్పినట్లు మారిపోయింది. ఈ నల్లటి ఆకాశపు నేపథ్యంలో వర్ణించటానికి కూడా లొంగని భీకర దృశ్యం ఒకటి తారసపడింది: బురుజుల మంటలలో చిక్కుకున్న ప్రజలు కొందరు, మార్గాంతరం లేక, తండోప తండాలుగా, వెయ్యి అడుగుల ఎత్తు నుంచి కిందకి దూకెస్తున్నారు. వడగళ్ళు రాలి నట్లు ఆకాశం నుండి మనుష్యులు రాలి, కిందనున్న కాంక్రీటు చపటాల మీద చిమ్మెటలలా పడుతూ ఉంటే డాక్టర్ కార్పెంటర్ చెయ్యగలిగేది ఏదీ లేక నిర్లిప్తతో నిశ్చేష్టుడై స్థాణువులా అలా ఉండిపోయేరు.

తిమ్మిరెక్కినట్లు ఉన్న జ్ఞానేంద్రియాలతో ఉన్న శరీరానికి ఆ దృశ్యం ఇంకా పూర్తిగా ఒంటబట్టకుండానే, అకస్మాత్తుగా, గం. 9:59 ని. కి ఎదురుగా ఉన్న దక్షిణపు బురుజు కళ్ళ ఎదుట కూలి పోయింది. దానితో ఉవ్వెత్తున లేచిన ప్రభంజనం ప్రేక్షకులని ఊపేసిందేమో అందరూ ఒక్క సారి కెవ్వున కేక వేసేరు. కేవలం పది సెకెండ్ల వ్యవధిలో 1368 అడుగులు ఎత్తు ఉన్న ఆ సౌధం కూలిపోయి, దృక్పథం నుండి శాశ్వతంగా మాయం అయిపోయింది. ఈ భీకర దృశ్యం ఇంకా పూర్తిగా ఆకళింపుకి రానేలేదు, ఇంతలో, గం. 10:28 ని. లకి ఉత్తరపు భవనం ఫెళఫెళారావంతో నేల కూలి మట్టి కరిచింది. ఈ బీభత్సంలో డాక్టర్ కార్పెంటర్ బృందంలో ఉన్న వారికి చాల మందికి దెబ్బలు తగిలేయి. డాక్టర్ కార్పెంటర్‌కి కూడ చేతి మీద చర్మం చీరుకు పోతే ఆయనే దానికి కుట్లు వేసుకుని కట్టు కట్టుకున్నారు. ఈ బీభత్సం అయి సాయంత్రం ఆఫీసుకి చేరేసరికి ఆయన శరీరం అంతా, జేబుల నిండా, సన్నని, సున్నితమైన మెత్తటి ధూళి, నుసితో కప్పబడి ఉంది. ఈ మహా ప్రళయంలో కాంక్రీటే చూర్ణం అయి, నుసి

అయిపోతే మానవ శరీరాలు ఏపాటి? ప్రాణం పోయిన శరీరాన్ని పరీక్షించి మరణం ఏ కారణం వల్ల కలిగిందో నిర్ధారించటం ఆయన ఉద్యోగ ధర్మం. పరీక్షించటానికి శరీరమే మిగలకుండా చూర్ణం అయిపోతే ఈ ధర్మాన్ని నిర్వర్తించటం ఎలా?

## 2

ఆ రాత్రి అంతా దుర్ఘటనల వల్ల సంభవించే పరిస్థితులని అదుపులో పెట్టటానికి ప్రత్యేకం తరిఫీదు పొందిన బృందం పని చేస్తూనే ఉంది. తెల్లారింది. అభాసు జరిగి ఇరవై నాలుగు గంటలు అయిపోయింది. హడ్సన్ నది దిగువన బల్లకట్టు వంటి పడవ ఒకటి లంగరు వేసుకుని ఉంది. ఆ బల్లకట్టు పడవ మీద మంచు ముక్కల సంచులు వరసగా పేర్చి ఉన్నాయి. శిధిలాలలో దొరికిన మానవ శరీర భాగాలని భద్రపరచటానికి ఆ మంచు ముక్కల సంచులు! మధ్యాహ్నం అయేసరికి మరణవిచారణాధికారి కచేరీకి ఎదురుగా శిశిరోపచారానికి (రెఫ్రిజిరేషన్ కి) వీలైన ట్రక్కులు బారులు తీర్చి నిలుచున్నాయి. కళేబరాలని భద్రపరచటానికి ఈ శిశిరోపచార వాహనాలు! పదకొండు వేల శవాలని భద్రపరచటానికి సరిపడా సంచులు పట్టుకొచ్చేరు ఈ వాహనాలతో!

ప్రమాదం జరిగిన ప్రదేశం నుండి శరీరభాగాలనీ, శవాలనీ వెనువెంటనే తీసి శుభ్రపరచకపోతే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం. కాని తొందరపాటు కూడ కూడదు. అదే కుప్పలో ఈ మారణహోమానికి కారకులైన నేరస్తుల శరీరభాగాలు కూడా ఉన్నాయి. వాటిని విడదీసి, పరీక్షించి నేరస్తులెవ్వరో కనుక్కోవాలి కదా!

అందుకని 1.6 మిలియను టన్నుల శిధిలాలనీ, అవశేషాలనీ ఊరు బయటకి తరలించి, వాటిని చేత్తో జల్లించి, రాళ్ళనుండి ఎముకలనీ, శరీర భాగాలనీ విడదీసి, ఎఫ్. బి. ఐ. వారి పర్యవేక్షణలో పరీక్షించటానికి నిర్ణయం జరిగింది. గడ్డిమేటులో పడ్డ – ఒకటి కాదు, ఎన్నో – సూదుల ముక్కలని వెతికి, ఏ ముక్క ఏ సూదికి సంబంధించిందో నిర్ణయించటం లాంటి పని అన్నమాట ఇది!

ఈ మారణహోమానికి ఆహుతి అయిన మనుష్యులు ఎవరు ఎవరో కనుక్కోవటం ఎలా? ప్రభుత్వోద్యోగులయితే వారి వేలిముద్రలు ఎక్కడొ కచేరీలలో నమోదు చెయ్యబడి ఉంటాయి. కాలి, బూడిద అయిపోకుండా ఉన్న వేలు దొరికితే దాని నుండి ముద్రని గ్రహించి, నమోదయిన ముద్రలతో సరిపోల్చవచ్చు. మరొక పద్ధతి దంతాలని ఉపయోగించి ఎవరెవరో నిర్ణయించటం. శరీరంలో అన్ని భాగాలూ కాలి బూడిద అయిపోయినా, సర్వ సాధారణంగా దంతాలు, దవడ ఎముకలు భస్మం కావు. కనుక బుగ్గిలో దొరికిన దంతాలని దంతవైద్యుల చిట్టాలలో ఉన్న ఎక్స్–రే పటాలతో పోల్చి వ్యక్తి నిర్ధారణ చెయ్యవచ్చు. కాని ఇది సాధారణమైన సంఘటన కాదుగా. విమానాలని నడపటానికి వాడే ఇంధనం మండినప్పుడు 1,500 ఫా. డిగ్రీలు వేడి పుడుతుంది. ఆ వేడికి సాధారణంగా శరీరం పూర్తిగా కాలి భస్మం అయిపోతుంది. ఈ వేడితోపాటు భవనాల్లో ఉన్న సరంజామా కూడా మండటంతో ఉష్ణోగ్రత 2,000 డిగ్రీల వరకు వెళ్ళి, ఉక్కు, కాంక్రీటుతో కట్టిన భవనమే కాలి మసి అయిపోయింది. అందులో శరీరపు అవశేషాలు ఎక్కడ దొరుకుతాయి?

ఈ క్లిష్టమైన పరిస్థితిలో డాక్టర్ కార్పెంటర్ భుజాల మీద పడ్డ భాధ్యత ఇంతా అంతా కాదు. ఒక పక్క బంధుమిత్రులనో, తల్లిదండ్రులనో, కన్న బిడ్డలనో పోగొట్టుకున్న కుటుంబాలు – కనీసం ఆఖరి చూపుకని - హాహాకారాలతో అలమటిస్తూ ఉండగా, మరొక పక్కనుండి ఈ దౌర్జన్యానికి కారకులెవ్వరో వారి ఆచూకీ తియ్యవలసిన ఉద్యోగ బాధ్యత ఆయనది.

విమానం ఎక్కిన ప్రయాణీకుల జాబితాలు, బోస్టన్ విమానాశ్రయంలో నిరంతరం ప్రయాణీకుల కదలికలని నమోదు చేసే ఛాయాచిత్రాలు పరిశీలించగా ఈ విధ్వంసానికి కారకులైన దుండగీడుల జాడ కొంతవరకూ దొరికింది. ఈ జాడతో వారు బస చేసిన హొటేలు గదులు గాలించి, వారు వదలేసిన బట్టలు, దువ్వెనలు, మొదలైనవి సేకరించ గలిగితే జన్యు పదార్థ (డి. ఎన్. ఎ.) విశ్లేషణ పద్ధతులతో వీరి ఆచూకీ లాగ వచ్చు.

ఇలా అన్ని కోణాలనుండి పత్తేదారీ పరిశోధన జరుతూ ఉండగా వేలిముద్రలు, బూడిద అయిపోకుండా మిగిలిన దవడ ఎముకలు, దంతాలు మీద ఆధారపడే కంటె జన్యు పదార్థపు విశ్లేషణ (డి. ఎన్. ఎ. ఎనాలిసిస్) మీద ఆధారపడటమే సర్వదా శ్రేయస్కరమని అని తేలింది.

అలాగని ఈ డి. ఎన్. ఎ. పద్దతి కూడ నల్లేరు మీద బండి నడక కాదు. డి. ఎన్. ఎ. విశ్లేషణకి అనుకూలమైన మచ్చులు – కల్తీ కానివి, కాలిపోనివి, కుళ్ళిపోనివి అయిన కణజాలాల మచ్చులు, కావలసిన ప్రమాణంలో – దొరకటం దుర్లభం అయిపోయింది. ఈ పరిస్థితులలో అంతవరకు ప్రాచుర్యంలో ఉన్న పద్దతులు అక్కరకు రాకుండా పోయేయి. సరికొత్త పద్ధతులు కావలసి వచ్చేయి.

అపరాధ పరిశోధనలో డి. ఎన్. ఎ. ని ఒక అస్త్రంలా వాడటంలో ఎఫ్. బి. ఐ. వారిది అందెవేసిన చెయ్యి. కనుక వారి సహాయం పట్టణపు ఆధిపత్యానికి ఎంతైనా అవసరం. కాని ప్రమాదం జరిగినది పురపాలక ప్రభుత్వం వారి అజమాయిషీ లో ఉన్న ప్రాంతం. కనుక వీరి అనుమతి వారికి కావాలి. అంధపంగ న్యాయంలా ఒకరికొకరు సహాయం చేసుకుంటే ఉభయత్రా శ్రేయస్కరం. కానీ వీళ్ళూ చీమూ, నెత్తురూ ఉన్న మనుష్యులే! వాళ్ళూ చీమూ, నెత్తురూ ఉన్న వాళ్ళే! పౌరుషాలు ముందు పుట్టేయి, తరువాత ప్రజానీకం పుట్టింది.

వేలి ముద్రలు, దంతాల ఎక్సు-రేలు, డి. ఎన్. ఎ. – ఈ మూడు పద్ధతులలో ఉన్న కష్టనష్టాలని ఇంకా బేరీజు వేసుకుంటూనే ఉన్నారు, ఇంతలో రామాయణంలో పిడకల వేటలా మన సుబ్బడి దృష్టి మరొక సమశ్య మీద పడ్డాది.

మరణవిచారణాధికారి ప్రథమ కర్తవ్యం – ఈ సందర్భంలో – చనిపోయినవారి గోత్రనామాలు స్థిరీకరించి, వారి వారసులకి మరణపు పత్రం ("డెత్ సర్టిఫికేట్") ఇవ్వటం. ఈ ధృవీకరణ పత్ర ప్రదానం చేసేముందు ఆ వ్యక్తి నిజంగా చచ్చిపోయినట్లు రుజువు కావాలి కదా. ఈ రుజువు కోసం, ఆ ధృవీకరణ పత్రం కోసం ఇంత తతంగం ఉందన్న మాట!

ప్రత్యక్ష సాక్ష్యం కనిపిస్తూ ఉండగా ఇంకా రుజువు ఎందుకని మన బోంట్లకి అనిపించవచ్చు. కాని, ఉదాహరణకి, ఈ కాగితం ముక్క జీవిత బీమా కంపెనీలకి అత్యవసరం. డబ్బు విషయానికి వచ్చేసరికి మానవ నైజం మీద జీవిత బీమా కంపెనీలకి నమ్మకం లేదు. పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నా, వారసులు ఎంత దుఃఖసాగరంలో ఉన్నా పట్టాదారు మరణించిన తరువాత ఆ

మరణానికి రుజువు కావాలని అడుగుతారు. మరణవిచారణాధికారి ఇచ్చిన మరణ ధృవీకరణ పత్రం ఇక్కడ రామబాణంలా పనిచేస్తుంది.

దేశం అంతా దుఃఖసాగరంలో ఉన్న తరుణంలోకూడ ఆ సమయాన్ని సొంత లాభానికి వాడుకుని నాలుగు రాళ్ళు సంపాదించాలనే దురాశాపరులూ, నీచులు అన్ని చోట్లా ఉంటారు. దేశం అందరితోపాటు జార్జియాలో సింథియా, ఆమె భర్త ఏలన్ టెలివిషన్ మీద ఈ సంఘటన చూసేరు. ప్రపంచం అంతటికీ ఇది హృదయవిదారకమైన దారుణంలా కనిపిస్తే, ఈ జంటకి ఇది ఒక వ్యాపారానికి మంచి తరుణంలా అనిపించింది. సమయం మించిపోతే అవకాశం చెయ్యి జారిపోతుందేమోనని వెంటనే జీవిత బీమా కంపెనీకి తన భార్య అయిన సింథియా సెప్టెంబర్ 11 ఉదయం తొమ్మిది గంటలకి వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఉన్న కేంటర్ ఫిట్జెరల్డ్ వారి కంపెనీలో ఉద్యోగం కోసం ఇంటర్‌వ్యూకి వెళ్ళిందనిన్నీ, ఆమె ఈ ప్రమాదంలో చచ్చిపోయిందనిన్నీ, నష్టపరిహారంగా అర్ధ మిలియన్ డాలర్లు చెల్లించమనిన్నీ అర్జీ దాఖలు చేసుకున్నాడు.

కేంటర్ ఫిట్జెరల్డ్ కంపెనీ పేరు సమయానుకూలంగా వాడుకున్నాడు, దురాశాపరుడైన ఏలన్. ఈ కంపెనీకి చెందిన సిబ్బంది, 658 మంది, ఈ ప్రమాదంలో మరణించేరు. అంతే కాదు ఆ కంపెనీ తాలూకు నమోదు దస్తరాలు (రికార్డులు) అన్నీ అగ్నికి ఆహుతి అయిపోయాయనిన్నీ, వాటికి నకళ్ళు కూడా ఎక్కడా లేవనిన్నీ వార్తా విలేకరులు పదేపదే చెబుతున్నారాయె! కనుక సింథియా ఈ ప్రమాదంలో చచ్చిపోయిందో లేదో నిర్ధారించి చెప్పటం దరిదాపు అసంభవం. అని ఏలన్ లెక్క కట్టుకున్నాడు.

ఇలాటి ఆటలు బీమా కంపెనీల దగ్గర ఆడటం అంటే తాతకి దగ్గులు నేర్పినట్లే. బీమా కంపెనీ వారు జార్జియా వార్తా పత్రికలన్నీ తిరగేసి చూసేరు. సింథియా మరణించినట్లు కాని, అంతిమ సంస్కారాలు జరగటానికి శరీరం లేకపోయినా కనీసం వార్తాపత్రికలలో "ఫలానా వ్యక్తి ఈ సంఘటనలో మరణించింది" అని కాని, ఆమె చర్చిలో ఆమె మనశ్శాంతికి పూజలు, సంతాప సభలూ జరిగిన దాఖలాలు కానీ ఏవీ కనిపించలేదు. బీమా కంపెనీ వారి అనుమానం పెనుభూతం అయింది. వారు జార్జియా రాష్ట్రపు పోలీసులకి ఫోను చేసి ఈ విషయం దర్యాప్తు చెయ్యమని అర్థించేరు. వారు ఏ పత్తేదారుడితో మాట్లాడేరో అతనికి సింథియా, ఆమె భర్త ఏలన్ పరిచయస్తులు కావటం కేవలం కాకతాళీయం! సింథియాని ఆ ఉదయమే షాపింగు సెంటర్‌లో చూసినట్లు ఆ పత్తేదారు భరోసా ఇవ్వటంతో ఆ కేసు నిమిషాల మీద పరిష్కారం అయిపోయింది. సింథియా, ఏలన్ శ్రీకృష్ణ జన్మస్థానాన్ని ఒకసారి కళ్ళారా చూసి ధన్యులయేరు.

## 3

పంచతంత్రం కథని పిట్టకథలు పక్కదారి పట్టించినట్లు సుబ్బారావు సొంతపని పెడదారి పడుతోందని వాడి గురువుగారికి అనుమానం వచ్చింది. ఎదో నెల్లాళ్ళపాటు "దత్తాంశ సేకరణ" అనే పని మీద గడుపుదామనుకున్న సుబ్బారావు ఈ జంఝూటనలో పడి ఏడాదైపోయింది. పట్టా పుచ్చుకుందుకి కావలసిన సరంజామా సేకరించటానికే మనవాడు ఈ కార్యక్రమానికి పూనుకున్నాడు కాని, పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ పత్తేదారీ వ్యవహారంలో తల

దూర్చటానికి వీడికి తాహతేదీ? పైగా ఎఫ్. బి. ఐ. వారికి, నూ యార్కు పురపాలక సంఘం వారికి మధ్య ఈ డి. ఎన్. ఎ. విశ్లేషణ సందర్భంలో జరిగే కీచులాటలో రాజకీయాల పాలు ఎక్కువగా కనిపించేయి గురువుగారి కంటికి. ఈ గొడవలు సామరస్యంగా తేలే లోపల పట్టా పుచ్చుకోవటమే అతని మొదటి పురుషార్ధం అని సుబ్బారావు గురువుగారు బోధ చేసి వీడిని వెనక్కి రప్పించేసేరు. రప్పించి "టెర్రరిజం" నేపథ్యంగా తీసుకుని వాడి పరిశోధనని పూర్తి చెయ్యమని ప్రోత్సహించేరు. ఆ తరువాత రాబోయే రెండు పురుషార్ధాలు కూడ దృష్టిలో పెట్టుకుని, కార్పెంటరు గారి కష్టాలని కార్పెంటరు గారికే వదిలేసి, మనవాడు పి. హెచ్. డి. పట్టా సంపాదించుకున్నాడు.

## 4

మన సుబ్బడు ఇండియాలో ఉంటే ఏ ఇంకా ఏ ముప్పు ఎలా ముంచుకొస్తుందోనని మేము ఇలా కంగారు పడుతూనే ఉన్నాము, వాడు అంతలోనే వెనక్కి వచ్చేసేడు. నూ యార్కులో 9/11 సంఘటననీ, ముంబై లో 11/26 దుర్ఘటననీ కళ్ళారా చూసినది ఈ ప్రపంచంలో ఒకే ఒక వ్యక్తి! ఆ వ్యక్తి మన సుబ్బయ్య! పైపెచ్చు ఇలాటి దురాగతాలు జరిగినప్పుడు పోలీసులు, అగ్నిమాపక దళాలు, వైద్య సిబ్బంది ఏ విధంగా ప్రవర్తించాలో వాడికి తెలిసినట్లు మరెంతోమందికి తెలియదంటే అది అతిశయోక్తి కాదు. సొంత ప్రాణాలని కూడ లెక్క చేయకుండా, ప్రభుత్వ పరిపాలనా పరిధికి బయట ఉంటూ, జిహాద్ నినాదాలతో భయానక చర్యలు జరిపే ఉగ్రవాదుల ప్రవర్తనని అర్ధం చేసుకోవటంలో వాడికి కొమ్ములు తిరిగిపోయేయి. అందుకని, ఈ సమయంలో,

ప్రభుత్వాధికారుల దగ్గరా, పాత్రికేయుల దగ్గరా – అమెరికాలో – వాడి గిరాకీ బాగా పెరిగిపోయింది. ఈ సందర్భంలో వాడు పరిశోధన చేసి కనుక్కున్న విషయాలని నలుగురితో పంచుకుందామన్న ఉద్దేశం తోటే వాడు టాటా ఇన్స్టిటూట్ లో పరిశోధన పత్రం చదవటానికి ముంబై వెళ్ళేడుట. దురదృష్టం కాక మరేమిటి? అమెరికాకి నూ యార్కు ఎలాంటిదో ఇండియాకి ముంబై అలాంటిదే కనుక అమెరికాలో 9/11 నాడు జరిగిన దుర్ఘటన లాంటిదే ముంబై లో కూడ జరగటానికి అవకాశాలు ఉన్నాయని వాడు సోదాహరణంగా వివరిస్తూ రాసిన పరిశోధనా పత్రం నవంబరు 26 ఉదయమే వాడు తాజ్‌మహల్ హొటేల్‌కి ఎదురుగానే ఉన్న టాటా ఇన్స్టిటూట్ వారి భవనంలో విజ్ఞుల ఎదుట ప్రసంగించేడుట. ఆ పత్రం నకలు ఒకటి నాకు ఇచ్చేడు, చదవమని.

“ముంబైకీ నూ యార్కుకీ మధ్య నైసర్గిక స్వరూపాలలోనూ, రాజకీయ వాతావరణాలలోనూ తేడాలున్నాయి. అమెరికాలా కాకుండా ఇండియాకి శత్రు దేశాలు పొరుగునే ఉండటం ఒక పెద్ద తేడా. పాకిస్తాన్‌లో ప్రభుత్వానికి దేశం లేదు, ఆఫ్ఘనిస్తాన్లో దేశానికి ప్రభుత్వం లేదు. ప్రపంచం అంతటా ఇస్లాం మూల సూత్రంగా పరివ్యాప్తి చెందాలన్న పాకులాట ఈ రెండు దేశాలలోనూ ప్రబలి ఉండటం ఈ ప్రాంతాలలో శాంతిభద్రతలకి వెన్నుపోటు అయి కూర్చుంది. ముంబై మీదకే కాదు, ప్రపంచంలో రాజ్యాలన్నిటి మీదకి, వీరు పదే పదే దండెత్తి – ఇస్లాం వ్యాప్తి కొరకు – ఆత్మాహుతి చెయ్యటానికి సిద్ధంగా ఉన్నారు. ఎంత బలిష్టమైన కోట గోడైనా పదే పదే బాదితే బీటలు వారినట్లు, ఏ దేశమైనా బాదగా బాదగా లొంగి తీరుతుందన్నది వీరి నమ్మకం. అందుకనే మహమ్మద్ ఘజినీ

అంటే వీరికి అంత గురి! ఈ వాతావరణంలో భారత దేశం మీదకి పదే పదే దాడులు జరిగే ప్రమాదం ఉంది. ముంబై వంటి కోస్తా నగరాల మీదకి జల మార్గాల ద్వారా దాడి జరిగే ప్రమాదం మరింతగా ఉంది," అని వాడు చిత్రీకరించేడు – ఆ పత్రంలో.

ఈ రకం విశ్లేషణ చెయ్యటానికి గూఢ సమాచారల మీద ఆధారపడక్కర లేదంటాడు. వాడి పరిశోధన అంతా అందరికీ సులభంగా అందుబాటులో ఉండే అంతర్జాలం లోకి గూగుల్ గేలం వేసి, గాలించి, సేకరించి, విశ్లేషించినదే! వాడు చేసినదల్లా ఈ గూగుల్ గేలానికి దొరికిన "చుక్కలని కలిపి" బొమ్మలా చిత్రించటమే! పాకిస్తాన్ ప్రత్యక్షంగా తన వేలు పెట్టకుండా, పరోక్షంగా తన తరఫున ప్రతినిధులని ఉపయోగించి, ఎంత సునాయాసంగా ఇండియా మీదకి దాడి చెయ్యగలదో వాడు బొమ్మలు, మేపులు, ఫొటోలు ఉపయోగించి వర్ణించి చూపించేడు – ఆ పత్రంలో.

"నీ ప్రసంగం అయిన తరువాత ఏమిటయింది?" ఉండబట్టలేక అడిగేను.

"ఏమీ అవ లేదు. అంతా ఒక సారి చప్పట్లు కొట్టేరు."

"అటుపైన ఎవ్వరైనా ప్రశ్నలు వెయ్యటం కాని, ప్రత్యేకమైన సంప్రదింపులకి ఆహ్వానించటం కాని జరిగిందా?"

"అందుకు అవకాశమే రాలేదు. అందరి దృష్టి ఇంగ్లండు–ఇండియా క్రికెట్ మేచ్ మీదే ఉన్నట్లుంది. ప్రసంగం తరువాత వచ్చిన టీ విరామంలో అంతా క్రికెట్ కబుర్లే చెప్పుకున్నారు!"

(ఈ కథలో నిజంగా జరిగిన సంఘటనల పాలు ఎక్కువ, కల్పన తక్కువ. రచన లో ప్రచురించబడింది కాని తేదీ అలభ్యం. అమెరికా తెలుగు కథానిక, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, పదకొండవ సంకలనం, 2010)

# గాలిదోషం

## 1

"గాలిలో ఎగురుతూన్నట్లు ఎప్పుడైనా కలగన్నావా?" మిడతంభొట్లు మేష్టారు భార్యని అడిగేరు.

"ఉహుఁ" అని పరాగ్గా సమాధానం. కారం పెట్టి కూర వండడానికి గుత్తి వంకాయలు తరుగుతూన్న రాధకి, భర్త వేసిన చొప్పదంటు ప్రశ్నకి, అంతకంటె విపులంగా సమాధానం చెప్పవలసిన అవసరం కనిపించలేదు.

"అది కాదు, రాధా! ప్రతి వాడు గాలిలో ఎగరాలని కలలు కంటాడు. విమానంలో కూర్చుని ఎగరడం మాట కాదు నేను చెప్పేది. నిజంగా లఘుయానం. అనగా అమాంతం గాలిలోకి తేలిపోగలగడం గురించి నేను చెబుతూంట. లియనార్డో డ వించీ రోజులనుండి ఈ రకం ఆలోచనలు మానవుడి మస్తిష్కంలో మెరుస్తూనే ఉన్నాయి," అని విశదీకరించేరు ప్రొఫెసర్ మిడతంభొట్లు.

మిడతంభొట్లు అసలు పేరు చాలమందికి తెలియదు. 'చెంబు గారు', 'గొట్టం గాడు' లా ఆంధ్రదేశంలో చెలామణీ అవుతున్న గౌరవనామాలలో ఇదొకటి.

"ఇంటికొచ్చింది మొదలు ఒకటే గొడవ. పోయి పత్రిక చదువుకుందురూ," తరిగిన వంకాయలు నీళ్లల్లో పడేస్తూ విసుక్కుంది రాధ.

అంత సులభంగా వదలిపెట్టే రకం అయితే మిడతంభొట్లు అంత చిన్న వయస్సులో ప్రొఫెసరు అయేవాడా? ఆంధ్రదేశంలో ఎక్కడో లెక్చరరు గానో, రీడరు గానో రాటవుతూ ఉండేవాడు. మిడతంభొట్లు ఇంట గెలిచిన తర్వాతే రచ్చ గెలిచేడు.

"గాలిలో తేలిపోవడం అంటే ఏమిటనుకున్నావు? రెక్కలు లేకుండా, యంత్ర సహాయం లేకుండా, ఇంద్రజాలం చెయ్యకుండా ఎప్పుడైనా గాలిలో తేలిపోయావా? అలా "చల్లగాలిలో...మెల్లమెల్లగా...తేలిపోదాం, పదరా" అని పాడుకుంటూ గాలిలోకి తేలిపోవాలన్న కోరికైనా పుట్టలేదా నీకు?"

"లేకేమి. పెళ్లి కాకపూర్వం సముద్రపుటొడ్డుకి షికారుకెళ్లి, భవిష్యత్తుని తలుచుకుంటూ, అలా..., అలా...ఊహాలోకంలో తేలిపోతూ చీకూ చింతా లేకుండా గాలి మేడలు కట్టుకుని ప్రయాణం చేస్తూ ఉంటే, గుదిబండలా మిమ్మల్ని నా మెడకేసి కట్టేసి నా ప్రయాణాలని భూస్థాపితం చేసేసేరు మా పెద్దవాళ్లు" అంటూ రాధ కత్తిపీట దగ్గరనుండి లేచింది.

రాధ మాటలలోని వెటకారం మేష్టారు గమనించకపోలేదు. ఏ పెళ్లాం ఏ మగవాడిని ఇంతకంటె గౌరవంగా చూసిందని, రాధ తన మాటలు లెక్క చెయ్యలేదని బాధ పడడానికి? చేతిలో ఉన్న పత్రికని నేలకేసి కొట్టేరు మిడతంభొట్లు మేష్టారు.

"అది కాదండీ. ఎగురుతూన్నట్లు నేనూ కలలు కన్నాను. కల కల్ల అవుతుంది కాని నిజం ఎలా అవుతుంది? ఒక సారి మంతా వారి మేడ మీదున్న బట్టల దండెం మీదకి వెళ్లి వాలినట్లు కల వచ్చింది. ఎవ్వరేనా చూస్తున్నారేమోనని

నేను సిగ్గుతో చచ్చిపోయాననుకొండి. అదేమిటో శరీరం అంతా దూది పింజలా అయిపోయి గాలిలో అలా అలా తేలుతూ వెళ్లిపోయాను.

"చూశావా! చూశావా! ఇలాంటి కల రావడానికి కారణం ఏమై ఉంటుందా అని ఎప్పుడైనా ఆలోచించేవా?" దొరికిన సదవకాశాన్ని దుర్వినియోగం చెయ్యదలుచుకోలేదు మిడతంభొట్లు. "రాధా, కల అంటే ఏమిటో తెలుసా? మనం నిద్ర పోతూన్నప్పుడు మన మెదడులోని నాడీమండలానికి ఒక అవ్యక్తమైన ప్రేరేపణ జరిగిందనుకుందాం. ఈ ప్రేరేపణ లిప్త మాత్రపు కాలంలో, సుషుప్తావస్తలో ఉన్న మన మనోవీధిలో సందర్భోచితమైన ఒక దృశ్యాన్ని సృష్టిస్తుందిట. అది కల రూపంలో మనకి సాక్షాత్కరిస్తుందిట."

తన ఎడమ చెయ్యి మేష్టారి నుదిటి మీద ఉంచి, "ఏమిటో మీ వరస నాకు బొత్తిగా అర్థం అవడం లేదు. మీ మేష్టర్లు అంతా ఆ చింత చెట్టు కింద కూర్చుని చదరంగం ఆడతారాయిను. ఒళ్లు వెచ్చగా లేదే. గాలి దోషమో ఏమిటో. సిద్ధాంతి గారిని పిలిపిస్తాను. ఆయన ఒక సారి వచ్చి చూసి పోతే నాకూ కొంచెం స్థిమితంగా ఉంటుంది." పీటలు వాల్చి, కంచాలు పెడుతూన్న రాధ నిజంగానే ఆరాట పడుతోందో, వెటకారం చేస్తోందో మేష్టారికి అర్థం కాలేదు.

"గోమూత్రం, నిమ్మకాయ రసం, రుద్రజడాకు పసరు కలిపి దానిని తేనెతో రంగరించి పుచ్చుకోమన్నావు కాదు. ఇంకా నయం. మా నాన్నగారు దగ్గరుంటే, నీ మాటలు నమ్మి లేఖసిస్ 200 మూడు మాత్రలు వేసేసి తన హొమోపతీ మందు తడాఖా చూపించేసేవారు. ఒకసారి ఏమి జరిగిందో చెబితే నువ్వు నమ్మవు."

"నమ్మకపోయినా నమ్మకపోవచ్చు. నేను ఒద్దంటే మాత్రం మీరు చెప్పడం మానుతారా ఏమైనానా."

"మెడ్రాసులో ఒకసారి భౌతిక శాస్త్ర పండితుల సదస్సు అయితే వేళ్లేను. దాశప్రకాష్ హొటేల్లో బస..."

"నాతో పొలం పని మీద పెంటకోట వెళుతున్నానని చెప్పి, నాకు తెలియకుండా మెడ్రాసు వెళ్లేరా? బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. గాలిదోషం పట్టిందంటే పట్టదూ?"

"ఆగు, రాధా, ఆగు! పెంటకోటలో సముద్రం ఉంది తప్ప పొలాలు లేవు. మన పొలాలు పొలమూరులో ఉన్నాయి. కనుక ఆ విషయం అటుంచి నేను చెప్పే విషయం కడితేరా విను. ఆఁ, ఎక్కడున్నాం? ఆఁ దాశప్రకాష్ హొటేలు. అకస్మాత్తుగా హొటేలుకి నిప్పంటుకుంది. పెద్ద గందరగోళం. అంతా పరుగులు, పెడ బొబ్బలు పెడుతున్నారు. అందరూ తప్పించుకుని పారిపోయినట్లున్నారు. నేనొక్కడినే గదిలో బందీనయిపోయాను. గదిలో పొగ కమ్ముకు పోతున్నాది. ఏ తలుపు తీద్దామన్నా తెరుచుకోదు. వేడికి అనుకుంటాను, అన్ని తలుపులూ బిగుసుకుపోయాయి. నాకు చెమటలు పోసేస్తున్నాయి."

"అదేమిటండీ. ఇన్నాళ్లూ నాకు ఎందుకు చెప్పలేదు?"

"చెప్పనీ, రాధా. చెమటలు పోసెస్తున్నాయని కదూ చెప్పేను? నా ఆర్తనాదం ఎవ్వరూ వినిపించుకున్నట్లు లేదు. ఈ లోగా అగ్నిమాపక దళాలు గణ గణ గంట వాయించుకుంటూ వస్తూన్న శబ్దం వినిపించింది.

అమ్మయ్య, ఎవ్వరో ఒక్కరు రక్షించకపోరు అని ధైర్యం వచ్చింది. రాను రాను గంటల శబ్దానికి చెవులు గింగుర్లెత్తిపోతున్నాయి. మంచం పక్కన ఉన్న అలారం గడియారం ధ్వనిలో ఆ గంటల ధ్వని కలిసిపోయింది. మెలుకువ వచ్చేసింది." చేతులు కంచంలో కడుక్కుంటూ కథనం పూర్తి చేసేరు.

"నమ్మబుల్ గానే ఉందని నేనంటే మీరు నమ్ముతారా?"

"వెటకారం చెయ్యకు, రాధా. ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏమిటో నీకు తెలుసా? కనీసం పది నిమిషాల పాటైనా ఈ కల కని ఉంటానని నా అనుమానం. పది నిమిషాలు కాకపోయినా, ఆ మంటలు, ఆ ఆత్రుత, ఆ కంగారులో పది నిమిషాలు దొర్లినట్లు అనిపించింది. ఆ కల ఆఖరు క్షణాలలో కదా అగ్నిమాపక దళాల వారు గంట మోగించుకుంటూ రావడం జరిగింది? అదే సమయంలో అలారం గడియారం కూడ గంట కొట్టడం మొదలెట్టిందంటే ఆశ్చర్యంగా లేదూ?"

"అవునుస్మండీ!"

"అసలు అలారం ఎప్పుడు కొడుతుందో కలకి తెలియదు కదా. నిజానికి గడియారం చప్పుడు చేసే వరకు మనం గాఢ నిద్రలోనే ఉంటాం. నిజమైన గాఢనిద్రలో కలలు రావు. అలారం గంట కొట్టిన ఉత్తర క్షణంలో ముందస్తుగా గాఢ నిద్ర మామూలు నిద్రగా మారుతుంది. ఈ మామూలు నిద్రలోనే మనం కలలు కంటాం. ఇంకా గడియారం గోల పెడుతున్నాది కనుక మరొక లిప్త మాత్రపు కాలంలో మనకి మెలుకువ వచ్చెస్తుంది. కనుక మన గడియారం గంట కొట్టడం మొదలు పెట్టిన తరువాత, మెలుకువ రాడానికి ముందు ఉన్న లిప్త

మాత్రపు కాలంలో నేను మెద్రాసు వెళ్లినట్లు, హోటేలుకి నిప్పంటుకున్నట్లు ఒక కథ అల్లి అకస్మాత్తుగా వచ్చిన అలారం చప్పుడుకి ఒక అర్థం కల్పించిందన్నమాట, మన మెదడు." పక్క మీద నడ్డివాల్చి, చదువుకుందుకని ఒక పుస్తకం పట్టుకుని కథ ముగించేరు మిడతంభొట్లు.

దంతధావనం పూర్తి చేసుకుని, కాఫీ కుంపటి దగ్గర పీట మీద కూర్చుని కాఫీ తాగుతూ, “అద్గది! అర్థం అయింది. వాతప్లవనం! దీనినే ఇంగ్లీషులో లెవిటేషన్ అంటారు. స్వతహాగా నీళ్లల్లో మునిగిపోయే మానవుడు శవాసనం వేసి తేలడం లేదూ? అలాగే ఈ భూమి చుట్టూ ఉండే వాతావరణం అనే ‘గాలి సముద్రం’ అడుగున ఉన్న మానవుడు గాలిలోకి ఎందుకు తేలకూడదు? ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా మనిషి నీటిలో తేలినట్లే గాలిలో తేలడం అనేది జరగొచ్చు కదా. ఇది సాధ్యమేనా? పద్మపాదాచార్యులవారు నీటిలో తేలిపోతూ నడిచేరని చరిత్ర చెబుతోందే. ఆయన పాదాలకి అడుగున పద్మాలు మొలిచేయనిన్నీ, అందుచేతనే ఆయన నీటిలో మునిగిపోకుండా తేలేరనిన్నీ...”

మేష్టారి వాలకం చూసి రాధ కంగారు పడుతూ ఉంటే ఆయన అదేమీ పట్టించుకోకుండా...

“...రాధా, రాత్రి నిద్ర నుండి లేచేసరికి మిద్దె మీద నుండి కిందనున్న మంచం మీదకి పడుతూన్నట్లు అనిపించింది. అసలు రాత్రల్లా వాయుయానం చేస్తూన్నట్లే అనిపించింది. కలో? నిజమో? వైష్ణవ మాయో? లేక కలే నిజమయిందో? అంతా అయోమయంగా ఉందనుకో. ప్రతి క్షణం క్షుణ్ణంగా వర్ణించి చెప్పగలను. చల్లటి గాలి వీస్తోంది. ఆకాశం నిండా శ్రావణ మేఘాలు దట్టంగా అలుముకుని ఉన్నాయి. నేనేమో గాలి కెరటాలలో తేలుతూ, నారదులవారిలా ప్రయాణం చేస్తూ, చుట్టూ చూద్దును కదా! అది కల కాదు. పచ్చి నిజం. ఇంటి కప్పుకున్న వాసాలు చేతికి తగిలేయి. మంచం కోళ్లు ఎదిగిపోయేయో

ఏమో అని కంగారు పడుతూ పరుపుని చేతులతో తడిమి చూసేను. వీపు కింద పరుపు లేదు. అసలు నేను మంచం మీద లేనేలేను. నా వీపుకీ, మంచం మీదున్న పరుపుకీ మధ్య కనీసం పదడుగుల జాగా ఉంది. పక్కకి ఒత్తిగిల్లి చూసేను. ఒక్క కండరం శ్రమించకుండా, ఇచ్ఛామాత్రంగా ఒత్తిగిల్ల గలిగేను. ఒక్కసారి నా గుండె గుభేలు మంది. వెంటనే పదడుగుల ఎత్తు నుండి కిందనున్న పరుపు మీదకి దుబ్బుమని పడ్డాను."

"బావుంది, మీ వరస. మీ ఆటలు ఇక నా దగ్గర సాగవు. ఇంతసేపూ నేనొక వెర్రిమాలోకంలా మీరు చెప్పిన మాటలన్నీ కళ్లప్పగించి, చెవులింతింత చేసుకుని వింటున్నాను. ఇహ వేళాకోళాలు కట్టిపెట్టండి. మీరు కథల పోటీకి కథ రాస్తున్నారు. మీకు తట్టిన ఊహలని నా మీద ప్రయోగించి చూస్తున్నారు. అవునా?"

"రాధా, ఇదేమీ కాకమ్మ కథ కాదు. కథల పోటీ కథ అంతకంటె కాదు."

"కాకపోతే ఏమిటండీ! నేనూ కలలు కన్నాను. ఒక సారి కలలో ఉప కల. ఎంత గాభరా పడ్డానో మీకేం తెలుసు. అలాగని ఊళ్లో వాళ్లందరిని కంగారు పెట్టేసేనా?"

"జరిగింది మాత్రం నిజం. నమ్ము. నమ్మకపో."

"ఫిజిక్సు మేష్టారూ, మనం ఈ భూమి మీద ఉన్నాం. ఈ భూమికి ఆకర్షణ శక్తి ఉందని మీకు నేను చెప్పక్కరలేదు. కనుక గాలిలో అమాంతం అలా తేలిపోవడం అసంభవం. ఇప్పటికేనా మీ సోది ఆపండి. ఎవ్వరైనా వింటే వెర్రో, పిచ్చో అనుకుంటారు."

“ఆహాహా! ఇప్పుడొచ్చిన చిక్కల్లా అక్కడే. నాకూ నమ్మాలని లేదు. మరొక సందర్భంలో అయితే నేనూ నమ్మేవాడిని కాను. కాని నమ్మవలసిన అవసరం వచ్చింది. నా యీ అనుభవానికి శాస్త్రసమ్మతమైన విపులీకరణ ఏదైనా పుస్తకాలలో ఉంటుందేమోనని యూనివర్శిటీ లోని గ్రంథాలయానికి వెళ్లి వెతికేను. కింద అరలలో ఉన్న పుస్తకాలన్నీ వెతికి, పై అరలలో ఉన్న పుస్తకాలు కూడ చూద్దామని ఒక్క సారి లేచి నిలబడ్డాను. అంతే ఒక్క సారి కళ్లు చీకట్లు కమ్మేయి. కూర్చున్న మనిషి గభీమని లేచి నిలబడితే కళ్లు చీకట్లు కమ్మడంలో వింతేమీ లేదు. కాని కళ్లు విప్పి చూద్దును కదా. మాయాబజారులో ఘటోత్కచుడిలా పైకి తేలిపోయేను. కావలసిన పుస్తకం కళ్ళకి ఎదురుగా ఉంది కాని, కాళ్లు నేలకి ఆనుకుని లేవు. ఏదో పైత్యం చేసిందని....”

“అమ్మా! ఈ రోజు సప్తమీ బుధవారం. మృగశిర ఘడియలు సాయంకాలం నాలుగు గంటల వరకు. అమ్మా! రాధమ్మా! ఏమిటి? బాబుగారికి అస్వస్థతగా ఉందని కబురు పెట్టేవు.” అంటూ అవధాని గారు లోపలికి రానే వచ్చారు. వస్తూనే దేవుడి గదిలోకి వెళ్లి, నేల మీద యంత్రం వేసి, “ఓం, హ్రీం, హ్రూం” అంటూ మంత్రాలు చదవడం మొదలుపెట్టేరు.

“మీ అందరికీ మతులు పోయి ఉండాలి. ఇంత బతుకూ బతికి ఇంటెనక్కాల చచ్చినట్లు, భౌతిక శాస్త్రం అవుపోశన పట్టేసిన నేను భూతాలన్నా, దయ్యాలన్నా, చెడుపూ, చిల్లంగీ అన్నా నమ్ముతానా?”

మిడతంభొట్లు మేష్టారి గొడవ పట్టించుకునే ధ్యాసలో లేరు అవధాని గారు.

"...గోవిందా, విష్ణవే, మధుసూదనా, ... అమ్మాయీ! మన చిరంజీవి జాతకం ఇలా పట్రా అమ్మా... వామనాయనమః, శ్రీధరా, హృషీకేశా...జపాకుసుమ సంకాశం, కాశ్యపేయం, మహాద్యుతిం,.. హ్రూం, హ్రీం, దుర్..." అంటూ అవధాని మంత్రాలు చదువుతూ, పూజాసామగ్రి కావాలని ఆదేశాలు అదే గుక్కలో ఇస్తూ, మధ్యలో ఒక గాఠి పొడుం పట్టు లాగించేరు.

"దీనినే మనవాళ్లు అష్టావధానం అంటారు కాబోలు" అని అవధాని గారిని ఎగతాళి చెయ్యబోతే రాధ రుసరుసలాడుతూ ఆయనని వారించింది.

"పంచమాధిపతి అయిన రవి తృతీయ షష్టాధిపతి అయిన బుద్ధుణ్ణి వక్ర దృష్టితో చూడడం వల్లనూ, శతృ స్థానమందు చంద్రుడుండి గురునిచే చూడబడుట చేతనున్నూ, జాతకుడి మనో చలనానికి..."

ధామ్మని తలుపు చేసిన చప్పుడు చందాన్ని బట్టి మిడతంభొట్లు కోపంతో బయటకు నిష్క్రమించేరని సూక్ష్మగ్రాహి అయిన ఆయన సహధర్మచారిణి అర్థం చేసుకుంది.

## 3

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ భౌతిక శాస్త్ర సమ్మేళనం జరగబోతూందన్న వార్త చెవిని పడేసరికికల్లా మిడతంభొట్లు మనస్సు ఎగిరి గంతేసింది. ఈ మహదవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని ఎంతో ఆరాటంతో సమావేశం కార్యదర్శి సుదర్శనం గారి దర్శనం చేసుకున్నాడు

మిడతంభొట్లు. ఊపిరి తిరగని పనులతో సతమతమవుతూ, ఒక చెవితో సుదర్శనం మిడతంభొట్లు కథనాన్ని విన్నారు. విని,

"మేష్టారూ! సమావేశపు ఆఖరు రోజున అతిథులందరి గౌరవార్ధం వినోద కార్యక్రమం ఉంటుంది. ఆ వ్యవహారం అంతా చిదంబరం గారు చూస్తున్నారు. కదంబ కార్యక్రమంలో తప్పకుండ మీకు అవకాశం ఇస్తారు. వెళ్లి నేను చెప్పేనని చెప్పండి," అని చెప్పి ఆయనని యుక్తియుక్తంగా అక్కడనుండి పంపించేసేరు.

మిడతంభొట్లు అహం దెబ్బ తింది. తను బొడ్డూడని వాడా? సుదర్శనం గారి మాటలలోని వ్యంగ్యాన్ని, శ్లేషని అర్థం చేసుకో లేడా? కాని, "ఈ దూషణ, భూషణ తిరస్కారాలు ఈ శరీరమునకే కాని ఆత్మకి చెందనేరవు అని సమర్ధించుకుని, కార్యశూరుడు కావడం వల్ల తక్షణ కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తూ సుదర్శనం సమక్షం నుండి తప్పుకున్నాడు.

## 4

సాయం సమయం. నేపథ్యంలో నీలిరంగు యవనికలా కనిపిస్తూన్న సముద్రం మీద నుండి చల్లని గాలి వీచుతోంది. రోజంతా భౌతిక శాస్త్రపు లోతుపాతులని శల్య పరీక్ష చేసి అతలాకుతలం అయిపోయిన అంతర్జాతీయ నిష్ణాతులందరూ సేద తీర్చుకునే నిమిత్తం బయట ఉన్న పచ్చిక బీడులో సమావేశం అయేరు. విజ్ఞాన పిపాస పూర్తిగా తీరని వాళ్లు పానీయాలని చప్పరిస్తూనే తీవ్రంగా చర్చలు కొనసాగిస్తున్నారు. విదేశాలనుండి వచ్చిన అతిథుల సత్కారానికి గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ మూడు రోజుల పాటు విశ్వవిద్యాలయపు సరిహద్దులలో మాత్రం చలామణీ అయే విధంగా మద్యనిషేధపు

చట్టాన్ని కొద్దిగా సడలించేరేమో పిపాస తీరని పుర ప్రముఖులు కొందరు ఆహూతుల మధ్యలో కలిసిపోయి అప్పనంగా దొరికిన అమృతాన్ని అవుపోశన పట్టెస్తున్నారు. గంట సేపే కాక్‌టెయిల్ పార్టీ. అటు తరువాత విందు భోజనం. ఆపైన కదంబ కార్యక్రమం.

అల్లంత దూరంలో రష్యా నుండి వచ్చిన పిసరెంకో గారు, జెర్మనీ నుండి తరలి వెళ్లి అమెరికాలో స్థిరపడిపోయిన ఎబర్‌హార్ట్ గారు అయిస్టయిన్ ప్రతిపాదించిన సాధారణ గురుత్వాకర్షణ సిద్ధాంతం మీద లొబఛెవ్‌స్కీ క్షేత్రగణిత ప్రభావం ఏమిటా అని తీవ్రంగా చర్చిస్తున్నారు.

"హల్లో ప్రొఫెసర్ ఎబర్‌హార్ట్! జ్డ్రాస్త్‌వీతి ఎకడమీషియన్ పిసరెంకో! అని పొల్లు పోని ఇంగ్లీషు, రష్యన్ భాషలలో ఇద్దరిని పలకరించి, వారిరువురి సంభాషణలలో ఉత్సాహం చూపిస్తూ మాట కలిపేరు మిడతంభొట్లు.

తెల్లవాడు మెచ్చుకుంటే కాని సాటి నల్లవాడి మెప్పు పొందడం దరిదాపుగా అసంభవం అని మిడతంభొట్లు పచ్చి అనుభవం మీద తెలుసుకున్న నగ్న సత్యం. భోజన కార్యక్రమాలు మొదలయేలోగానే తన గోడు పెద్దవాళ్ల చెవిన పడేయాలన్న ఉత్కంఠతో తహతహలాడుతున్న మిడతంభొట్లుకి ఈ సదవకాశాన్ని విడుచుకోవడంలో ఏమంత విజ్ఞత కనిపించలేదు. అందుకని గురుత్వాకర్షణ సిద్ధాంతం మీద జరుగుతూన్న చర్చని, నాస్తి గురుత్వం, బరువు, భారం మొదలైన విషయాల మీదకి నేర్పుగా మళ్లించేడు మిడతంభొట్లు. మళ్లించి తన అనుభవాలని వాళ్ల చెవిలో ఊదేశాడు.

మిడతంభొట్లు గుక్క తిప్పుకోకుండా చెప్పిన కథనాన్ని ఊపిరి బిగపట్టుకుని విన్నారు అతిథులిద్దరూ. రెండు నిమిషాల పాటు ఒక రకం బరువైన నిశ్శబ్దం వాతావరణంలోకి దిగింది.

"మీ మాటలు వింటూ ఉంటే ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు అయింది" అన్నారు రష్యన్ భాషలో సామెతలు చెప్పడంలో దిట్ట అయిన పిసరెంకో.

"మీ అనుభవాలు మేము కూడ పంచుకోడానికి వీలవుతుందా? లేక యోగంలోలా ఎవరి అనుభవాలు వారివేనా?" అని ఎబర్‌హార్ట్ వంత పలికేరు.

మిడతంభొట్లు గుప్తంగా పంట్లాము జేబులో దాచి పెట్టిన వీశ రాళ్లని తీసి బయట పడేశారు. మేష్టారి వాలకం అర్థం కాక పిసరెంకో, ఎబర్‌హార్ట్ కళ్లప్పగించి చూస్తున్నారు. మిడతంభొట్లు రెండడుగులు వెనక్కి వేసి, ఆ పక్కన ఉన్న ఒక చెట్టు కొమ్మ దగ్గరకి వెళ్లి, కొమ్మ కొసన ఉన్న ఒక కాయని అందుకుంటున్నట్లు కాళ్లని సాగదీశారు. అమాతం గాలిలోకి తేలిపోతూన్న మిడతంభొట్లుని చూసి అతిథులిద్దరూ నిశ్చేష్టులై, నిర్విణ్ణులై, మాటా మంతీ లేకుండా ఒక నిమిషం పాటు అలా ఉండిపోయేరు. మిడతంభొట్లు మేష్టారు నేలకి పదడుగులు పైకి లేచిపోయి, చిటారు కొమ్మ చివర అలా ఒక నిమిషం పాటు శ్రమించకుండా నిలబడి ఉండగలిగేరు. తరువాత నెమ్మదిగా నేలమట్టం మీదకి వచ్చేరు.

ఎబర్‌హార్ట్ గతంలో భారతదేశం వచ్చినప్పుడు మోళీ కట్టడం చూసేరు. రాబోయే కదంబ కార్యక్రమంలో ఇదొక నాందీ అంశం ఏమో అని ఆయనకి చిన్న అనుమానం వచ్చింది. కాని వ్యక్తిగతంగా కాకపోయినా ప్రచురించిన పరిశోధనా పత్రాల ద్వారా మిడతంభొట్లు ఆయనకి చిరపరిచితులు కనుక ఆయన ఇటువంటి

కొంటె చేష్టలు చెయ్యడానికి అవకాశం తక్కువ. అయినా వేళాకోళానికో, పరిహాసానికో, వినోదానికో శాస్త్రవేత్తలు ఇటువంటి ప్రయోగాత్మక పరిహాస చేష్టలు చెయ్యడంలో దిట్టలే. కనుక ఎబర్‌హార్ట్ గారికి ఇందులో ఉన్న భేతాళ రహశ్యం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది. అందుకని తన ముఖ కళవళికలలో తన మనోభావం ప్రస్ఫుటమవకుండా జాగ్రత్త పడుతూ సంభాషణ కొనసాగించేరు.

ఇటువంటి విలక్షణమైన విశేషానికి తార్కికమైన కారణం ఏమై ఉంటుందా అని చాల పెద్ద ఎత్తున ఆ చెట్టు కింద చర్చలు జరిగేయి.

"భూమికి ఆకర్షణ శక్తి నశించి ఉండాలి," అన్నారు త్రిమూర్తులలో ఒకరు.

"అలా అయితే మిడతంభొట్లుతో పాటు అందరూ గాలిలో తేలిపోయి ఉండాలే," అంటూ మరొకరు ధర్మసందేహం వెలిబుచ్చేరు.

"భూమికి ఆకర్షణ శక్తి నశించిపోతే భూమి సూర్యుడి చుట్టూ తన కక్ష్యలో తిరగగలదా?" అంటూ మరొకరికి అనుమానం వచ్చింది.

ఇలా ఎన్నో పిల్ల సిద్ధాంతాలు, పిచిక సిద్ధాంతాలు తిరగేసి, తోసిపుచ్చారు. ఒక్క మిడతంభొట్లు మేష్టారికే ఈ అనుభవం కలుగుతున్నాది కనుక ఇదేదో ఆయన శరీరంలో మార్పు వల్ల కాని బాహ్య ప్రపంచంలో మార్పుల వల్ల కాదని తీర్మానించేరు.

"లేదా, మిడతంభొట్లు శరీరం చుట్టూ ఉన్న ప్రదేశంలో ఏదైనా మార్పు జరుగుతూ ఉండి ఉండాలి. ఉదాహరణకి ఒక వ్యక్తి చుట్టూ ఉన్న గాలి చిక్కబడిందనుకుందాం. అప్పుడు ఆ అధిక సాంద్రత పొందిన గాలిలో వస్తువులు

తేలిపోవడానికి సావకాశం ఉంది కదా!" అంటూ పిసరెంకో ఒక సిద్ధాంతాన్ని లేవదీసి, తన సిద్ధాంతాన్ని చులకన చేసి అమెరికా ప్రొఫెసర్ నవ్వుతాడేమోనని భయపడి కాబోలు, "అసలు, అమెరికాలో సాల్ట్ లేక్ సిటీ దగ్గర ఉన్న సరస్సులో నీటి సాంద్రత ఎక్కువ కావడం వల్ల ఆ సరస్సులో ఈత రాని వాళ్లు కూడ పాదరసం మీద గుండుసూదిలా తేలిపోతారుట," అని చిన్న సమర్ధింపు వాక్యాన్ని జోడించేడు, ఎబర్‌హార్ట్ వైపు చూస్తూ.

"అటువంటప్పుడు కనీసం మిడతంభొట్లు తక్షణ పరిసరాల్లో ఉన్న వస్తువులు కూడ గాలిలో తేలిపోవాలి కదా?" ఎబర్‌హార్ట్ అన్నారు.

"నేను తాపగతి శాస్త్రం యొక్క రెండవ సూత్రం మీద నా ఆశలన్నీ పెట్టుకుని ఉన్నాను." స్వగతంగా అనుకుంటున్నట్లు మిడతంభొట్లు గొణిగేడు.

కాక్‌టెయిల్ పార్టీలలో కబుర్లు సగానికి పైగా గాలి కబుర్లే కనుక అతిధులు మిడతంభొట్లని ప్రోత్సహించేరు.

"ఒక గాజు తొట్టెని నీటితో నింపి, నిశ్చలంగా ఉంచి, దానిలో ఒక సిరా చుక్క వేస్తే ఏమవుతుంది?" మిడతంభొట్లు దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ తన సిద్ధాంతాన్ని లేవదియ్యడం మొదలు పెట్టేరు. "కాలం గడుస్తూన్న కొద్దీ సిరా నెమ్మదిగా నీటిలో కలిసిపోతుంది. కదా? ఆ సిరా చారలు, చారలుగా నెమ్మదిగా నీటిలో కలిసిపోవడం మనం కళ్లారా చూడవచ్చు. అవునా? అంటే సిరా వేసిన చోట కుదురుగా కూర్చోకుండా, క్రమం తప్పి చెదిరిపోతుంది. శక్తిని వెచ్చించకుండా ఆ సిరా చుక్కని నీళ్లల్లోంచి మళ్లా వెనక్కి తియ్యలేము. ఈ రకం ప్రవర్తన నీళ్లతొట్టెలో సిరాకే పరిమితం కాదు. ప్రపంచంలో దేనినయినా సరే

నియమ నిబంధనలు లేకుండా – కట్టడి, ఒత్తిడి లేకుండా – ఒదిలేస్తే దానిలో క్రమత్వం నశించి, అక్రమత్వం ప్రబలుతుంది. ఉపాధ్యాయుడనే బాహ్యమైన ఒత్తిడిని తీసెస్తే, విద్యార్ధులు క్రమశిక్షణ లేకుండా అల్లరి చెయ్యరూ? యుగాలు గడుస్తూన్నకొద్దీ ఈ ప్రపంచంలో ధర్మం నశించి అధర్మం పెరుగుతుందని గీతలో చెప్పనే చెప్పేడు. ఇది ప్రకృతి ధర్మం. దూరాన్ని కొలవడానికి గజాలు, మీటర్లు వాడినట్లు, కాలాన్ని కొలవడానికి క్షణాలు, నిమిషాలు, గంటలు వాడినట్లు, ఈ అక్రమత్వాన్ని కొలవడానికి ఇంగ్లీషులో ఎంట్రోపీ అనే మాట వాడతాం కదా?"

అప్పటికే వీళ్ల సంభాషణ మీద ఆసక్తి ఉన్న ఆహూతులు కొందరు అక్కడ మూగడం మొదలు పెట్టేరు. వారిలో ఒకడు – సైన్సుని తెలుగులో రాయడానికి తాపత్రయ పడే ఒక పాత్రికేయుడు – కలుగజేసుకుని, "ఈ ఎంట్రోపీ అనే మాటని అబంత్రం అనిన్నీ, యంతరపి అనిన్నీ, సంకరత అనిన్నీ మన వాళ్లు తెలుగులో వాడుతున్నారండి."

అవకాశం ఇస్తే ఆషాఢభూతిలా పంచని చేరి వాసాలు లెక్కపెట్టే సమర్ధులు ఈ విలేకరులు అని మిడతంభొట్లుకి తెలుసు. అందుకని తన వాక్ప్రవాహానికి ఎవరివల్లా అంతరాయం కలుగకూడదన్న దృఢనిశ్చయంతో, "కాలం గడుస్తూన్న కొద్దీ ఈ ఎంట్రోపీ పెరుగుతుందే కాని తరగదు," అని తిరిగి అందుకున్నాడు.

పరిగెడుతూన్న ప్రవాహానికి మన పాత్రికేయుడు ఎలాగూ అంతరాయం కలిగించేడు కదా అన్న ధైర్యంతో ఒక స్నాతకోత్తర విద్యార్ధి మిడతంభొట్లు గారిని తొందర పెట్టడం మొదలు పెట్టేడు.

“నిర్జీవమైన భౌతిక ప్రపంచంలో ఎంట్రోపీ ఎల్లప్పుడు పెరుగుతూనే ఉంటుంది. ఎంట్రోపీ తగ్గాలంటే మనం బయటనుండి శక్తిని సరఫరా చెయ్యనైనా చెయ్యాలి లేదా కాలచక్రాన్ని వెనక్కి తిప్పనైనా తిప్పాలి. కాలాన్ని వెనక్కి నడిపించడం అసంభవం అయినట్లే ఎంట్రోపీని తగ్గించడం కూడ అసంభవమే. ఇది ప్రకృతి ధర్మం. అయినప్పటికీ, జీవం ఉన్న పదార్థాలలో ఇది సాధ్యం. జీవన ప్రక్రియలో గజిబిజిగా ఉన్న అక్రమత్వం నుండి పరిపూర్ణ సౌష్టవం, క్రమత్వం ఉన్న జీవి పుట్టడం లేదూ? తల్లి గర్భంలో పిండం నుండి పెరిగే శిశువే దీనికి ఉదాహరణ. తల్లి రక్త ప్రవాహంలో ఉండే నిరాకారమైన పోషక పదార్థాలని తీసుకుని వాటికి రూపం కలిగించే ప్రక్రియలో ఎంట్రోపీ తగ్గినట్లే కదా! ఇక్కడ కాలాన్ని వెనక్కి మళ్లించకుండా ఎంట్రోపీని తగ్గించడం జరిగింది. ఇది తాపగతి శాస్త్రపు రెండవ సూత్రానికి విరుద్ధంగా ఉందని అనిపించవచ్చు. కాని శిశువు ఆ ఆకారం దాల్చడానికి శరీరం ఎంత శక్తి వెచ్చిస్తున్నాదో మనం లెక్కగట్టలేదు కదా!”

మిడతంభొట్లు ధోరణి ఎబర్‌హార్ట్‌కి అర్ధం కాలేదు. “మీరు చెబుతూన్న సిద్ధాంతానికీ, మీరు గాలిలో తేలిపోయిన అనుభవానికి మధ్య ఉన్న లంకె ఏమిటో బోధపడడం లేదు.”

“వస్తున్నా. తాపగతి శాస్త్రపు రెండవ సూత్రం స్థానికంగా వమ్ము అయినట్లు కనిపించడం అప్పుడప్పుడు జరిగినప్పటికీ, విశాలదృక్పథంతో చూసినప్పుడు రెండవ సూత్రం అక్షరాలా వర్తిస్తుంది. సజీవకాయంలో క్రమత్వం ఎక్కువ కనుకనున్నూ, బాహ్యప్రపంచంలో కాలంతో పాటు క్రమత్వం తగ్గాలి

కనుకనున్నూ, సజీవ కాయానికీ, నిర్జీవ భౌతిక ప్రపంచానికీ మధ్య ఉన్న ప్రహర వద్ద విచిత్రమైన సంఘటనలు జరగడానికి సావకాశాలు ఉన్నాయి.

"ఉదాహరణకి నా శరీరంలో పదార్థం కొంత అకస్మాత్తుగా ఏష్యం అయిపోయిందని అనుకుందాం. పదార్థం నిహిత నియమాలకి లోబడి ఉంటుంది కనుక, ఏష్యం అయిపోయిన పదార్థం శరీరంలో లేదు కనుక బాహ్య వాతావరణం లోనికి పోయి ఉండాలి; లేదా, అయిన్‌స్టయిన్ సమీకరణం ప్రకారం శక్తిగా మారిపోయి ఉండాలి. బాహ్య వాతావరణంలోనికే పోయిన పక్షంలో శరీరం చుట్టూ ఉన్న గాలిలోకి అధికంగా పదార్థం చేరిందన్నమాటే కదా? అప్పుడు శరీరం చుట్టూ ఉన్న గాలి సాంద్రత పెరుగుతుంది. జీలుగుబెండు నీటిలో తేలినట్లు, సాంద్రత పెరిగిన గాలిలో నా శరీరం తేలిపోయి ఉంటుంది."

"అదా మీ సిద్ధాంతం?"

"అవును. ఇప్పటికి అదీ నా సిద్ధాంతం."

"మీరు చెప్పిన సిద్ధాంతమే నిజమయితే తేలిపోయిన మనిషి కిందికి తిరిగి ఎలా రాగలిగేడు? ఇది, ఇది –" ఆయనకి ఇంగ్లీషుమాట గభీమని తట్టలేదు – "ఒబ్రతీమియా రియాక్సియ్" అని చిటికలు వెయ్యడం మొదలుపెట్టి, "ఇది రివర్సిబుల్ రియాక్షన్ అని మీ నమ్మకమా?" పిసరెంకో గారు చిన్న ధర్మ సందేహం వెలిబుచ్చేరు.

"ఇది నమ్మకంగా ఉత్‌క్రమణీయ ప్రతిక్రియే!" – పిసరెంకో రష్యన్‌లో మాట్లాడేసరికి మిడతంభొట్లు తెలుగులో లంకించుకుని, మరీ వేషాలు వేస్తే

మర్యాదగా ఉండదనో ఏమో – "లేదా రివర్సిబుల్ రియాక్షనే. దీనిని ఎంట్రోపీతో సమన్వయం చెయ్యాలి. అలా చేసిన తరువాత..."

మంచి రసగంధాయంలో ఉన్న మిడతంభొట్లు ఆలోచనా సరళికి అంతరాయం కలిగిస్తూ అపస్వరంలా ఆయన కర్ణకుహరాలలోకి తెలుగు సంగీతం వినిపించసాగింది.

"ఎంట్రోపీ, యంతరపి, యంత..."

"ఏమండీ! ఏమండీ! ఏమిటా కలవరింతలు? లేవండి. పొద్దెక్కిపోతోంది. మీ యూనివర్సిటీలో ఏదో కాన్ఫరెన్సు ఉందని అన్నారు. అమెరికా నుండి, రష్యా నుండి పేరున్న ప్రొఫెసర్లు వస్తున్నారనిన్నీ, వాళ్లని కలుసుకోవాలనీ కూడ అన్నారు. త్వరగా తెమలండి." రాధ కంగారు పడుతూ భర్తని లేపింది.

సిలోన్ రేడియోలో తెలుగు సంగీత కార్యక్రమం సన్నగా వినబడుతోంది.

"ఏమీ కంగారు పడకమ్మా, రాధమ్మా. నిన్న రాత్రి ఆంజనేయస్వామి కోవెలలో యంత్రం వేసి, జపం చేసేను. ఈ తావీజు అబ్బాయి మేళ్లో వేసుకున్నాడంటే అన్నీ సర్దుకుంటాయి. వాయుపుత్రుడు గట్టివాడమ్మాయ్. నా యంత్ర మహిమ వల్ల వాయుపుత్రుడు అబ్బాయిలో ప్రవేశించి 'యంత్రం, యంత్రం' అనిపిస్తూన్నట్లున్నాడు. ఇక చిరంజీవికి గండం గడచినట్లే.

అవధాని ఏదో ఊకదంపుడు ఉపన్యాసం లాగించేస్తున్నాడు.

"చెప్పేవాడికి వినేవాడు లోకువ. చెప్పేవాడు గడ్డి తింటే తిన్నాడు. వినేవాడి బుద్ధి ఏమయింది? అయినా ఎవరి పిచ్చి వారికి ఆనందం. కానివ్వండి.

కానివ్వండి..." అనుకుంటూ మిడతంభొట్లు ఆంధ్రా యూనివర్శిటీ వైపు అడుగులు వేసేరు.

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక 17 జూలై 1970)

# బ్రహ్మాండం బద్దలైంది

కోటు కొక్కేనికి తగిలించి, ఆఫీసు తలుపుకి లోపల గెడ పెట్టి, కాళ్లు రెండూ బల్ల మీదకి బారజాపి, కుర్చీలో కూర్చున్నారు, మిడతంభొట్లు మేష్టారు. అక్కడక్కడ పలచబడుతూన్న జుట్టు గుండా చేతి వేళ్లు పోనిచ్చి, ఎదురుగుండా ఉన్న గాజద్దాల కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నారాయన. గదిలో వాతనియంత్రణ ఉన్నప్పటికీ ఎప్పుడూ నిశ్చలంగా ఉండే ఆయన విశాలమైన నుదుటి మీద ఘర్మ బిందువులు ఆయన మనస్సులో చెలరేగుతూన్న తుఫానుకి ప్రత్యక్ష తార్కాణంగా నిలిచేయి. అప్పుడే ఇంటి వద్ద తాగి వచ్చినా, ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసుకుని మళ్లా తాగేరు. కుర్చీలోంచి లేచి, ఆఫీసు గదిలోనే బోనులోని పులిలా పచార్లు చేసేరు. తక్షణ కర్తవ్యం ఏమిటో తేల్చుకోలేక, దిగాలుగా మళ్లా కుర్చీలో కూలబడ్డారు.

ఆ రోజు ఆఫీసుకి బయలుదేరే సమయం అది. అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు తను. కాఫీ కుంపటి దగ్గర ముక్కాలి పీట మీద కూర్చుని, రాధతో కబుర్లు చెబుతూ... గుంటవెధవ... ఊరుకున్నాడా? ఏటం బాంబులా ఒదిలేడు. మరొకడూ, మరొకడూ అయితే, ఏదో ఈ రోజుల్లో కుర్రకుంకలు కూసే అర్థంలేని ఊత పదాల్లో ఇదొహటని సర్దుకుని ఊరుకునేవాడు తను. కాని మిడతంభొట్లు ఏదో సామాన్యమైన ఉల్ఫాగాడైతే భారత ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించి, రక్షణ శాఖలోని శాస్త్రవేత్తల సిబ్బందికి ఈయనని నాయకుడిగా నియమించేవారా? ఆంధ్రా యూనివర్శిటీలో అలా రాటవుతూ ఉండేవాడు.

దైనందిన జీవితంలో ఏవో సామాన్యమైనవని అందరూ నిర్లక్ష్యం చేసే చిన్న చిన్న సంఘటనలలో ఏదో అసమాన్యత కనిపిస్తుంది మిడతంభొట్లు నిశితమైన దృష్టికి. ఈ సమర్ధతని దొరతనం వారు వాడుకోదలిచేరు.

ఈ విశ్వానికి అయిదవ కొలత ఉందంటూ ఈయన ఒక ప్రతిపాదన చేసి, దానిని సమర్ధిస్తూ వ్యాసాలు రాసి ప్రచురించేరు. ఆంధ్రా యూనివర్శిటీలో బ్రిడ్జి ఆడకుండా ఒక మూలని పడి ఉన్న ఇతగాడి రచనలు సముద్రాలు దాటి ఆవలికి వెళ్లేయి. సమర్ధులు, శ్వేతవర్ణులు అయిన శాస్త్రవేత్తలు కొందరు “ఔరా!” అన్నారుట. అని ఊరుకున్నారా? లేదే. “మిడతంభొట్లు రాసిన సిద్ధాంతాలు చదివి అర్ధం చేసుకోడానికి పంచేంద్రియాలు చాలవు. దివ్యదృష్టి వంటి ఆరవ ఇంద్రియం కూడ ఉండాలి” అని రాశాట్ట ఒక దొర. రాసి ఊరుకున్నాడా? లేదే. “ ఎ సిక్స్త్ సెన్స్ ఈజ్ రిక్వైర్డ్ టు ఎప్రీషియేట్ ద ఫిఫ్త్ డిమెన్షన్” ని ఇంగ్లీషులో చమత్కరించేడుట.

“మీ తెలుగు ఇటాలియన్‌లా ఉందిస్మీ” అని ఒక దొరగారు అబ్బుర పడేసరికి అది పొగడ్తా, గిగడ్తా అని కూడ ఆలోచించకుండా తుళ్లిపడి ఆనందించిన తెలుగువాడిలా అదరి పడింది నయా దిల్లీ. పడి, పదవినిచ్చి పట్టం గట్టింది.

పులి కడుపున పిల్లి పుడుతుందా? మిడతంభొట్లు గారి వంశోద్ధారకుడు పసితనంలోనే పరిమళించడం మొదలెట్టేడు. “ఏమండీ దివ్యదృష్టి గారూ” అని తనని సరదాకి ఎవ్వరైనా పలకరించినప్పుడు, తేలికగా నవ్వి పారేసేవాడు కాని

తన కుమార రత్నానికి ఆ శక్తి ఉందేమోనని అప్పుడప్పుడు అనుమానించకపోలేదు.

ప్రతి తండ్రి తన కొడుకుకి నోబెల్ బహుమానం రావాలని కోరుకోవడంలో తప్పు లేదు. తను సాధించలేని పనులన్నీ తన కొడుకైనా సాధించాలని అనుకోవడంలోనూ వింత లేదు. మిడతంభొట్లు ఇటువంటి మానవ దౌర్బల్యాలకి అతీతుడు కాదు. కాని చిరంజీవికి దివ్యదృష్టి ఉందేమోనని అనుమానపడడానికి, పుత్రవాత్సల్యానికి అతీతమైనవి, బలమైనవి అయిన ఆధారాలు ఉన్నాయి. ఏడాది క్రితం సంగతి. ప్రభుత్వపు పని మీద తను గ్రామాంతరం వెళుతూ ఉంటే, "వర్షం పడుతుంది. రెయిన్ కోటో, గొడుగో పట్టుకెళ్లండి నాన్నా" అన్నాడు వాడు. వెళ్లేది ఎడారి లోకి. అక్కడ దశాబ్దానికొక జల్లు పడితే అది పత్రికలలో పతాక శీర్షిక నధిష్టించే వార్త. అటువంటి ఎడారిలో కుండపోతగా వర్షం కురిసిందారోజు. ఇటువంటి చిన్న చిన్న సంఘటనలు ఎన్నో జరిగేయి. మిడతంభొట్లు తార్కిక బుద్ధికి ఇలా చెదురుమదురుగా జరిగిన సంఘటనలలో రాను రాను ఒక బాణీ కనిపించసాగింది. అనుమానం పుట్టింది. పెను భూతమై కూర్చుంది. ఆయన మస్తిష్కంలో కుమ్మరి పురుగై గొలకడం మొదలు పెట్టింది.

చంద్రుడు గుడి కట్టినా, కీచురాయి కూత కూసినా, సముద్రం హోరు పెట్టినా వర్షం పడుతుందని మామ్మ జోశ్యం చెప్పేది. ఆకాశవాణి వారు చెప్పినప్పుడు భరోసా ఏమీ లేదు కానీ, మామ్మ చెబితే వరుణదేవుడు టెంకలు కొట్టుకుంటూ వచ్చేవాడు. అంతమాత్రం చేత మామ్మకి దివ్యదృష్టి ఉందని తనెప్పుడూ అనలేదే. చిరంజీవి పద్ధతికీ, మామ్మ పద్ధతికీ చాల తేడాలు ఉన్నాయి.

మామ్మగారిని అడగని వాళ్లది పాపం. అడిగినవాళ్లందరికీ, కుల మత బేధాలు చూపించకుండా, తన జోశ్యాన్ని ఉచితంగా పంచిపెట్టేది. ఉత్త జోశ్యం చాల మంది చెబుతారు. భవిష్యత్తుని తెలుసుకున్న తరువాత, భవిష్యత్తు కళ్ల ముందు విడుతూ ఉంటే, నాటకాన్ని చూస్తూన్న ప్రేక్షకుల్లా, స్థబ్దుగా కూర్చోవడం ఆవిడకి ఇష్టం లేదు. వర్షం పడదని తెలిస్తే, అవసరం వెంబడి అవధానికి కబురంపి, ఈశ్వరుడికి సహస్ర ఘట్టాభిషేకం చేయించేది. వేసవి కాలంలో చెట్లన్నీ సిపాయిల్లా కదలిక లేకుండా నిలబడి ఉంటే, గుమాయింపు తగ్గడానికని, “దూ గాలీ, దుప్పన్న గాలీ, పాటి మీద గాలీ, పాత్రా గాలీ” అని వాయుదేవుణ్ణి బుజ్జగించేది. టూకీగా చెప్పాలంటే భవిష్యత్తుని లోకకల్యాణార్థం మరమ్మత్తు చెయ్యడానికి వెనకతీసేది కాదు ఆమె. ఈ అంశే మిడతంభొట్లు నాన్నగారిలోనూ ఉండేది. ఆయన జాతకాలు మరమ్మత్తు చేసేవారు. ఆయనలో ఉన్న ప్రత్యేకత జాతకాలనీ హోమియోపతీ వైద్యాన్నీ అనుకూలమైన పాళ్లల్లో మేళవించడం. లేకపోతే ఏమిటి? బంగారాన్ని ముట్టుకుంటే మట్టవుతూన్న ఒక దైవోపహతుడి జాతకంలో శని మహాదశని మరమ్మత్తు చేసి జాతకుడిని అమెరికా ఎలా పంపగలిగేరాయన? చాల మంది దీన్ని “ఆటో సజషన్” అని వ్యాఖ్యానించేరు. మరికొంతమంది “సైకలాజికల్ ట్రీట్‌మెంట్” అన్నారు. ఏది ఏమైనా ఇదేదో వంశపారంపర్యంగా వస్తూన్న అంశలా ఉంది కానీ...

“పోలికలు ఎక్కడికి పోతాయి?” అనుకుంటూ మిడతంభొట్లు చాల కాలం సమర్ధించుకుని ఊరుకున్నారు. కానీ కుర్రాడి బాణీ కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటే. “ఒరేయ్ నాన్నా, నైన్ డౌన్ ఎంత లేటవుతుందిరా?” అని అడగండి. ఆ విషయం

రైల్వే వారికెంత తెలిసేదో వీడికీ అంతే తెలిసేది. బిక్కమొహం మాత్రం జవాబుగా మిగిలేది. లేకపోతే ఏ మహాలక్ష్మి లోనో గుర్రాల మీద కాసి ఈ పాటికి బంగారపు ఇటికలతో___ ఎప్పుడో మూడు ముక్కలు చెబుతాడు. అది భవిష్యత్ పురాణమో ఉత్త ఊకదంపుడో మిడతంభొట్లు గారికి తెలిసిపోయేది.

"బ్రహ్మాండం బద్దలవుతోంది నాన్నా" అన్నాడు కుంక ఆ ఉదయం. వెంటనే తను ఆ మాటని అంతగా పట్టించుకోలేదు. కాని రాను రాను ఆ మాటలు పదే పదే జ్ఞాపకం వచ్చేయి. ఆ మాటలలో ఏదో అంతరార్థం ఉన్నట్లు ఆయన అంతర్వాణి చెప్పసాగింది. ఎంత వద్దనుకున్నా ఆ విషయం తలుచుకోకుండా ఉండలేకపోతున్నారాయన. డ్రైవరు కారు తోలుతూ ఉంటే వెనక సీట్లో కూర్చుని అలా మధన పడుతున్నారు.

మనస్సు కలవరపడ్డప్పుడల్లా శూన్యంలోకి దృష్టిని కేంద్రీకరించడం ఆయనకి అలవాటు. ఈ రోజూ అదే పని చేశారు. ముందస్తుగా కంటి ముందు ఏదో నలకలాంటి వెలుగు కనిపించింది. ఆయన కళ్లు నులుముకున్నారు. ఆ నలక అక్కడే ఉంది. మధ్య వేలుని కంటి రెప్ప మీద ఉంచి నెమ్మదిగా నొక్కేరు. ఆశ్చర్యం. ఆ నలక కదల లేదు; అక్కడే ఉంది. పైపెచ్చు "ఇంతింతై, వటుడింతై" అన్నట్లు ఆ నలక పెరగడం మొదలు పెట్టింది. శంఖాకారం పొందింది. ఆ శంఖం పెరుగుతూ, సాగుతూ, అలా అనంతాకాశంలోకి వెళ్లిపోయింది. శూన్యమనే నల్లటి కొండలో వెలుగుతో దొలిచిన సొరంగంలా అనిపించింది. తను మాత్రం ఆ సొరంగానికి ఈవలి దరిని ఉన్నాడు. నూతిలోనుండి వస్తూన్నట్లు ఆ సొరంగపుటద్దరి నుండి అవ్యక్తమైన శబ్దం ఒకటి వినిపించసాగింది. ఒకసారి

తలలో పోటు వచ్చినట్లయింది. శరీరంలోని శక్తినంతటినీ కూడగట్టుకుని ఆ శబ్దం మీదే మనస్సుని లగ్నం చేసేరు మిడతంభొట్లు. గళబిళ ధ్వనిగా మొదలయిన ఆ శబ్దం క్రమేపీ తేటబారింది. ఏవో మాటలు వినిపిస్తున్నాయి.... "మీ లోకం...మీ నక్షత్రం... నవ ..నౌవ..." మాటలు ఖణిగా వినిపించలేదు. భావం ఏమిటో అవగాహన కాలేదు. తమాషా ఏమిటంటే ఆ మాటలు ఎక్కడో ఆకాశం నుండి వచ్చిన – సినిమాల్లో చూపించే అశరీరవాణి – మాటలులా లేవు. తన అంతర్వాణే తనని దేని గురించో హెచ్చరిస్తూన్నట్లు అనిపించింది. ఇంకా మనస్సుని ఆ శబ్దం మీద కేంద్రీకరించి వినాలి....

"బాబుగారూ, ఆఫీసుకి వచ్చేశాం," అన్న డ్రైవరు మాటలు మిడతంభొట్లు ఆలోచనలకి అంతరాయం కలిగించి అనంతపుటవధులనుండి ఈ లోకానికి తీసుకు వచ్చేయి.

## 2

ఆఫీసులో అడుగు పెట్టేరన్నమాటే గాని మిడతంభొట్లు గారి మనస్సు మాత్రం ఈ లోకంలోకి రాలేదు. కళ్లెం లేని గుర్రంలా పరిపరివిధాల పరిగెడుతోంది. ఏదో కుర్రవాడి కొంటె కూతలనే పునాదుల మీద తను నిర్మించిన ఊహాసౌధాలని తలుచుకుంటే తనకే నవ్వు వస్తోంది. కాని నుదిటి మీద చిరు చెమటల సంగతి? కాళ్లల్లో నీరసం సంగతి? హృదయ ఘాతం కాదు కదా? మరో కప్పు కాఫీ తాగి వైద్యుడికి ఫోను చేసేరు.

"హృద్రోగం ఎవ్వరికి వస్తుందో చెప్పలేను కాని, మీకు రాదని హామీ ఇవ్వగలను." బిగ్గరగా నవ్వేరు డాక్టరు. "బక్కపలచని శరీరం. రోజూ

వ్యాయామం చేస్తారు. ధూమపానం చెయ్యరు. మాదక ద్రవ్యాలు పుచ్చుకోరు. ముక్క తినరు. చుక్క తాగరు. మీ వంశంలో గుండెపోటు వచ్చిన దాఖలాలు లేవు. మీకు హృదయ ఘాతం ఏమిటి? అయినా ఒకసారి పరీక్ష చేస్తే సరిపోతుంది. సాయంకాలం ఒక సారి ఇటు రాండి."

మిడతంభొట్లు నెమ్మదిగా తేరుకున్నారు. పని మీద మనస్సు పోవడం లేదు. కొంచెం విశ్రాంతి అయినా దక్కుతుందని కాళ్లు రెండూ బల్ల మీదకి బారజాపి, తూగుకుర్చీలో వెనక్కి జారబడి, కళ్లు మూసుకుని కూర్చున్నారు. అలా ఎంతసేపు కూర్చున్నారో ఆయనకే తెలియదు. ఇంకా కళ్లు మూసుకునే ఉన్నారు. కంటికి ఎదురుగా ఉన్న దృక్క్షేత్రంలో, నల్లటి నలుపు నేపథ్యంలో, వింతవింత చుక్కలూ, బుడగలూ వంటి ఆకారాలు కనిపిస్తున్నాయి. ఆ ఆకారాల మధ్య చిన్న నేతిదీపం లాంటి వెలుగు కనిపించింది. మళ్లా అదే శంఖాకారం. అదే సొరంగం...అనంతం...ఆ అనంతపు ఆవలి దరి నుండి మళ్లా అదే శబ్దం... పోతే ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో ఆ శబ్దంలో రొద లేదు. మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయిమాటు.

"మీ ప్రపంచం బ్రహ్మాండమైన ప్రమాదానికి లోనవుతోంది. మీ దూరదృష్టి, మీ చాకచక్యాల మీదనే మీ మనుగడ ఆధారపడి ఉంటుంది." ఈ మాటలు మిడతంభొట్లుని ఆశ్చర్యచకితుణ్ణి చేసేయి. తనతో ఎవరు మాట్లాడుతూన్నట్లు? ఈ ప్రపంచానికి వచ్చిన ఆపద ఏమిటి? నిలకడలేని మనస్సు తనతో చెలగాటాలాడుతున్నదా? పొరపాటున ఎల్. ఎస్. డి. వంటి రసాయన ద్రవ్యాలేమీ

తను తినలేదు కదా? తనతో నిజంగా ఎవ్వరైనా మాట్లాడుతున్నారా? లేక ఇదంతా ఒక భ్రమా? ఈ ప్రశ్నలకి సమాధానాలు కావాలి.

"ఎవరు మీరు? ఎక్కడనుండి మాట్లాడుతున్నారు? నాతో ఎలా మాట్లాడగలుగుతున్నారు?" అడిగేరు మిడతంభొట్లు.

"మేము మీ లోకం వాళ్లం కాము. మీ సూర్య మండలానికి దరిదాపు పదకొండు కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాం. మా ఆకాశంలో ఉండే జంట తారల కంటె మీ సూర్యుడు ఇరవై రెట్లు కాంతివంతంగా ఉన్నాడు. కొద్ది కాలంలో ఇది నూరింతలవరకు పెరిగి పోతుంది. అప్పుడు మీ లోకాలన్నీ భస్మం అయిపోతాయి. మీ జాతిని, సంస్కృతిని కాపాడుకోవాలంటే మీరంతా మరొక చోటకి తరలి వలస వెళ్లిపోవాలి."

టెలిఫోను లోని మాటలలా స్పష్టంగా వినిపించిన ఆ శబ్దం మిడతంభొట్లు గారి మేధకి అగ్ని పరీక్ష అయి కూర్చుంది. నివృత్తి కాని అనుమానాలు ఆయన మనోసాగరంలో ఉవ్వెత్తున లేస్తున్నాయి. భూలోకం అంతా భస్మం అయిపోతుందా? యుగాంతం సమీపించిందా? ఈ విషయం తను దండోరా వేసి చెబితే ప్రజలు గాభరా పడిపోరూ? సజావుగా ఆలోచిస్తారా? దొమ్మీ చేస్తారా? అసలు తన మాట నమ్ముతారా? పిచ్చివాడిలా కొట్టిపారేస్తారా? ఆసన్నమవుతూన్న ఈ బృహత్ ప్రమాదాన్ని ప్రపంచంలోని ప్రజలందరూ కక్షలూ, కావేషాలు కప్పెట్టుకుని, కలిసికట్టుగా పనిచేస్తారేమో. ఈ ప్రమాదం మూలంగానైనా ప్రపంచానికి శాంతి లభిస్తే అదెంత కాదు. అసలు తనవంటి హోదాలో ఉన్న మనిషి ప్రభుత్వానికి ఈ విషయం ఎలా తెలియజెయ్యాలి? పత్రికల వాళ్ల

దగ్గరనుండి తుంటరి వెధవల వరకు అందరూ సవా లక్ష ప్రశ్నలు వేస్తారు. వీటన్నిటికి కాకపోయినా కొన్నిటికయినా సరి అయిన సమాధానాలు తను తయారుగా ఉంచుకోవాలి. మిడతంభొట్లు మస్తిష్కం మిషనులా పనిచెయ్యడం మొదలుపెట్టింది. ఆకాశవాణిని ఉద్దేశించి ప్రశ్నల వర్షం కురిపించేరు.

"మీరు మాకు పదకొండు కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్లయితే మీతో నేను టెలిఫోనులో మాట్లాడినట్లు మాట్లాడగలగడం అసంభవం. మీ వార్త మాకు చేరేసరికి పదకొండు సంవత్సరాలు, మా సమాధానం మీకు చేరేసరికి పదకొండు సంవత్సరాలు పడుతుంది. ఈ లెక్కని సంభాషణ కుదరదు. అంతే కాకుండా పదకొండు సంవత్సరాల క్రితం మా సూర్యుడి పరిస్థితి గమనించి, ఇంక కొద్ది రోజుల్లో జరగబోయే విషయాన్ని..."

"రాతి యుగం. రాతి యుగం. మా పూర్వీకులు కూడ ఇలాంటి కుతర్కంతో శతాబ్దాలపాటు కొట్టుకున్నారు. మా వాళ్లూ కాంతి వేగాన్ని మించి వాకేతాలు పంపడం అసాధ్యం అన్నారు. ఈ విశాల విశ్వంలో ఉన్న కోట్ల కొద్దీ ప్రపంచాలు, ఒకరి సంపర్కం ఇంకొకరికి లేకుండా, ఎవరి ప్రపంచంలో వారు బందీలు మాదిరి, ఒంటిపిల్లి రాకాసులలా, ఉండవలసిందే అన్నారు. అంతర్‌ప్రపంచ సంభాషణలు అసంభవం అన్నారు. మనం కాంతి వేగం అనే అవధి చేత బంధించబడ్డ ఖైదీలమన్నారు. ఇలా శతాబ్దాలు గడిచేయి. వాకేతాల వేగం కాంతి వేగంతో సమమవడం అసంభవమేమో కాని, కాంతి వేగాన్ని మించిన వేగంతో వాకేతాలని పంపగలమా అన్న ఆలోచన వచ్చేసరికి చాల కాలం పట్టింది...."

"మీరనేది వార్తా ప్రసారం కాంతి వేగాన్ని అధిగమించి చెయ్యడం సుసాధ్యమేనంటారు? కాంతి వేగంతో సమానం కానంత సేపూ చిక్కు లేదంటారు? అవునా?"

"అవును." ఆకాశవాణి పలికింది. ఈ మహా విశ్వంలో అవధిలేకుండా మహా వేగంతో పయనించేది ఏది?" భౌతిక శాస్త్రవేత్తగా కాకుండా సామాన్యుడిగా ఆలోచించి చూడు."

"మనస్సు." మహాభారతంలో యుధిష్టురుడిలా అన్నారు మిడతంభొట్లు. ఏదో జ్ఞానోదయం అయినట్లయింది. "భౌతిక శక్తులకి అసాధ్యం అనిపించే ప్రక్రియలెన్నో మనో శక్తితో సాధించవచ్చని మన పురాణ గ్రంథాలు ఘోషిస్తున్నాయి కద! అంతర్గతంగా నిబిడీకృతమైన ఈ శక్తిని కూడదీసి ఇచ్ఛామాత్రంగా మన శరీరంలో ఉత్పరివర్తనాలు కూడ పుట్టించవచ్చని ఈ మధ్య అధునాతనులు కూడ వాదిస్తున్నారు. ఇవన్నీ పటిష్టం లేని శుష్క వాదాలయితే టెలీపతీ మీద రష్యన్ శాస్త్రవేత్తలు విరివిగా పరిశోధనలు ఎందుకు చేస్తున్నారు? మిడతంభొట్లు స్వగతంగానే, మనస్సులో అనుకున్నారు. ఎవ్వరినీ ఉద్దేశించి అనలేదు. పైకి అనలేదు.

"అవును. మనోశక్తిని మించిన శక్తి లేదు. ఈ శక్తిని ఉపయోగించి వ్యాధిగ్రస్తులకి స్వస్థత చేకూర్చవచ్చు. వాకేతాలని ప్రసారం చెయ్యవచ్చు. భవిష్యత్తు లోకి చూడ వచ్చు. అన్నిటి కంటె ముఖ్యమైన అంశం ఏమిటంటే ఈ శక్తితో వార్తలని ప్రసారం చెసేటప్పుడు భాషతో ప్రమేయం ఉండదు. నిజానికి మీ భాష ఏమిటో కూడ మాకు తెలియదు. అవసరం లేదు కూడ. మేము ప్రసారం

చెయ్యవలసిన వార్త మీద మా మనస్సుని లగ్నం చేస్తాం. మా "ఎంటెనా" ల ద్వారా వార్తని ప్రసారం చేస్తాం."

"మీ వార్తలు గమ్యం చేరిన తరువాత వాటిని "డీకోడు" చేసి వార్తని పైకి లాగడం ఎలా?"

"ఇది చాలా మంచి ప్రశ్న. ఈ విషయమై మేము ఇంకా పరిశోధనలు చేస్తున్నాము. ప్రస్తుతం మా శక్తిలో సగం ప్రసారం చెయ్యడానికి, మిగిలిన సగం వార్తని డీకోడ్ చెయ్యడానికి వాడుతున్నాం. ఉదాహరణకి ప్రస్తుతం మా శక్తి మీ మస్తిష్కం మీద కేంద్రీకరించేం. ఈ సందర్భంలో మా ఆలోచనలు మా మెదడులో ఎటువంటి విద్యుత్-రసాయనిక ప్రక్రియలని ప్రేరేపించేయో వాటికి సారూప్యమైన విద్యుత్-రసాయనిక ప్రక్రియలు మీ మెదడులోని చక్షు-శ్రవణ కేంద్రాలలో చెలరేగుతాయి. మా వాకేతాలని అందుకున్న గ్రాహకుడు ఇలా చెలరేగుతూన్న 'భావ దుమారాన్ని' ఏకాగ్రతతో అవగాహన చేసుకోగలిగితే వాటి భావం ఆ వ్యక్తికి అర్థం అవుతుంది. ఈ రకం నిగ్రహ శక్తి లేని వారికి మా వల్ల జరిగిన ప్రేరేపణ అర్థ రహితంగా ఉంటుంది. ఉండడమే కాదు. ఈ ఆందోళన బయటకి వ్యక్తం అయినప్పుడు అవి రోగ లక్షణాలని భ్రమ పడడానికి అవకాశం కూడ ఉంది. ఈ విషయంలో ఇంకా పరిశోధనలు ... మా శక్తి తగ్గిపోతోం...మీ జాగ్రత్తలో మీరు ఉండం..." విశ్వాంతరాళంలోంచి వచ్చిన శబ్దం కర్పూరం నిండుకున్న హారతిలా హరించిపోయింది.

మిడతంభొట్లు క్షణమాత్రపు కాలం నిశ్చేష్టులై ఉండిపోయేరు. దివి నుండి భువికి వచ్చిన వార్త యొక్క సారం ఆయన మెదడులోని కణసారంలోకి ఇంకా

ఇంక లేదు. పుట్టపర్తి సాయిబాబా శక్తి ఏమిటో ఇప్పుడు ఈయనకి కొద్దిగా అర్థం అయింది. ఇటువంటి పద్ధతి ఏదో లేకపోతే ఆయన ఇంగ్లీషువాడితో ఇంగ్లీషులోను, తెలుగు వాడితో తెలుగులోను, జెర్మనీ వాడితో జెర్మనీ లోనూ ఎలా మాట్లాడేవాడట? ఆయనని సంబోధించి ప్రశ్న అడగకుండానే మన మనస్సులో ఉన్న ప్రశ్నకి సమాధానం చెప్పేవారట! తపోశక్తి అంటే ఇదేనేమో?

తపోశక్తి శరీరంలో ఉత్పరివర్తనాలు కలిగించి ఉండకపోతే కారు నలుపుగా ఉండే ముమ్మడివరం బాలయోగి పదహారో వన్నె బంగారపు ఛాయలోకి ఎలా వచ్చేడు? పాశ్చాత్యులు మనని తప్పు దారి తొక్కించేరా? మన మహర్షులు నిజంగా మహిమాన్వితులేనేమో? ఉత్త శుంఠలు కాదేమో?

వింత పాతబడేటప్పటికి పాత మీద రోత పుట్టలేదు కాని మిడతంభొట్లు అంతరాంతరాల్లో ఉన్న శాస్త్రవేత్తకి రోషం మాత్రం వచ్చింది. ఆయన ఆ మధ్య ప్రచురించిన సిద్ధాంతాలకీ, నేటి అనుభవాలకీ అవినాభావ సంబంధం ఉన్నట్లు అనిపించింది. మొట్టమొదటగా తన సిద్ధాంతాలని ప్రయోగాత్మకంగా నిరూపించడానికి వచ్చిన అవకాశమా ఇది? ప్రస్తుతం చెలామణీలో ఉన్న ఖగోళ–భౌతిక సిద్ధాంతాల ప్రకారం మన సూర్యుడు నవ్యతారగా మారి పేలిపోవడానికి అవకాశాలు తక్కువ – ఎక్కడో సిద్ధాంతంలో లొసుగు ఉంటే తప్ప. కాని తను ఉద్ఘాటించిన సిద్ధాంతంలో వెలుగు వేగానికి అవధులు తొలగిస్తే కొన్ని సమీకరణాలలో ఏకత్వ వైపరీత్యం గోచరిస్తుంది. అదే నిజమైతే మన సూర్యుడు నోవా అయే ప్రమాదం ఉంది. కాని ఈ సిద్ధాంతం సంభావ్యతలు చెబుతుంది కాని నిర్దిష్టంగా ఏదీ చెప్పదు. సూర్యుడు నోవాగా మారిపోతే సౌరకుటుంబం అంతా

భస్మం అయిపోవచ్చు. లేదా అంతర్ గ్రహాలు కొన్ని బలి కావచ్చు. ఘోర ధర్మం ప్రకారం ఈ విషయం ప్రధాన మంత్రికి తెలియజెయ్యాలా? తెలియజేస్తే ఒరిగేదేముంది? ఇప్పుడు తను ఏమి చేసినా ప్రయోజనం ఉంటుందా? అలాగని రిక్తహతుడై ఊరుకోలేడు కదా? తనకి చేతనయినది చెయ్యాలి. గబగబ కంప్యూటర్ కేంద్రానికి పరిగెట్టేరు మిడతంభొట్లు. సాయంకాలం వరకు క్రమణికలు రాసి, వాటిని వాడవలసిన విధానం అక్కడ సిబ్బందికి బోధించి ఇంటి ముఖం పట్టేరు. కంప్యూటరు నమూనాలు ఏమిటి చెబుతాయో ముందు చూసి, ఆ తరువాత కార్యక్రమానికి తయారవవచ్చని ఆయన ఊహ.

## 3

అనుకున్న ప్రకారం శర్మ గారి క్లినిక్ దగ్గర ఆగేరు, మిడతంభొట్లు. శర్మ వైద్యుడే కాకుండా కుటుంబ స్నేహితుడు కూడా. ఇద్దరూ రాజకీయాల దగ్గరనుండి అన్ని విషయాలూ చర్చిస్తారు. తన ఆరోగ్యానికేమీ డోకా లేదన్న ధీమాతో, ఏదో బాతాఖానీ వేద్దామన్న ఉద్దేశంతో, లోపల అడుగు పెట్టేరు మిడతంభొట్లు. జరిగిన సంగతులన్నీ చెబుతూ ఉంటే శ్రద్ధగా విన్నారు డాక్టర్ శర్మ. ముఖ కళవళికలని బట్టి డాక్టరు గారి అంతరంగం ఆకళింపు చేసుకుందామనుకున్న ప్రొఫెసరు గారికి ఆశాభంగమే అయింది.

"పైత్యం చేసిన వాడికి భూమి గిర్రున తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. అలాగని దానిని ప్రయోగత్మకమైన ఆధారంగా భావించి భూమి తిరుగుతున్నాది అంటే మీరు ఒప్పుకుంటారా? అలాగని భూమి తిరగడం లేదని అనగలమా? కారణ కార్య సంబంధం తార్కికంగా ఉండాలి కాని వాటి మధ్య కేవలం

సహసంబంధం ఉంటే సరిపోదు. మీవాడేదో బ్రహ్మాండం బద్దలవుతున్నాదన్నాడని ఆ మాటలనే పదే పదే తలుచుకుని, చిలవలు, పలవలు పెట్టి పగటి కలలు కన్నారేమో."

"నా క్షోభ అంతా కేవలం మానసికమైనదని మీరింత తేలికగా తీసిపారేస్తారని అనుకోలేదు." మిడతంభొట్లు చిన్నబుచ్చుకున్నారు.

"మానసికం కావచ్చు. శారీరకం కావచ్చు. మంత్రం కావచ్చు. మీ వెనక వీధిలో ఉన్న సాయిబు చెడుపు, చిల్లంగి అంటారే అటువంటి క్షుద్ర విద్య ఏదైనా మీమీద ప్రయోగిస్తున్నాడేమో. ఆసలు మీరు మీ పెరటి వీధిలో ఉన్న పుల్లయ్యతో మాట్లాడలేదనీ, మీరు విన్నది విశ్వాంతరాళపు లోతుల్లోంచి వచ్చిందనీ రుజువేదీ?"

"వాళ్లు పదకొండు కాంతి సంవత్సరాల దూరం నుండి గోల పెడుతున్నామని అఘోరిస్తున్నారు కదా."

"నేను మా ఆఫీసు నుండి ఫోను చేసి, 'నేనే శ్రీ కృష్ణ పరమాత్మని, ద్వారకనుండి మాట్లాడుతున్నాను' అని చెబితే మీరు నమ్మేస్తారా?" నిలదీసి అడిగేరు శర్మ. మిడతంభొట్లుకి పచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డట్లు అయింది. అహం దెబ్బ తింది. అయినా తమాయించుకుని వింటున్నారు.

"చూడండి. పైత్యం చేసి ఉండొచ్చు. ఎలర్జీ అయి ఉండొచ్చు. ఏ వైరస్ లాంటి విషాణువో మెదడులో దూరి ఈ హంగామా అంతా చేసి ఉండొచ్చు. మరేదైనా కారణం ఉండొచ్చు. కొంచెం పరీక్ష చేసి చూస్తే సరిపోతుంది కదా."

"కాలు బెణికితే ఇదేదో రుమేటిక్ హార్ట్ డిసీజ్ లా ఉంది. దీనికి వెంటనే ఓపెన్ హార్ట్ సర్జరీ చెయ్యాలి అన్నాట్ట వెనకటికి మీ లాంటి వాడే," మాటకి మాట బాకీ తీర్చేసుకున్నారు.

"చూడండి మన సూర్యుడు పదకొండేళ్లకి ఒక సారి వింతగా ప్రవర్తిస్తూ ఉంటాడని మీరొక సారి చెప్పేరు. ఆ సమయంలో అనేకమైన పరమాణు రేణువులు తండోపతండాలుగా వచ్చి మన భూగ్రహాన్ని ఢీకొంటాయని కూడ మీరు చెప్పిన మాటే. ఈ ఏకాదశవర్షచక్రం లోకి సూర్యుడు ఈమధ్యనే ప్రవేశించాడు కదా. ఈ సందర్భంలో ఒక కాస్మిక్ కిరణం కాని మీ మెదడులో దూరి..."

"కాస్మిక్ కిరణాలు ఇంత హడావిడి చేస్తాయా?" మిడతంభొట్లు గొంతుకలో మొదటి సారి ఆత్రుత గోచరించింది.

ఈ ప్రశ్నకి సమాధానంగా డాక్టరు శర్మ ఒక అగ్గిపుల్ల గీసి వెలిగించేరు. దాని అంతరార్థం ఏమిటా అని మిడతంభొట్లు కళ్లప్పగించి చూస్తున్నారు.

"ఈ వెలుగు మీ కంటిగుడ్డు వెనక భాగంలో ఉన్న అక్షిపటలం మీద పడుతుంది. ఆ రెటినా ఈ వెలుగుని విద్యుత్ వాకేతంగా మార్చి నేత్రనాడి ద్వారా మెదడులోని కపాలాస్తిక తమ్మి అనే భాగానికి పంపుతుంది. ఈ విద్యుత్ వాకేతం అక్కడ కొన్ని రసాయన మార్పులని కలిగించి, మీరు ఈ వెలుగుని చూస్తూన్నట్లు ఒక భ్రమని కలిగిస్తుంది. ఇప్పుడు మీరు కళ్లు మూసుకుని ఉన్నారనుకొండి. నేను వైద్య పరికరాలని వాడి, మీ మెదడులో, అదే స్థానంలో, అదే రకం ప్రేరేపణ కలిగించాననుకొండి. అప్పుడు కూడ అగ్గిపుల్ల వెలుగుని చూస్తూన్నట్లు భ్రాంతి కలుగుతుంది, మీ మెదడులో. ఒప్పుకుంటారా?"

తార్కికంగా ఉన్న శర్మ గారి వాదనని ఖండించలేకపోయారు మేష్టారు. “ఏ కాస్మిక్ కిరణమో, వైరస్ కణమో నా మెదడులో చేరి, అక్కడ రసాయనిక ప్రక్రియలని ప్రేరేపించి, నాకు ఈ దృక్భ్రమ, ఈ ‘హలూసినేషన్’, కలిగిస్తోందంటారు.”

“మీరలా అధైర్య పడకండి. మీరు ఉదయం నుండి విన్నవి, కన్నవి ఏ కారణం వల్లనైనా సంభవించవచ్చు అని చెబుతున్నానంతే. ముందు సేంద్రియ లోపం ఏదీ లేదని నిర్ధారించుకోవాలి కదా.”

“సేంద్రియ లోపం ఏదీ లేదని తేలితే నేను మరొక ప్రపంచంలోని జీవులతో మాట్లాడేనని మీరు ఒప్పుకుంటారా?”

“అలాగని నేను అనలేదే. సేంద్రియ లోపం లేక పొతే మానసిక రుగ్మత ఏదైనా ఉందేమో కూడ చూడాలి. అదీ లేక పోతే మీ ఇంటి వెనక సాయిబు ఏమిటి చేస్తున్నాడో చూడాలి. ఆ తరువాత సంగతి చూద్దాం.”

మిడతంభొట్లు నీరు కారిపోయారు. డాక్టరు మాత్రం మేష్టారి మీద చెయ్యవలసిన పరీక్షల జాబితా ఒకటి నర్సుకి చెబుతున్నారు. ఆయన ధోరణిని బట్టి మిడతంభొట్లు గుండెకాయ గట్టిగానే ఉంది కాని మరొకటేదో అవుగ్గా ఉన్నట్లు అనిపించింది. గుండె రాయి చేసుకుని మిడతంభొట్లు ఇల్లు చేరుకున్నారు.

ఉదయం ఎనిమిదయేసరికల్లా మిడతంభొట్లు క్లినిక్‌లో కాలు పెట్టేరు. సూదులు, గొట్టాలు పట్టుకుని నర్సులు చుట్టూ మూగేరు. రక్తపు పోటు, నాడి, హృదయ స్పందన, ఇ.సి.జి. వగైరాలు గుండెకి ఢోకా లేదని నిర్ధారించేయి. బుర్రకి తీగెలు తగిలించి ఇ. ఇ. జి. తీసేరు. అదీ బాగానే ఉన్నట్లు అనిపించింది కాని చిన్న

అనుమానం మిగిలిపోయింది. కంటి వైద్యుడు వచ్చి కళ్లని పరీక్ష చెసేడు. నూటికి నూరు మార్కులు ఇవ్వలేనన్నాడు. కుడి మెదడులో లోపం ఉందేమో అని ఆయన అనుమానం.

మెదడు ఉపరిభాగంలొ, ఈ చెవి నుండి ఆ చెవి వరకు, ఉండే భాగాన్ని చలనపు చార అంటారు. ఈ చార వెంబడే కదలికకి సంబంధించిన కేంద్రాలన్నీ ఉన్నాయి. శరీరంలోని చలనాలన్నీ ఈ కేంద్రాల పర్యవేక్షణలోనే జరుగుతాయి. ఈ చలనపు చారని ఆనుకుని మెదడు వెనక భాగంలో, ఇరుపక్కలా, శ్రవణ కేంద్రాలు ఉన్నాయి. ఈ శ్రవణ కేంద్రాలని ఆనుకుని, మెదడు వెనక భాగంలో దృష్టి కేంద్రం ఉంది. వాక్ కేంద్రం ఎడమ మెదడులో మాత్రమే ఉంది. మిడతంభొట్లు మాటలో ఎక్కడా లోపం కనిపించలేదు కనుక కుడి మెదడు మీద కేంద్రీకరించారు వైద్యులంతా. కాని కుడి మెదడులో ఎక్కడ?

నూరాలజీ డాక్టర్ కళ్లు మరొక సారి పరీక్ష చెయ్యాలన్నాడు. కళ్లల్లోని కండరాలు బలంగానే ఉన్నాయి. వాటి ప్రతివర్తితలు బాగానే ఉన్నాయి. మెదడుకి రక్తాన్ని తీసుకెళ్లే గళ ధమనిలో రక్త ప్రవాహం బలంగానే ఉంది. డాక్టర్లంతా ఎక్కడ బయలుదేరారో అక్కడికే వచ్చారు. ఇక మెదడు మూరు మూలలన్నీ కంచు కాగడా పెట్టి వెతకాలి. కపాలాస్తిక తమ్మి మెదడు మూరు మూలలో ఉంది. దానిని పరీక్షించాలంటే చిన్న బ్రహ్మ ప్రయత్నం చెయ్యాలి.

నర్సు వచ్చి టెక్నీటియం పెరిటెక్నిటేట్ ఒక సిరలోకి సూది ద్వారా ఎక్కించింది. ఆ మందు రక్తప్రవాహంతో పాటు మెదడులోకి వెళ్లగానే, ఒక రకం కేమెరాతో బుర్రకి వివిధ కోణాల నుండి ఫొటోలు తీసేరు. వీటిని బట్టి కపాలాస్తిక

తమ్మి దగ్గర చక్షు శ్రవణ కేంద్రం అతి కొద్దిగా వాచినట్లు అనిపించింది. అక్కడ ఏదో దోషం ఉంది. కాని అది ఎంత హాని చేస్తుందో వైద్యులు తేల్చి చెప్పలేకపోయారు. శస్త్ర చికిత్స అవసరమా, కాదా అన్న మీమాంశలో పడ్డారు. శస్త్ర చికిత్సతో వెంటనే ఫలితం కనిపించే అవకాశం ఉంది కాని ప్రమాదం కూడా ఉంది. అందుకనే ఇది ఆఖరున ఎన్నుకోవలసిన మార్గం. శస్త్రం అంటే మాటలా? మెదడులో అంగుళం లోతు గొయ్యి తవ్వాలి. తవ్వి, ఆ గోతి గుండా వైద్యుడి వేలిని పోనిచ్చి, తమ్మిని తడిమి చూడాలి. ఈ గొయ్యి వెళ్లే మార్గంలోనే దృష్టి కేంద్రం ఉంది. ఏదైనా పొరపాటు జరిగితే దృష్టి పోయే ప్రమాదం ఉంది. మనం ఊహించని సంఘటన జరిగి ప్రాణం పోవచ్చు. నిజంగా మానవుడి మస్తిష్కం యొక్క కట్టడి ఇంకా మనకి పూర్తిగా అవగాహన కాలేదు. పోనీ అని శస్త్ర చికిత్స చెయ్యకుండా వదిలెస్తే ప్రాణానికి మరొక విధంగా ప్రమాదం. ఈ విషయాలన్నీ వైద్యులు మేష్టారితో కూలంకషంగా చర్చించేరు. తుది నిర్ణయం మేష్టారి భుజస్కంధాల మీద ఒదిలేశారు.

ఇది ఏకాంతంగా చెయ్యగలిగే నిర్ణయం కాదు. సంసారంలోని సభ్యులందరూ బహుముఖ సమావేశం అయేరు. ఆపరేషన్ వల్ల కాదన్నారు నాన్నగారు. విరేట్రం ఆల్బం 200 తో ఆయన హోమియోపతీ వైద్యం మొదలు పెట్టేరు. ఎందుకైనా మంచిదని అబ్బాయి జాతకం కూడ ఒక సారి చూసేరు. మామ్మ అవధానికి కబురంపింది. అరగంటలో అవధాని ఆంజనేయ దండకం చదువుతూ ప్రత్యక్షమయేడు. పెరటి వీధిలో ఉన్న సాయిబు కాదు కదా, ఆ సాయిబు తాత తల్లో జేజెమ్మ కూడ తన మనవడిని ఏమీ చెయ్యలేదని మామ్మ

సవాలు చేసింది. నాన్నగారు జాతకాన్ని ఎలాగైనా మరమ్మత్తు చెయ్యాలని చూస్తున్నారు. వాకట్లో, ఆరుబయట, మంచం మీద వెల్లకిల్లా పడుక్కుని మిణుకు మిణుకుమంటూన్న నక్షత్రాల వైపు చూస్తున్నారు, మిడతంభొట్లు గారు. ఆయన పక్కనే రాధ బితుకు బితుకుమంటూ కూర్చుని ఉంది. వేళ దరిదాపు అర్ధరాత్రి కావస్తోంది.

"ఏమైనా గుణం కనిపించిందా నాన్నా?" అంటూ నాన్నగారు హోమియోపతీ మందు సీసా పట్టుకుని వాకట్లోకి వచ్చేరు, మరొక మోతాదు ఇవ్వడానికి కాబోలు. మిడతంభొట్లు ఒక్క సారి తుళ్లిపడి మంచం మీదనుండి కిందకి గెంతేరు. అదే సమయంలో వాకలంతా పట్టపగలులా వెలుగుతో నిండి పోయింది. ఆకాశంలో అంతవరకు కనిపించీ కనిపించనంతగా ఉన్న ఒక నక్షత్రం, చూస్తుండగా, నూరింతల కాంతితో ప్రకాశించడం మొదలెట్టింది. ఏసుక్రీస్తు పుట్టబోయే ముందు నాజరత్‌లో కనిపించిన తారలా మిలమిలా మెరిసిపోయిందా నక్షత్రం.

"అప్పుడే తెల్లారగట్ర అయిపోయిందా?" అంటూ మామ్మ వాకట్లోకి వచ్చింది.

"అవతార పురుషుడు ఎవ్వరో పుడుతున్నాడురా!" అన్నారు నాన్నగారు.

"అది నోవా నాన్నగారూ! ఆకాశంలో పేలిపోతూన్న నవ్యతార! ఆహా! నాకే జబ్బూ లేదు. ఇదంతా కేవలం రాంగ్ నంబర్ నాన్నగారూ. రాంగ్ నంబర్!" అన్నారు మిడతంభొట్లు.

(తెలుగు భాషా పత్రిక (17 జూలై 1970) వారు నడిపిన సైన్సు ఫిక్షన్ కథల పోటీలో ప్రోత్సాహక బహుమానం పొందిన కథ. రచన (ఆగష్టు 1992) లో పునర్ముద్రితం. వంగూరి ఫౌండేషన్ వారి ప్రథమ కథా సంకలనం (జూలై, 1995) లో మళ్లా ముద్రించేరు.)

# కాకతాళీయం

ప్రొఫెసరు మిడతంభొట్లు నోబెల్ బహుమానం అందుకున్న తొలి తెలుగు వాడు. నలిగిపోయిన బట్టలు, ఉడతలు పీకిన తాటి టెంకలా జుత్తుతో చూట్టానికి అపర అయిన్‌స్టయిన్‌లా ఉంటాడు. అతి నిదానంగా మాట్లాడే తత్త్వం. ఏదయినా ప్రశ్న అడగండి. మూడు నిమిషాలు పోయే వరకూ నోట మాట రాదు. ఆలోచన పూర్తి అయిన తరువాత నోరు విప్పి, వాక్యం మధ్యలో ఆపేసి, మరో రెండు నిమిషాలు ఆలోచించి, మరో రెండు మాటలు చెబుతాడు.

నేను ఒక పత్రికా విలేకరిని. మిడతంభొట్లు మేస్టారికి నోబెల్ బహుమానం రాకముందే, ఆయనతో ఉన్న పరిచయం వల్ల, చాల తడవలు ఆయనతో ముఖాముఖీ జరిపిన గోష్టులు పురస్కరించుకుని సంపాదించిన అనుభవంతో చెబుతున్నాను.

“అయ్యా, రేపు ఉదయం సూర్యుడు తూర్పున ఉదయిస్తాడా?” అని అతి సామాన్యమైన ప్రశ్న అడిగేమనుకొండి. దానికి మిడతంభొట్లు సమాధానం ఇలా ఉంటుంది.

“సూర్యుడా? మన సూర్యుడా? తూర్పునా? ఈశాన్య దిశలో ఉదయిస్తే అది తూర్పు కింద లెక్కలోకి వస్తుందా? అసలు ఉదయించటం అన్నదానికి నిర్వచనం ఏమిటి? సూర్యబింబం ఉత్తరపు అంచు దిక్‌చక్రం దాటుకుని మొదటిసారి కనబడటమా? లేక, బింబం పరిపూర్ణంగా దిక్‌చక్రం మీదకి రావటమా...? అంటూ ఆలోచనలో పడిపోయి, వాక్యాన్ని అసంపూర్ణంగా ఆపేసి,

మరోలోకంలోకి వెళ్లిపోతాడు. ఆయన తర్జనభర్జనలు తెగతెంపులు అయేసరికి తూర్పు తెల్లారిపోతుంది.

సత్య శోధన, సత్య సాధన – ఈ రెండే ఆయన పరమార్థాలు. అటువంటి మిడతంభొట్లు ఖూనీ చేసేడన్న అనుమానం నాకు కలగగానే నా విచక్షణా జ్ఞానం మీద నాకే రోత పుట్టింది. ఒక కీలకమైన పరిస్థితిలో ఆయన బుర్రలోని ఆలోచనలు, మీనమేషాలు లెక్కెట్టకుండా, పంచకల్యాణి గుర్రంలా పరిగెట్టి ఉండాలి. అలా కాని పక్షంలో ఈ ఖూనీ అసాధ్యం.

ఒక వేళ నా అనుమానం నిజమే అయినా ఇప్పుడు నేను చెయ్యగలిగేది ఏమీ లేదు. దీనికి రెండు కారణాలు. ఒకటి, నాకు తప్ప ఈ అనుమానం మరెవ్వరికీ రాలేదు. రెండు, చట్టరీత్యా ఈ కేసుకి కాలదోషం పట్టేసిందో లేదో తెలియదు కాని, ప్రజల దృష్టిలో మాత్రం పట్టేసింది. అలాగని ఈ విషయాన్ని ఎన్నాళ్లని కడుపులో దాచుకోగలను? వెళ్లగక్కకపోతే కడుపుబ్బి చచ్చిపోనూ? కథ వివరంగా చెబుతాను, మీరే నిర్ణయించండి.

## 2

మిడతంభొట్లూ, రమేషూ నా చిన్ననాటి సహాధ్యాయులు. కలిసి ఆడుకునేవాళ్లం. కలిసి చదువుకునే వాళ్లం. మిడతంభొట్లు అసలు పేరు నిడసనమెట్ల రామదాసు. రవంత చెవుడు ఉన్న మా మామ్మకి నిడసనమెట్ల అన్న మాట సరిగ్గా వినిపించక, “మిడతంభొట్లా?” అంది, ఒక సారి. అంతే! ఆ పేరే స్థిరపడిపోయింది.

రమేష్ తల్లిదండ్రులు తెలంగాణా ప్రాంతాల నుండి తరలి వచ్చి తునిలో స్థిరపడ్డారు. రమేష్ మంచి వ్యక్తిత్వము, స్ఫూర్తి ఉన్న మనిషి. ఆటలు బాగా ఆడేవాడు. మంచి వక్త. చాకు లాంటి మనిషి. కాని చదువు మాత్రం బాగా అబ్బలేదు. మేం ముగ్గురం కొత్తపేటలో ఒకే వీధిలో ఉండేవాళ్లం. శెలవలు వచ్చినప్పుడల్లా పెండ్యాల వారి పంచ కింద కూర్చుని కేరం బోర్డు ఆడటం మా దిన చర్యలో తప్పని సరి. మిడతంభొట్లుకి ఆటలలో పెద్దగా ఆసక్తి లేకపోయినా కేరంబోర్డు ఆటలో మాత్రం రమేష్‌కి లేశమాత్రం తీసిపోయేవాడుకాదు.

రమేష్ ఆడే పద్ధతే వేరు. ప్రయాస పడకుండా, అలవోకగా, ఏ బిళ్ల ఏ జేబు లోకి వెళుతుందో చెబుతూ, బల్ల మీద ఉన్న పిక్కలని నిమిషాల మీద తుడిచి పారేసేవాడు. అతను ఆడుతూ ఉంటే చూడ ముచ్చటేసేది. మరి మిడతంభొట్లో? ఒకొక్క బిళ్లని ఏ కోణంలో ఎంత జోరుగా కొట్టాలో, ఒరిపిడి తగ్గటానికి బల్ల మీద ఎంత గుండ జల్లాలో, లెక్కలు కట్టి, నానిచి, నసిగి, ఒకొక్క బిళ్లనీ జేబులలో వేసేవాడు. బల్లని ఖాళీ చెయ్యటానికి పది నిమిషాలు పట్టేది.

ఒక సారి వైజాగులో జిల్లా ఎత్తున పోటీలు జరిగేయి. అందులో రమేష్ ప్రభృతులని ఓడించి వెండి కప్పు గెలుచుకున్నాడు, మిడతంభొట్లు. రెండవ స్థానంలో కాంస్య పతకం గెలుచుకున్న రమేష్ ఎప్పుడూ అనేవాడు – గేం పాయింటు దగ్గర మిడతంభొట్లు మోసం చేసేడని. అది పోటీలో ఆఖరి ఆట. ఆఖరి బిళ్లని జేబులో వేసే అవకాశం మిడతంభొట్లుకి వచ్చింది. కాని రమేష్ నల్ల బిళ్ల అడ్డుగా ఉంది. దానిని తప్పించి తన తెల్ల బిళ్లని కొట్టాలి. చూస్తూన్న జనాలంతా అది అసంభవం అన్నారు. మిడతంభొట్లు ఎంతసేపు ఆలోచించేడో చెప్పలేం. ఆ

ఉత్కంఠ భరితమైన సమయంలో గోడ మీద బల్లి ఎవరిమీదో పడటం, వారు కెవ్వున కేక వెయ్యటం, అందరి దృష్టి అటువైపు మళ్లటం, అదే సమయంలో మిడతంభొట్లు తన తెల్ల పిక్కని జేబులోకి కొట్టటం – అంతా లిప్త మాత్రంలో జరిగిపోయింది. అడ్డుగా ఉన్న నల్ల పిక్కని మిడతంభొట్లు తన వేలితో పక్కకి తోసేడని రమేష్ అనుమానం. కాని అంత మంది మధ్యలో, అంత పనికి ఒడిగడతాడా? – ఎంత తెగువ సాహసం ఉన్నవాడైనా!

మిడతంభొట్లు, రమేషు ఉత్తర, దక్షిణ ధ్రువాలు. చదువులో మిడతంభొట్లుది ఎప్పుడూ ప్రథమ స్థానమే. రమేష్ మాత్రం దినదిన గండంలా పరీక్షలని నెట్టుకుని వచ్చేవాడు. రమేష్ వాలకం గమనించి వాడిని వాళ్ల నాన్న తనతో వ్యాపారంలో తిప్పటం మొదలు పెట్టేడు. వ్యాపారంలో కిటుకులు కనిపెట్టేసి తండ్రిని మించిన కొడుకు అనిపించుకున్నాడు, రమేష్. చదువంటే అబ్బలేదు కాని సిరి అబ్బింది. మిడతంభొట్లు విద్వత్ సభలలో పురస్కారాలు అందుకుంటే, రమేష్ పెద్ద పారిశ్రామిక వేత్తగా, రసాభౌకం (రసాయనిక, భౌతిక కంపెనీ) అధినేతగా ఎన్నెన్నో పురస్కారాలు అందుకున్నాడు. కోటికి పడగలు ఎత్తేడు.

భౌతిక, రసాయనిక శాస్త్రాలలో ఎవ్వరయినా కొత్త విషయాలు కనిపెట్టేరంటే చాలు, రమేష్ దాన్ని వెంటనే ఆచరణలో పెట్టి చిన్నో, పెద్దో ఉపకరణాన్ని తయారు చేసేవాడు. చేసి, బజారులో అమ్మకానికి పెట్టేవాడు. పెట్టి, పెట్టెల నిండా గణించేడు.

మిడతంభొట్లు రాసి, ప్రచురించిన పరిశోధన పత్రాలు తనకి అర్థం కాకపోయినా పరవా లేదనేవాడు. డాక్టరేటు పట్టాలున్న పెద్ద పెద్ద మేధావులకి పెద్ద పెద్ద జీతాలిచ్చి, వాళ్ల సహాయంతో మిడతంభొట్లు ప్రతిపాదించిన సిద్ధాంతాలని కూలంకషంగా అర్థం చేసుకుని, ఆయన కూడ ఊహించని విధంగా, ప్రజానీకానికి ఉపయోగపడే అనేక ఉపకరణాలు తయారు చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. మిడతంభొట్లు ఏదో చేసేడని అందరికీ తెలుసు; రమేష్ ఏమిటి చేసేడో అందరికీ తెలుసు. అదీ వీళ్లిద్దకీ తేడా.

అవి మిడతంభొట్లు నోబెల్ బహుమానం అందుకున్న కొత్త రోజులు. ఆయిన్‌స్టయిన్ అంతటివాడికి కొరుకుపడని సమస్యని ఇతగాడు సాధించేడుట. అందుకని నోబెల్ బహుమానం ఇచ్చేరుట. ఆమాత్రం సామాన్యులందరికీ గ్రాహ్యం అయింది. కాని మిడతంభొట్లు నిజంగా ఏమిటి కనిబెట్టేరో సామాన్యులకి అర్థం అయే రీతిలో చెప్పటం కొంచెం కష్టమే. రామానుజన్ ఏదో ఊడబొడిచేడని మనందరికీ తెలుసు. కాని ఆయన ఏమిటి చేసేడయ్యా అంటే లెక్కలు వచ్చిన వాళ్లే చెప్పలేరు. ఇదీ అంతే.

చిన్నతనం నుండీ సైన్సులో వ్యాసాలూ, జనరంజక శైలిలో వైజ్ఞానిక కల్పనలూ రాసే అలవాటు నాకుంది. అందుకని మిడతంభొట్లు గారితో ముఖాముఖీ సంభాషణ జరిపి ఆయన లేవదీసిన ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతాన్ని నలుగురికీ అర్థం అయే శైలిలో తిరగ రాసి ప్రచురించమని మా పత్రిక వారు నాకు పురమాయింపు ఇచ్చేరు.

నాలాంటి పత్రికా విలేకరే ఒకసారి అయిన్‌స్టయిన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్దాంతం ఎంతకీ అర్థం కాక, ఆయననే తరుణోపాయం అడిగేడుట. “అందమైన అమ్మాయితో కూర్చుని కబుర్లు చెబుతూ ఉంటే యుగాలు నిమిషాలలా గడచిపోతాయి. బోటనీ పాఠం బోరు భరించలేని వాడికి ఒక గంట ఒక యుగంలా గడుస్తుంది. ఇదే నా సిద్ధాంతంలోని సారాంశం.” అని చమత్కరించేరుట ఆయన. ప్రజాబాహుళ్యం యొక్క పిపాస తీర్చటానికి ఇలాంటి చిన్న పిట్ట కథ ఒకటి చాలు; సిద్ధాంతంలోని ఒంపు సొంపులన్నీ విడమర్చి చెప్పక్కరలెదు.

ఇలాంటి పిట్ట కథ – ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతానికి సంబంధించినది – ఏదయినా మిడతంభొట్లు దగ్గర సంపాదించలేకపోతానా అన్న ఆశ నా మనస్సులో ఉంది. కాని ఆయన నసుగుడు, నానుపుడు భరించగలగాలి. జనరంజకమైన కథ కావాలనుకుంటే ఆయన్ని కొంచెం రెచ్చగొట్టాలి. తరువాత కాసింత మసాలా కలపాలి. అందుకని,

“మేష్టారూ, మీరు ప్రతిపాదించిన ద్వంద్వ క్షేత్ర సిద్దాంతం నిజమయితే, దాని పర్యవసానంగా భూమి యొక్క ఆకర్షణ శక్తికి విరుగుడుగా, మరొక ప్రతిశక్తిని సృష్టించవచ్చని అభిజ్ఞ వర్గాలలో అనుకుంటున్నారు. అంటే ఆ సందర్భంలో భూమి యొక్క ఆకర్షణ శక్తి నశించటమే కదా? ఇలా గురుత్వాకర్షణ ఏష్యం అయిపోవటం సాధ్యమేనంటారా?”

ముక్కు మీద జారిపోతూన్న కళ్లజోడుని పైకి ఎగదోస్తూ , నన్ను ఎగా దిగా ఒక సారి చూసి, “భూమి యొక్క ఆకర్షణ శక్తిని నశింపచెయ్యటం అన్నా,

గురుత్వాకర్షణని ఏష్యం చెయ్యటం అన్నా 'ఏంటీ గ్రేవిటీ' ని సృష్టించటం. అవునంటావా?"

అవునని తల ఊపేను. చిన్న నాటి స్నేహితుడే అయినా ప్రపంచ విజ్ఞాన రంగంలో తారాపథాన్ని అందుకున్న మిడతంభొట్లుని ఏకవచనంతో సంబోధించటానికి జంకేవాడిని. కాని ఆయన నన్ను నువ్వు అని సంభోధించటం నా ప్రోద్బలం వల్లనే. ఈ పరిచయాన్ని వాడుకునే విజ్ఞాన విలేకరిగా ఉద్యోగం సంపాదించుకున్నాను.

" 'అప్పులడిగే అప్పారావుని ఎలా తప్పించుకోలేమో అలాగే ఈ గురుత్వాకర్షణ గుప్పిట్లోంచి ఏదీ తప్పించుకోలేదు. గురుత్వాకర్షణ ఒక నీడ లాంటిది. అది సర్వవేళ సర్వావస్థలయందు మనని వెన్నంటి తిరుగుతూనే ఉంటుంది' అని మీరే ఒక సారి అన్నారు కదా. మరి మీ ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం ప్రకారం ఈ గురుత్వాకర్షణ బారి నుండి తప్పించుకుందికి యంత్రాలు నిర్మించి, వాటితో విద్యుత్ శక్తి భారీగానూ, చవగ్గాను ఉత్పత్తి చెయ్యొచ్చని ప్రజలు అనుకుంటున్నారు. దీని మీద మీ అభిప్రాయం ఏమిటో చెబుతారా?"

"ఏంటీ గ్రేవిటీ! అంటే, నాస్తి గురుత్వం గురించా? నా ద్వంద్వ క్షేత్ర సమీకరణాలని ఎటువంటి ప్రహరాంక్షలతో పరిష్కరిస్తే ఏకైక వైపరీత్యాలు లేకుండా పరిమిత పరిష్కారం వస్తుందో......అలాంటి పూరణం లేని పక్షంలో.....ఏంటీ గ్రేవిటీకి సావకాశం లేదేమో...ఉన్నా రీమాన్ క్షేత్రంలో....."

ఇది ఇప్పట్లో తెమిలే విషయం కాదని నాకు తెలుసు. ఈ సైన్సు భాష ఎన్ని సార్లు విన్నా నాకు అర్థం అయి చావదు కదా. పైగా, ఈ తర్జన భర్జనలు

అయిపోయేసరికి తెల్లారిపోతుంది. నేరకపోయి అడిగేనురా భగవంతుడా. మధ్యలోనే లేచి వెళ్లిపోతే మర్యాదగా ఉండదు, మళ్లా ముఖాముఖీ సమావేశానికి అవకాశం ఉండదు. ఆయన మన లోకంలో లేడు. ఎందుకైనా మంచిదని నేనే కలుగజేసుకుని, ఒక సారి గొంతుక సవరించుకుని, అన్నాను.

"...ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతపు సమీకరణాలని ఉపయోగించి ఏంటీగ్రేవిటీ సృష్టించవచ్చని రమేష్ అంటున్నాడండీ.."

"వ్యాపార సరళి తెలిసిన వ్యక్తి. ప్రజలకి ఏది కావాలో అది తెలుసుకుని, తయారుచేసి అమ్మగల సమర్ధుడు. బాగా గణిస్తున్నాడని విన్నాను...."

ఈ సమాధానం నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. అన్న మాటలు కాదు; అవి పలికిన తీరు. మాటలు తడుముకోకుండా, శషభిషలు పెట్టకుండా, ముక్తసరిగా, ముచ్చటగా మూడు వాక్యాలు. చిన్న వాక్యాలే అనుకోండి. ఒక్కుమ్మడిగా ఆయన అలా అనటం, అదే మొదటి సారిగా నేను వినటం. ఇంకొక విచిత్రం ఏమిటంటే, నేను అడిగిన ప్రశ్న ఒకటి, ఆయన ఇచ్చిన సమాధానం మరొకటి. ఈ డొంకతిరుగుడు సమాధానం లోని అంతరార్థం ఏమిటా అని నేను ఇంకా ఆలోచిస్తూ ఉండగానే మిడతంభొట్లు, మళ్లా అందుకున్నారు.

"...విద్యావంతుడికి వినయమే సంపన్నం. డబ్బు చేదని అనను. ధనం మూలం మిదం జగత్ అన్నారు. కాని విజ్ఞానవేత్తలు విత్త వాంఛనీ, విజ్ఞాన కాంక్షనీ సమ దృష్టితో చూడాలి..."

ఈ మధ్య ఈయనమీద భగవద్గీత ప్రభావం కనబడుతోంది. మిడతంభొట్లు మాటలలో బహిర్గతమైన అర్థంతో పాటు అంతర్గతంగా కొంచెం వ్యంగ్యం

ఉందేమో అనిపించింది. లేక రమేష్ ఐస్వర్యం చూసి అసూయ పడుతున్నాడా? కష్టపడి సిద్ధాంతాలు కనిపెట్టిందీయన. దానికి ఫలితంగా నోబెల్ బహుమానం వచ్చింది, నిజమే. కాని బహిరంగంలో, దమ్మిడీ ఖర్చు లేకుండా దొరికే ఈ సిద్ధాంతాలని వాడుకుని, వాటి ద్వారా పుట్టుకొచ్చిన శేముషీ సంపద మీద విశిష్టాధికారాలు పొంది, రమేష్ దోసిళ్లతో గణిస్తూన్న డబ్బుతో పోల్చి చూస్తే నోబెల్ బహుమానం ఏ మూల? హస్తిమశకాంతరం! ఈ విశ్లేషణ అంతా నా స్వకపోల కల్పితమే సుమండీ! మిడతంభొట్లు మనస్సులో దూరి ఆయన అంతరంగిక భావాలని కనుక్కునే స్తోమత నా దగ్గర లేదని నాకు తెలుసు.

"...నేనిలా అంటున్నానని నన్ను అపార్థం చెసుకోవద్దు. రమేషు, నేను – మనం అంతా – బాల్య స్నేహితులం. రివాజు తప్పకుండా కేరం బోర్డు ఆడేవాళ్లం."

"రమేష్ ఏంటీ గ్రేవిటీ సృష్టిస్తానని అంటున్నాడండీ. నెగ్గుకు రాగలడంటారా?"

"చూడు, నాయనా! ఏంటీ గ్రేవిటీ అంటే అర్థం కావాలంటే ముందు గ్రేవిటీ అంటే ఏమిటో అర్థం అవాలి. గ్రేవిటీ అంటే గురుత్వాకర్షణ. పుద్గాలం, లేదా గురుత్వం, లేదా భారీతనం ఉన్న పదార్థాలన్నిటికి ఈ ఆకర్షణ ఉంటుంది. భారీతనం ఎంత ఎక్కువ ఉంటే ఈ ఆకర్షణ అంత ఎక్కువ. కొబ్బరి బొండాం చెట్టుని వీడి నేల మీద పడుతోందంటే దానికి కారణం భూమికి ఉన్న గురుత్వాకర్షణే. చంద్రుడు భుమి చుట్టు తిరగటానికీ, గ్రహాలు తమ గతులు

తప్పకుండా సూర్యుడి చుట్టూ పరిభ్రమించటానికీ కారణం ఈ గురుత్వాకర్షణే. ఆయిన్‌స్టయిన్ ప్రతిపాదించిన సాధారణ సాపేక్ష సిద్ధాంతం ప్రకారం...”

ఇహ ఈయన పురాణం విప్పుతూన్నట్లున్నాడు. ఇది ఇంతకు పూర్వం విన్న ఊక దంపుడే. కాని మధ్యలో ఆపేమంటే మంత్రం చదువుతూన్న పురోహితుణ్ణి ఆపినట్లవుతుంది. తన ఆలోచనకి అంతరాయం కలిగిందంటే మళ్లా మొదటినుండి లంకించుకుంటాడు. అందుకని నోరు మెదపకుండా, కుదురుగా కూర్చుని సావధానంగా వినటం మొదలు పెట్టేను.

“...గురుత్వాకర్షణ ఊహించుకోచటం ఎలాగో చెబుతాను, విను. దిట్టంగా ఉన్న ఒక పెద్ద జంబుఖానాని నాలుగు పక్కలా సాగదీసి పట్టుకున్నాం అనుకుందాం. ఇదే మన గురుత్వాకర్షణ క్షేత్రం. ఇప్పుడు ఈ క్షేత్రంలో భారీగా ఉన్న ఒక బంతిని ఉంచేమనుకుందాం. బంతి ఉన్న చోట జంబుఖానాకి లొత్త పడుతుంది. బంతి ఎంత పెద్దదయితే అంత లోతుగా లొత్త పడుతుంది.

“ఈ విశ్వం ఒక పెద్ద రబ్బరు జంబుఖానా లాంటిది. సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు, వగైరాలు భారం ఉన్న బంతులు లాంటివి. కనుక ఈ నక్షత్రాలు, గ్రహాలు ఉన్న పరిసరాల్లో జంబుఖానా లొత్తలు పడుతుంది. పిండి కొద్దీ రొట్టెలా కొన్ని పెద్ద లొత్తలు, కొన్ని చిన్న లొత్తలు. ఇలా లొత్తలతో నిండిన విశ్వంలోకి ఒక గోళీని విసిరేమని అనుకుందాం. అది దొర్లుకు వెళ్ళి ఏదో ఒక లొత్త సమీపంలో స్థిరపడుతుంది. నిజానికి జంబుఖానా లేదు, లొత్తలు లేవు. అవి మనం ఊహించుకోటానికి ఉపయోగపడే ఉపమానాలు, అంతే. ఈ లొత్తల దగ్గరకి వెళ్లిన గోళీని చూసి నూటన్ ఏమనుకున్నాడు? గ్రహం గోళీని

ఆకర్షిస్తోందని అనుకున్నాడు. న్యూటన్ అనుకున్నది రజ్జు సర్ప భ్రాంతి లాంటి భ్రమ అంటారు అయిన్‌స్టయిన్. ఒంపులు, లొత్తలతో ఉన్న గురుత్వాకర్షణ క్షేత్రంలో జారుతూన్న గోళీని చూసి గ్రహం గోళీని ఆకర్షిస్తున్నాదని న్యూటన్ భ్రమ పడ్డాడు."

ఇంతవరకు కొట్టిన పిండిని మరో సారి దంచటం కనుక ఉపన్యాసం అనర్గళంగానే సాగింది. గుక్క తిప్పుకోటానికి ఆగినట్లున్నారు. కథ చెబుతూన్నప్పుడు ఊకొట్టకపోతే మర్యాదగా ఉండదు. అందుకని నేనే కలుగజేసుకుని అన్నాను.

"వెనకటికి ఒక గురువుగారు శిష్యపరమాణువులకి వేదాంత తత్త్వం బోధ చేస్తూన్న సందర్భంలో ఒక మదించిన ఏనుగు వీరి ఆశ్రమం వైపే పరిగెత్తుకుని వస్తోందిట. శిష్య పరమాణువులు భయపడి పరుగు లంకించుకున్నారుట. వారి భయాన్ని చూసి, గురువుగారు మందస్మిత వదనారవిందంతో, "గజం మిథ్య, గజం మిథ్య" అని వేదాంత ధోరణిలో ధైర్యం చెప్పేరుట. అంటే ఏనుగు మన భ్రమే సుమా అని అర్థం కదా. కాని ఆ ఏనుగు ఆగకుండా ఆశ్రమం వైపే జోరుగా వస్తోందిట. అప్పుడు గురువు గారు కూడ కాలికి బుద్ధి చెప్పేరుట. పరిస్థితి కుదుటబడ్డ తరువాత, "అయ్యా గజం మిథ్య అన్నారే, మరి తమరెందుకు పలాయన మంత్రం పఠించేరు?" అని అమాయకంగా ఒక పరమాణు రేణువు తెగించి అడిగేడుట. దానికి మన గురువు గారు సావధానంగా "గజం మిథ్య, పలాయనం మిథ్య!" అంటూ చిరునవ్వుతో సమాధానం చెప్పేరుట. అలా ఉంది మీరు చెపుతూన్నది."

నా పిట్ట కథతో ఆయన ఏకాగ్రతకి భంగం కలిగినట్లుంది. అందుకని స్పందించకుండా మళ్ళా అందుకున్నారు.

“ఏంటీ గ్రేవిటీని సృష్టించటం అంటే మన "జంబుఖానా విశ్వం" లో ఉన్న లొత్తలని తీసేసి జంబుఖానాని సాఫు చెయ్యటం. ఇలా గురుత్వాకర్షణ క్షేత్రాన్ని సాఫు చెయ్యటం సుసాధ్యమైన పని కాదు...”

“...మరి మీ ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతపు...”

“వస్తున్నానోయ్! తొందర పడకు. ద్వంద్వ క్షేత్రాలంటే ఏమిటి? గురుత్వ క్షేత్రం. విద్యుదయస్కాంత క్షేత్రం. ఈ రెండింటిని కలిపి ఒకే ఒక గణిత సమీకరణంతో వర్ణించాలని అయిన్‌స్టయిన్ కలలు కని, కన్ను మూసేరు. ఆయిన్‌స్టయిన్ తరువాత ఎంతోమంది ప్రయత్నించి విఫలులయారు. కారణం ఏమిటని ఎప్పుడైనా ఆలోచించావా?”

ఆలోచించలేదని బుర్ర అడ్డుగా ఆడించేను.

“ఎండ లేకుండా నీడ లేదు. చావు లేక పోతే పుట్టుక లేదు. బొమ్మ లేకపోతే బొరుసు లేదు...”

నా మనస్సులో గభీమని ఒక ఆలోచన మెరిసింది. “నాణేనికి బొమ్మ, బొరుసు ఎలాగో ఈ విశ్వానికి గురుత్వాకర్షణ క్షేత్రం, విద్యుదయకాంత క్షేత్రం అలాగని మీరు అంటున్నారా?”

“అనుకో. సూక్ష్మంగా అదీ కథ. సంగతి, సందర్భం అనుకూలిస్తే ఈ రెండు శక్తులని ఒకదానికి మరొకటి విరుగుడుగా వాడి, రబ్బరు గుడ్డలా ఉన్న విశ్వానికి పడ్డ లొత్తలని కొన్నింటిని తీయవచ్చు. కాని ఆ సంగతి, సందర్భం

అనుకూలించటమే కష్టం. నిజానికి విద్యుదయస్కాంత ఆకర్షణ గురుత్వ ఆకర్షణ కంటె ఎంతో ఎక్కువ శక్తిమంతమైనది. అయినా సరే ...."

"గురుత్వాకర్షణని అధిగమించటం అంత కష్టం కాదంటున్నాడు రమేష్...."

"అంటాడోయ్ ఎందుకనడూ? డబ్బంటే మస్తుగా ఉంది కాని పై అంతస్తులో సరుకు లేదోయ్. అయినా కాకి పిల్లకేం తెలుస్తుందోయ్ ఉండేలు దెబ్బ. అయినా నాకు తెలియక అడుగుతాను. ఆ రమేష్‌కి భౌతిక శాస్త్రం ఏమి వచ్చూ అని? మనలో మన మాట. ఆ రమేష్‌ని ఆంధ్రా యూనివర్శిటీ వారు డిగ్రీ ఇవ్వకుండా పంపించేసేరు, తెలుసా?"

"అయితే రమేష్ చెప్పేవన్నీ ప్రగల్భపు పలుకులే అంటారా? ఏంటీ గ్రేవిటీ అసాధ్యం అంటారా?"

"మానవుడి బుర్రకి ఊహ తట్టాలే కాని సాధ్యం కానిది ఏదీ లేదోయ్. అసాధ్యం అనే మాట నా నిఘంటువులో లేదోయ్. ఈ రోజు సాధ్యం కాకపోతే రేపు సాధ్యం కావచ్చు. ఆయిన్‌స్టయిన్ అసాధ్యం అనుకున్నది ఇప్పుడు సాధ్యం కాలేదూ? బొడ్డూడని వాళ్లంతా భౌతికశాస్త్ర వేత్తలమే అంటే...."

నాకిది చాలు. మా పత్రికకి కావలసినది, ప్రజలు ఎగిరిపడి చదవగోరేదీ అయిన కథా వస్తువు మిడతంభొట్లు నోటి నుండి వచ్చింది. మేష్టారి వద్ద సెలవు తీసుకున్నాను.

## 3

మిడతంభొట్లుకి పుస్తకాల పరిజ్ఞానం తప్ప ప్రపంచ జ్ఞానం లేదంటాడు రమేష్. పొగరుతో ప్రగల్భాలు పలుకుతాడు తప్ప రమేష్‌లో పస లేదని మిడతంభొట్లు అంటారు. అయినా ఇద్దరూ ముఖాముఖీ కలుసుకున్నప్పుడు ఒకరి యెడల మరొకరు గౌరవంగానే ఉంటారు. అంతెందుకూ? ఇప్పటికీ, ఈ ప్రచ్ఛన్న యుద్ధం ఒక పక్క జరుగుతూ ఉన్నప్పటికీ, వీలైనప్పుడల్లా ఇద్దరూ కేరం బోర్డు ఆడుతూనే ఉంటారు.

పత్రికలలో నా శీర్షిక రాసేసి మరేదో పనిలో మునిగి పోయాను. ఇట్టే మూడు నెలలు తిరిగిపోయాయి. నేను రాసినది చదివిన దగ్గరనుండి రమేష్ కారాలు, మిరియాలు నూరేస్తున్నాడని విన్నాను. “ఏంటీ గ్రేవిటీ ఇంజను” నిర్మించి తీరతానని శపథం పట్టేడుట. ఆ యంత్రాన్ని మిడతంభొట్లు సమక్షంలోనే పరీక్ష చేసి తన సత్తా నిరూపించుకుంటానని సవాలు కూడ చేసేట్ట. ఇదే మంచి అవకాశమని రమేష్‌తో ఒక ముఖాముఖీ సమావేశానికి అనుమతి సంపాదించేను. ఏంటీ గ్రేవిటీ ఇంజను మీద పని ఎంత వరకు వచ్చిందో కనుక్కోవాలని నా ఆశ. ఆయన ఆఫీసులో అర గంట సేపు పడిగాపులు పడి ఎదురు చూడగా, చూడగా చివరికి ప్రత్యక్షమయేడు. పత్రికల వారితో పేచీ పెట్టుకునే తత్త్వం కాదు రమేష్‌ది. ఆలశ్యం అయినందుకు క్షమార్పణ చెప్పుకున్నాడు. అతని వాలకం చూస్తే ఏంటీ గ్రేవిటీ ఇంజను ఇబ్బందిలో పడిందేమో అని అనుమానం వేసింది. ఆ విషయమే అడిగేను.

“ఎవరు చెప్పేరు? ఆ నిడసనమెట్ల వాడేనా?”

రమేష్‌కి కోపం వచ్చినప్పుడు మిడతంభొట్లుని ఇంటిపేరుతో పిలుస్తాడు. అందుకని, నా జాగ్రత్తలో నేను ఉన్నాను.

"ఎవరూ కాదండి. ఏదో కర్ణాకర్ణిగా విన్నదేనండి.

"నీ శ్రుతపాండిత్యం అంతా ఆ మిడతంభొట్లు దగ్గర సంక్రమించిందే. ఏంటీ గ్రేవిటీ సంభవమో, అసంభవమో నీ కళ్ల ముందే రుజువు చేస్తాను, రా," అని జబ్బ పుచ్చుకుని పై అంతస్తులో ఉన్న ప్రయోగశాలలోకి లాక్కెళ్లేడు.

రమేష్ అమర్చిన ప్రయోగశాల చాల క్లిష్టమైనది. చాల చాకచక్యంతో చేసేడని ఒప్పుకోవాలి. భౌతిక శాస్త్రంతో బాగా పరిచయం ఉన్నవాళ్లకి తప్ప సామాన్యులకి గభీమని అర్థం కాదు. అయినా టూకీగా చెబుతాను. రెండు అయస్కాంతాల మధ్య ఒక బలమైన విద్యుదయస్కాంత క్షేత్రం సృష్టించేడు. ఆ అయస్కాంతాల మధ్య భూమి యొక్క గురుత్వాకర్షణ క్షేత్రం ఎలాగూ ఉండనే ఉంది. భూమి యొక్క ఆకర్షణ శక్తిని విద్యుదయస్కాంత శక్తితో రద్దు చెయ్యాలి. అది ఎంత రద్దయిందో కొలవటానికి ఒక పరికరం కావాలి కదా. అందుకని ఆ అయస్కాంతాల మధ్య "మాస్బావర్ ఎఫెక్ట్" త్రాసు ఒకటి అమర్చేడు. అంటే మరేమీ కాదు. సంబద్ధమైన గామా కిరణవారాన్ని భుమ్యాకర్షణ క్షేత్రం గుండా పంపుతారు. ఆకర్షణ క్షేత్రంలో ఏదయినా మార్పు కలిగితే, తత్‌ఫలితంగా గామా కిరణాల తరంగ దైర్ఘ్యం మారుతుంది. ఆ మార్పుని కొలిచి, ఆకర్షణ క్షేత్రంలోని మార్పుని లెక్కగట్టి, తద్వారా ఏంటీ గ్రేవిటీ క్షేత్రాన్ని కొలవచ్చు.

నాకు భౌతిక శాస్త్రంలో ప్రావీణ్యత లేకపోయినా కొద్ది పరిచయం ఉంది. విజ్ఞాన విలేకరిని కదా. అందుకని దేశదేశాలలో జరిగే విషయాలని చదువుతూ

ఉంటాను. రమేష్ చూపించిన ప్రయోగాల అమరికలో పెద్దగా కొత్తదనం ఏదీ లేదు. ఉరమరగా ఇలాంటి అమరికనే ఉపయోగించి అమెరికాలో ఆ మధ్య గురుత్వాకర్షణని ఇరవైరెండు శాతం తగ్గించేరు. ఆ విషయమే అడిగేను.

"గురుత్వాకర్షణని ఇరవైరెండు శాతం తగ్గించటానికి అమెరికా వారు ఎంత శక్తి వెచ్చించేరో తెలుసా? అంత విద్యుత్ శక్తి వెచ్చించకుండా మా ప్రయోగం చాల సమర్ధవంతంగా చేసేం. కావలిస్తే..."

"ఇరవైరెండు శాతం తగ్గించటం పెద్ద గొప్పేమీ కాదు. మీరు గురుత్వాకర్షణని పరిపూర్ణంగా తగ్గించగలరా? అదీ అసంభవమని మిడతంభొట్లు అన్నట్లు నాకు గుర్తు."

రమేష్ ముఖం జేవురించింది.

ఈ సిద్ధాంతాలూ, సమీకరణాలూ, వీటిని ప్రతిపాదించే సిద్ధాంతులూ, ఉప సిద్ధాంతులూ అంటే నాకు ఒళ్లు మంట. ఏవో రెండు సమీకరణలు రాసి, వాటిని ఎవ్వరూ చదవని ఒక అనామకమైన పత్రికలో ప్రచురించగానే సరిపోయిందా? ప్రజలు వాడుకుందికి వీలయిన విషయం ఒక్కటి కనిబెట్టేడుటయ్యా మీ మీడతంభొట్లు? అక్కరకు రాని విద్య అడవి గాచిన వెన్నెల. చేతనైన వాళ్లు చేసి చూపిస్తారు, చేతకాని వాళ్లు పాఠాలు చెప్పుకుంటారు. చూడు, మా రసాభౌకంలో ఎన్నెన్ని ఉపకరణాలు రూపుదిద్దుకుంటూన్నాయో. అందుకే మిడతంభొట్లుకి నేనంటే అంత ఈర్ష్య. అయినా నేనే మనలో మనకి స్పర్ధలు ఎందుకని అవకాశం వచ్చినప్పుడల్లా అతనితో కేరం బోర్డు ఆడుతూనే ఉంటాను."

"మీరు ఎప్పుడూ చిత్తుగా ఓడిపోయేవారట, నిజమేనా?"

మరీ కోపంతో రెచ్చిపోవటం పబ్లిసిటీకి మంచిది కాదని వ్యాపార దక్షుడైన రమేష్ కి తెలుసు. అందుకని, కోపాన్ని మింగుకుని, ప్రయత్నం మీద చిరునవ్వు తెచ్చుకుని,

"ఆ మరీ బడాయిలు. నా వంతు నేనూ గెలిచేను. నేను గప్పాలు కొట్టుకోను, అంతే. ఏదో వాడికి లెక్కలూ, సైన్సూ బాగా వచ్చేవి. మనలో మనమాట. సోషల్ స్టడీస్‌లో మిడతంభొట్లు సున్నప్పిడతే. ఏదో ఆ మద్దాల గంగారామయ్య గారు జాలిపడి పేసు మార్కులు ఇచ్చేవారు."

మనిషిని కుక్క కరిస్తే అది వార్త కాదు. కుక్కని మనిషి కరిస్తే అది పెద్ద వార్త. ప్రజలు పత్రికలు కొనాలంటే వాటిల్లో కాసింత మసాలా ఉండాలి. అందుకని,

"మీరు పట్టభద్రులు కాలేదుట, నిజమేనా?"

"అదీ మిడతంభొట్లే కూసేడూ? అసలు విషయం చెబుతా, రాసుకో. ఎందుకోయ్ ముష్టి డిగ్రీలు? వెధవ డిగ్రీ వచ్చిందంటే ముష్టెత్తుకుందికి కూడ వీలు లేదు; మధ్యలో నామోషీ అడ్డొస్తుంది. అందుకని నేనే చదువు మానేసేను. ఇప్పుడు చూడు, నా కంపెనీలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నానో. ఆ మిడతంభొట్లుకి వచ్చిన నోబెల్ బహుమానం వల్ల ఎవరికి ఏమి ఒరిగింది?"

ఈ రోజుకి ఇంటర్వ్యూ అయినట్లే. ఆఖరు మాటగా,

"అయితే ముడతలు పడ్డ మిడతంభొట్లు జంబుఖానాని రసాభౌకం ఇస్త్రీ చెయ్యలేకపోయిందని రాసెయ్యమంటారా?"

“ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ కావునన్ అన్నాడు కదోయ్, కవి. కనుక రబ్బరు జంబుఖానా మీద లొత్తలు తియ్యటానికి అనంత పద్మనాభుడు అంతరిక్షం నుండి దిగిరానక్కర లేదు, ఇస్త్రీ పెట్టెతో మా ఊరు మడేలు వస్తే చాలని మిడతంభొట్లుతో చెప్పు.”

ఒక ఏడు గడచిపోయింది. ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో ఆహ్వానపత్రిక ఒకటి ఉంది – రసాభౌకం నుండి. ఏమిటి చెప్మా అనుకుంటూ విప్పి చూసేను. ఏంటీ గ్రేవిటీ యంత్రం పురప్రముఖుల ఎదుట, పత్రికా విలేకరుల సమక్షంలో, ప్రప్రధమంగా ఆవిష్కరణ! ఈ సంరంభానికి ముందు ఒక గంట సేపు మద్య పానీయాలు!

ఏమీ లేకుండా ఇంత ఆర్భాటం చెయ్యటానికి ఎన్ని దమ్ములుండాలి? వెంటనే మిడతంభొట్లుకి కూడా ఆహ్వానం వచ్చిందో లేదో వాకబు చేసేను. వచ్చిందిట. ఆయన ఏదో సాకు చెప్పి తప్పించుకుంటాడని అనుకున్నాను. తప్పకుండా వస్తానన్నారు.

ముహూర్తపు రోజు రానే వచ్చింది. రసాభౌకం ప్రాంగణం చాల కోలాహలంగా ఉంది. నేను వెళ్లేసరికి పత్రికా విలేకరులతోటీ, ఫొటోలు తీసే వారితోటీ కలకలలాడుతోంది. రాజకీయ నాయకులు – అప్పనంగా దొరికిన మందుని అప్పటికే రెండు మోతాదులు పుచ్చుకున్నారేమో – మేఘాల మీదే ఉన్నారు.

రమేష్ వేదికని సమీపించి ఆహూతులందరినీ ఆహ్వానించేడు. ప్రపంచాన్ని దిక్భ్రమ చెందించే అపురూపమైన ప్రయోగాన్ని చూడబోతున్నారనిన్నీ, ఇది చరిత్రనే సృష్టించబోతూన్న సందర్భమనిన్నీ ముచ్చటగా మూడు ముక్కలలో స్వాగతం చెప్పేడు. వేదిక దిగబోతూ చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా వెనక్కి తిరిగి మరో రెండు మాటలు చెప్పేడు:

"ఈ రోజు మీరు తిలకించబోయే ప్రయోగాలకి మూలాధారం మన మిడతంభొట్లు మేష్టారి ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం. ఆ సిద్ధాంతంలోని మెళుకువలన్నీ అవగాహన చేసుకుని, ఆయన అసంభవమని హెచ్చరిస్తూన్నా అధైర్యపడకుండా మేము ఈ ఏంటీ గ్రేవిటీ ఇంజనుని నిర్మించేం. కనుక, నా చిన్ననాటి స్నేహితుడు, మా ఊరివాడు, నోబెల్ గ్రహీత అయిన శ్రీ మిడతంభొట్లు మేష్టారిని ఈ ఆవిష్కరణ చెయ్యవలసిందిగా కోరుతున్నాను."

సావడి అంతా కరతాళ ధ్వనులతో మోగిపోయింది. అనుకోకుండా వచ్చిన ఈ అహ్వానానికి ఎలా స్పందించాలో తెలియక, కొద్దిగా తికమక పడి, తేరుకుని, అవకతవకగా కుర్చీలోంచి లేచి, రమేష్ వైపు నడచి వెళ్లేరు మిడతంభొట్లు. అంతవరకు అడ్డుగా ఉన్న తెర తెరచుకుంది.

అక్కడ ఒక కేరం బోర్డు ఆ కేరం బోర్డుకి నాలుగువైపులా నాలుగు జేబులతో పాటు నడిమధ్యలో – పిక్కలు అమర్చే చోట – వృత్తాకారంలో ఒక విశాలమైన బెజ్జం దొలచబడి ఉంది. ఆ బెజ్జానికి కింద బలిష్టమైన విద్యుదయస్కాంత ధ్రువం ఉంది. దానికి జవాబుగా పై నుండి మరొక ధ్రువం వేలాడుతోంది. ఆ కేరం బోర్డు చుట్టూ రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు

ఉన్నాయి. ఈ ప్రయోగానికి విద్యుత్ శక్తి ఏమాత్రం ఖర్చు అవుతుందో, బల్ల మధ్య బెజ్జం దగ్గర విద్యుదయస్కాంత శక్తి ఎంత బలంగా ఉందో, అక్కడ గురుత్వాకర్షణ శక్తి ఎంత ఉందో, వగయిరా సాంకేతిక విషయాలన్నీ ఆహూతులకి అర్థం అయే రీతిలో తెరల మీద ప్రదర్శించటానికి ఏర్పాట్లు ఎలా చెయ్యబడ్డాయో, ఈ విషయాలన్నిటిని ఒక లంగరమ్మ విశదం చేసింది. ఈ అట్టహాసానికీ, ఆర్భాటానికీ అరగంట పైగా పట్టింది. అసలు ప్రయోగం అర నిమిషంలో అయిపోతుందని నాకు తెలుసు.

"ఈ అయస్కాంత ధ్రువాల మధ్య ఉన్న గురుత్వాకర్షణ శక్తిని ఏష్యం చెయ్యటమే ఇప్పుడు చెయ్యబోతూన్న ప్రయోగం లక్ష్యం." అంటూ మిడతంభొట్లు వైపు చూస్తూ రమేష్ మీట నొక్కేడు.

మిడతంభొట్లు సిద్ధాంతాలన్నీ అజగళస్తనాలు, తన ప్రయోగాలన్నీ ప్రజోపయోగాలు అనే భావం స్ఫురించిందా చూపుల్లో. పచ్చి వెలక్కాయ గొంతుకకి అడ్డు పడ్డట్టు ఉండుంటుంది మేష్టారికి.

మాస్‌బావర్ త్రాసుతో గురుత్వాకర్షణ శక్తి ఎంత జోరుగా క్షీణిస్తున్నాదో లెక్కగట్టి ఆ లెక్కని టెలివిషన్ తెరల మీద చూపుతున్నారు. అందరూ కళ్లప్పగించి టెలివిషన్ తెరలవైపే చూస్తున్నారు. పదిహేను శాతం, నలభై శాతం, ఏభై రెండు శాతం.... అయస్కాంతాల మధ్య గురుత్వాకర్షణ శక్తి పడిపోతోంది. మిడతంభొట్లు ముఖం, కత్తివేటుకి రక్తపు చుక్క లేనట్లు, పాలిపోయింది.

ఉత్కంఠని పెంచటానికా అన్నట్లు రమేష్ ఏవేవో మీటలు నొక్కుతున్నాడు. ఆ చర్యల వల్ల ప్రయోగం జోరు తగ్గింది. గురుత్వాకర్షణ క్షేత్రం యొక్క బలం పడుతోంది కాని, ఆ పడే జోరు తగ్గింది.

“మీ అందరికీ అర్థం అవటానికి సదుపాయంగా ఉంటుందని ప్రయోగం జోరు తగ్గించేం. అనతి కాలంలోనే గురుత్వాకర్షణ శక్తి పూర్తిగా నశిస్తుంది. అప్పుడు ఆ అయస్కాంతాల మధ్య నుండి అత్యాద్భుతమైన కాంతి ఉద్భాసిస్తుంది. ఆ కాంతిని చూడటం మీ కళ్లకి మంచిది కాదు. మీమీ కుర్చీల పక్క వేల్లాడుతూన్న సంచులలో చలవ కళ్లజోళ్లు ఉన్నాయి. అవి తీసి మీరందరూ ధరించండి.” ఇందాకటి లంగరమ్మే కోకిల కంఠంతో హెచ్చరించింది.

అందరూ ఊపిరి బిగపట్టి కుర్చీల అంచుల మీద కూర్చుని చూస్తున్నారు. కొద్ది క్షణాలలోనే గురుత్వాకర్షణ శక్తి పూర్తిగా నశించి పోయింది. అదే వేళకి గదిలో దీపాల ద్యుతి తగ్గించినట్లున్నారు. కేరం బోర్డు మధ్యలో విద్యుదయస్కాంత క్షేత్రం వింతయిన కాంతులీనుతూ కనబడింది. గదిలో గాలికి కూడ ఏదో వింతయిన తావి అబ్బినట్లు అనిపించింది. మిడతంభొట్లు ముఖ కళవళికలు ఆ చీకట్లో, ఆ నల్ల కళ్లద్దాల వెనక నుండి, కనబడటం లేదు. కాని మనిషి ఏదో తీవ్రమైన ఆలోచనలో పడ్డట్టు కనబడ్డాడు.

“ప్రయోగం ఇంకా అయిపోలేదు.” రమేష్ గోంతుక వినిపించింది.

“ప్రస్తుతం మనం సాధించినదల్లా అయస్కాంతాల మధ్యనున్న గురుత్వాకర్షణని నశింపజేశాం. అంతే. ఇంతటితో ఈ ప్రయోగం ఆపేసే మనిషినయితే నేను కూడ ఏ విశ్వవిద్యాలయంలోనో పాఠాలు చెప్పుకుంటూ

ఉండేవాడిని.” అంటూ మిడతంభొట్లు వైపు అర్థగర్భితంగా ఒక చూపు చూసి మళ్లా అందుకున్నాడు.

“గురుత్వాకర్షణ లేకపోయిన సందర్భాలని మనం ఎలా వినియోగించుకోగలం? అది ఇప్పుడు మీ అందరికీ చూపిస్తాను. ఈ పని నేను నా చేతులతో చేస్తే నేను ఏదో మోళీ కట్టేననో కనికట్టు చేసేననో మీరు అనుకునే ప్రమాదం ఉంది. కనుక ఈ ప్రయోగాన్ని తన చేతుల మీదుగా పూర్తి చెయ్యవలసిందిగా – మన జాతికే వన్నె తెచ్చిన – మిడతంభొట్లు మేష్టారిని అర్థిస్తున్నాను.”

కథ ఇలా మళుపు తిరుగుతుందని మిడతంభొట్లు కలలో కూడ అనుకుని ఉండరు. అకస్మాత్తుగా వచ్చిన ఈ ఆహ్వానంలోని అంతరార్థం ఏమిటో ఆకళింపు చేసుకుందికి వ్యవధి లేదు. అప్రయత్నంగానే లేచి, రమేష్ చూపించిన దారి వెంబడే యాంత్రికంగా నడుచుకు వెళ్లి, కేరం బోర్డు పక్కన ఉన్న కుర్చీలో చతికిలపడ్డారు. ఆయనకి ఎదురుగా ఉన్న కుర్చీలో రమేష్ కూర్చున్నాడు.

“గురుత్వాకర్షణ పూర్తిగా నశించిన ప్రదేశంలోనికి ఘన పదార్థాన్ని పంపితే వాటి ప్రవర్తన ఎలా ఉంటుందో అధ్యయనం చెయ్యటమే ఈ మొదటి ప్రయోగం యొక్క లక్ష్యం. మీకు కేరం ఆట మీద ఉన్న వ్యామోహం విశ్వవిదితం. భౌతిక శాస్త్రం, కేరం ఆట – ఈ రెండూ మీ జీవితానికి బొమ్మా, బొరుసూ లాంటివి. ఒకటి మీ వృత్తి, రెండోది మీ ప్రవృత్తి. పైపెచ్చు ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం మీ ముద్దుల బిడ్డ. ఆ సిద్ధాంతాన్ని మీ జీవిత కాలంలోనే సవరించవలసి వస్తుందని సూచించే ప్రయోగం ఇది. ఏదీ, ఆ ఎర్ర బిళ్లని నెమ్మదిగా, ఆ అయస్కాంతాల

మధ్యకి, గురుత్వాకర్షణ నశించిన క్షేత్రం లోనికి, మీ వేలితో ఒక చిన్న తోపు తొయ్యండి, ఏమవుతుందో చూద్దాం.” అన్నాడు రమేష్.

చలవ కళ్లజోడు వెనక ఉన్న మిడతంభొట్లు కళ్లని చూడగలిగితే అవి ఏమి చెప్పి ఉండేవో?

రమేష్ పద్ధతి చెప్పేనుగా. పిక్కలని కొట్టే ముందు ఏ పిక్క ఏ జేబులోకి వెళుతుందో ముందే చెప్పి మరీ కొడతాడని. అదే ధోరణిలో రమేష్ ప్రేక్షకులని ఉద్దేశించి, “జాగ్రత్తగా గమనించి చూడండి. ఆ ఎర్ర పిక్క శూన్య క్షేత్రం చేరుకోగానే, దాని మీద భూమి యొక్క ఆకర్షణ శక్తి ప్రభావం ఏమీ ఉండదు. అంటే, ఆ అయస్కాంతాల మధ్యకి వెళ్లగానే, మన ఎర్ర పిక్క కేరం బోర్డు మధ్యనున్న బెజ్జం గుండా కిందకి పడిపోకుండా ఒక్క క్షణం పాటు అలా తేలుతూ ఉండిపోతుంది. భూమ్యాకర్షణ....”

ఈ ప్రసంగం అంతా అయే వరకూ మిడతంభొట్లు ఆగలేదు. ఎర్ర పిక్కని, ఒణుకుతూన్న వేళ్లతో నెమ్మదిగా అయస్కాంత క్షేత్రంలోకి తోసేడు.

ప్రత్యర్థులిద్దరూ నాకు స్నేహితులే కనుక నేను ముందు వరసలోనే కూర్చుని చూస్తున్నాను. ఎర్ర బిళ్ల నెమ్మదిగా బల్ల మధ్య బెజ్జం వరకు వెళ్లింది, అక్కడ ఏమిటి చెయ్యటమా అని ఈషణ్మాత్రం తటపటాయించిందా అన్న సందేహం నా మనస్సులో పొడచూపింది.

ఇంతకంటె ఆలోచించటానికి వ్యవధి లెదు. ఎర్ర బిళ్ల అకస్మాత్తుగా అదృశ్యం అయిపోయింది. ఎక్కడో దూరాన్న ఉరుము ఉరిమినట్లు శబ్దం

వినిపించింది. తరువాత ఎక్కడో మెరుపు మెరిసినట్లు కనిపించింది. తరువాత ఏదో కాలుతున్నట్లు వాసన వేసింది.

ఏమయిందో అర్థం కాక కొందరు ఒక్కసారి లేచి నిలబడ్డారు. మధ్యనున్న బెజ్జం నుండి కిందకి పడిపోయిందేమోనని కొందరు ఎర్ర బిళ్ల కోసం తొంగి, తొంగి బల్ల కింద చూస్తున్నారు.

రమేష్ మాత్రం స్థాణువులా, మాట్లాడుతూన్న వాక్యాన్ని మధ్యలోనే ఆపేసి, ఉలుకు, పలుకు లేకుండా, కూర్చున్నవాడు కూర్చున్నచోటే కదలకుండా, మెదలకుండా ఉన్నాడు. రమేష్ పక్కనే ఉన్న కోకిలమ్మ కెవ్వున కేక వెయ్యటమూ, కేరం బోర్డు రక్తసిక్తం అవటమూ రెప్పపాటు కాలంలో జరిగిపోయాయి. రమేష్ హృదయ ఫలకంలో, గుండె నుండి వీపు దాకా, అంగుళం పొడుగు, పావు అంగుళం వెడల్పుతో దీర్ఘచతురస్రాకారంలో ఒక బెజ్జం పడి ఉంది. తరువాత శవ పరీక్షలో తేలింది, ఏదో గుండ్రని వస్తువు, రూపాయి కాసు ఆకారంలో ఉన్న వస్తువు, తూటాలా ఆ గుండె కాయ లోంచి దూసుకు పోయిందని.

ప్రయోగాన్ని అర్ధాంతరంగా ఆపేసేరనీ, పోలీసులని పిలిపించేరనీ మళ్లా నేను ప్రత్యేకం చెప్పక్కరలేదనే అనుకుంటాను. ప్రశ్నించటానికని మిడతంభొట్లుని, వాంగ్మూలానికని వచ్చిన అతిథులలో చాల మందిని పోలీసులు ఠాణాకి తీసుకు పోయారు.

## 4

ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు దాటిపోయింది. దర్యాప్తు ఎంతవరకు వచ్చిందని పోలీసులని ఎన్ని సార్లు అడిగినా వాళ్లంతా గప్‌చిప్. ఏమీ చెప్పటం లేదు. ఇందులో గప్‌చిప్‌కి రాచ రహస్యం ఏమీ లేదే. నాకు ఏదీ పాలుపోకుండా ఉంది. ఈ సందర్భంలో మిడతంభొట్లు నా కోసమని కబురంపేరు. ఆయనని కలుసుకుందికి వెళ్లేను.

ఆఫీసు తలుపు మీద ఆర్ నిడసనమెట్ల అని రాసి ఉంది. తలుపు తెరుచుకుని లోపలికి వెళ్లేను. మనిషి కొద్దిగా చిక్కినట్లు కనిపించేడు. పూర్వంలా బడేమియా బట్టలు లేవిప్పుడు. జుత్తు ఉడతలు పీకిన తాట్టెంకలానూ లేదు. సంరక్షణ చేసుకుంటే మనిషి స్ఫురద్రూపే. నన్ను చూడగానే ఆప్యాయంగా పలకరించేడు. ముక్తసరిగా మూడు నిమిషాల పాటు కుశలప్రశ్నలు అయేయనిపించి ఆయనే విషయం ఎత్తుకున్నాడు.

“ఆ రోజు ఏమిటి జరిగిందో ఇప్పటికీ అర్థం కావటం లేదోయ్. ఆ రోజు బుర్ర జోరుగా పని చెయ్యలేదనుకో. ఆ ప్రయోగాన్ని రమేష్ అలా వర్ణించి చెబుతూ ఉంటే మంత్రముగ్ధుడిలా అతను ఏమి చెబితే అది చేసేసేను తప్ప ఒక్క క్షణం ఆలోచించి ఉంటే ఈ ఘోరమైన ప్రమాదం జరిగి ఉండేది కాదోయ్. ఆలోచిస్తూ ఉంటే జరిగిన తప్పులో నేను కూడ కొంత పాలు పంచుకోవాలేమో అనిపిస్తోంది. ఏదో ఢాంబికంగా హడావిడి చెసేడే అనుకో. సిద్ధాంతం తెలిసిన వాడిని నేను. నేనయినా కొంచెం నిదానంగా ఆలోచించి ఉండాల్సింది. జరిగిన దానికి ప్రాయశ్చిత్తం ఏమిటా అని ఆలోచిస్తున్నాను.”

"గతజల సేతుబంధనం. ఇప్పుడు విచారించి ఏమి లాభం? మీ ఫిజిక్సు పోయిన వాడికి ప్రాణం పొయ్యలేదు కదా."

"పొయ్యలేదు. నిజమే. కాని, పాపం. రమేష్ తన జీవితమంతా ఈ కపెనీకే ధారపోసేడు కదోయ్. కనీసం రమేష్ చివరి కోరిక తీర్చటానికా అన్నట్లు ఇప్పుడు నేను రసాభౌకం అధిష్టాన వర్గానికి అధ్యక్షుడిగా చేరేనోయ్. ఆ రోజు జరిగిన అభాసు వల్ల కంపెనీ పరపతికి ఎంత చిన్నతనం. అసలు ఆ రోజు నిజంగా జరిగినది ఏమిటో అందరికీ అర్థం అయే రీతిలో రాసి విపులీకరించే స్థోమత నీకు ఒక్కడికే ఉందోయ్. అందుకే నిన్ను పిలిపించేను."

సంభాషణ ధోరణి ఇలా మలుపు తిరుగుతుందని నేను కలలో కూడ అనుకోలేదు. కాని, నేను చెయ్యవల్సిన పని ఏమిటో నాకు పూర్తిగా బోధ పడ లేదు. ఇంతలో ఆయనే మళ్లా చెప్పటం కొనసాగించేరు.

"ఒట్టి చొప్పదంటు సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని ఈ ప్రయోగం తలపెట్టేడోయ్. లేకపోతే ఏమిటి చెప్పు. గురుత్వ క్షేత్రం రద్దవగానే బిళ్ల బరువు కోల్పోయి గాలిలో తేలుతుందని కదూ అన్నాడు? రాకెట్‌లో మనుష్యులు తేలిపోతూన్నట్లు సినిమాలో చూసుంటాడు. గురుత్వ క్షేత్రం రద్దయినప్పుడు వస్తువులు అలా తేలిపోతాయని చాలమంది అనుకుంటారు. నిజానికి రాకెట్టూ, రాకెట్టు లోని మనిషి – రెండూ ఒకేసారి – భూమి గురుత్వ క్షేత్రంలో పడుతూ ఉంటే మనిషి బరువుని కోల్పోయినట్లు అనిపిస్తుంది. అది శుద్ధ భ్రమ. నిజానికి భూమి గురుత్వ క్షేత్రంలో ఏమీ మార్పు రాదు. అదే విధంగా..... చూడవోయ్ ఈ

కథ పూర్తిగా చెప్పేసరికి చాల సేపు పడుతుంది. టూకీగా చెబుతాను. కావలిస్తే రాసుకో.”

“నిజానికి రమేష్ గురుత్వ క్షేత్రాన్ని నాశనం చెసేదు. కాని దాని పర్యవసానంగా ఎర్ర బిళ్ల తేలిపోవటం కాదు. భారాన్ని పూర్తిగా కోల్పోయింది. ఎర్ర బిళ్లే కాదు. ఆ అయస్కాంతాలమధ్య ఉన్న పదార్థాలన్నీ – అంటే గాలి బణువులూ, ధూళి రేణువులూ, సమస్తం - వాటి వాటి భారాలని పోగొట్టుకున్నాయి. శూన్య భారం ఉన్న పదార్థం ఏదయినా ఒకే విధంగా ప్రయాణం చేస్తుంది.”

తరగతిలో పాఠం చెబుతూ, కుర్రాళ్లు ఏమంటారో చూద్దామని ఆగినట్లు మిడతంభొట్లు ఒక సారి ఆగి, ప్రశ్నార్ధకంగా నా వైపు చూసేరు. ఆయన ఏదైనా ప్రశ్న అడిగితే సమాధానం చెప్పే త్రాణ నాకు లేదు. అందుకని, నేనే, “ఏ రకంగా ప్రయాణం చేస్తుందంటారు?” అని అడ్డు ప్రశ్న వేసేను.

“అలా అడుగు, చెబుతాను. శూన్య భారం ఉన్నది ఏదయినా సరే కాంతి వేగంతో ప్రయాణం చేస్తుందని చదువుకోలేదుటోయ్. ఫోటానులకి భారం లేదు. అవి కాంతి వేగంతో పయాణం చేస్తాయి. అసలు ఫోటానులంటేనే కాంతి రేణువులు. అలాగే ఎర్ర బిళ్ల ఏంటీ గ్రేవిటీ క్షేత్రంలో ప్రవేశించగానే, తన భారాన్ని పూర్తిగా కోల్పోయి, కాంతి వేగాన్ని సంతరించుకుని, ఝూమ్మని గగన వీధిలోకి దూసుకు పోయింది. పోతూ పోతూ దారిలో రమేష్ శరీరం అడ్డొస్తే, అతని గుండెల్ని చీల్చుకు పోయింది.

నాకొక చిన్న ధర్మ సందేహం వచ్చింది. తెగించి అడిగేను.

"అయస్కాంతాల మధ్యలో కదా గురుత్వ క్షేత్రం నశించింది? ఆ పరిధిని దాటి బయటకి రాగానే పోయిన బిళ్ల బరువు మళ్లా తిరిగి వచ్చేయాలి కదా? అప్పుడు అది కాంతి వేగంతో ఎలా వెళుతుంది?"

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. నా ప్రశ్న నాకే ఎంతగానో నచ్చింది. మేష్టారికి కూడ ఎంతగానో నచ్చి ఉండాలి. నా మీద చిరాకు పడకుండా, తల పంకించి, సమాధానం చెప్పేరు.

"నిజమే. జోరుగా వెళుతూన్న సైకిలుకి ఎంత బలంగా మరకట్టు వేసినా అకస్మాత్తుగా ఆగలేదు కదా. అలాగే ఎర్ర బిళ్ల శూన్య భారం తోటీ, కాంతి వేగం తోటీ ప్రయాణం మొదలు పెట్టింది. అయస్కాంత క్షేత్రం దాటి బయటకు రాగానే దాని నిజ భారం దానికి వచ్చేసి ఉంటుంది. కనుక దాని వేగం తగ్గాలి. కాని అకస్మాత్తుగా తగ్గలేదు. వేగం తగ్గటానికి నిర్ధిష్టమైన కాలం కొంత పడుతుంది. ఈ వ్యవధి ముగిసే లోగా మన ఎర్ర బిళ్ల అయస్కాంత క్షేత్రం నుండీ, భుమ్యాకర్షణ క్షేత్రం నుండీ, ఆమాటకొస్తే సూర్య మండలం నుండీ దాటి, బయటికి ఎక్కడికో వెళ్లిపోయి ఉంటుంది. విశ్వాంతరాళం దరిదాపు అంతా శూన్యమే కనుక మన వాతావరణం దాటగానే ఎర్ర బిళ్ల మీద పడే ఒరిపిడి శక్తుల ప్రభావం.....

"గుడ్డిలో మెల్ల. మనం అదృష్టవంతులం అనుకో. ఆ ప్రయోగం మూడో అంతస్తు మీద జరిగింది కనుకా, ఆ చుట్టుపట్ల ఎత్తయిన భవనాలు మరేమీ లేవు కనుకా సరిపోయింది. లేక పోతే ఆ ఎర్ర పిక్క మరెంతమందిని పొట్టని పెట్టుని ఉండేదో..."

నాకు మరొక అనుమానం వచ్చింది. తీర్చేసుకుందామని మరొక ప్రశ్న అడిగేను.

"మరయితే... ఆ ఎర్ర బిళ్ల రమేష్ సృష్టించిన క్షేత్రంలోకి అతి నెమ్మదిగా ప్రవేశించింది. కేరం బోర్డు మధ్యలో ఉన్న బెజ్జం దగ్గర ఒక్క క్షణం ఆగిందేమో కూడ. అటువంటి సందర్భంలో ఆ బిళ్ల అకస్మాత్తుగా కాంతి వేగం ఎలా సంతరించుకుంది?"

"భౌతిక శాస్త్రంలో ఇంత ప్రవేశం నీకెప్పుడు వచ్చిందోయ్? నా తరగతిలో విద్యార్థులు ఇలాంటి మంచి ప్రశ్నలు ధైర్యంగా అడిగినట్లయితే మనకి మరొక నోబెల్ బహుమానం వచ్చి ఉండేదోయ్.

"అడిగేవు కనుక చెబుతున్నాను. ఇది కొంచెం క్లిష్టమైన ఊహనం. గభీమని అర్థం కాకపోతే కంగారు పడకు. రమేష్‌కి సిద్ధాంతం అర్థం కాకపోయినా తంతే బూర్ల గంపలో పడ్డట్టు పడ్డాడు. వ్రతం చెడ్డా ఫలం దక్కింది. మన జంబుఖానా నమూనా ఉంది చూశావూ? మనవాడు ఆ జంబుఖానాలో పడ్డ లొత్త తీసెయ్యగలిగేడు. లొత్తలు లేని క్షేత్రంలో అయిన్‌స్టయిన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతం వర్తించదు. అప్పుడు నిహిత నియమాలు కూడ వర్తించవు. ఆ సందర్భంలో రమేష్ సృష్టించినది సతత గతి యంత్రం. ఈ యంత్రంతో అపరిమితమైన శక్తిని ఉత్పాదించవచ్చు.

"ఈ సూత్రాలని ఉపయోగించి శక్తిని నిరంతరాయంగా, అతి చవకగా, ఉత్పత్తి చేసే సావకాశాలు ఉన్నాయి. తెలిసీ తెలియని మిడిమిడి జ్ఞానంతో గుడ్డి గుర్రపు తాపులా రమేష్ కనిపెట్టినది ఏంటీ గ్రేవిటీ యంత్రం కాదు. పెట్టుబడి

పెట్టిన శక్తి కంటే దాని మీద వచ్చే రాబడి శక్తి ఎక్కువగా ఉత్పత్తి చెయ్యగలిగే సతత గతి యంత్రం కనిపెట్టినట్లున్నాడు. ఇది ఇప్పటి వరకు అంతా దుస్సాధ్యం అని ఎవ్వరూ దీని వైపు చూడ లేదు. ఈ యంత్రం కాని నిజంగా పని చేస్తే మన దేశంలో ఖనిజపు చమురు, నేలబొగ్గు, యురేనియం వంటి ఇంధనపు నిల్వలు తక్కువని చింతించనక్కర లేదు. అందుకే రసాభౌకం కంపెనీకి మేనేజింగ్ డైరక్టర్‌గా ఉండమని అతని వారసులు నన్ను బతిమాలేరు. కాదనలేక పోయాను."

మేష్టారూ, మీరు చెప్పినవన్నీ బాగానే ఉన్నాయి. కాని ఆ రోజు జరిగిన ప్రమాదంలో మనలో ఎవ్వరిమైనా చచ్చిపోయి ఉండేవాళ్లం కదా. మరి ఆ ఎర్ర బిళ్ల గురిపెట్టి కొట్టినట్లు రమేష్ గుండెలు చీల్చుకు వెళ్లిందంటే.....”

“నాకు తెలిసిన సిద్ధాంతం చెబుతాను, విను. దీపం వెలిగించినప్పుడు కోటానుకోట్ల కాంతి రేణువులు ఉత్పత్తి అవుతాయి. ఈ రేణువులకి, ఈ ఫోటానులకి, భారం లేదు. కనుక ఇవి అన్ని దిశలలోకీ, కాంతి వేగంతో చెల్లా చెదురవుతాయి. అప్పుడు వెలుగు అన్ని వైపులకీ వ్యాపిస్తుంది. అంతే కాదు. భారం లేనివి కనుక ఇవి ఎంత జోరుగా మనని ఢీకొన్నా మనకి దెబ్బ తగలదు. ఇదే విధంగా అయస్కాంత క్షేత్రంలో ఉన్న కోటానుకోట్ల గాలి బణువులు కూడ భారాన్ని కోల్పోయి, ఫోటానులలాగే, అన్ని దిశలలోనూ చెదిరిపోతాయి. కాని, ఎర్ర బిళ్ల సంగతి వేరు. ఇక్కడ ఒక్కటే ఎర్రబిళ్ల ఉంది. అది భారం పోగొట్టుకున్నప్పుడు అది ఏ దిశలో ప్రయాణం చేస్తుందన్నది కోటి రూపాయల ప్రశ్న. ఈ బిళ్ల ఏ దిశలో వెళుతుందన్నది యాధృచ్ఛిక ప్రక్రియ. అది ఎటైనా వెళ్లి

ఉండవచ్చు. మన రమేష్ రోజులు నిండుకున్నాయి. మనతో రుణానుబంధం తీరిపోయింది. ఆ బిళ్ల వెళ్లి అతనిని కొట్టింది. అతను వెళ్లి పోయాడు.”

ప్రజలు, పత్తేదారులు, పోలీసులు, ప్రభుత్వం, అంతా ఈ సంజాయిషీ నమ్మేరు. నమ్మటమేమిటి? మిడతంభొట్లు మేష్టారిని రసాభౌకం కి అధ్యక్షునిగా చేసేరు.

మిడతంభొట్లు చెప్పిన వివరణ ఎంత పకడ్బందీగా ఉన్నట్లనిపించినా నాకు నమ్మబుద్ధి కాలేదు. అనంతమైన దిశలలో ప్రయాణం చెయ్యగలిగే ఆ ఎర్ర పిక్క రమేష్ గుండెల వైపే ప్రయాణం చేసిందంటే ఎలా నమ్మటం. ఇది కేవలం కాకతాళీయం అంటే నేను నమ్మలేకపోయాను.

బొంబాయి, కలకత్తా, బెంగుళూరు నగరాలలో భౌతిక శాస్త్రంలో కొమ్ములు తిరిగిన వాళ్లు చాల మంది ఉన్నారు. వారిని సంప్రదించేను. ఇదమిత్థంగా ఎవ్వరూ చెప్పలేకపోయారు. రమేష్ చేసిన ప్రయోగాన్నే మరొకసారి చేసి, ఈ మారు బిళ్ల ఎటువైపు వెళుతుందో చూస్తే సరిపోతుంది కదా అని ఒక స్నాతకోత్తర విద్యార్థి సలహా ఇచ్చేడు. కాని ఈ ప్రయోగం చెయ్యగలిగే పరిజ్ఞానం, స్తోమత ఒక్క రసాభౌకం వారికే ఉన్నాయి. ఆ కంపెనీ అధినేత అయిన మిడతంభొట్లు ఒప్పుకోవద్దూ?

అనుమానం పెనుభూతం అయింది. బంకనక్కిరికాయలా ఈ అనుమానం నా మస్తిష్కాన్ని దొలిచేస్తోంది. కేరం బోర్డు ఆటలో మిడతంభొట్లు జగజ్జెట్టి. ఏ పిక్కని ఏ కోణంలో ఎంత గట్టిగా కోడితే అది ఎటు వెళుతుందో అన్న జ్ఞానం ఆయనకి వెన్నతో పెట్టిన విద్య. అటువంటి వ్యక్తి మనస్సులో, ఆ కుర్చీలో

కూర్చున్న సమయంలో, ఒక మెరపులాంటి ఆలోచన వచ్చి ఉండొచ్చు. ఎర్ర పిక్కని ఏ కోణంలో కొడితే అది రమేష్ కూర్చున్న వైపు వెళుతుందో....

ఇది ప్రమాదం అంటారా, కాకతాళీయం అంటారా? ఖూనీ అంటారా?

(ఐజాక్ అసిమావ్ రాసిన బిలియర్డ్ బాల్ అనే కథ దీనికి ఆధారం. రచన, ఫిబ్రవరి 1995, ఆంధ్ర ప్రభ, మే 1995)

# స్వరాజ్యం చచ్చిపోయింది

అర్ధరాత్రి అవుతోంది. తెల్లారితే ఆగస్టు పదిహేను. స్వరాజ్యం వచ్చి సరిగ్గా నూరేళ్లు అవుతోంది. సంబరాల హడావుడితో వీధులన్నీ కోలాహలంగా ఉన్నాయి.

ఆ రాత్రే శివశంకరశాస్త్రి తల్లి స్వరాజ్యానికి నూరేళ్లూ నిండిపోయాయి.

పుట్టినవాళ్లు గిట్టక మానరని శాస్త్రికి తెలుసు. తల్లి పోయిందన్న దుఃఖం కంటె బతికున్నన్నాళ్లూ ఆమె ఏమీ సుఖపడలేదన్న చింత శాస్త్రి చెంత ఉండిపోయింది.

కొడుకుగా తన ఆఖరి కర్తవ్యం ఆమె పార్థివ దేహాన్ని పంచభూతాలకీ సమర్పించే కర్మకాండలు జరిపించటం. ఆర్థికంగానూ, మానసికంగానూ జవసత్వాలుడిగిన శివశంకరశాస్త్రికి ఈ కర్తవ్యం మోకాలి పర్వతపు మెట్టులా కనబడింది.

శాస్త్రి ముత్తాత విశ్వనాథ చయనులు. గాంధీ గారి పిలుపు విని, సర్వం ఒదులుకుని, జైలుకి వెళ్లిన దేశభక్తుడు. ఆయన ఆస్తి అంతా సహాయనిరాకరణోద్యపు వడగాలిలో హారతి కర్పూరంలా హరించుకుపోయింది. తరువాత, ప్రజాస్వామ్యపు గమ్యం సమానత్వం సాధించటం కాదనిన్నీ, కేవలం సమానమైన అవకాశాలు కల్పించటం వరకు మాత్రమేననిన్నీ అన్న మూల సూత్రాన్ని విస్మరించిన దేశ నాయకుల చేతుల్లో స్వరాజ్యం నలిగి కమిలిపోయింది.

స్వతహాగా ప్రజ్ఞాబుద్ధులు ఉన్నవాడే అయినా, కాలప్రవాహానికి ఎదురీదే స్థోమతలేని శివశంకరశాస్త్రిని కాలసర్పం కాటు వేసింది. అందని అవకాశాలకి అర్రులు చాచుతూ దుర్భరమైన దరిద్రం అనుభవించేడు.

స్వతంత్ర శతజయంతి సందర్భంగా ఊరంతా బందయిపోయింది. కర్మ చేయించటానికి బ్రాహ్మణుడు దొరకలేదు. మంత్రాలు నేర్చిన బ్రాహ్మణుడు నూటికో, కోటికో ఒకడు ఉంటున్నాడు. వాడేనా కంచు కాగడా వేసి వెతికితేకాని కనిపించి చావడు. నాలుగు మంత్రం ముక్కలు వల్లించటం వచ్చిన వాళ్లంతా ఏ మంత్రుల వెనకో ఆశీర్వచనాలు చదవటానికి పోయి ఉంటారు. తను మాత్రం చస్తాడా?

దహన సంస్కారాలు చేయించటానికి కర్రలకి దేశంలో కరువొచ్చి పడిందిట. వానలు పడే ముందు పుట్టి, పెరిగే ఇసుళ్లలా ప్రజానీకం అంతూ, దరీ లేకుండా పెరిగిపోవటంతో వారికి వనరులు, వసతులు కల్పించకపోతే ఎన్నికల వేళప్పుడు ఎక్కడ ఓట్లు పడవో అన్న భయంతో దేశంలో ఉన్న అడవులన్నిటిని ఎప్పుడో నరికించేసి భూదానాలు చేసేసింది ప్రభుత్వం. సందెడు కర్రలు కూడ దొరకని ఆ రోజుల్లో బండెడు కర్రలు ఎక్కడ దొరుకుతాయి? అందులోనూ పలుకుబడి పూర్తిగా పూజ్యమైన ఒక పంతులికా?

బారెడు పొద్దు ఎక్కి పోయింది. శవాన్ని మొయ్యటానికి మనుష్యులు లేరు. చితిని పేర్చటానికి కర్రలు లేవు. చితికిపోయిన బేపనోడి చింతని పట్టించుకునే దాత ఒక్కడు కనబడలేదు. వాకట్లో ఉన్న అరటి మొక్కలని కొట్టేసి ఆ బోదెలని పెరట్లో పేర్చి తల్లిని దహనం చేస్తానంటూ భోరుమన్నాడు.

శివశంకరశాస్త్రి ఆర్తనాదాన్ని విన్న ఆపద్బాంధవుడిలా ఎక్కడనుండి ఊడిపడ్డాడో కాని ధర్మారెడ్డి ఊడిపడ్డాడు. స్వరాజ్యం బొందికి సలక్షణంగా, మంత్రాలు చదివిస్తూ అంతిమ సంస్కారాలు చేయిస్తానన్నాడు. పైపెచ్చు పదకొండు రోజులూ చెయ్యవలసిన కర్మకాండలన్నీ తన స్వంత ఖర్చులతో జరిపిస్తానన్నాడు.

ఇది కలో, నిజమో, వైష్ణవ మాయో శివశంకరశాస్త్రికి అర్థం కాలేదు. అయాచితంగా ఆదుకుంటానంటూ ముందుకొచ్చిన ధర్మారెడ్డి దగాకోరు కాదు కదా అని అనుమానం వచ్చింది.

ధర్మారెడ్డికి తనని దగా చెయ్యవలసిన అవసరం ఏముంటుంది? అయినా అవసరం తనది. ఇష్టమైతే ఒప్పుకోవచ్చు. కష్టమైతే మానెయ్యవచ్చు. ధర్మారెడ్డి ఏమీ బలవంతం చెయ్యటం లేదే. ఏ కోణంలో ఏ లాభం చూసుకుని తనకి ఉపకారం చేస్తానంటున్నాడో? ఇలా తటపటాయిస్తూన్న శివశంకరశాస్త్రి మనస్సులో ఒక అనుమానం మెదిలింది.

"రెడ్డి గారూ! మీరు మా అమ్మగారిని ఏ వైద్య కళాశాలకో..."

"అదేం మాట పంతులూ! మెడికల్ కాలేజీకి పంపటానికి మధ్యలో నేనెందుకూ? ఆ పని నువ్వు చేసుకోలేవా? నీకు ఇష్టమైతేనే నేను ఏర్పాట్లు చేయిస్తాను."

అహఁహఁ. మనస్సు స్థిమితంగా లేక ఏదో అన్నాను. ధర్మారెడ్డిని అనుమానించినందుకు శివశంకరశాస్త్రి కొద్దిగా నొచ్చుకున్నాడు. "సూర్యాస్తమయం అయే లోగా కర్మకాండ అంతా జరుగుతుందంటారా?"

"ఏయ్ పంతులూ! మన ఆచారాలు నాకు తెలియవా?"

శివశంకరశాస్త్రి "సరే" అన్నాడు.

ధర్మారెడ్డి జేబులోంచి సెల్‌ఫోను తీసి తన పరివారంతో మాట్లాడి, మిగిలిన సన్నాహాలు చేయించుకుని వస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

ధర్మారెడ్డి ఊరికి కొత్తేమీ కాదు. తరతరాలుగా ఊళ్లో ఉన్న పారిశ్రామికవేత్తల కుటుంబంలో పుట్టిన వాడు. కొండ మీద స్వామి వారికి భక్తులు సమర్పించిన తలనీలాలని ఏమిటి చెయ్యాలో తెలియక దేవస్థానం వారు తికమక పడుతూన్న రోజుల్లో ధర్మారెడ్డి వంశవృక్షంలో ఉన్న ఒక "తాత" తలనీలాలని కొండ దిగువకి తరలించుకు పోవటానికి "రోజుకి ఇంత" అని దేవస్థానం వారి వద్ద వసూలు చేసే పద్ధతిలో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ జుత్తుని వృధా చెయ్యకుండా సవరాలుగా మార్చి, వాటిని విపణివీధిలో అమ్మి ఇటూ అటూ డబ్బు సంపాదించేడు. ఆయన తదనంతరం ధర్మారెడ్డి తండ్రి ఆ వ్యాపార పరిధిని పెంచటానికి "విగ్గులు" చేసి, విదేశాలకి ఎగుమతి చేసి "పారిశ్రామిక వేత్త" అనిపించుకున్నాడు.

వ్యాపారపు సుళువులు, మెలుకువలు విగ్గుల రెడ్డి దగ్గర ఉగ్గుపాలతో నేర్చుకున్న ధర్మారెడ్డి, ఎం. బి. ఎ. చదివి ఈ కేశసంస్కారపు వ్యాపారానికి కొత్త మెరుగులు దిద్దేడు. సవరాలు, విగ్గులు ఎన్నని అమ్మగలడు? పాపం పెరిగినట్లు ప్రజలు పెరిగిపోయి, వాళ్లు చేసే పాపాలని పరిహరించటానికి తొంబతొంబలుగా తిరుపతి వచ్చేస్తున్నారు. వాళ్లు స్వామి వారికి సమర్పించే తలనీలాలు కొండలు, గుట్టలుగా పెరిగిపోతున్నాయి. స్థానభ్రంశం చెందిన కేశములు రాణించవని

మిత్రలాభంలో హిరణ్యకుడు చెప్పిన మాటలు జ్ఞాపకం ఉన్నా ధర్మారెడ్డి వ్యాపార దృష్టికి ఈ గుట్టలు తలనీలాలుగా కనిపించలేదు; ముడి పదార్థంగా కనిపించేయి.

జుత్తు ఒక రకమైన ప్రాణ్యం (ప్రోటీను) అని ధర్మారెడ్డికి తెలుసు. జుత్తులో ఉన్న ఈ పోషక పదార్థాన్ని విడదీసి ప్రజోపయోగానికి ఉపయోగించి, స్వామి కార్యంతో పాటు స్వకార్యంగా, నాలుగు డబ్బులు చేసుకోవాలని సంకల్పించేడు, ధర్మారెడ్డి.

ఈ ప్రాణ్యాలనే పూర్వం "మాంసకృత్తులు" అనేవారు. ఇవి ప్రాణాధారమైన పోషక పదార్థాలు కనుకనే వీటికి "ప్రాణ్యములు" అని పేరు పెట్టటం జరిగింది. భారత దేశం వంటి వర్ధమాన దేశాలలో ప్రజాబాహుళ్యం తినే తిండిలో పస లేకపోవటానికి కారణం ఈ ప్రాణ్యాలు లోపించటం వల్లనే. భూమిని సహస్రాబ్దాలుగా సాగు చెయ్యటం వల్ల అయితేనేమి, స్వతస్సిద్ధంగా సారం లేని భూములని కృత్రిమ పద్దతులతో సాగు చెయ్యటం వల్ల అయితేనేమి, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తినే తిండిలో మేలు రకం ప్రాణ్యాల పాలు తగ్గిపోతోందని కొందరు ఆరాట పడి మనం తినే తినుభండారాలలో ప్రాణ్యములు, విటమినులు, ఖనిజ లవణములు కలపటం మొదలుపెట్టేరు.

ఇలా తినే తిండిలో పోషక పదార్థాలు కలపటం కొత్తేమీ కాదు. ఉప్పులో అయొడీన్ కలపటం, పాలల్లో విటమిన్ డి కలపటం చాల రోజులబట్టి చేస్తూన్న పనే. అలాగే మొక్కజొన్నలో లైసీన్ అనే ముఖ్యమైన నవామ్లం ("ఎమీనో ఏసిడ్") లేదు. ఈ వెలితి వల్ల మొక్కజొన్న సంపూర్ణ ఆహారం కాదు. అందుకని

మొక్కజొన్న పిండిలో లైసీనుని కలిపి దాని పోషక శక్తిని మెరుగు పరచేరు శాస్త్రవేత్తలు.

ఈ రకం రసాయన వ్యవసాయంలో అందె వేసినది అమెరికాలో ఉన్న ఎ. డి. ఎం. అనే కంపెనీ. ఈ కంపెనీతో చేతులు కలిపి, ధర్మారెడ్డి "పునరావృత్త ప్రభంజనం" అనే సరికొత్త నామధేయంతో ఒక సరికొత్త కర్మాగారాన్ని నిర్మించేడు.

పునరావృత్తం అంటే "రీ సైక్లింగ్." ప్రభంజనం అంటే విరగ్గొట్టే శక్తి ఉన్న సుడిగాలి. ముడి పదార్థాలని రసాయన ప్రక్రియలతో విరగ్గొట్టి, వాటిలోని ఘటకద్రవ్యాలని తిరిగి మనకి అనుకూలంగా సంశ్లేషించి, మన అవసరాలకి వీలైన విధంగా మలచటం ఈ పునరావృత్త ప్రభంజనం వారి గమ్యం.

స్వామి వారికి భక్తులు సమర్పించిన తలనీలాలు ఈ కర్మాగారానికి ముడి సరుకు. ఈ తలనీలాలని గుండ చేసి, రసాయనిక ప్రక్రియలతో విశ్లేషించి, వాటిలోని ప్రాణ్యాలని విడదీసి, వాటిలోని ముఖ్యమైన నవామ్లాలని విడదీసి, వాటిని స్పటికాలుగా తయారు చేసి ఎ. డి. ఎం. కంపెనీకి ఎగుమతి చేస్తాడు, ధర్మారెడ్డి.

పనికిరాదని మనం కత్తిరించి పారేస్తున్న జుత్తులో పదిహేడు రకాల నవామ్లాలు ఉన్నాయి. ఉదాహరణకి పదిహేను టన్నుల జుత్తు నుండి ఒక టన్ను "సిస్టీన్" అనే నవామ్లాన్ని సేకరించవచ్చు.

ఎ. డి. ఎం. కంపెనీ వారు ధర్మారెడ్డికి డాలర్లు చెల్లించి, ఈ నవామ్లాలని కొనుక్కుని, వాటిని నాసి రకం తినుభండారాల్లో తగు పాళ్లల్లో కలిపి, పోషక

శక్తిని పెంపొందించే విధంగా తయారు చేసి అమ్ముతారు. ఈ పోషక మిశ్రమాలని అనేక విధాలుగా వాడుకోవచ్చు: మొక్కలకి ఎరువుగా వెయ్యవచ్చు; చేపలకి, కోళ్లకి పెట్టే తిండిలో కలపొచ్చు; ఆఖరికి అవసరమైతే గోధుమ పిండి, జొన్న పిండి, ఐస్ క్రీము మొదలైన సరుకుల్లో కలపొచ్చు. అంతే కాకుండా ఎ. డి. ఎం. కంపెనీ వారు ఈ నవామ్లాలని అందమైన పేకెట్లలో పెట్టి, వాటిని ప్రపంచవ్యాప్తంగా అమ్మి, ఆ లాభాలలో ఒక వాటాని ధర్మారెడ్డికి ఇస్తున్నారు. ధర్మారెడ్డి ఐశ్వర్యానికి ఇది మూల కారణం.

వ్యాపార దక్షత తెలిసినవాడు కావటం వల్ల ఐశ్వర్యం ఎంతున్నా ధర్మారెడ్డికి కళ్లు నెత్తి మీదకి ఎక్కలేదు. దీనికి కారణాలు లేకపోలేదు. ప్రపంచ వాణిజ్య రంగంలో పోటీ ప్రభంజనాలు జోరుగా వీస్తున్నాయి. ఈ పోటీలో చైనా వాళ్లు ధర్మారెడ్డికి పక్కలో బల్లెంలా తగులుకుని ఇవే సరుకులని నాలుగో వంతు ధరకి ప్రపంచపు విపణి వీధిలో గుమ్మరిస్తున్నారు. దీనితో ఎ. డి. ఎం. కంపెనీతో తనకున్న ఎగుమతి ఒప్పందం దెబ్బతినే ప్రమాదం ఉందని ధర్మారెడ్డి పసిగట్టేడు. చైనా వాడి ధాటికి ఎలా తట్టుకోవటమా అని ఆలోచిస్తూన్న రోజులవి.

ఇంట గెలవని వ్యాపారం రచ్చ గెలవదన్న సూత్రాన్ని నమ్మిన వ్యక్తేమో వేంకటేశ్వరస్వామి భక్తుల ఎడల ధర్మారెడ్డి ఎప్పుడూ ఎనలేని అభిమానం చూపించేవాడు. ఆ భక్తులే కద తన వ్యాపారానికి ముడి పదార్థం సరఫరా చేసేది? అందుకని తిరుపతి యాత్రలు చేసేవారి సదుపాయానికి ఎన్నెన్నో వసతులు సానుకూల పరచేవాడు. "యాత్రా స్పెషల్" అన్న పదబంధానికి కొత్త అర్థం కల్పిస్తూ ఇంటి గుమ్మం నుండి స్వామి పాదాల వరకూ, అన్ని వయస్సుల వారూ,

అలసట తెలియకుండా యాత్రలు చేసుకునే సదుపాయాలు కల్పించి. "ఏకతాళం" ("టర్న్కీ") పద్ధతిలో ప్రణాళికలు ప్రవేశపెట్టేడు. భక్తులు ఒకే ఒక టికెట్టు కొనుక్కుంటే చాలు, వారిని ధర్మారెడ్డి మనుష్యులు ఇంటి గుమ్మమం ముందు కలుసుకుని, వారి మంచి చెడ్డలన్నీ చూస్తూ వారి చేత యాత్రలు చేయించి, మళ్లా వారిని ఇంటి గుమ్మం వద్ద దింపే పూచీ తీసుకునేవాడు. ఈ సదుపాయంతో తెలుగు రాని ఉత్తర దేశీయులు కూడ బాలాజీ దర్శనం కోసం ధర్మారెడ్డినే ఆశ్రయించేవారు.

ఇరవైయవ శతాబ్దం అంతం అయే రోజులలో స్వామి దర్శనానికి సగటున రోజుకి 40,000 భక్తులు వచ్చేవారు. పర్వ దినాలలో అయితే భక్తుల సంఖ్య సునాయాసంగా రోజుకి లక్ష దాటిపోయేది. ఒకొక్కప్పుడు రెండు గంటలలో దొరికే దర్శనం పర్వ దినాలలో పదిహేనేసి గంటలు పట్టేది. పెద్దలు, పిల్లలు, అడ్డాల్లో పసిపాపలు, మధుపర్కాలతో నూతన వధూవరులు, పండితులు, పామరులు, అంతా కూపాల్లాంటి గదులలో, అలా వరసలో గంటలకొద్దీ నిలబడి, కాలక్షేపపు బటానీలు తింటూ, కాలయాపన చెయ్యటం ధర్మారెడ్డికి నచ్చలేదు. ఇంతగా ఇబ్బందులకి ఓర్చుకుని వేచి ఉన్నా స్వామివారి దర్శనం లభించేది క్షణకాలం మాత్రమే! స్వామివారి విగ్రహాన్ని అల్లంత దూరంలోంచి తప్ప దగ్గరగా చూడటమే అవదు. "కదలండి, కదలండి" అని పోలీసులు ఒకటే గోల. దేవుడు సర్వాంతర్యామి కదా. ఈ కొండ ఎక్కే చూడాలా? ఈ తొడతొక్కిడిలో, అనారోగ్యకరమైన పరిస్థితులలో, ఈ దర్శనం ఎందుకు? అప్పుడు ధర్మారెడ్డికి ఒక తరుణోపాయం తట్టింది.

వరసలలో వేచి ఉన్నవాళ్లు కాళ్లు పీకెట్టేలా నిలబడవలసిన అవసరం లేకుండా, పెద్ద పెద్ద గదులు కట్టించి, వాటిల్లో కుర్చీలు వేయించి, ఆ గదులలో పురాణ కాలక్షేపాలు, హరికథలు, మొదలైన కార్యక్రమాలు ఏర్పాటు చేయించి, తొడతొక్కిడి తగ్గించి, భక్తుల మన్ననలు అందుకున్నాడు. ఎంత కాలక్షేపపు కార్యక్రమాలు ఉన్నా వరసలు జోరుగా ముందుకి కదలకపోతే ఎలా? స్వామి దర్శనం కొరకు భక్తులు గంటలకొద్దీ పడిగాపులు పడి ఉండవలసిన స్థితి రాకుండా ఉండటానికి మార్గాంతరాలు వెతకటం మొదలెట్టేడు, ధర్మారెడ్డి.

స్వామి వారి గర్భగుడికి, విగ్రహానికి, ఆ విగ్రహం చుట్టూ ఉన్న సామగ్రికి, విగ్రహం పాదాల దగ్గర కూర్చున్న అర్చక స్వాములకి – ఆ వాతావరణం అంతటికి – హోలోగ్రాము తీసి నాలుగైదు చోట్ల ప్రక్షేపించి, మైలు పైగా పొడుగున్న ఆ వరసలని నాలుగైదు వరసలుగా విడగొడితే వేచి ఉండే సమయమూ తగ్గించవచ్చు. దర్శన సమయం పెంచ వచ్చు. తొడతొక్కిడి తగ్గించవచ్చు. కొండ ఎక్కటానికి అనుకూలపడని వారికి దిగువ తిరుపతిలోనే దర్శనభాగ్యం కలిగించవచ్చు. భక్తులకోసం స్వామి ఎన్ని సార్లు కొండ దిగి రాలేదు? ఒకే కృష్ణుడు పదహారు వేల గోపికలకి ఒకొక్కడుగా కనిపించేడు కదా. అమెరికాలో, ఎన్నో చోట్ల స్వామి ఆలయాలలో దర్శనం చేసుకుందికి వెళ్లినప్పుడు "నా ఎదట ఉన్నది నకిలీ స్వామి, అసలు స్వామి ఎక్కడో తిరపతిలో ఉన్నాడు" అని ఏనాడైనా ఎవరైనా అనుకుంటారా? భక్తుల సంఖ్య ఘాతీయంగా (ఎక్స్పొనెన్షియల్) పెరిగిపోతూన్న ఈ రోజుల్లో సాంకేతిక పరిష్కారాలమీద ఆగమ శాస్త్రాలు మాత్రం శీతకన్ను ఎందుకు వేస్తాయి?

దగ్గరకెళ్ళి చేత్తో తడిమి చూస్తే కాని అసలుకి, హోలోగ్రాముకీ తేడా తెలియదు. మనని ఎలాగూ గర్భగుడిలోకి వెళ్లి విగ్రహాన్ని ముట్టుకోనివ్వరు, పూజలు చెయ్యనివ్వరు, హారతులివ్వనివ్వరు. దూరం నుండి దర్శనం చేసుకోటానికి రాతి విగ్రహం అయితేనేమిటి, గాలి విగ్రహం అయితేనేమిటి? జ్యోతిర్విగ్రహం అయితేనేమిటి? వినాయకుడి బొమ్మని శక్తిని బట్టి బంగారంతో చెయ్యవచ్చు, వెండితో చెయ్యవచ్చు, మట్టితో చెయ్యవచ్చు, పసుపుతో చెయ్యవచ్చు. శివలింగాలు కూడ అన్ని పదార్థాలతోటీ చెయ్యవచ్చు. మనకి జ్యోతిర్లింగాలు ఉన్నాయి కదా? ఈ రోజుల్లో హోలోగ్రాములని లేసరు కాంతితో చేస్తున్నారు. కనుక హోలోగ్రాము అంటే కాంతి విగ్రహం, జ్యోతిర్విగ్రహం.

ఈ విధంగా ఆలోచించి, హోలోగ్రఫీ సహాయంతో స్వామివారి అసలు విగ్రహాలకి ప్రతీకలుగా జ్యోతిర్విగ్రహాలు సృష్టించి, “సమాంతర స్వామి దర్శనం” అనే కొత్త పద్ధతి ప్రవేశపెట్టేడు. అమెరికాలోని డిస్నీలేండులో తరిఫీదు పొంది వచ్చిన వారి పర్యవేక్షణలో “అసలు స్వామి” విగ్రహానికీ, దానికి ప్రతీకగా సృష్టించిన జ్యోతిర్విగ్రహానికి తేడా తెలియటానికి వీలులేనంత గొప్పగా ఒకటికి పది హోలోగ్రాములు సృష్టించేరు – ధర్మారెడ్డి కంపెనీలో పనిచేసే ఇంజనీర్లు. ఈ పద్ధతిలో ఒక వరుస పది వరుసలుగా చీలింది. వరుసలు జోరుగా ముందుకి కదలటమే కాదు, భక్తులకి స్వామి విగ్రహం ఎదుట రెండు నిమిషాలు నిలబడి తన్మయత్వం చెందటానికి అవకాశం కలిగింది. ఇదీ ధర్మారెడ్డి పరపతికి మూలకారణం.

కొద్ది సేపటిలో ధర్మారెడ్డి కంపెనీ వారి వాహనం వచ్చి శివశంకరశాస్త్రి ఇంటి ముందు ఆగింది. శవాలని తీసుకెళ్లటానికి వీలుగా ఆ బండికి వెనక ఒక తలుపు ఉంది. రెడ్డిగారి మనుష్యులు ఇద్దరు ముందుకి వచ్చి జరగవలసిన అంత్యక్రియలు జరిపించటానికి సర్వ హక్కులూ పునరావృత్త ప్రభంజనం వారికి చెందేలా శివశంకరశాస్త్రి చేత కాగితం మీద సంతకం పెట్టించుకుని, తరువాత పార్థివ దేహం శయనించిన పాడెని బండిలో ఉంచి, కాపలాగా ఇటూ అటూ కూర్చున్నారు. ధర్మారెడ్డి స్వయంగా కారు తోలుతూ ఉంటే శివశంకరశాస్త్రి, ఆయన పక్క, ముందు సీటులో కూర్చున్నాడు.

తల్లి ప్రాణాలు విడచి పన్నెండు గంటలు అయింది. ఈ పన్నెండు గంటలలోనూ, శాస్త్రి పచ్చి మంచి నీళ్లయినా ముట్టలేదు. రాత్రల్లా మొద్దుబారిన మనస్సుతో పడ్డ హైరాణ వల్ల కలిగిన అలసట మొదటిసారిగా, కారులో కూర్చోగానే, కనిపించింది. జనసందోహాన్ని చీల్చుకుంటూ కారు ముందుకి సాగుతోంది. కారు కుదుపుకి చిన్నగా మగత కమ్మిందో ఏమో శాస్త్రి జోగటం చూచి రెడ్డే అన్నాడు.

“పంతులూ! ఆ ఫ్లాస్కులో కాఫీ కొంచెం గ్లాసులో పోసుకుని తాగు. ఏమీ కడుపులో పడకపోతే శోష వచ్చి పడిపోతావు.”

“ఎలా తాగమంటారు, రెడ్డి గారూ! అమ్మ శరీరం దహనం అయే వరకూ...”

“ఏయ్ పంతులూ! అందరికీ వేదాంతం చెప్పే నువ్వే ఇలా దిగాలు పడిపోతే ఎట్లా? ఇంక అమ్మ ఇక్కడ లేదు. వెనక ఉన్నది నీ తల్లి నివసించిన

దేహము, కట్టుకున్న బట్టాను. ఈ రెండింటిని వదిలేసి నీ అమ్మ ఆత్మ దేవుడిలో ఎప్పుడో కలిసిపోయింది. ఇటుపైన ఆ ఆత్మ మరొక బొందెలో ప్రవేశిస్తుంది. మా కంపెనీ భాషలో చెప్పాలంటే అమ్మ ఆత్మ "రీసైకిల్" అయిపోయింది. ఈ బొంది కూడ కొద్ది గంటలలో పంచ భూతాలలో కలిసిపోయి "రీసైకిల్" అయిపోద్ది. నువ్విక దిగాలు పడక. కొంచెం కాఫీ తాగి తేరుకో."

వెల్లువలా పొంగి పొర్లుతూన్న జనసందోహాన్ని తప్పించుకుంటూ ధర్మారెడ్డి కారుని చాకచక్యంతో తోలి ఊరు బయటకు చేరుకున్నాడు. శివశంకరశాస్త్రికి తెలుసున్న శ్మశానం ఊరికి ఆవలి దరిని ఉంది. రెడ్డి కారుని ఇటు వైపు ఎందుకు తీసుకొస్తున్నాడో శాస్త్రికి అర్థం కాలేదు.

కారు పునరావృత్త ప్రభంజనం పెరటి గుమ్మంలో ఆగింది.

కారు ఆగగానే సిబ్బంది శవాన్ని కిందకి దింపేరు.

ఇద్దరు ఆడంగులు వచ్చి శవం మీద రెండు బిందెల నీళ్లు పోసి, కొత్త బట్ట చుట్టబెట్టేరు.

మళ్లా ఇందాకటి మనుష్యులే ఇద్దరు వచ్చి శవాన్ని అలంకరించబడ్డ మరొక పాడె మీద పడుకోబెట్టేరు. ఈ పాడె ఆసుపత్రిలో రోగులని తీసుకెళ్లే చక్రాల బండిలా ఉంది. ఈ తంతు అంతటినీ స్థాణువులా నిలబడి చూస్తున్నాడు శివశంకరశాస్త్రి.

ఒక వ్యక్తి శవ వాహనాన్ని తోసుకు వెళుతూ ఉంటే రెడ్డి ఆ వెనక, శాస్త్రి ఆ వెనక నడుస్తున్నారు. అందరూ ఒక గదిలో ప్రవేశించేరు. లోపల చూడటానికి ఒక శ్రవణమందిరంలా ఉంది: ఎదురుగా వేదిక, దిగువ రెండు వరసలలో కుర్చీలు,

వాటి మధ్య నడవ. శవ వాహనాన్ని ఈ నడవలో ఆపేరు. నేపథ్యంలో భగవద్గీతలోని శ్లోకాలు సన్నగా, మంద్రస్థాయిలో, వినిపిస్తున్నాయి. రెడ్డి ఏమిటి చెబితే ఆ పని చేస్తున్నాడు శివశంకరశాస్త్రి. ఇద్దరూ శవానికి ప్రదక్షిణ చేసి చివరిసారిగా నమస్కారం చేసేరు.

అవశ్యం వేదిక మీద తెర తెరుచుకుంది. వేదిక మీద ఒక బ్రాహ్మణుడు మంత్రాలు చదువుతూ కనిపించేడు. దూరంగా వేదిక మీదనే ఉన్నాడు కాని కిందకి దిగి మృతదేహం దగ్గరకి రాలేదు. అయినా సరే శాస్త్రోక్తంగా, ఉచ్చారణ దోషాలు లేకుండా, మంత్రాలు చదువుతూన్న బ్రాహ్మణుడిని చూడగానే శివశంకరశాస్త్రి మనస్సు తృప్తి చెందింది; రెడ్డిని శంకించినందుకు కించిత్తు చింతించేడు.

ఈ లోగా మందిరంలో దీపాల దీప్తి తగ్గింది. అదే సమయంలో వేదికకి పక్కగా మరొక యవనిక తెరుచుకుంది. ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని శాస్త్రి కళ్లు అప్పగించి చూస్తున్నాడు. ఎదుట ధనుస్సు ఆకారంలో ఒక ద్వారం, అందులోంచి సొరంగం లాంటి అమరిక కనిపించేయి. ఆ సొరంగపు గోడలని ఆనుకుని చక్రాకారంలో ఉన్న రంగురంగుల విద్యుత్ దీపాల అమరిక కనిపించింది. ఆ సొరంగాన్ని, ఆ దీపాల అమరికని చూడాలి కాని వర్ణించి చెప్పటం కష్టం. వెలుగుతూ, ఆరుతూ మిటకరితూన్న ఆ దీపాలు సర్పిలాకారంలో ఉన్న సొరంగం లోపలికి రమ్మని ఆహ్వానిస్తూన్నట్లు భ్రమ కలిగిస్తున్నాయి. భూలోకం నుండి స్వర్గలోకానికి వెళ్లే దారంటూ ఒకటి ఉంటే అది ఇలానే ఉంటుందేమో అనే భ్రాంతి కలగక మానదు. సొరంగపు ముందు భాగం

భూలోకం లాగనే ఉంది. వెనక్కి వెళుతూన్న కొద్దీ, దూరంలో, మహానుభావుల రూపాలు మేఘాలలో కదలాడుతూన్నట్లు కనిపిస్తున్నాయి. గాంధీ, శంకరాచార్యులు, వ్యాసభగవానుడు,... ఇలా కొందరి రూపాలు గుర్తు పట్టగలిగేడు శివశంకరశాస్త్రి. సొరంగానికి ఆవలి దరిలో ఉన్నది స్వర్గమే కాబోలు అనిపిస్తుంది ఎవరికైనా!

దిగ్భ్రాంతితో మైమరచి ఆ దృశ్యాన్ని చూస్తూన్న శివశంకరశాస్త్రి తన ఎదురుగా ఉన్న పాడె కదలికని గమనించనే లేదు. ఇంతలో పువ్వులతో అలంకరించబడ్డ తల్లి పార్థివ దేహం, పాడెతో సహా ఆ సొరంగంలో ప్రవేశించింది. ప్రవేశించి, ముందుకి పయనం సాగించింది. కొద్ది దూరం వెళ్లిన తరువాత ఆ పాడె సొరంగపు దీప్తిలో లీనమైపోయింది. ఇంతలో ఆ దీప్తిని చీల్చుకుంటూ తల్లి ఆకారం లీలగా శాస్త్రి కంటికి కనబడి, క్రమేపీ అదృశ్యమైపోయింది.

ఇంతలో మందిరంలో దీపాల కాంతి పెరిగింది. వేదిక మీద మంత్రాలు చదువుతూన్న బ్రాహ్మణుడు, చూస్తూ ఉండగా, హరించిన కర్పూరంలా, మీట తీసేసిన దీపంలా అంతర్ధానం అయిపోయేడు. సొరంగంలో కనిపించిన గాంధి, శంకరాచార్యులు, వ్యాసభగవానుడు, మొదలైన వారి ఆకారాలు సూర్యుడి వేడిలో కరిగిపోయిన మంచు విగ్రహాలులా కరిగి నేపథ్యంలో కలిసిపోయాయి. నాటకం అయిన తరువాత తెర మూసుకుపోయినట్లు సొరంగపు ద్వారం ముందు తెర పడిపోయింది. నేపథ్యంలో మాత్రం జంత్రవాద్యాల ధ్వని సుతారంగా వినిపిస్తోంది.

"పంతులూ, అమ్మని స్వర్గానికి పంపేసేము. నువ్వింకేమీ బెంగ పెట్టుకోమాక" అంటూ చేతిలో వెయ్యి నూట పదహార్లు పెట్టి "మిగిలిన కర్మ కాండ

నీకు నచ్చిన విధంగా ఇంటి దగ్గర జరుపుకో!" అంటూ డ్రైవరుని తోడిచ్చి ఇంటికి పంపేశాడు.

సూర్యాస్తమయం అయే వేళకి శివశంకరశాస్త్రి ఇంటికి వచ్చేసేడు. పదిహేనేళ్ల కిందట తన తండ్రి మరణించినప్పుడు సనాతన సంప్రదాయం ప్రకారం కర్మకాండ జరిపించేడు. చితి మీద ఉన్న తండ్రి కపాలాన్ని కొరివితో కొట్టవలసి వచ్చినప్పుడు పెల్లుబికే దుఃఖాన్ని ఆపుకోలేక పోయేడు. రెడ్డి గారి అధునాతన పద్ధతే నయమెమో అనిపించింది. ఇప్పుడు తల్లిని స్వర్గానికి పంపేమన్న సంతృప్తి ఎక్కువ, తల్లి ఇక లేదన్న విచారం తక్కువ.

## 2

పునవావృత్త ప్రభజనం యొక్క భవనాల అంతర్భాగంలో కంపెనీ యొక్క మార్గదర్శకుల సమావేశం జరుగుతోంది. వ్యాపారం వెళ్లే దిశలో మార్పులు చెయ్యవలసి వచ్చినప్పుడు మార్గదర్శకులు ఇలా కలుసుకుని మంతనాలు జరపటం పరిపాటే. ఇలాంటి ప్రత్యేక సమావేశాలలో మార్గదర్శకులు ఎక్కువ మాట్లాడరు. సాంకేతిక నిపుణుల అభిప్రాయాలు వింటారు. నలుగురి సలహా విన్న తరువాత కంపెనీ గతీ, గమ్యం నిర్ణయిస్తారు.

ఒక నిపుణుడు మాట్లాడుతున్నాడు:

"ఒక సగటు మనిషి బరువు 68 కిలోలు. లెక్క సౌలభ్యం కొరకు 100 కిలోలు అనుకుందాం. తరువాత సవరింపులు చేసుకోవచ్చు. ఈ వంద కిలోలు బరువున్న శరీరంలో 64 కిలోలు నీరే. ఆ నీటిని తీసివెయ్యగా మిగిలిన 36 కిలోలలో 4 కిలోలు ఎముకలలో ఉండే ఖనిజ లవణాలు. మిగిలిన 32 కిలోలలో

నాలుగు రకాలైన బృహత్‌బణువులు లేదా మెగా మోలిక్యూలులు, ఉంటాయి. వీటినే కర్బనోదకాలు లేదా కార్బోహైడ్రేటులు, కొవ్వులు లేదా లిపిడ్లు, ప్రాణ్యములు లేదా ప్రోటీనులు, కణికామ్లములు లేదా నూక్లియక్ ఏసిడ్‌లు అనీ అంటారు. వీటిలో కొవ్వులు 20 కిలోలు, ప్రాణ్యములు 10 కిలోలు ఉండొచ్చని అంచనా వెయ్యొచ్చు. మిగిలిన రెండు కిలోలు అమాంబాపతులు, అంటే కండరాలలో ఉండే గ్లయికోజెన్ (0.4 కిలో), కాలేయంలో ఉండే గ్లయికోజెన్ (0.2 కిలో), రక్తంలో ఉండే గ్లూకోజు (0.03 కిలో), గోరోజనామ్లాలు (0.0004 కిలో),...”

మాటల్లో దమ్మిడీ ఎత్తు ఉద్వేగం లేకుండా, యంత్రంలా మానవుడు లెక్కలు చెప్పుకు పోతున్నాడు. సైన్సుకి సెంటిమెంటు లేదంటే ఇదే!

“...మన రసాయన పద్ధతుల సమర్ధత నూటికి నూరు పాళ్లు ఉండదు కనుక ఈ 10 కిలోల ప్రాణ్యాలు దిగుబడి కావు. కనీసం 5 కిలోల ప్రాప్తికి ప్రాణ్యపు స్పటికాల దిగుబడికి సావకాశాలు ఉన్నాయి. అంటే ఈ పద్ధతి యొక్క నికర సమర్ధత లేదా “నెట్ ఎఫిషెన్సీ” ఉరమరగా 5 శాతం. మన ఉత్పాదక పద్ధతులు నూటికి నూరు పాళ్లు సమర్ధవంతంగా పని చేస్తే ఈ నికర సమర్ధత 10 శాతం ఉంటుంది. ఇది అందని గమ్యమే అయినా ఆశాభావంతో ఈ 10 శాతం సమర్ధతనే తీసుకుందాం. అప్పుడు వంద కిలోల బరువున్న మనిషి శరీరం నుండి 10 కిలోల ప్రాప్తికి నవామ్లాలు దిగుబడి పొందవచ్చు.

“శరీరంలో ఉండే ప్రాణ్యాలు 20 నవామ్లాలతో తయారు చెయ్యబడ్డాయి. కనుక సగటున 100 కిలోలు తూగే మనిషి శరీరపు భారంలో ఒకొక్క నవామ్లం పాలు అర్ధ కిలో కంటె ఎక్కువ ఉండదు. నిజానికి సగటు మనిషి బరువు 68

కిలోలే కనుక ఒక సగటు మనిషి శరీరం నుండి లభించే ఒకొక్క నవామ్లు అర కిలో కూడ ఉండదు.

"అంతే కాదు. ఈ నవామ్లాలన్నీ ప్రతి ప్రాణ్యం లోను సమాన నిష్పత్తిలో ఉండవు. ఉదాహరణకి ప్రాణ్యాలలో ప్రోలీను, సిస్టీను కంటె అలనీను, గ్లయిసీను ఎక్కువగా ఉంటాయి. కనుక 68 కిలోలు సగటు బరువు ఉన్న వ్యక్తి శరీరం నుండి, ఆదర్శప్రాయమైన పరిస్థితులలో, గిట్టుబాటు అయే లైసీను అర్ధ కిలో కంటె తక్కువే. నిజ పరిస్థితులలో అయితే ఈ గిట్టుబాటు పావు కిలో ఉంటుందని నా అంచనా. కనుక మనుష్యుల శరీరాలనుండి నవామ్లాలని తీసి వాటిని పునరావృత్తం చెయ్యటం లాభదాయకమూ కాదు, నైతికంగా నలుగురూ హర్షించే పనీ కాదు."

మాట్లాడే మనిషికి జీవశాస్త్రం కరతలామలకం అని తెలుస్తూనే ఉంది. కొంచెం ఊపిరి తీసుకుని ఆ నిష్ణాతుడు మళ్లా అందుకున్నాడు.

"ఎందుకంటే మనం భక్తుల తల నీలాలని ముడి పదార్థంగా వాడినప్పుడు 15 కిలోల ముడి పదార్థం నుండి ఒక కిలో లైసీను వస్తోంది కదా. అంటే ఈ పద్ధతి సమర్థత పదిహేనింట ఒకటి లేదా 7 శాతం.

ఒక కిలో లైసీను కావాలంటే నాలుగు సగటు శరీరాలైనా కావాలి, 15 కిలోల జుత్తయినా కావాలి. నన్నడిగితే పరికర్మకి జుత్తుని ముడిపదార్థంగా వాడటమే అన్ని విధాలా శ్రేయస్కరం."

"కానియ్యవయ్యా! తొందరగా తెముల్చు." గాలి వీచే వాటం ఎటు తిరుగుతోందో పసికట్టిన ధర్మారెడ్డి తొందర పెట్టేడు.

“మరొక చిన్న ఉరమర లెక్క చూపించి నా ప్రసంగం ఆపు చేస్తాను. నా అంచనా ప్రకారం సగటున వందమంది భక్తుల జుత్తు 15 కిలోలు తూగుతుంది. రోజూ స్వామిని దర్శనం చేసుకుందికి వచ్చే 40,000 భక్తులలో తలనీలాలు సమర్పించుకునే వారు కనీసం 10,000 ఉంటారు. కనుక మనకి రోజుకి 1,500 కిలోల జుత్తు వస్తోంది, అందులోంచి 100 కిలోల లైసీను నికరంగా వస్తుంది. దీన్ని పదింతలు పెంచాలంటే దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పదింతలు పెరగాలి. అంటే సగటు రోజుకి నాలుగు లక్షల భక్తులు తిరుపతి రావాలి. ఇప్పటికే జనసందోహాన్ని అదుపులో పెట్టటం కష్టంగా ఉంటోంది. అందుకనే సమాంతర స్వామి దర్శనం – అవసరమైతే ఆగమ సూత్రాలని సవరించి – ” అంటూ అర్థోక్తిలోనే ప్రసంగం ముగించి కుర్చీలో కూలబడ్డాడు.

మరొక నిపుణుడు లేచి, “సమర్ధత విషయం అలా పక్కని పెట్టి ఖర్చుల సంగతి చూద్దాం. కేశపరికర్మకి కావలసిన టెక్నాలజీ మన దగ్గర అప్పుడే ఉంది. మానవ శరీరం నుండి నవామ్లాలని విడదీసే సాంకేతిక నైపుణ్యం మనకి ఇంకా పూర్తిగా అవగాహన కాలేదు. ఎంత లేని వాళ్లయినా అంత్యక్రియలకి దహనమో, ఖననమో అంటే మన సంస్కృతి ఒప్పుకుంటుంది కాని, ....”

మరొక నిపుణుడు లేచి, “చితిని పేర్చటానికి కర్రలు కరువైతే ఏ విద్యుత్ చితి మీదో దహనం చెయ్యాలి కాని, పునరావృత్తం అంటే....”

“అయితే అంత్యక్రియలు జరిపించెద్దాం.” అంతా ఏకగ్రీవంగా తీర్మానించేరు.

## 3

ధర్మారెడ్డి కారు శివశంకరశాస్త్రి పూరి పాక ముందు ఆగింది. ఆస్థికలు ఉన్న కలశం పట్టుకుని ధర్మారెడ్డి కారు దిగేడు.

# మరోలోకం

మిడతంభొట్లు మేష్టారు తిరుగుడు కుర్చీలో కూర్చుని నెమ్మదిగా, గుండ్రంగా తిరుగుతూ గదంతా మరొకసారి కలయజూసేరు. ఎదురుగా గోడ మీద ఉన్న ప్రశంశా పత్రాలని ఇంకోసారి చూసుకున్నారు. గదిలో గోడలని ఆనుకుని నిలువెత్తు బీరువాలు పుస్తకాలతో పిటపిటలాడుతున్నాయి. నేల మీద ఖాళీ అట్ట పెట్టెలు ఆ పుస్తకాలని అందుకోటానికి తయారుగా ఉన్నాయి.

.....ఎప్పటి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు రోజులు? నలభై ఏళ్లు నలభై నిమిషాలలా దొర్లిపోయాయి! ఎన్ని దూషణ భూషణ తిరస్కారాలు? ఇంకెన్నాళ్లు ఈ పరిశోధన? ఇంకెన్నాళ్లు ఈ దుక్కృంకరణాలు? "సదసద్ వస్తువుల మధ్య గల తారతమ్యాన్ని తత్త్వవేత్తలు మాత్రమే గ్రహించగలరు" అని గీతలో చెప్పనే చెప్పేడు. శక్తి, గరిమ; అలలు, రేణువులు; అస్తిత్వం, నాస్తిత్వం; నిత్యం, అనిత్యం; అమరత్వం, మృత్యువు; దేహి, దేహం అనే ద్వయీభావాల మధ్య ఉండే అంతరాలు బహు సూక్ష్మం. ప్రకృతి రహశ్యాలని భౌతికశాస్త్రం ఛేదించలేకపోతే తత్త్వశాస్త్రమే శరణ్యంలా ఉంది. ఈ కోణం నుండి సత్యశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.....

ఇలా ఆలోచనలు ఆయన మస్తిష్కంలో ఝుమ్మని చెలరేగుతునాయి.

మిడతంభొట్లు మేష్టారు నెమ్మదిగా కూర్చున్న కుర్చీలోంచి కిందకి ఒంగి నేల మీద చిందరవందరగా ఉన్న కాగితాలలో కొన్నింటిని ఏరి చేతిసంచిలో సర్దుకున్నారు. ఎదట బీరువా పై అరలో ఎన్నాళ్లబట్టో ధూళి పొరలు

సంతరించుకుంటూన్న తత్త్వశాస్త్రపు పుస్తకాలు రెండు అందుకుందామని లేచి నిలబడ్డారు. వెంటనే కళ్లు గిర్రున తిరిగి చీకట్లు కమ్మేయి. పడిపోకుండా బీరువానే ఆసరాగా పట్టుకున్నారు.

....నెత్తురుపోటు ప్రభావం అయుంటుంది. ఇటుపైన ఉన్నపట్టున గభాల్న లేవకూడదు....

కొద్ది క్షణాలలో తేరుకుని కళ్లు తెరచేరు. బీరువా పై వరుసలో ఉన్న పుస్తకాలన్నీ కంటి మట్టానికి ఒక అడుగు దిగువనే కనిపిస్తున్నాయి. బుర్ర కిందకి వంచి చూసేరు. కాళ్లు నేలని ఆనటం లేదు! ఇది కళ్లు తిరగటం కాదు; కాళ్లు తేలటం!

నలభై ఏళ్ల క్రితం సంగతి. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రాంగణంలో, అంతర్జాతీయ భౌతికశాస్త్ర సమావేశం జరుగుతోంది. ఆ సందర్భంలో ఇదే రకం అనుభవం కలిగింది ఈయనకి. మనిషి ఉన్నపాటున అమాంతం గాలిలో తేలిపోయేడు. భూమి ఆకర్షణ శక్తి ప్రాంతీయంగా పలచబారిందని – శాస్త్రీయత లోపించకుండా, కట్టుదిట్టంగానే – ఒక ఉపపాద్యాన్ని ప్రతిపాదించేడు. ఎవ్వరూ నమ్మలేదు. పైపెచ్చు కన్ను చెదిరిందేమో అన్నారు. కనికట్టు అన్నారు. పైత్యోద్రేకం అంటూ నాటు వైద్యాలు చేసేరు. గాలిదోషమేమో అంటూ భూత వైద్యుణ్ణి పిలిపించేరు. సీల ఒదులై ఉంటుందని హేళన చేసేరు. క్రమేపీ అంతా మరచిపోయేరు. ఇన్నాళ్ల తరువాత మళ్లా అదే అనుభూతి!

ఇప్పుడు పూర్వపు మిడతంభొట్లు కాదు. ఈయన సిద్ధాంతాలని అవహేళన చేసినవాళ్లు ఎంతమంది ఉన్నారో ఆదరించి అందలం ఎక్కించినవాళ్లూ

అంతమంది ఉన్నారు. నోబెల్ బహుమానం గెలుచుకున్న తొలి తెలుగువాడు! అయినప్పటికీ సాపేక్షత్వ వేగంతో ప్రయాణం చేసే కేరం బోర్డు పిక్కతో కొట్టి తోటి సహాధ్యాయుడిని హత్య చేసేడన్న నేరం మీద తీహార్ జైల్లో వారం రోజులు నిర్బంధించేరు. సాక్ష్యాధారాలు సరిపోక ఒదిలేసేరు. "అఖండ మేధావంతుడు" అని కొందరనుకుంటే, "చిత్తచాంచల్యం ఉన్న వ్యక్తి" అని అనుకునేవాళ్లు లేకపోలేదు.

-----. వైద్యుడిని చూసే వేళవుతోంది. రాధ వచ్చి తీసుకెళతానంది-----.

ప్రస్తుతపు పరిస్థితులలో వైద్యం వల్ల ఉపశమనం ఉండదని ఆయనకి తెలుసు. వైద్యుడు చెయ్యబోయే రోగనిర్ణయం ఏముంటుంది? వార్ధక్యం వల్ల వచ్చే "వర్టిగో" అనబడే తలతిప్పు కావచ్చు అంటాడు. దానికి కారణం మధ్య చెవిలో ఉండే కాలువలలో ఖటిక రేణువులు పేరుకోవటం వల్ల సంతులన యంత్రాంగం సరిగ్గా పని చెయ్యకపోవటం అంటాడు. ఇవన్నీ కళ్లు ఎందుకు తిరుగుతున్నాయో చెబుతాయి కాని గాలిలో కాళ్లు తేలిపోవటం సంగతి? దానికి మానసిక వైద్యం కావాలంటాడు. ఆ మానసిక వైద్యుడేమంటాడో కూడ మిడతంభొట్లు మేష్టారు ఊహించగలరు. ఈ పరిస్థితికి ఏ "డిసోసియేషన్ డిసార్డర్" అనో ఒక ఇంగ్లీషు పేరు పెట్టి భూస్థాపిత ప్రక్రియలలాంటివి సాధకం చేస్తే సరిపోతుందంటాడు. వాళ్లెవరూ ఏమీ చెయ్యలేరని తనకి తెలుసు.

ఏ మానసిక నిపుణుడి సహాయం లేకుండానే మిడతంభొట్లు మేష్టారు పుస్తకాల బీరువా అంచు పట్టుకుని నెమ్మదిగా నేల మీదకి దిగేరు. కుర్చీలో

కూర్చుని ఉద్విగ్నతకి, ఆరాటానికి తావివ్వకుండా నిదానంగా ఆలోచించటం మొదలు పెట్టేరు.

ఇంతలో దోమల హోరులా మంద్ర స్థాయిలో అస్పష్టమైన రొద వినబడింది. కంటికి ఎదురుగా వర్ణనాతీతమైన ఒక అసమాన్య దృశ్యం సాకారం పొందటం మొదలయింది. ఎదురుగా ఉన్న ప్రదేశం ప్రకాశమానమై, క్రమేపీ సాంద్రమానమైన ఒక ఆకారం సంతరించుకుంటోంది. పారదర్శకంగా ఉన్న ప్రదేశం ముందుగా మసకబారింది. క్రమేపీ రేఖాకృతి చెందింది. అటుపైన స్థూలరూపం దాల్చి, దరిదాపు మానవాకృతిలో, ఎదురుగా ప్రత్యక్షమైంది – ఒక శాల్తీ!

అది కలా, కనికట్టా, మాయా? లేక, పొరుగు గదులలో పూర్ణప్రతిబింబాలతో ("హోలోగ్రాములు" తో) ప్రయోగాలు చేస్తూన్న విద్యార్థులు ఈ గదిలోకి వారి సమాచారాన్ని ప్రక్షేపిస్తున్నారా?

ఎదురుగా ప్రత్యక్షమైన శాల్తీ సన్నగా, నిలువెత్తు పొడుగు ఉంది. మిలమిల మెరిసే రజత అంగరక్ష లాంటి ఉడుపులు. రెండు కాళ్లు. పాదాలు మాత్రం వెనక్కి తిరిగి లేవు! ....నాలుగు చేతులు ఉన్నాయా? అవి చేతులేనా? .... శిరోభాగం కూడ మిలమిల మెరుస్తూ కోలగా, నున్నగా ఉంది. మానవాకృతి ఉంది కాని మానవుడు కాదేమో!.

"ఏమి అనుకుంటున్నారో తెలుసు నాకు. ఇది మనిషా కాదా అని కదూ?"

....ఇదేదో మాట్లాడుతోంది! పైపెచ్చు తనకి అర్థం అయే భాషలో మాట్లాడుతోంది! ఆ గొంతుక ఎప్పుడో, ఎక్కడో విన్నట్లు ఉందే....

మదిలో మెదులుతూన్న బెదురుని అదుపులో ఉంచి, “అవును. అదే అనుకుంటున్నాను” అంటూ బింకంగానే సమాధానం చెప్పేరు మేష్టారు.

“భూలోకిని కాదు నేను. మరోలోకం మాది. అరవై జ్యోతిర్వర్షాల దూరం నుండి వచ్చేను. మీ ధనూరాశిలో కనిపిస్తుంది మా తార. ప్రభుత్వపు సిబ్బందిలో పనిచేసే నౌకరుని; కలనయంత్రాల అదుపులో చాకిరీ చేసే చాకరుని కాను. బుద్ధిశాలిని. బాధ్యత తెలిసిన వాడిని. ఇంతవరకు చెప్పేది నమ్మగలరా?”

“నమ్మజాలని నిజాలు ఎన్నో చూసేను. సిద్ధాంతాలకి లొంగని నిజాలని చూసిన తరువాత నా సిద్ధాంతాలనే సవరించుకున్న సందర్భాలు ఉన్నాయి. నేను కనేది, వినేది తర్కరహితం కానంతసేపు నమ్మటానికే ప్రయత్నం చేస్తాను.”

“నమ్మకం కుదిరిందా? అంత జోరుగా?”

“పామరులు, స్వకపోలకల్పితాలైన సిద్ధాంతాలని గుడ్డిగా నమ్మేవాళ్లు నమ్మకపోవచ్చు. పాండిత్యము, ప్రతిభలతో పాటు తెగువ ఉన్నవాళ్లు నమ్మగలరు. నువ్వు ఫలానా రాశిలోని, ఫలానా నక్షత్రం చుట్టూ తిరిగే ఫలానా గ్రహం నుండి వచ్చేనని చెబుతున్నావు కదా. నీ ఆకార వికారాలు చూసినా, నీ మాట విన్నా నమ్మాలనే అనిపిస్తోంది. ”

“ఇప్పుడు ఎందుకు వచ్చేనో తెలుసుకోవాలని లేదా?”

“ఎందుకు లేదు? కుతూహలం అనేది లేకపోతే శాస్త్రవేత్తని ఎలా అవుతాను?”

“భూలోకులందరిని, కాపాడటానికి వచ్చేను.”

"ఇప్పుడు మాకొచ్చిన ఉపద్రవం ఏమిటి? ఈ భూగ్రహం మీద ఉన్న ప్రజలంతా ఎల్లప్పుడు ఏదో ఒక మిష మీద కొట్టుకు చస్తూనే ఉన్నారు, నిజమే. కణికాస్త్రాలు, అణ్వాస్త్రాలు ఎప్పుడు ఏ ముప్పు తెస్తాయో తెలియదు కదా. హరితగృహ వాయువులు పెరిగిపోయి మా గ్రహం వేడెక్కిపోతే ఎదురయే ప్రళయాన్ని తలుచుకుని కొందరు భయపడుతున్నారు. గతి తప్పిన గ్రహశకలాలు వచ్చి భూమిని గుద్దుకుంటే జీవకోటి అంతా చచ్చిపోతుందని కొందరు ఆందోళన పడుతున్నారు. ఇవన్నీ మా ఈతి బాధలు; మీవి కావు. ఒక మహాకవి చెప్పినట్లు పీత కష్టాలు పీతవి. వీటి నుండి తప్పిస్తామంటూ ఎక్కడో జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న మరొక లాతి సమాజం మాకు దూతని పంపటమా? ఈ ప్రతిపాదన తర్కబద్ధంగా లేదు."

"ఎదురుగా వస్తోంది పెను ముప్పు. ఈతి బాధలని మీరు జాబితా వేసిన ఇబ్బందులన్నీ – ఏమిటబ్బా ఆ మాట – ఆఁ కేవలం నేపథ్యపు రొద. చిరాకు పెట్టేవి. చెప్పులోని రాళ్ల వంటివి. తల్చుకుంటే వాటిని ఎదుర్కోగలరు మీరు. వచ్చేది పెద్ద ప్రమాదం. మరొక 200 ఏళ్లల్లో – అదే, మీ కాలమానంలో – మీ పొరుగున ఉన్న ఒక పెద్ద తారలో పెను మార్పు వచ్చి పేలిపోతుంది. ఈ పేలుడులో పుట్టే శక్తి తరంగాలు ఎంతో వేగంతో వచ్చి మీ పరిసరాలని ఢీకొనటం వల్ల మీ పొరుగు తారలన్నీ పూర్తిగా నశించిపోతాయి. చుక్కలే నాశనం అయిపోతూన్నప్పుడు వాటితోపాటు గ్రహాలకి కూడ అదే గతి. ఆ గ్రహాల మీద ఉన్న జీవాలు అంతం అవటం తప్పేది కాదు. "

"మా లోకం అంతం అయిపోతోందని జోశ్యం చెప్పి మమ్మల్ని బెదిరించటానికి ఇక్కడే మాకు ఎంతోమంది ఉన్నారు. రేపటితోటో మాపటితోటో మా పని సరి అని ఆరారా చెబుతూనే ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నాం. మీరు చేసిన విశ్లేషణతో మీలో మీకు ఏకాభిప్రాయం ఉందా? "

"నమూనాల మీద, అంచనాల మీద మాకు గట్టి నమ్మకం ఉండబట్టే మావాళ్లు ఇంత దూరం దూతని పంపేరు. ఈ రకం పేలుడు మీ పొరుగునే ఉన్న క్షీరసాగరంలో జరగబోతోందని మా నమూనాలు ఒకసారి చెప్పేయి. చెప్పినట్లే ఈ మధ్య అటువంటి పేలుడు జరగటం వల్ల మా నమూనాల మీద నమ్మకం పెరిగింది మాకు."

-----సా. శ. 1987 లో పాలపుంత క్షీరసాగరానికి పొరుగున ఉన్న పెద్ద మేజిలాన్ మేఘంలో ఉన్న SN 1987A అనే నీలి బృహత్ మహాతార బృహత్ నవ్యతారగా మారి పేలిపోవటం హబుల్ స్పేస్ టెలిస్కోప్ నమోదు చేసి సంచలనమే సృష్టించింది; అప్పటివరకు అరుణ బృహత్ మహాతారలే బృహత్ నవ్యతారలై పేలిపోగలవనే సిద్ధాంతం వీగిపోయింది. మన సూర్యుడు ఇలా పేలిపోటానికి అవకాశం లేదు కాని, మన పొరుగున ఉన్న ఎన్నో నీలి బృహత్మహాతారలలో ఒకటి ఇలా పేలిపోవచ్చు. మన ఇల్లు దిట్టంగా ఉన్నప్పటికీ పొరుగున ఉన్న ఇల్లు కాలిపోతే అది మన మనగడకి ముప్పు తెస్తుంది కదా. పొరుగువాడు ఎలాపోతే మనకేమి అని చూస్తూ ఊరుకోవటం విజ్ఞుల లక్షణం కాదు కదా! ఈ ఆగంతకుడితో మరికొంచెం మాట్లాడి చూడాలి---.

“దూతని పంపవలసిన అవసరం ఏమి వచ్చింది? వార్తని పంపితే సరిపోయేది కదా?”

“వార్తనో, దూతనో పంపాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం, చాల కాలం నుండి. నలభై ఏళ్ల క్రితం – మీ కాలమానం ప్రకారం – దూతని పంపి ఈ వార్తని మీకు అందజేద్దామని మొదట ప్రయత్నించేం. అప్పట్లో “దూ-రవాణా” మీద మా పరిశోధనలు పండలేదు; మా ప్రయోగం పూర్తి కాకుండా ఆగిపోయింది.”

“అప్పుడు దూతని ఎక్కడికి పంపటానికి ప్రయత్నం చేసేరు?”

“మీ దగ్గరకే! నలభై ఏళ్ల క్రితం గాలిలోకి తేలిపోతూన్నట్లు అనుభవం అయింది మీకు. అవునా? ఆ అనుభవం కలగటానికి అప్పుడు మేము చేసిన ప్రయోగాలే కారణం. చూడండి! మా శాల్తీలని దూ-రవాణా చెయ్యాలనుకున్నప్పుడు పెద్దగా ఉన్న ఆ శాల్తీని రవాణా చెయ్యటం కష్టం. అందుకని ఆ శాల్తీలలో ఉన్న జన్యు సమాచారాన్ని ముందు కుదిస్తాం. కుదించి, ఒక గణిత సమీకరణంలో ఇముడ్చుతాం. ఇమిడ్చి, ఆ సమీకరణాన్ని మాత్రం వాకేతాలుగా మార్చుతాం. మార్చి, వాటిని స్థలకాల సమవాయంలో ఉన్న గుళిక సొరంగాల ద్వారా ప్రసారం చేస్తాం. అలా అవి అడ్డదారుల వెంట ప్రయాణం చేసి గమ్యం చేరుకున్న తరువాత మా సమీకరణం చెప్పిన ప్రకారం గమ్యంలో ఉన్న పదార్థాన్ని కూడగట్టి దానికి రూపు, ఆకారం వచ్చేలా చూస్తాం. ఈ పని జరిగేటప్పుడు గమ్యంలో యాదృచ్ఛికంగా పడున్న పదార్థం క్రమబద్ధం అవుతుంది. అప్పుడు ఆ సమీప ప్రాంతాలలో అబందరం తరుగుతుంది. ఈ

తరుగుదల ప్రకృతి ధర్మానికి విరుద్ధం. అందుకనే ఆ ప్రాంతంలో మట్టుకు గురుత్వాకర్షణ నశించినట్లు భ్రాంతి కలుగజేస్తుంది."

గురుత్వాకర్షణ సిద్దాంతం, తాపగతిశాస్త్రం, గుళిక సిద్ధాంతాలలో సిద్ధహస్తుడైన మిడతంభొట్లుకి ఈ సాంకేతిక భాష అర్థం అయింది. పైపెచ్చు ఎప్పుడో నలభై ఏళ్ల కిందట ఆయన అనుభవించిన అనుభూతిని ఇంత స్ఫూర్తితో విశ్లేషించి చెప్పినవారు ఇంతవరకు ఎవ్వరూ తారసపడలేదు. కాని ఆయనకి ఇంకా సందేహాలు పూర్తిగా నివృత్తి కాలేదు.

---.. గుళిక సౌరంగాలలో కాంతి వేగాన్ని అధిగమించి ప్రయాణం చెయ్యగలిగే స్థోమత ఉంటేకాని ఈ దూరప్రయాణం సాధ్యంకాదు---..

"మీ ప్రయోగాలు ఈ మధ్యంతర కాలంలో చెయ్యకుండా, నలభై ఏళ్లు పోయిన తరువాత మళ్లా ఇప్పుడు ఎందుకు చేసేరు?"

"మీరనుకుంటూన్నది నిజం కాదు. ఇరవై ఏళ్ల క్రితం మరొక ప్రయోగం చేసేం. అప్పుడు దూతని పంపకుండా కేవలం వార్తని పంపి చూసేం. ఆ వార్తని అందుకున్నారు మీరు. అందుకున్నట్లు దాఖలాలు ఉన్నాయి మా దగ్గర. వార్తని విన్నారు మీరు. అది ఎక్కడనుండి వస్తోందో చెప్పలేకపోయారు మీరు. అందువల్ల ఎలా స్పందించాలో తెలిసినట్లు లేదు మీకు. ఎవ్వరూ నమ్మినట్లు కూడా లేదు, మీ మాటని. అదే సమయంలో ఒక తార పేలిపోవటం కనబడింది, మీ ఆకాశంలో. దానిని చూసి, మేము మీకు పంపిన వార్త మరొకరిని ఉద్దేశించింది అనుకున్నారు. అనుకుని మీ మెదడులో చెలరేగిన వార్తకి తప్పుగా వివరణ చెప్పుకున్నారు. మా వార్తని పక్కకి తోసిపుచ్చి సమాధానం పడిపోయేరు."

మిడతంభొట్లు ఆశ్చర్యానికి అంతు లేదు. ఇరవై ఏళ్ల క్రితం "విశ్వాంతరాళం లోతుల్లోంచి మాట్లాడుతున్నాం" అంటూ ఒక కంఠధ్వని వినిపించింది. ఇదే కంఠం. ఇదే మాట తీరు. "మీ సూర్యుడు పేలిపోతున్నాడు, జాగ్రత్త పడండి" అన్న వార్త విన్నప్పుడు అది ఆకాశవాణో లేక తన అంతర్వాణి పెడుతూన్న ఘోషో అర్థం కాలేదు. అయినా మనస్సు చెబుతూన్న మాటలు నమ్మి "బ్రహ్మాండం బద్దలవుతోంది" అనుకుంటూ ఎంతో ఆరాటపడి ఎందరికో చెప్పి చూసేడు మిడతంభొట్లు. ఆ రోదన అరణ్య రోదనే అయింది. ఇది మూడో తడవ అంతర్గ్రహ జీవులు భూలోకులని హెచ్చరించటానికి చేస్తూన్న ప్రయత్నం అని మిడతంభొట్లు మనస్సులో ఒక ఆలోచన ప్రవేశించింది. దీనిని నిర్ద్వందంగా నిర్ధారించుకోవాలనే తీర్మానానికి వచ్చి,

"ఈ వార్త మోసుకురావటానికి నిన్నే ఎందుకు పంపేరు? నీ ప్రత్యేకమైన అర్హతలు ఏమిటి?"

"అంతర్గ్రహ సేవలు అనే ఉద్యోగ విభాగంలో నేను పని చేస్తాను. ఆ ఉద్యోగ హోదాలో ఉండటం వల్ల ఈ అవకాశం వచ్చింది నాకు. నా ప్రత్యేకత ఏమీలేదు. ఎవ్వరయినా వచ్చి ఉండేవారు ఆ విభాగం నుండి."

"ఏ అమెరికా అధ్యక్షుడినో, భారత ప్రధానినో పట్టుకుంటే పని జరుగుతుంది కాని నాలాంటివాడితో..."

"అదీ ఆలోచించేం. మీ నాయకులకి రెండు నెలలలో వచ్చే ఎన్నికలమీద ఉన్న శ్రద్ధ రెండువందల సంవత్సరాల తరువాత రాబోయే ఉపద్రవం మీద ఉండదు."

“మరయితే ఏమిటి చేద్దామని...”

“వార్తని అందించేను. మా ప్రభుత్వం, మా సిబ్బంది మీకు సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాం. వ్యోమనౌకలలో మిమ్మల్ని తరలించుకు పోతాం. మీ ప్రజలని, ప్రభుత్వాలని ఒప్పించగలరు మీరు.” సమాధానం కోసం ఎదురు చూస్తూన్నట్లు ఆగంతకుడు చెప్పటం ఆపేడు.

తక్షణ కర్తవ్యం ఏమిటో మిడతంభొట్లుకి అవగాహన కాలేదు.

..... వార్తాహరుడు మరొక లోకం శాల్తీ లాగనే ఉన్నాడు. ఆ శాల్తీ చెబుతూన్న వార్త నిజంగా ఆ మరోలోకం వాళ్లు పంపినదే కావచ్చు. కాని వార్తాహరుడి వార్త నమ్మదగ్గదిగా లేదు. అరవై జ్యోతిర్‌వర్షాల దూరం నుండి వార్త రావాలంటే కనీసం 60 సంవత్సరాలు పడుతుందే. గత నలభై ఏళ్లల్లో రెండు సార్లు వార్తని పంపేమంటాడు. మూడో తడవ ఆసామీ ఎదురుగా నిలబడ్డాడు. ఇది సాధ్యమా? పోనీ అని తెగించి ఈ శాల్తీ మాటని తను నమ్మినా తన మాటని ఎవరు వింటారు? పైపెచ్చు తనని అస్తిత్వం లేనివాటిని కని, వినే మనోవిదళన రోగిగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అగ్ర రాజ్యాలన్నిటిని ఒక తాటి మీదకి తీసుకు రావటం అంటే మాటలా? అంతర్జాతీయ వేదికలమీద మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే ఆసన్నమయే ఆపద ఆగుతుందా?.....

వేళ్లతో కణతల మీద రుద్దుకుంటూ, “మీరు వ్యోమనౌకని అక్కడనుండి తీసుకువచ్చి ఎంతమందిని రక్షించగలరు? ఎవరెవరిని రక్షించాలో ఎలా నిర్ణయిస్తారు? మానవజాతిని రక్షిస్తే సరిపోతుందా? మానవుడి మనుగడకి మిగిలిన జీవకోటి మూలాధారమే. ఆ సర్వభూత సమాహారం మాటేమిటి?

వెనకటికి పెనువరద వచ్చినప్పుడు నోవా అనే వ్యక్తి పడవేసుకుని వచ్చి జాతికో జంట చొప్పున జీవకోటిని రక్షించేడని మా బైబిల్ చెబుతోంది. అలా మీరు కూడ ఆపద ఆసన్నమైన తరుణంలో వచ్చి మీకు తోచిన వాళ్లని రక్షిస్తే పోలా? నా సిఫారుసు ఎందుకు?"

"మా ఆలోచన అది కాదు. భూలోకంలో ఉన్న ప్రజలందరినీ – వీరు, వారు అనే తేడా లేకుండా – అందరినీ మోసుకుపోతాం. అదీ మా ఆలోచన."

"ఎప్పుడో 200 సంవత్సరాల తరువాత ఏదో ఆపద రాబోతోంది కనుక ఇప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలని నేను చెబితే ఎవరు పట్టించుకుంటారు? మా రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ రేపు రాబోయే ఎన్నికల మీద, ఈ కందాయంలో రాబోయే లాభాల మీద గురిపెట్టి ఉంటుంది. ఒక ప్రణాళికా బద్ధంగా దూరదృష్టితో పనులు చెయ్యటం కష్టమైపోతోంది. పైగా మా భూలోకులకి సమష్టిగా పనిచెయ్యటం చేత కావటం లేదు. ఈ ప్రపంచాన్ని, ఈ అమెరికావాళ్లని, ఈ చైనావాళ్లని, ముస్లిం రాజ్యాలని, కమ్యూనిష్టులని, ... వీళ్లందరినీ నమ్మించి ఒప్పించటం ఎలా సాధ్యం? పోనీ అంతర్జాతీయ సమితిలో ఉన్న 192 సభ్య దేశాలు, ఏడు బిలియన్ల ప్రజలు నమ్మేరనే – మాటవరసకి – అనుకుందాం. అప్పుడు వీళ్లందరినీ ఒప్పించి వ్యోమనౌకలు ఎక్కటానికి సహకరించేటట్లు చెయ్యటం ఎలా?"

"భయమేల మీకు? ఆ సేవాతంత్రాలన్నీ చూసుకుంటాం మేము. వ్యోమనౌకలని తయారు చేసే పద్ధతులు నేర్పుతాం మీకు. ఇక్కడ ఉన్న ఏడు బిలియను ప్రజలని ఒక క్రమ పద్ధతిలో వ్యోమనౌకలు ఎక్కించి వారిని పంపే

ఏర్పాట్లు దగ్గరుండి చూస్తాం మేము. ఇదంతా జరిపించటానికి 200 ఏళ్లు పడుతుంది. వ్యవధి లేదు. ఒకటి మాత్రం మరచిపోకండి. మీ మంచి కోరి, మీకు సాయం చేద్దామనే కోరికతోటే ఈ పని చేస్తున్నాము కాని ఇందులో సొంత లాభం ఏమీ లేదు మాకు."

.....స్వలాభాపేక్ష లేకుండా ఎవరుంటారు? కేవలం పరోపకార బుద్ధితో పని చేసే వ్యక్తులు నూటికో కోటికో ఒకరు ఉంటే ఉండవచ్చు. కాని స్వీయప్రయోజనాలని ఆశించకుండా రాజ్యాలు ఏలటం కష్టం. కాందిశీకులు దేశంలోకి వెల్లువలా వస్తే వారు ఉండటానికి చోటు, తినటానికి తిండి పెట్టటమే ఎంతో కష్టం. అటువంటిది ఏడు బిలియన్ల ప్రజలకి రవాణా సౌకర్యాలు కల్పించి వారి బాధ్యతలని నెత్తిమీద వేసుకోవటం అంటే సామాన్యమైన పని కాదు. ఇందులో తర్కానికి అందని కిటుకు ఉందేమో..... ఈ ఆలోచనని బయట పెట్టకుండా,

"మీరు తలపెట్టిన పని సాధ్యపడేది కాదు. ఇది నాకు తలకి మించిన పని. మా ప్రజాస్వామ్యంలో పుర్రెకో బుద్ధి. మా ప్రభుత్వం అత్యవసరమైన పరిచర్యలే ప్రజలకి అందించలేక పడరాని పాట్లు పడుతోంది. అంతర్జాతీయంగా ఇది అస్సలు పొసగదు. ఏ రాజ్యానికీ ఇతర రాజ్యాల మీద నమ్మకం లేదు. కనుక మా బతుకేదో మేము బతుకుతాం. మీ సహృదయానికి మా జోహార్లు."

"పోనీ ఎవరు వస్తామంటే వారినే, మీ బైబిల్‌లో నోవా చేసినట్లు జాతికో జంటని, తీసుకెళతాం."

"అదీ జరగని పనే! మా దేశంలోనే మిలియన్లకి పైబడి ఆకలితో అలమటిస్తూన్న అనాధలు ఉన్నారు. వారిని దత్తత చేసుకుని తమతమ దేశాలు తీసుకుపోయి పెంచుకుంటామని విదేశీయులు ఎంతగా బతిమాలినా మా ప్రభుత్వం ఒప్పుకోవటం లేదు. అటువంటిది మీరు మమ్మల్ని అందరినీ ఉద్ధరిస్తామంటే ఎవరు ఒప్పుకుంటారు?"

"పోనీ మాతో వచ్చెయ్యండి మీరు."

"నేను ఉద్యోగ విరమణ చేసి వేదాంత తత్త్వం అధ్యయనం చేద్దామనే ప్రయత్నంలో ఉన్నాను. ఈ వయస్సులో నన్ను తీసికెళ్లి మీకేమి లాభం?"

"ఆ ఆలోచన వద్దు మీకు. మీ జీవిత కాలాన్ని సునాయాసంగా రెట్టింపు చెయ్యగలం. మీ యవ్వనాన్ని పునరావృత్తం చెయ్యగలం. మీకు సంసార సుఖాలు అందివ్వటానికి ఆరాటపడే అందమైన ఆడవాళ్లు ఉన్నారు మా దగ్గర. మీ వంటి మేధావి అవసరం ఎంతైనా ఉంది మాకు. వచ్చెయ్యండి నాతో. తీసుకుపోతాను."

..ఆవు అందం ఎద్దుకి తెలిసినట్లు మనిషికి తెలుస్తుందా?.....

"ఎందుకయ్యా ప్రయాస పడతావు! నేను ఇల్లు దాటి బయటకి వెళితే చలామణీ కాను. నా ఆచారవ్యవహారాలు నావి. నా వెర్రి నాది. ఎవరి వెర్రి వారికి ఆనందం. పైగా నేను శాకాహారిని. నాకు అలవాటయిన ఆహారం కూడ మీ దగ్గర మూడొంతులు ఉండదు."

"ఆ భయం లేదు మీకు. మాసం తినటం మానేశాం మేము. గతంలో ఒక అదృశ్యమైన విషాణువు కారణంగా మా లోకాన్ని అంతటినీ ఒక అంటువ్యాధి

చుట్టుముట్టి మా ప్రజలందరినీ దరిదాపుగా రూపుమాపింది. దీనికి కారణం కొన్ని జాతుల ప్రాణులని చంపి తినటం వల్ల ఆ విషాణువు ఆ జంతు గణాల నుండి మా గణాలలోకి గెంతు వేసిందని మా శాస్త్రవేత్తలు తీర్మానించేరు. అప్పటినుండి ఇతర ప్రాణులని తినటం మానేసేం. మా పోషణకి కావలసిన ఆహారాన్ని అంతటినీ మేము కర్మాగారాల్లో తయారు చేసుకుంటాం. సహజంగా దొరికేవాటిని కూడ తినం; వాటిని మా కర్మాగారాల్లో మాకు అనుకూలమైన ఆహారాలుగా మార్చుకుని తింటాం. మా ఆర్థిక వ్యవస్థలో ఏదీ వృధాగా పోనివ్వం. అన్నిటినీ పదేపదే వాడుకుంటాం. ప్రాణం ఉన్న ప్రతి జీవిని బాధ్యతతో పోషించి కాపాడుతాం. ప్రాణం పోయిన తరువాత – దేహికి పునర్జన్మ ఉందో లేదో తెలియదు కాని – మా వ్యవస్థలో ప్రతి దేహానికి పునర్వినిమయం ద్వారా పునర్జన్మ ఉంది. మా జీవావరణంలో ఎంత ఎక్కువ జీవకోటి ఉంటే అంత సమర్ధవంతంగా పునర్వినిమయం జరుగుతుంది. మేము తినే ఆహారం అంతా ఇలా పునర్వినిమయం చేసే కర్మాగారాలలోనే తయారవుతుంది.”

“మీరు తినేవన్నీ ఇలా రీ సైకిల్ చేసినవేనా?”

“అవును. అందుకనే ఎంతమందినైనా పోషించగలమనే ధైర్యం ఉంది మాకు.”

తనడిగిన ప్రశ్నకి ఈ రకమైన సమాధానం వచ్చేసరికి మేష్టారి మెదడులో ఒక అనుమానం కదలాడింది. ఇదేనా ఆగంతకుడి రాకకి అసలు కారణం? నిజానిజాలు ఆ పెరుమాళ్లకే ఎరుక. కాని అనుమానం పెనుభూతం.

“మాలో ఒక మహాకవి, ‘జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి’ అన్నాడు. అంటే జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గతుల్యాలు. ఇది మా జన్మభూమి. ఇక్కడ పుట్టేం. ఇక్కడ పెరిగేం. ఇక్కడే చచ్చిపోతాం. అరవై జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న మరోలోకం వెళ్లి మరో అరవై ఏళ్లు బతికి బావుకునేది ఏముంది? నా శేష జీవితం – అరవై రోజులైనా సరే – ఇక్కడే గడుపుతాను. ప్రాణం పోయిన తరువాతా? పార్థివ దేహాన్ని అగ్నికి అప్పగించటం మా ఆచారం. కనుక దయచెయ్యి మరి!” ఇదే చివరి మాట అన్నట్లు నిష్కర్షగా చెప్పేసేరు మిడతంభొట్లు!

తలుపు మీద టకటక చప్పుడయింది.

“సరే! మళ్లా కలుద్దాం. అప్పుడు మిమ్మల్ని ఒప్పిస్తాను.”

“మళ్లా కలవక్కరలేదు. క్షేమంగా వెళ్లు.”

ఇంతలో దోమల హోరులా, మంద్రస్థాయిలో, అస్పష్టమైన రొద వినబడింది. కంటికి ఎదురుగా ఉన్న వ్యక్తి చుట్టూ ఉన్న ప్రదేశం ప్రకాశమానమైంది. సాంద్రమానమైన ఆగంతకుడి ఆకారం క్రమేపీ మంచు విగ్రహం కరిగినట్లు కరిగిపోయి అదృశ్యమైపోయింది.

తలుపు మీద టకటక శబ్దం మరొకసారి అవుతూనే తలుపు తెరుచుకుంది.

“ఎవరితో మాట్లాడుతున్నారు?” అంటూ చొరవగా లోపలికి వచ్చిన రాధ గదంతా కలయచూసింది. ఏమీ కనబడలేదు. “పదండి ఇంటికి వెళదాం” అంటూ చెయ్యి పట్టుకుని బయటకి దారి తీసింది ఆయన సహధర్మచారిణి.

(వంగూరి ఫౌండేషన్ వారు 2011 లో జరిపిన కథల పోటీలో నూటపదహారు డాలర్ల బహుమతి పొందిన కథ. కౌముది అంతర్జాల పత్రిక, ఏప్రిల్ 2012)

వేమూరి వేంకటేశ్వరరావు తెలుగులో రచించిన ఇతర గ్రంథములు

1. కంప్యూటర్లు, తెలుగు భాషా పత్రికలో ధారావాహిక, 1968–71

2. జీవరహశ్యం, 1980 (ప్రతులు దొరకడం లేదు)

3. రసగంధాయ రసాయనం, 1991 (ప్రతులు దొరకడం లేదు)

4. కించిత్ భోగో భవిష్యతి, వంగూరి ఫౌండేషన్, 1997 (ప్రతులు దొరకడం లేదు)

5. ఇంగ్లీషు–తెలుగు, తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు, Asian Educational Servces, New Delhi, 2002

6. జీవనది, Eco Foundation, 2002; రెండవ తడవ, Kinige.com e-book, 2010

7. అమెరికా అనుభవాలు, Emesco, 2009

8. విశ్వస్వరూపం, సుజనరంజనిలో ధారావాహిక, APweekly.com లో ధారావాహిక, 2010

9. తెలుగులో కొత్త మాటలు పుట్టించడం ఎలా?, APweekly.com లో ధారావాహిక, 2011

10. భౌతిక శాస్త్రంలో అంశాలు, APweekly.com లో ధారావాహిక, 2012

11. అంకెలతో ఆటలు, సంఖ్యలతో సయ్యాటలు, APweekly.com లో ధారావాహిక, 2013